

దొంగ... దొంగ... దొంగ
పట్టుకోండి... పట్టుకోండి...
మధుబాబు

# ముందు మాట!

పాఠకులకి నమస్కారం.

సూపర్‌మేన్, అపర భీముడు, ఇంటెలిజెంట్, అనితరసాధ్యుడు అంటూ షాడోని మెచ్చుకుంటున్న షాడో అభిమానులకు కూడా నమస్కారం.

నిజానికి పైన చెప్పిన మాటలేవీ షాడోకి వర్తించవు. షాడో ఒక హ్యూమన్ బీయింగ్. అయితే అతని గుండె మాత్రం ఆర్డినరీ హ్యూమన్ బీయింగ్ గుండె కంటే కొంచెం పెద్దది. తోటి మనిషి బాధని అతను చూడలేడు. అన్యాయాన్ని ఎంత మాత్రం సహించలేడు.

రాజకీయ నాయకుల మాదిరి ఉపన్యాసాలతో దేశసేవ, సంఘసేవ చేయటం అతని ప్రవృత్తికి విరుద్ధం. ప్రాణాలు పోయినా సరే అప్పటి కప్పుడు అటో ఇటో తేల్చుకోవాలన్నది అతని నైజం.

ఆ గుండె అతనికి స్నేహితుల్ని ఎంత మందినో సంపాదించి పెట్టింది. అలాగే ఆ సంఖ్యకి రెట్టింపు శత్రువుల్ని కూడా క్రియేట్ చేసింది.

రాజస్థాన్ స్మగ్లర్స్ రామ్‌దయళ్– అతని నలుగురు సోదరులు, బీహార్ బందిపోటు ఠాకూర్ రాంచంద్, ముంబయి రౌడీ శంకర్ దాదా, రామ్‌భక్త హనుమాన్, మార్నింగ్ స్టార్ దినపత్రిక యజమాని శ్రీనివాస్, ఇలా ఎంతో మంది అతని కోసం ప్రాణాలు పెట్టేటంత సన్నిహితులు. ఆఖరికి పాకిస్తాన్ బందిపోటు మహమ్మద్ కూడా అతని దోస్తే.

ఆ ఏరియాలో సంచరించే ఫకీర్ బాబాకి అయితే షాడో అంటే వల్లమాలిన ఆపేక్ష.

పాకిస్థాన్‌కే చెందిన నాట్యరాణి చాందినీ షాడోకి మరీ మరీ మరీ సన్నిహితురాలు.

ఒక ఆర్డినరీ హ్యూమన్ బీయింగ్ అలాంటి రేంజ్‌కి చేరుకోవటం ఎలా జరిగిందనే అంశం మీద ఎంతో మంది ఎన్నెన్నో రకాలుగా ఎనలైజ్ చేసి చూశారు.

మంత్రాలు, మాయలు షాడోని ఆ స్థాయికి తీసుకుపోలేదు. అనుక్షణం ప్రమాదాలతో తలపట్లుపడుతూ బతకటంవల్ల ప్రమాదాలను కంటికి కనిపించక ముందే పసికట్టగల సిక్స్‌త్ సెన్స్ అతనికి అలవడింది.

గంటలకు గంటలు రోజుల తరబడి కుంగ్ ఫూ ప్రాక్టీస్ చేయటం వల్ల అమితమైన గట్టితనం వచ్చింది. నిలబడిన చోట కూర్చోకుండా, కూర్చున్నచోట నిద్రపోకుండా– ఆగమ్మ కాకిలా దేశాల వెంటపడి పరుగులు తీయటంవల్ల ఎన్నెన్నో భాషలతోను, సంప్రదాయాలతోను పరిచయం ఏర్పడింది. ఎటువంటి వాతావరణంలోనైనా హ్యాపీగా సంచరించే తత్వం అలవడింది.

అన్నిటినీ మించి షాడో ఒక మనసున్న మనిషి.

అతను గనక మాట ఇస్తే దానికి తిరుగు అనేది ఉండదని– అతని నాశనాన్ని కోరుకునే శత్రువులు కూడా ప్రగాఢంగా విశ్వసిస్తారు.

కిల్ అండ్ కాంకర్, రేప్ అండ్ రాబరీ మూల సూత్రాలుగా ప్రపంచాన్నంతా స్వాధీనంలోకి తెచ్చుకుని, ఏకఛత్రధిపత్యం సాధించాలని కోరుకునే కిల్లర్స్ గ్యాంగ్– షాడోని తనతో కలుపుకోవటానికి శక్తివంచన లేకుండా ప్రయత్నం చేసింది. రెఫ్యూజ్ చేశాడు షాడో.

దాంతో మూడు కోట్ల రూపాయల దగ్గిర్నించీ మొదలుపెట్టి– అతని తలను తెచ్చి చూపించిన వారికి మూడు వందల కోట్లు బహుమతి ప్రకటించింది ఆ గ్యాంగ్. ఇది జరిగి చాలా రోజులు అయింది. బహుశా ఆ ప్రైజ్ మనీ విలువ వెయ్యి కోట్లు దాటి వుండవచ్చు– ఇప్పుడు.

నీడ వంటి షాడోని పట్టుకోవటానికి ప్రయత్నాలు చేసి చేసి చేతులు ఎత్తేసింది పోలీస్ డిపార్ట్‌మెంట్. ఎందుకు పట్టుకోలేక పోతున్నామని అంతర్మథనం చేసుకుంటున్న సమయంలో తేలింది ఏమిటంటే షాడోని పట్టుకోలేక పోవటానికి కారణం– అతనికి తోడుగా అతని స్నేహితుడు గంగారాం ఉండటమేనని.

పొట్టిగా, లావుగా, పిచ్చివాడిలా కనిపించే గంగారాంకి తోడు, నీడ, ప్రాణం అన్నీ షాడోనే.

అతను పక్కన ఉండగా షాడోని పట్టుకోవటం ఇంపాజిబుల్ అని గ్రహించి– ముందుగా అతన్నే క్యాచ్ చేయటానికి ట్రై చేశారు అధికారులు.

నీడ లాంటి షాడోకి నీడ వంటి గంగారాం పోలీసు అధికారులకు దొరుకుతాడా?

ఇద్దరూ కలిసి కాశ్మీర్ నించి కన్యాకుమారి దాకా కార్చిచ్చు, ఈదురుగాలి మాదిరిగా సంచరించారు.

అలా తిరుగుతున్న సమయంలో జరిగినటువంటి కొన్ని సంఘటనల్ని వివరించే కథ ఇది. మీకు నచ్చుతుందనే భావిస్తున్నాను.

**- మధుబాబు**

# దొంగ... దొంగ... దొంగ

"దొంగ... దొంగ... దొంగ... పట్టుకోండి... పట్టుకోండి" చెవులు చిల్లులు పడే స్థాయిలో వినవచ్చాయి ఆ అరుపులు. అదిరిపడి చెక్కబల్లల మీది నించి లేచి నిలబడ్డారు చాంద్‌పూర్ చౌకత్‌మహల్ సెంటర్లో జానూభాయ్ టీ కొట్టు దగ్గిర టీ తాగుతూ కూర్చుని ఉన్న కస్టమర్స్.

పొడుగాటి బాణా కర్రలు పట్టుకుని సెంటర్లోకి పరిగెత్తుకు వచ్చారు పది మంది యువకులు. "పకడో... చోర్ బద్మాష్‌కొ పకడో..." చుట్టూ చూస్తూ ఇంకాస్త బిగ్గిరిగా అరిచాడు వారిలో ఒకతను.

"ఎవర్ని పట్టుకోవాలి బేటా? అసలేమిటి ఈ గోల?" పది అడుగులు ముందుకేసి చనువుగా ఒక యువకుడిని అడిగాడు జానూభాయ్ కస్టమర్స్‌లో ఒక వృద్ధుడు.

"దిల్‌దార్ సేట్ ఇంటికి కన్నం వేశారు ఎవరో... తాకట్టు పెట్టించుకున్న నగల్ని, దస్తావేజుల్ని కొట్టేశారు. గోడ దూకుతుంటే వాచ్‌మేన్ చూశాట్ట" అసలు విషయాన్ని వివరముగా చెప్పాడు ఆ యువకుడు.

"దిల్‌దార్ సేట్ ఇంటికే కన్నం వేశారంటే వాళ్ళెవరో సామాన్యమయిన దొంగలు అయివుండరు... రాంచీ ఏరియా నుంచి బందిపోట్లు వచ్చి ఉంటారు" ఆ యువకుడి వైపు చూస్తూ సాలోచనగా అన్నాడు వృద్ధుడు.

“లేదు కాకా... బందిపోట్లు కాదు. ఇద్దరే ఇద్దరు. నల్ల ప్యాంటు, బూడిద రంగు షర్టట ఒక కుర్రాడిది... పొట్టిగా, లావుగా, పిచ్చివాడిలా ఉన్నాట్ట రెండోవాడు... కన్నం వేసింది ఇద్దరే” విషయాన్ని చెప్పాడు ఆ యువకుడు.

ఝల్లుమన్నది వృద్ధుడి శరీరం. ఏదో ఆలోచన వచ్చింది అతనికి. బైటపెట్టటానికి కొంచెం తటపటాయించాడు.

“పదండిరా... ఇంత మంది ఉన్న సెంటర్ దరిదాపులకి కూడా వాళ్ళు రారు. హనుమాన్ గుడి దగ్గిరికి పోదాం... పదండి...” ఉన్నట్లుండి ఇంకో యువకుడు చెప్పడంతో, స్పీడ్‌గా కదిలారు ఆ కుర్రాళ్ళందరూ...

పెద్ద పెద్దగా అరుస్తూ సెంటర్‌కి ఎడమ వైపున ఉండే ఒక వీధిలోకి వడివడిగా వెళ్ళిపోయారు.

నిద్రలో నడుస్తున్నట్టు అడుగులు వేస్తూ టీకొట్టు దగ్గిరికి తిరిగి వచ్చాడు వృద్ధుడు. “ఇప్పటిదాకా హుషారుగా ఉన్నావ్. ఇంతలోనే ఏమయింది కాకా?” అతనిని చూస్తూ నవ్వుతూ అడిగాడు జానూభాయ్.

“నాకు ఏమీ కాలేదు బేటా... నేను బాగానే ఉన్నాను. మన ఊరికే ఏదో శని పట్టుకోబోతోంది... అది తలుచుకునే సరికి ఎందుకో బాధ కలిగింది” చెక్కబల్ల మీద కూర్చుంటూ అన్నాడు ఆ వృద్ధుడు.

“మన ఊరికా? శని పట్టుకోవటమా? భలేవాడివిలే కాకా... ఏదో ఒకచోట చిన్న దొంగతనం జరిగినంత మాత్రాన అలా అనుకోవడం చాలా తప్పు. రేచుకుక్కల వంటి వాళ్ళు మన కుర్రాళ్ళు. ఇంకో గంటకో, అరగంటకో ఆ బద్మాష్

గాళ్ళను కార్నర్ చేసి కాళ్ళు చేతులు తీసేస్తారు. ఫికర్ చేయకు. టీ తాగు'' అంటూ వేడి వేడి టీని చిన్న మట్టి కప్పులో పోసి అందించాడు జానూభాయ్.

''ఈ రేచుకుక్కలు చేయగలిగింది ఏమీలేదు బేటా? నా అనుమానమే నిజం అయితే వచ్చింది పిల్లి కాదు... పెద్దపులి... కోరలు బయట పెట్టి ఎదురు తిరిగిందంటే కుక్కలే కాదు... సింహాలు కూడా తోకలు ముడవాల్సిందే'' టీని సిప్ చేస్తూ చెప్పాడు వృద్ధుడు.

ఎటువంటి సమస్య ఎదురైనా నిబ్బరంగా పరిష్కార మార్గాన్ని చూపించ గలడు ఆ వృద్ధుడు.

చాంద్‌పూర్ పంచాయితీలో వార్డు మెంబర్. అటువంటి మనిషి అలా దిగాలుగా మాట్లాడటాన్ని చూసేసరికి ఆశ్చర్యం కలిగింది జానూభాయ్‌కి.

''చుట్టుదారి మాటలు వదిలి సూటిగా చెప్పు. ఏమిటి నీ అనుమానం?'' అతని దగ్గిర నిలబడుతూ అడిగాడు.

''ఈ చాంద్‌పూర్‌లో ఎవరిదో పాపం పండింది... గజదొంగ షాడో వచ్చేశాడు. దిల్‌దార్ సేట్ ఇల్లు కంచుకోటాలాగా ఉంటుంది. షాడో ముందు ఈ కోటలే కాదు చిత్తూర్‌ఘర్ కోటలు కూడా ఆగలేవు'' చెప్పాడా వృద్ధుడు.

అమాంతగా నోరు తెరిచేశాడు జానూభాయ్... షాడో... గజదొంగ షాడో... చాంద్‌పూర్‌లోకి రావటమా?

చాలా చల్లగా ఉంది వాతావరణం. అంతటి చల్లదనంలోను, మండు వేసవిలో మాదిరి విపరీతమైన చెమటలు పట్టేశాయి అతని మొఖం మీద.

“వచ్చేశాట్టరోయ్... షాడో వచ్చేశాట్ట...” తనకు తెలియకుండానే చాలా బిగ్గిరిగా అరిచాడు.

కరెంట్ దీపాలతో, పెట్రోమాక్స్ లైట్లతో పట్టపగలు మాదిరి దేదీప్యమానంగా వెలిగిపోతోంది సెంటర్. జానూభాయ్ అరుపు చెవిన పడిన మరుక్షణం టపటపమని పగిలిపోయాయి లైట్లు. ధన్‌ధన్‌మనే శబ్దాలతో మూతలు పడ్డాయి షాపులు. ఆ రోజు సంపాదించిన సొమ్ములన్నీ నడుములకు ఉన్న మనీ బెల్టులలో భద్రపరచుకుంటూ తమ తమ నివాసాల వైపు పరుగులు తీశారు మర్చంట్స్.

వీధి దీపాలు తప్ప వేరే లైటు అంటూ లేకపోయేసరికి, మసక చీకటితో నిండిపోయింది సెంటర్. అంతకు ముందు వరకూ రకరకాల శబ్దాలతో ఎలైవ్‌గా కన్పించింది కాస్తా– చిటికెలో నిశ్శబ్దంతో నిండిపోయింది.

“నువ్వు కూడా వెళ్ళిపో బేటా... నా అనుమానమే నిజం అయితే– పోలీసు పటాలాలు కూడా వచ్చి పడతాయ్... వచ్చినవాళ్ళు ఊరికే నిలుచోరు... నీ కొట్టుమీద పడి ఉచితంగా చాయ్‌లు తాగేస్తారు, మూసేయ్” అని సలహా ఇచ్చి తాను కూడా ఇంటికేసి వెళ్ళిపోయాడు వృద్ధుడు.

స్టవ్ మీద సెగలు వెలువరిస్తున్న పాలగిన్నె వంక చూసుకుని, గట్టిగా నిట్టూర్చాడు జానూభాయ్.

ఇంకో రెండు లీటర్లున్నాయ్... నీళ్ళు కలపటం అతనికి అలవాటు లేదు. అందుకే అర్ధరాత్రి దాటిన ఇంకో అరగంట వరకూ అతన్నే వెతుక్కుంటూ వచ్చేస్తారు కస్టమర్స్.

ఎంత లేదని అనుకున్నా నలభై యాభై రూపాయల బేరం... ఏం చేయాలో అతను డిసైడ్ చేసుకోక ముందే మోతలు చేస్తూ సెంటర్లోకి దూసుకు వచ్చేసింది పోలీస్ వేన్.

"హెచ్చరిక... చాంద్‌పూర్ ప్రజలకు పోలీస్ వారి హెచ్చరిక... రాంచీ పట్టణంలో పోలీసులకి స్లిప్ ఇచ్చి పారిపోయిన షాడో ఇప్పుడు మీ ఊర్లోనే ఉన్నట్టు మాకు వార్త అందింది. జాగ్రత్తగా ఉండండి అందరూ... షాడోని పట్టిచ్చిన వారికి ప్రభుత్వం పెద్ద పెద్ద బహుమతులు ఇస్తుంది..." వేన్ పైభాగంలో ఉన్న లౌడ్‌స్పీకర్‌లోనుంచి గుండెలు జలదరించే లెవెల్లో వినవచ్చింది ఒక ఇన్స్‌పెక్టర్ కంఠం.

సెంటర్ మధ్యలో ఉన్న చిన్న రింగ్ వంటి ప్రొజెక్షన్ చుట్టూ రెండు రౌండ్లు కొట్టి ఒక్కసారిగా జానూభాయ్ దుకాణం దగ్గిరికి వచ్చింది వేన్.

బిలబిలలాడుతూ అందులో నించి కిందికి దూకారు పదిహేను మంది కానిస్టేబిల్స్.. వారి వెనుకే దిగి బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాడు ఇన్స్‌పెక్టర్.

"మంచి చాయ్ వేడి వేడిగా ఇవ్వు బే... టేస్ట్ అదిరిపోవాలి" ఆర్డర్ ఇస్తూ చెక్కబల్ల మీద కూర్చున్నాడు.

*　　*　　*　　*　　*

“అరేయ్ బంధో... రారా బయటికి... బయటికిరా” ఉరుములాంటి కంఠంతో అరిచాడు రెహమాన్ సేట్.

చౌకత్‌మహల్ సెంటర్‌కి ఉత్తరంగా పదివీధుల అవతల ఉండే చిన్న ఇల్లు అది. మూసి వున్న తలుపులు తెరుచుకుని గబగబా బయటికొచ్చాడు ఇరవై నాలుగేళ్ళ బంధో.

“వారం రోజుల క్రితమే బాకీ తీర్చేస్తానన్నావ్? ఏం చేస్తున్నావ్ బే? కొత్త పెళ్ళాంతో కులుకుతూ కూర్చున్నావా?” ఎర్రబడిన మొఖంతో బిగ్గిరిగా అడిగాడు సేట్‌జీ.

అతన్ని- అతని వెనుక భూతాల మాదిరి నిలబడి ఉన్న పది మంది వస్తాదుల్ని చూసేసరికి కాళ్ళు, చేతులు వణకడం మొదలు పెట్టాయి బంధోకి.

ఊరిని ఆనుకుని నాలుగు ఎకరాల పొలం ఉంది అతనికి. ఊళ్ళో వాళ్ళకి అవసరం అయిన ఆకు కూరలు, కూరగాయలు పండించటం అతని వృత్తి. అదేం కర్మమోగాని వరుసగా ఒక ఏడాది నించీ ఏ పంటా చేతికి రావడం లేదు. పెట్టుబడి పెట్టేంత వరకూ బాగానే ఉంటోంది. ఆ తర్వాత ఉన్నట్లుండి నాశనం అయిపోతోంది.

పాతికవేలు అప్పు తీసుకున్నాడు రెహమాన్ సేట్ దగ్గిర. అందరి మాదిరిగా పగటి సమయాల్లో వసూళ్ళకి రాడు ఆ పెద్దమనిషి. అర్ధరాత్రి సమయంలో ఇళ్ళ ముందు కొచ్చి ఊరంతా వినబడేటట్టు గోల చేస్తాడు.

“టొమేటోలు పెట్టాను. ఎల్లుండి కోసి మార్కెట్‌కి పంపుతాను. మూడంటే మూడు రోజులు టైము ఇవ్వండి సాబ్. పువ్వుల్లో పెట్టి తీర్చేస్తాను మీ బాకీ...” చేతులు జోడించి చాలా వినయంగా అర్థించాడు సేట్‌జీని.

“ఎన్నిసార్లు ఇవ్వాలి టైము? చాలా సార్లయింది. ఇంక ఆగేది లేదు. రేపు పొద్దున్నే మా వాళ్ళు పొలాన్ని స్వాధీనం చేసుకుంటారు” కోపంగా చెప్పబోతూ ఆఖరి క్షణంలో ఆ మాటల్ని ఆపేశాడు సేట్ జీ.

తెరిచి వున్న ఇంటి తెలుపులు దగ్గిరికి బంధో భార్య రావడమే అందుకు ప్రధాన కారణం.

ఆరు నెలల క్రితమే అయిందతనికి పెళ్ళి... పచ్చ కర్పూరపు ముద్దలా ఉంటుంది అతని భార్య అవంతి.

చూడ చక్కని రూపం... చారడేసి కళ్ళు...

“అరేయ్ బంధో. నువ్వొక పని చేస్తావా?” అనదలుచుకున్న మాటలను వెంటనే ఆపేసిన తరువాత కొత్త మాటలను మొదలు పెట్టాడు సేట్‌జీ.

“చెప్పండి సాబ్, ఏం చేయమంటారో చెప్పండి” అతనిని చూస్తూ గబగబా అన్నాడు బంధో.

“నీ పొలం నువ్వే ఉంచుకో. నీ బీబీని మాత్రం నాతో పంపు. బాకీ తీర్చాక తీసుకుపో. కావాలంటే వడ్డీలో సగం మాఫీ చేసేస్తాను” గుమ్మంలో నిలబడిన అవంతి మీది నించి చూపుల్ని తిప్పకుండా చెప్పాడు సేట్‌జీ.

నెత్తి మీద పిడుగు పడినట్టు అయింది బంధోకి.

“అన్యాయం సాబ్. ఇది అక్రమం. మీ లాంటి పెద్దోళ్ళు ఇలా మాట్లాడటానికి వీలు లేదు. చాలా తప్పు సాబ్” భయంతో వణికిపోతూ దీనంగా అన్నాడు.

“పైసల్ తీసుకోని ఎగగొట్టటం సక్రమమే అయితే ఇది కూడా సక్రమమే. అక్రమం కాదు. బాకీ తీర్చి నీ బీబీని నువ్వు తీసుకో” అంటూ తన వెనుక ఉన్న వస్తాదుల వంక సైగచేస్తూ చూశాడు సేట్ జీ.

ఒంటరిగా ఉన్న జింక మీదికి దూకే తోడేళ్ళ మంద మాదిరి స్పీడ్‌గా ముందుకు కదిలారు వాళ్ళు.

“పారిపో అవంతీ. పారిపోయి నీ ప్రాణాల్ని కాపాడుకో” జీరపడిన కంఠంతో అరిచాడు బంధో.

ఫట్‌మంటూ కొట్టాడు సేట్‌జీ అతని మొఖం మీద. లావుపాటి బండరాయి మొఖం మీద పడినట్టు గిలగిల లాడుతూ కింద పడిపోయాడు బంధో.

వాకిళ్ళల్లో నిలబడి వింతగా చూస్తున్నారు ఆ చుట్టు పట్ల నివసించే పౌరులు. సేట్‌జీ చేస్తున్న పని తప్పని చెప్పే ధైర్యం వారిలో ఎవరికీ లేదు… బంధో క్రింద పడిపోవటాన్ని చూడగానే గబగబా ఇళ్ళల్లోకి పోయి తలుపులు దఢాల్న మూసేసుకున్నారు.

“తీసుకు రండిరా చవటల్లారా… ఆలస్యం చేయకండి” ఇంకోసారి తన వస్తాదుల్ని హెచ్చరించాడు సేట్‌జీ.

తన భర్త పారిపొమ్మని అరవగానే గిరుక్కున వెనక్కి తిరిగి ఇంట్లోకి పరిగెత్తింది అవంతి. పట్టుకోవటానికి ప్రయత్నించిన ఇద్దరు వస్తాదుల చేతుల్ని విదిలించి కొట్టి పెరటి గుమ్మం లోనించి బయటికి పారిపోయింది.

ప్రహరీ గోడ లేదు ఇంటి వెనుక భాగంలో. నాలుగు అడుగుల ఎత్తున్న వెదురు చువ్వల దడి మాత్రమే కట్టి ఉంది. ముంగాళ్ళకు అడ్డం పడుతున్న చీరెను ఒక చేత్తో ఎత్తి పట్టుకుంటూ, అమాంతం జంప్ చేసి ఆ దడిని క్రాస్ చేసింది ఆమె. అవతలి పక్కన నేలను తాకగానే లేడిపిల్లలా ఒక్కసారిగా పరుగు మొదలు పెట్టింది.

పట్టినపట్టు వదిలిపెట్టే అలవాటు లేని సేట్‌జీ వస్తాదులు కూడా దడి మీది నించి జంప్ చేసి ఆమెను వెంబడించారు. పారిపోవటానికి పరుగు మొదలు పెట్టడం అయితే మొదలు పెట్టింది గాని, రెండు వీధుల్ని క్రాస్ చేసే సరికి ముంచుకు వచ్చేసింది ఆయాసం– అవంతికి.

గుండెలు మండిపోతున్న సెన్సేషన్, గొంతు ఆరిపోతున్న ఫీలింగ్, మొఖం నిండా ముచ్చెమటలు... మూడో వీధి మొగదల్లోనే పాదాల్లో శక్తి లేనట్టు పడిపోయింది.

గొల్లున అరిచారు వెనకాల వస్తున్న వస్తాదులు... తమ వేగాన్ని మరింతగా పెంచారు. వాళ్ళ చేతికి చిక్కటం అంటే అభిమానాన్ని మంట గలుపు కోవటమే అని పూర్తిగా అర్థమై పోయింది అవంతికి. పళ్ళు బిగపట్టి పైకి లేచింది గానీ, మళ్ళీ పడిపోయింది. అలా రెండోసారి పడిపోతున్న సమయంలో ఆమెకు కనిపించారు ఇద్దరు వ్యక్తులు.

వీధి మొదట్లో ఉన్న ఒక షాపు మెట్ల మీద కూర్చుని సిగరెట్ కాలుస్తున్నాడు వారిలో ఒక యువకుడు.

నల్లటి ప్యాంటు బూడిదరంగు షర్టు... పొట్టిగా, లావుగా, పిచ్చివాడిలా ఉన్నాడు రెండో మనిషి... జుట్టు దారుణంగా పెరిగి మొఖాన్ని కప్పేసేటట్టు ముందుకు పడుతోంది. రెండోసారి పడిపోతున్న అవంతిని అతనే చూశాడు మొదటిగా... "అరెరె... అరెరే" అంటూ గభాల్న ముందుకు వచ్చి భుజాలు పట్టుకున్నాడు– లేవదీయటానికి. చలిజ్వరం వచ్చినట్టు వణికి పోతోంది అవంతి. ఆమె చెప్పకపోయినా ఆ అలజడి గురించి ఆ వ్యక్తికి తెలిసిపోయింది.

"భయం లేదమ్మా... నీకు అన్నయ్యలాంటి వాడిని... లేచి నిలుచో" ఆప్యాయంగా అంటూ లేపి నిలబెట్టాడు.

అదే సమయంలో అక్కడికి వచ్చేశారు సేట్‌జీ వస్తాదులు. "మమ్మల్ని అడ్డుకునే దమ్ము ఈ ఊళ్ళో ఎవరికీ లేదు... వీడు నిన్ను ఎలా రక్షిస్తాడే" అంటూ అవంతి భుజం పట్టుకోబోయాడు ఒక వస్తాదు.

"తప్పు భాయీ... తప్పు. పరాయి ఆడవాళ్ళ భుజాల మీద చేతులు వేయటం తప్పే. వదిలెయ్" వినయంగా అన్నాడు అవంతిని లేపి నిలబెట్టిన పొట్టి మనిషి. అనటంతో ఆగలేదు, ఆ వస్తాదు చేతుల్ని అవతలికి నెట్టాడు.

మండి పోయింది వస్తాదుకి. ఫాట్‌మని శబ్దం వచ్చేలా చేతిని విసిరాడు. అతను అలా చేస్తాడని ఊహించక పోవటం వల్ల అదిరిపోయింది పొట్టి వ్యక్తి చెంప... తనకు తెలియకుండానే రెండు అడుగులు వెనక్కి వేశాడు.

“మాకు అడ్డం వస్తే ఈ సారి నీ తల పగిలిపోతుంది ఖబడ్దార్...” అని అతన్ని హెచ్చరించి “ఎక్కడికి పోగలవే? మమ్మల్ని తప్పించుకోవటం అంత తేలిక అనుకున్నావా?” అంటూ అవంతిని పట్టుకుని వెనక్కి లాగాడు ఆ వస్తాదు. అతని చేతి దెబ్బని రుచి చూసిన తరువాత కాళ్ళు చేతులు చల్లబడి అవతలికి వెళ్ళిపోవాల్సిన పొట్టివ్యక్తిలో ఉన్నట్టుండి వచ్చేసింది ఒక మార్పు.

ఎడమపాదంతో నేలను బలంగా తన్ని నోటిని విశాలంగా తెరిచి ఒకే ఒక కేక పెట్టాడు అతను. కేకా అది? చాంద్‌పూర్ అవతల ఉండే పాడుపడిన కోటగోడల మీది ఫిరంగి చప్పుడు. గుండెలు ఝల్లుమన్నయ్ వస్తాదులందరికీ. తనకు తెలియకుండా అవంతిని వదిలి వెనక్కి జరిగాడు ఆమెను పట్టుకున్న వస్తాదు.

“ఇప్పుడే చెపుతున్నా నాకు పూనకం వచ్చేస్తోంది. మీరు ఇక తట్టుకోలేరు. మర్యాదగా వెనక్కి వెళ్ళిపోండి” మామూలుగా మారిపోతూ వారిని హెచ్చరించాడు పొట్టిమనిషి.

అరుపును విన్న అలజడి నించి తేరుకున్నారు వస్తాదులు. ఒకరి వంక ఒకరు చూసుకుని, ఒకేసారి అతని మీద కలబడ్డారు. పిడికిలి బిగించి ఈ సారి అతని నడినెత్తి మీద కొట్టాడు అవంతిని పట్టుకున్న వస్తాదు.

నిలబడటానికి ఓపికలేనట్టు ఉన్న పళాన నేలమీద చతికిల పడిపోయాడు పొట్టిమనిషి. “ఊరూ పేరూ లేని ఈ దొంగ నాయాళ్ళు నా ఒంటి మీద చెయ్యి వేస్తుంటే చూస్తూ కూర్చున్నావా?” అంటూ దుకాణం ముందు మెట్లమీద కూర్చుని ఉన్న యువకుడిని ఎత్తి పొడిచాడు.

పకపకా నవ్వుతూ మళ్ళీ అవంతి భుజం పట్టుకోబోయాడు మొదటి వస్తాదు. చివరి కంటా కాలిన సిగరెట్‌ని మునివేళ్ళతో సున్నితంగా మీటాడు మెట్ల మీది యువకుడు. ఆగ్నేయాస్త్రంలా గింగిరాలు తిరుగుతూ వచ్చి ఆ వస్తాదు మొఖానికి తగిలింది అది. అదిరిపడి అవంతిని మళ్ళీ వదిలేశాడు అతను. చురుక్కుమన్న చోట చేత్తో రుద్దుకుంటూ మెట్లవంక చూశాడు.

ఎప్పుడు లేచి నిలబడ్డాడో, ఎప్పుడు కదిలాడో, ఎలా వచ్చాడో అతనికిగాని అతని సహచరులకి గాని అర్థం కాలేదు. పిడికిళ్ళను బిగించి సరిగ్గా వాళ్ళందరి మధ్యా నిలబడ్డాడు ఆ యువకుడు. ఫట్‌ఫట్‌మంటూ పడ్డాయి దెబ్బలు. ఒకటి నుంచి నాలుగు అంకెలు లెక్కబెట్టేలోగా ఎగిరి అవతల పడ్డారు నలుగురు వస్తాదులు.

“కొట్టండి రోయ్... వాడి తల పగలగొట్టేయండి” గొంతు బొంగురు పోయేటట్టు అరిచాడు పడిపోయిన వారిలో ఒకతను. అరుపు అతని పెదవుల్ని దాటుతుండగానే, వచ్చి అతని మీద పడ్డారు ఇంకో ఇద్దరు. చూస్తూ ఉండగానే దూరంగా పరిగెత్తారు మిగిలినవారు.

“మొనగాళ్ళా మీరు? మగాళ్ళా?” అంటూ కింది నించి లేచి చుట్టూ చూశాడు పొట్టి మనిషి. వీధి మొదట్లో ఉన్న చెత్తకుండీ దగ్గిర కనిపించింది అతనికి ఒక పెద్ద బండరాయి. అమాంతం దాన్ని ఎత్తి పడిపోయిన వస్తాదుల మీదికి విసిరేశాడు. అంతే... పూర్తిగా దిగజారిపోయింది వారి ధైర్యం. కూడబలుక్కున్నట్టు ఒకేసారి కింది నించి లేచి పాదాలకి బుద్ధి చెప్పారు.

“ఒక్క దెబ్బకే ఎందుకూ పనికి రాకుండా పోయే ఈ దొంగ నాయాళ్ళతో కలబడటం అంటే పరువు తక్కువ” అంటూ చేతులు దులుపుకుని అవంతి కేసి చూశాడు పొట్టిమనిషి. నీరు నిండిన కళ్ళతో చూసి చేతులు జోడించిందామె.

“అయ్యయ్యో అట్టాంటి పనులు చేయద్దు తల్లీ... అంతా అయిపోయిందిగా... ఇప్పుడు చెప్పు. ఈ బద్మాష్‌లు నీ వెంట ఎందుకు పడ్డారు?” అడిగాడతను.

ఒణుకుతున్న కంఠంతో వివరించింది అవంతి.

“చీడపట్టి పంట పాడయిపోతున్నదని అనుకుంటున్నాడు నా భర్త. చీడ కాదు... కావాలనే సేట్‌జీ పంటని పాడు చేయిస్తున్నాడు” అంటూ మళ్ళీ కన్నీళ్ళు పెట్టుకుంది.

రోడ్డు మధ్యలో నిలబడి ఇంకో సిగరెట్‌ని వెలిగించుకుంటున్న యువకుడి కేసి చూశాడు పొట్టిమనిషి. “మనం వచ్చింది ఈ సేట్‌జీ అంతు చూడటానికే. మనం వచ్చిన సంగతి అందరికీ తెలిసిందిగాని, వీడికి తెలియక పోవడం ఆశ్చర్యంగానే ఉంది” సాలోచనగా అన్నాడు.

“వాడు సామాన్యుడు కాదు. ఇప్పుడు మీరు కొట్టి పంపించిన వస్తాదుల వంటి వాళ్ళు ఇంకా చాలా మంది వాడి దగ్గిర ఉన్నారు. ఈ సంగతి తెలిస్తే అందరూ కట్ట కట్టుకుని వచ్చి నా భర్తను చంపి పారేస్తారు” సడన్‌గా ఇంకో భయం మనసులో అడుగుపెట్టింది కాబోలు– మరోసారి కన్నీరు పెట్టుకుంటూ అన్నది అవంతి.

ఆ మాటలు తన చెవికి చేరనట్టు ఆమెకేసి చూశాడు పొట్టిమనిషి. "ఇంకో రెండు గంటల తర్వాత నీ భర్తని ఊరి అవతల ఉన్న కాళికామాయి గుడి దగ్గిరికి రమ్మని చెప్పు. మర్చిపోకు... ఇంక నువ్వు ఇంటికి వెళ్ళు" అంటూ చనువుగా ఆమె చేయి పట్టుకుని వెనక్కి నెట్టాడు.

అప్పుడే అటుకేసి దూసుకు వచ్చింది ఒక పోలీస్ వేన్.

"హెచ్చరిక... చాంద్‌పూర్ పౌరులకి పోలీస్‌వారి హెచ్చరిక... షాడోని పట్టివ్వండి. బహుమతులు అందుకోండి" ఖంగు ఖంగు మంటూ వినవచ్చింది హెచ్చరిక.

ఛక్‌మని అవంతికి అయింది జ్ఞానోదయం. "షాడో భయ్యా... నువ్వేనా? నన్ను రక్షించింది నువ్వేనా?" అని అడుగుతూ వెనక్కి తిరిగి చూసింది.

ఖాళీగా కనిపించింది రోడ్డు. పోలీస్ వేన్ వస్తున్న సవ్వడిని ముందుగానే గమనించినట్టున్నారు– నిశ్శబ్దంగా మాయమైపోయారు ఆమెను రక్షించినవారు.

*　　*　　*　　*　　*

విపరీతమైన నీరసం ముంచుకు వచ్చినట్టు చెక్కబల్ల మీద కూర్చుండి పోయాడు టీకొట్టు జానూభాయ్.

ఒకటి కాదు... స్టవ్ మీద ఉన్న పాలన్నీ అయిపోయే వరకూ టీలు పెట్టించుకుని తాగారు పోలీసులు. రొట్టెలు, బిస్కెట్లు, సిగరెట్లు అన్నిటినీ ఖాళీ చేసేశారు.

“షాడోని పట్టుకోవటానికి వచ్చిన స్పెషల్ స్క్వాడ్ మాది. మమ్మల్ని డబ్బులు అడగకూడదు... అడిగితే–” అంటూ చెప్పడం ఆపాడు ఇన్స్‌పెక్టర్.

“అడిగితే ఏమౌతుంది సాబ్?” అన్నాడు.

“నువ్వు షాడోకి సహాయం చేస్తున్నావని రిపోర్టు చేస్తాం. తీసుకుపోయి మక్కెలు విరగేస్తాం. అంత వరకూ తెచ్చుకోవటమవసరమా?” అని చెప్పి వెళ్ళిపోయాడు.

తన గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలీకుండా పోయింది జానూభాయ్‌కి. రెండు లీటర్ల పాలు నిలువ ఉన్నాయని దుకాణం మూయకుండా నిలబడినందుకు తగిన శాస్తి జరిగిందని అతను అనుకోలేదు.

“నీ వల్లే. ఇదంతా నీ వల్లనే... నువ్వు మనిషివి కాదు. రాక్షసుడివి. నీ గురించి ఎవరు ఆలోచించినా అందరికీ ఇదే గతి పడుతుంది” కంటి ఎదుటలేని షాడోని తలుచుకుంటూ కోపంగా అన్నాడు అతను.

“ఒంటరిగా కూర్చుని నీకు నువ్వే మాట్లాడుకుంటున్నావేంటి భాయీ? ఏమయింది నీకు?” అంటూ ఒక కంఠం వినిపించేసరికి అదిరిపడి వెనక్కి చూశాడు అతను.

ఒక పట్టుగుడ్డ మూటని భుజం మీది నించి దింపి చెక్కబల్ల మీద పెట్టాడు పొట్టిగా ఉన్న మనిషి.

“మంచి చాయ్ ఉంటే ఇవ్వు భాయీ...” అంటూ ఆ మూట పక్కనే సెటిల్ అయ్యాడు ఒక యువకుడు.

"చాయ్ లేదు... పాలన్నీ ఆ పోలీసోళ్ళు అవజేశారు" యాంత్రికంగా చెప్పాడు జానూభాయ్. "డికాక్షన్ ఉంది కదా. పంచదార వేసి ఇవ్వు. సరిపెట్టుకుంటాం" అంటూ పొట్టిమనిషి కేసి చూశాడు ఆ యువకుడు.

దుమ్మూధూళితో అసహ్యకరంగా తయారై ఉన్న పైజమా జేబులో నించి ఒక కరెన్సీ నోటును తీసి–

"తీసుకో... రొట్టెలుగాని, బిస్కెట్లుగాని ఉంటే ఇవ్వు. మా గురువుగారికి సిగరెట్లు కావాలి" అన్నాడు.

"అన్నీ అయిపోయినయ్... ఆ పోలీసోళ్ళూ–" అంటూ జరిగింది తలుచుకుని మళ్ళీ కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

"మగాడివి భాయీ... ఆడమనిషి మాదిరి అదే పనిగా ఏడ్వకూడదు. కష్టాలు అందరికీ వస్తయ్. ఏడిస్తే రాకుండా ఉంటయ్యా?" నవ్వుతూ అన్నాడు పొట్టిమనిషి.

"నా చోట్లో నువ్వుండి ఉంటే ఏం చేసి ఉండే వాడివి?" కోపంగా అడిగాడు జానూభాయ్.

"ఇరగదీసే వాడిని... డికాక్షన్ కోసం పెట్టిన వేడినీళ్ళు మొఖాల మీద కుమ్మరించే వాడిని" చెప్పాడతను.

"అదుగో. మళ్ళీ వస్తున్నారు. డికాక్షన్ నీళ్ళు పోసి అవతలికి తరిమేయ్" అంటూ వెనక్కి జరిగాడు.

ఆశ్చర్యంగా వెనక్కి చూసిన పొట్టిమనిషికి, బర్రుమంటూ వస్తున్న పోలీస్ వాహనం కనిపించింది.

"అయ్యబాబోయ్... హనుమాన్ గుడి దగ్గిరికి పోయారని అనుకున్నా. వీళ్ళు వచ్చేస్తారని అనుకోలేదు" అంటూ బల్లమీద పెట్టిన మూటమీద చెయ్యి వేశాడు.

చేయిజాపి అతన్ని ఆపి, తల అడ్డం తిప్పాడు అతనితో పాటు వచ్చిన యువకుడు.

దగ్గిరికి వచ్చేసింది వాన్. టీ బంక్‌కి పాతిక అడుగుల దూరంలో ఆగిపోయింది. "అరిచి అరిచి గొంతు పట్టేసింది బే... ఇందాక ఇచ్చిన చాయ్ వంటిది ఇంకోటి ఇవ్వు" కిందికి దిగి ఒళ్ళు విరుచుకుంటూ జానూభాయ్‌ని ఉద్దేశించి అన్నాడు ఇన్స్‌పెక్టర్.

'హాయిగా వాన్‌లో కూర్చోవడం– మైకులో పిచ్చి మాటలు మాట్లాడటం తప్ప ఈయనగారు విరగతీసింది ఏముందో!' తనలో తను అనుకుంటూ పొట్టి మనిషికేసి ఓరగా చూశాడు జానూభాయ్.

'ఇందాక ఏదో విరగ పొడుస్తానన్నావుగా... పొడిచేయ్' అనే వెక్కిరింపు ఉన్నది ఆ చూపులో....

పళ్ళు బిగించబోయిన పొట్టిమనిషి చేతిని ఇంకోసారి గట్టిగా అదిమాడు అతనితో వచ్చిన యువకుడు.

“టీ అడిగితే మాట్టాడవేం? ఎలా ఉంది ఒళ్ళు?” బంక్ దగ్గిరికొస్తూ కోపంగా అడిగాడు ఇన్స్‌పెక్టర్ సాబ్.

“పాలు నిండుకున్నయ్ సాబ్... కుండ ఖాళీ” వినయంగా అన్నాడు జానూభాయ్.

“మరి స్టవ్ మీద అదేమిటి?” పొగలు వెలువరుస్తున్న స్టవ్ మీది గిన్నె వంక చూపిస్తూ అడిగాడు ఇన్స్‌పెక్టర్.

“నీళ్ళు సాబ్... వీళ్ళకి డికాక్షన్ చాలని చెప్పారు...”

మొదటిసారిగా పొట్టిమనిషిని, యువకుడిని గట్టిగా చూశాడు ఇన్స్‌పెక్టర్ సాబ్.

“ఎవరు బే మీరు? ఇంత రాత్రివేళ ఏం చేస్తున్నారు? నొసలు ముడివేస్తూ కరుకుగా అడిగాడు.

“నా పేరు డీలారాం కొడుకు భగవాన్ రాం అంటారండి. వీడు నా తమ్ముడు అండీ... వట్టి పిచ్చిమాలోకం అండీ... చూట్టానికి చదునుగా చక్కగా ఉంటాడుగాని, కొంచెం నట్లు లూజండీ... అదండీ సంగతి” వినయాతి వినయంగా సలాం చేస్తూ చెప్పాడు పొట్టిమనిషి.

“ఇంత రాత్రివేళ ఎందుకు వచ్చారని అడిగితే కథలు చెపుతున్నావేమిటి బే?” కనుబొమల్లోంచి చాలా సీరియస్‌గా చూస్తూ అడిగాడు ఇన్స్‌పెక్టర్.

“మా బతుకులు కథల్లాగానే వుంటాయండీ… నట్లు లూజయిన వాళ్ళకి నాటు మందులిచ్చే వైద్యుడి కోసం వెతుకుతూ వచ్చామండీ…” కొంచెంగా కూడా జంకకుండా సమాధానం ఇచ్చాడు పొట్టిమనిషి.

జానూభాయ్ వైపు చూశాడు ఇన్స్‌పెక్టర్ సాబ్.

“కంగన్ బజార్లో కతియాసింగ్ మంచిగా వైద్యం చేస్తాడు… రోజుకి పది మందయినా బయటి ఊళ్ళనించి వస్తూ ఉంటారు…” వెంటనే చెప్పాడతను.

తన అనుమానం నివృత్తి అయినట్టు తల వూపి, అంతలోనే ఇంకో ఆలోచన వచ్చినట్టు మళ్ళీ పొట్టిమనిషి వైపు చూశాడు సూటిగా ఇన్స్‌పెక్టర్.

“ఇందాక హనుమాన్ గుడి దగ్గిర ఒక చాయ్ దుకాణాన్ని చూశాను. తెరిచే ఉంది. అక్కడికి పోయి నేను చెప్పానని చెప్పి పాలు తీసుకురా. టీ పెట్టిద్దాం” అన్నాడు.

“నేనా?” ఆశ్చర్యంగా అడిగాడు పొట్టిమనిషి.

“అవును వెళ్ళవా?” మళ్ళీ కోపం తెచ్చుకోవటానికి రెడీ అవుతూ అడిగాడు ఇన్స్‌పెక్టర్.

“ఎందుకు వెళ్ళనండీ? వెళతానండి. కాని అక్కడ ఉన్నవాళ్ళు ఆ పాలు నా చేతికి ఇవ్వరండీ. మొఖం మీద పోస్తారండి. నాది పోలీస్ మొఖం కాదు గదండీ… తట్టుకోలేరు…” అన్నాడు పొట్టిమనిషి.

ఎంత బిగపట్టుకున్నా నవ్వు ఆగకపోవటంతో ఒక్కసారిగా కిసుక్కుమన్నాడు జానూభాయ్.

అతని వంక మహా విసురుగా చూసి, "మా వాన్‌లో వెళ్ళు. వాళ్ళకి అర్థం అవుతుంది. త్వరగా వెళ్ళి త్వరగా వచ్చేయ్" అన్నాడు ఇన్స్‌పెక్టర్.

"నా తమ్ముడిని కొంచెం జాగ్రత్తగా చూసుకోండి... ఎలాంటి వాడో చెప్పానుగా..." అంటూ రెండు అడుగులు ముందుకు వేశాడు పొట్టిమనిషి.

"పట్టుకో... పట్టుకో... పారిపోతున్నాడు పట్టుకో" ఉన్నట్టుండి బిగ్గిరిగా అరిచాడు అంతవరకూ మౌనంగా కూర్చుని వున్న యువకుడు.

అరవటంతో ఆగలేదు, ఛెంగున చెక్కబల్ల మీది నించి లేచి స్పీడ్‌గా అవతలికి పరిగెత్తబోయాడు.

గిరుక్కున వెనక్కి తిరిగి అతన్ని బలంగా వాటేసుకున్నాడు పొట్టిమనిషి. "పట్టుకున్నానురా తమ్ముడూ... గట్టిగా వాటేసుకున్నాను... నువ్వు కంగారు పడకు... పోలీసు బాబులు చిరాగ్గా వున్నారు. మక్కెలు విరగేస్తారు...." అంటూ మళ్ళీ బల్లమీద కూర్చోపెట్టబోయాడు.

"ఒరేయ్... వీడిని నీతో తీసుకుపో.... వీడిని చూస్తూ ఉండటం ఇంపాజిబుల్. తీసుకుపో" అప్పటి కప్పుడు ఒక నిర్ణయానికి వస్తూ అన్నాడు ఇన్స్‌పెక్టర్.

చెక్కబల్ల మీది పట్టుగుడ్డ మూటను అతనుగాని, వాన్‌లో నించి దిగిన ఇతర కానిస్టేబిల్స్ గాని గట్టిగా గమనించక ముందే చటుక్కున చంకలో పెట్టుకుని యువకుడిని వాన్ దగ్గిరికి నడిపించాడు పొట్టిమనిషి. అందరిలా చాయ్ దుకాణం

దగ్గిరికి రాకుండా, వాన్ పక్క నిలబడి సిగరెట్ కాల్చుకుంటున్నాడు పోలీస్ డ్రయివర్.

“కనిపిస్తామా?” లోగొంతుకతో నెమ్మదిగా యువకుడిని అడిగాడు పొట్టిమనిషి.

“కష్టం.... అరిస్తే మాత్రం వినిపిస్తుంది” అదే మాదిరిగా తనూ అన్నాడు యువకుడు.

చంకలో ఉన్న పట్టుగుడ్డ మూటని కిందికి వదిలేశాడు పొట్టిమనిషి. డ్రయివర్ చూపులు అప్రయత్నంగా దాని మీదికి ప్రసరించాయి. దభీమని అతని తల మీద పడింది బలమైన దెబ్బ. బాధతో విలవిలలాడిపోతూ పెద్దగా అరవటానికి నోరు తెరిచాడు. గట్టిగా అదిమేసింది పొట్టిమనిషి చెయ్యి అతని నోటిని. మోకాలిని స్పీడ్‌గా ఎత్తి అతని పొట్టమీద పొడవటం వెంటనే జరిగిపోయింది.

ఊపిరి ఆగిపోయినంత పని అయింది డ్రయివర్‌కి. కళ్ళు గిర్రున తిరిగి ఒకే ఒక సెకన్లో తెలివి తప్పి తల వాల్చేశాడు. ఈతాకుల చాపను చుట్టగా చుట్టి పైకి ఎత్తినట్టు అతన్ని అమాంతంగా గాలిలోకి ఎత్తి ముందు సీటు మీదికి దొర్లించాడు పొట్టిమనిషి. కన్నుమూసి కన్ను తెరిచేటంతలో స్టీరింగ్ ముందుకు చేరుకుని వాన్‌ని స్టార్ట్ చేశాడు అతనితో పాటు వచ్చిన యువకుడు.

చిటికెలో జరిగిపోయిన ఆ డ్రామాని చాయ్ దుకాణం దగ్గిర ఉన్న కానిస్టేబిల్స్ గాని, ఇన్స్‌పెక్టర్ సాబ్ గాని గమనించలేకపోయారు. ఏదో విరగ

పొడిచేస్తానని పొట్టి మనిషి గొప్పలు చెప్పి ఉండటం వల్ల ఒక్క జానూభాయ్ మాత్రమే చూపుల్ని పక్కకు తిప్పుకోలేదు.

జరిగింది ఏమిటో అర్థం అయ్యేసరికి గుండెలు పట్టేసినయ్ అతనికి. అటువంటి డేర్ డెవిల్ పనులు చేయగల సామర్థ్యం ఎవరికి ఉంటుందో ఊహించుకునేసరికి కళ్ళు గిర్రున తిరిగినంత పని అయింది అతనికి.

ఎందుకూ పనికిరాని ఒక చవట చాయ్ దుకాణం తనది. అటువంటి దుకాణం దగ్గిరికి స్వయంగా వచ్చి తన నోటితో తను చాయ్ కావాలని అడిగాడు షాడో. పాలు లేవు పొమ్మంటే డికాక్షన్ అయినా చాలని అన్నాడు. బయటికి చెపితే నమ్ముతారా ఎవరయినా?

కళ్ళల్లో నించి వేగంగా బయటికి దూకబోయిన ఆనంద బాష్పాల్ని అతిబలవంతంగా కళ్ళల్లోనే దాచుకుని, ఏమీ తెలియని వాడిలా నిలుచుండి పోయాడతను.

“అనుకోకుండా వచ్చిన అవకాశం ఇది... చక్కగా ఉపయోగించుకోవాలి... తేడాలు రాకూడదు...” సీట్లో సర్దుకు కూర్చుంటూ అన్నాడు గంగారాం.

ఇరుకు సందుల్లో పోలీస్ వాన్‌ని జాగ్రత్తగా నడుపుతూ కనుచివరల నుండి అతని వంక చూశాడు షాడో. తెలివి లేకుండా పడిపోయిన డ్రయివర్ షర్టును, ప్యాంటును ఊడతీసి తన దుస్తులమీదే ధరించాడు గంగారాం. షర్టు చాలా టైట్ అయిపోయింది. బటన్స్ పెట్టుకోవటం అసాధ్యమవటంతో అలాగే ఓపెన్‌గా వదిలేశాడు.

ప్యాంటు కూడా అంతే... పాదాల దగ్గర మాత్రం మడతలు పెట్టి ఎడ్జస్టు అయ్యాడు.

"నేను కిందికి దిగితే బండారం బట్టబయలు అయిపోతుంది. నువ్వే ఒంటరిగా పోయి మేనేజ్ చెయ్యాలి. చెయ్యగలవా?" షర్టు కాలర్‌ని సరిచేసుకుంటూ అడిగాడు.

"ప్రయత్నం చేస్తాను సార్... మీరు మాత్రం కొంచెం ఎలర్ట్‌గా ఉండాలి" నవ్వుతూ చెప్పి వాన్‌ని ఒక పెద్ద వీధిలోకి టర్న్ చేశాడు షాడో.

ఆ వీధి చివర కనిపించింది అతనికి ఒక పెద్ద హవేలీ. మూడు నిలువుల ఎత్తున్న ప్రహరీ గోడలు... పెద్ద ఐరన్ గేటు... సూటిగా ఆ గేటు ముందుకు పోయి హారన్ని గట్టిగా ప్రెస్ చేశాడు అతను. అంతకు ముందు ఒక్క క్షణం వరకూ నిర్మానుష్యంగా కనిపించిన ఆవరణ ఒక్కసారిగా జనంతో నిండిపోయింది. నిద్రకళ్ళను నులుము కుంటూ, కర్రలు, ఐరన్ రాడ్లు పట్టుకుని గేటు దగ్గిరికి పరిగెత్తుకు వచ్చారు అనేక మంది వస్తాదులు.

"రెహమాన్ సేట్ ఉన్నాడా?" స్టీరింగ్ ముందు నించి కదల కుండా హుందాగా అడిగాడు షాడో.

అతని వంక అనుమానంగా చూడబోయిన వస్తాదుల మీద అగ్గిరాముడిలా విరుచుకు పడిపోయాడు గంగారాం.

“ఏదో మీ సేట్‌జీ మీద అభిమానంతో మా ఇన్స్‌పెక్టర్ సాబ్ స్వయంగా వస్తే పిచ్చి చూపులు చూస్తారా? మీకసలు బుద్ధులున్నయ్యా?” గంయ్ గంయ్ మని అరిచాడు.

“క్షమించాలి సాబ్... పొరపాటయిపోయింది. పోలీస్ డ్రెస్ కాకపోవడంతో కొంచెం తటపటాయించాం” గబగబా క్షమాపణలు చెప్తూ గేటు తెరిచాడో వస్తాదు.

తారాపథానికి వెళ్ళిపోయింది గంగారాం కోపం. “మీరు వడ్డీలకు వడ్డీలు కొట్టి జనాల్ని నిలువు దోపిడీ చేస్తూ ఉండండి. మీ అంతు చూడటానికి ఆ షాడో వచ్చి చేయకూడని గోలలన్నీ చేస్తూ ఉంటాడు. మేము గంజి పెట్టి ఇస్త్రీ చేసిన యూనిఫామ్ వేసుకుని చిరునవ్వులు చిలకరిస్తూ మీకు కనిపిస్తాం... గాడిదలురా మీరు... కంచర గాడిదలు... తోకలు లేని అడ్డగాడిదలు. అసలు నన్ను అడిగితే...” అంటూ ఇంకా ఫ్లేరప్ అయిపోబోతుంటే... చిన్నగా చూశాడు షాడో ఒకే ఒక చూపు.

“ఎక్కువ అయిపోయింది కదా?” చిన్న కంఠంతో అతడ్ని అడిగాడు గంగారాం.

ఒక్కసారిగా తల విదిలించి సూటిగా ముందుకు చూస్తూ స్టిఫ్‌గా కూర్చున్నాడు షాడో.

"పొండిరా... పోయి అయ్యగారు వచ్చారని మీ సేట్‌జీకి చెప్పండి" అని గంగారాం ఆర్డర్ ఇవ్వబోతుండగా– పరుగులాంటి నడకతో తనే వచ్చేశాడు రెహమన్ సేట్.

"నమస్కారం సాబ్... నమస్కారం" అంటూ వినయంగా చేతులు జోడించాడు.

"మీ ఊళ్ళోకి ఆ షాడో వచ్చాడు... ఆ వార్త మీకు తెలిసిందా?" ఇన్స్‌పెక్టర్ సాబ్ తరఫున తనే అడిగాడు అసిస్టెంట్ గంగారాం సాబ్.

"ఇప్పుడే ఇందాకే తెలిసింది సాబ్... అందుకే మా వాళ్ళందర్నీ హుషార్‌గా ఉండమన్నాను... కిందికి దిగండి సాబ్. మంచిగా చాయ్ తాగిపోవచ్చు" వినయంగా సజెస్ట్ చేశాడు రెహమన్ సేట్‌జీ.

"నువ్వు వాన్ లోనే ఉండు. మనం వెంటనే వెళ్ళిపోవాలి. నేను వెళ్ళి సెక్యూరిటీ ఎలా ఉందో చూసొస్తా" అని చెపుతూ వాన్ దిగాడు షాడో.

"ఈ షాడోని పట్టుకోవడం కాదు కాని, మా బతుకు ముష్టివాళ్ళ బతుకు అయిపోయింది. డ్రెస్ మార్చుకునే అవకాశం కూడా ఉండటం లేదు" మట్టి కొట్టుకు పోయిన తన డ్రెస్ వంక చూసుకుంటూ అన్నాడు.

"వజ్రం మట్టిలోనే ఉంటుంది సాబ్... అలాగని దాని విలువ తగ్గి పోతుందా? రండి" అంటూ లోపలికి తీసుకుపోయాడు రెహమన్ సేట్‌జీ....

పోలీస్ వేన్‌లో రాకుండా ఉన్నట్లయితే... ఆ హవేలీలోకి అడుగు పెట్టడం ఆల్‌మోస్ట్ అసాధ్యం అని వెంటనే అర్థం అయింది షాడోకి... కాంక్రీట్‌తో కట్టిన

గోడల కంటె వంద రెట్లు గట్టిగా కనిపిస్తున్నయ్ గోడలు. ఫస్ట్‌క్లాస్ టేకుతో చేయబడిన తలుపులు, కిటికీలు... కన్నపు దొంగలకి ఎటువంటి సందు ఇవ్వటం లేదు.

''కూర్చోండి సాబ్... కూర్చోండి'' విశాలమైన హాలు వంటి గదిలోకి పోయిన వెంటనే మెత్తటి పాతకాలపు సోఫాని చూపించాడు సేట్‌జీ.

''కూర్చోవడం సంగతి తర్వాత... ముందు మీ ఖజానా ఎక్కడ ఎటువంటి సెటప్‌లో ఉన్నదో చూపించండి. పరవాలేదని నాకు అనిపిస్తేగాని ప్రశాంతంగా కూర్చోలేను'' హుందాగా అన్నాడు షాడో.

''ఇటురండి సాబ్... ఇటు'' అంటూ అతన్ని ఇంకో గదిలోకి తీసుకుపోయాడు సేట్‌జీ. గదిలో ఒక గోడకి ఆనించి ఉన్న బరువైన ఇనప్పెట్టెను చూపించాడు.

''తాళం చెవులు సేఫ్‌గా ఉన్నాయ్ కదా?'' అడిగాడు.

''నా దగ్గిరే ఉన్నాయి సాబ్. ఎవరికీ ఇచ్చేది లేదు'' మొలలో కట్టుకుని ఉన్న తాళం చెవుల గుత్తిని చూపిస్తూ చెప్పాడు రెహమాన్ సేట్‌జీ.

''ఆల్‌రైట్... ఐయామ్ శాటిస్‌ఫైడ్... పదండి పోదాం'' అంటూ వెనక్కి తిరిగాడు షాడో.

మొలలో ఉన్న తాళం చెవులు గుత్తిని సవరించుకుంటూ అతని వెనుకే అడుగు కదిపాడు సేట్‌జీ...

కదిపిన వెంటనే గిర్రున వెనక్కి తిరిగి అతని మెడ మీద బలంగా కొట్టాడు షాడో. మెదడు రక్తాన్ని సరఫరా చేసే కెరోటిడ్ వెస్సెల్ మీద పడింది దెబ్బ.

కళ్ళ ముందున్న ప్రపంచమంతా కారు చీకటితో నిండి పోయినట్టు ఫీల్ అవుతూ నేలకూలాడు సేట్‌జీ. కింద పడక ముందే అతన్ని పట్టుకుని ఒక పక్కన పడుకోబెట్టాడు షాడో. ఆ గది తలుపులు మూసి గడియ పెట్టాడు.

*    *    *    *    *

"హనుమాన్ గుడి దగ్గిరికి అరడజను సార్లు పోయి రావచ్చు. ఏడిరా వాడు? ఏమైపోయినట్టు?" విపరీతమైన అసహనంతో అప్పటికి ఆరోసారి అడిగాడు ఇన్స్‌పెక్టర్– టీ బంకు జానూభాయ్‌ని.

వెళ్ళినవాడు ఎవరో అతనికి చెప్పలేదు జానూభాయ్. "వచ్చేస్తూ ఉంటాడు సాబ్..." అని మాత్రం అన్నాడు.

సరిగ్గా అదే సమయంలో అవతలి వీధిలో చెలరేగింది విపరీతమైన గందరగోళం.

"అయిపోయాడు రెహమన్ సేట్ అయిపోయాడు. పోలీస్ వాన్లో వచ్చి షాడో నిలువు దోపిడీ చేసేశాట్ట... దొంగ... దొంగ... దొంగ... పట్టుకోండి... పట్టుకోండి" ఆకాశం బద్ధలయ్యేలా అరుస్తూ అరక్షణం తర్వాత ఆ సెంటర్లోకి వచ్చారు దాదాపు పది మంది యువకులు.

పాలు తీసుకురావటానికి పంపిన తన వాన్ ఎందుకు ఉపయోగపడిందో ఒక చెప్పాల్సిన అవసరం లేకుండానే అర్థం అయిపోయింది ఇన్స్‌పెక్టర్‌కి. ఆ

విషయం తన పై అధికారులకు తెలిస్తే జరిగేది ఏమిటో ఊహించుకునే సరికి చెమటలు పట్టేశాయి అతనికి.

"సాబ్... నేను ఇంటికి వెళ్ళిపోతాను" అంటూ అతని సమాధానం కోసం ఏమాత్రం ఎదురు చూడకుండా దుకాణాన్ని క్లోజ్ చేసేశాడు జానూభాయ్.

చెమటలు పట్టిన మొఖాన్ని టవల్‌తో తుడుచుకుంటూ సెంటర్లో నించి ఇవతలికి వచ్చేశాడు. ఊరి అవతల వున్న కాళికామాయి గుడి దగ్గిర ఉంటుంది అతని ఇల్లు.

అది ఇంకో రెండు వందల మీటర్ల దూరంలో ఉన్నదనగా కాళికామాయి గుడి దగ్గిర కనిపించింది అతనికి ఆ పోలీస్ వ్యాన్. స్పీడ్‌గా నడుస్తున్నవాడు కాస్త ఆగిపోయి కళ్ళు చిట్లించుకు చూశాడు. సరిగ్గా ఆలయం పక్క భాగంలో కనిపించారు అతనికి తన షాపు దగ్గిరికొచ్చిన వ్యక్తులిద్దరూ.

గుబగుబ లాడుతున్న గుండెల్ని చిక్కబట్టుకుంటూ అటుకేసి నడిచాడు అతను. మరో పాతిక అడుగులు వేయగానే కనిపించాడు అతనికి రెహమాన్ సేట్‌కి బాకీ పడి ఉన్న బంధో, పక్కన ఉన్నది అతని భార్య అవంతి.

"అప్పణంగా వచ్చిన సొత్తు లక్షలయినా కోట్లు అయినా ఎవరికీ అచ్చిరాదు... నీ అవసరం సేట్‌జీ బాకీ తీర్చటం వరకే అవునా కాదా?" అతన్ని అడుగుతున్నాడు పొట్టిమనిషి.

నోటి వెంట మాటలు రావటం లేదు కాబోలు తల ఊపుతున్నాడు బంధో. "బాకీ తీర్చటానికి ఇవిగో పాతిక వేలు... వడ్డీకి ఇంకో పాతిక... కొత్తగా పెళ్ళి

చేసుకున్నావు కదా... నీ పెళ్ళానికి నెక్లెస్ కొనిపెట్టు'' అంటూ మరో పాతిక వేలు కలిపి అతని చేతిలో పెడుతున్నాడు పొట్టి మనిషి.

సాష్టాంగ నమస్కారం చేయబోయిన అతన్ని వెంటనే వారించాడు అతని పక్కనే ఉన్న యువకుడు.

''ఇంటికి పొండి. పోలీసులకు కనిపించకండి. వెళ్ళిపోండి'' అంటూ అవతలికి పంపించేశాడు.

''మనం వచ్చిన పనయిపోయింది. ఇంక ఈ ఊళ్ళో ఉండద్దు'' అంటూ తలతప్పి మొదటిసారిగా జానూభాయ్‌ని గమనించాడు పొట్టి మనిషి.

''మీ ఇన్స్‌పెక్టర్ ముఖం మీద డికాక్షన్ నీళ్ళు చల్లినట్లేగా... ఎలా ఉన్నాడు?'' నవ్వుతూ అడిగాడు.

మాటలు రాలేదు జానూభాయ్‌కి. ఒకసారి షాడోని చూడటమే గొప్ప... ఒక రోజులో తను రెండవసారి చూస్తున్నాడు... అప్రయత్నంగా ఉబికి వచ్చిన కన్నీటిని అద్దుకోను కూడా అద్దుకోకుండా– చేతులు జోడించాడు.

''నీ కొట్లో చాయ్ చాలా బాగుంటుందని ఈ ఊళ్ళోకి రాగానే మాకు తెలిసింది. తాగే అదృష్టం లేకుండా పోయింది. ఇంకోసారి వచ్చినప్పుడు తప్పకుండా తాగుతాం'' అంటూ యువకుడికేసి చూశాడు పొట్టి మనిషి.

సిగరెట్ వెలిగించుకుంటూ తల ఊపాడు అతను.

తన పైజమా జేబులో నించి ఒక నోట్ల కట్టని బయటికి తీశాడు పొట్టి మనిషి "మేం తాగబోయే చాయ్‌కి ఎడ్వాన్స్ ఇది. నీ దగ్గిర ఉంచు" అంటూ అతని చేతిలో పెట్టి వాన్ దగ్గిరికి వెళ్ళిపోయాడు.

శిలా విగ్రహంలా నిలబడి పోయిన జానూభాయ్ కళ్ళ ముందే స్పీడ్‌గా నేషనల్ హైవే వైపు దూసుకుపోయింది ఆ వాన్. అరక్షణంలో చీకట్లలో కలిసి మాయమైంది.

*　　　*　　　*　　　*　　　*

"అన్యాయం ఇది. అక్రమం, దుర్మార్గం... మాలాంటి వాళ్ళని కాపాడాల్సిన వాళ్ళు మీరు. మీరే అన్యాయం చేస్తే మేము ఎవరికి చెప్పుకోవాలి?" అరిచి అరిచి బొంగురు పోయిన కంఠంతో అడిగాడు రెహమాన్ సేట్.

తెల్లవారిన తర్వాత హనుమాన్ గుడి దగ్గరికి వచ్చిన డి.ఎస్.పి. సాబ్ దీర్ఘంగా నిట్టూర్చి– రెహమాన్ సేట్‌జీ భుజం తట్టాడు అనునయంగా.

"ఆ షాడో అంటూ రానేకూడదు. వచ్చిన తర్వాత ఏం చేస్తాడో ఎలా చేస్తాడో ఎవరికీ తెలియదు. అతను మా వాన్‌ని హైజాక్ చేస్తాడని మేము అనుకోలేదు... ఇంత వరకూ అసలు అది ఏమైపోయిందో మాకు తెలియటం లేదు" మెల్లిగా అన్నాడు.

"మీ డొక్కు వాన్ ఎలాపోతే నాకేంటి సాబ్? నా సొత్తు రెండు కోట్లు. నగలు ఎనభై లక్షలు... దస్తావేజులు కోటి యాభై లక్షలు... దగ్గర దగ్గర నాలుగున్నర కోట్లు. నేను ఏం చేయాలి?" కోపంగా అడిగాడు సేట్‌జీ.

"కంప్లయింట్ రాసివ్వండి" అన్నాడు డి.ఎస్.పి.

“రాసిస్తాను... సాబ్... మీకు కాదు... రాంచీ పట్టణానికి పోయి మంచి లాయర్‌తో మాట్లాడి దొంగతనానికి మీరే వాన్ పంపి సహకరించారని కంప్లయింట్ రాసి కోర్టుకి ఇస్తాను. ఈ సేట్‌జీ అంటే అల్లాటప్పా అనామకుడు అనుకోకండి...” అంటూ విసురుగా వెళ్ళిపోయాడు అతను తన అనుచరులందరితో కలిసి.

మరింత గాఢంగా నిట్టూర్చి– కొంచెం అవతలగా ఉన్న ఒక ఇన్స్‌పెక్టర్ వంక చూశాడు డి.ఎస్.పి.

“రెహమాన్ సేట్‌కి రాజకీయంగా చాలా బలం ఉంది సాబ్... అతను మన మీద కంప్లయింట్ ఇస్తే తట్టుకోవటం కష్టం” నెమ్మదిగా అన్నాడు ఆ ఇన్స్‌పెక్టర్.

“వాన్‌ని తీసుకుపోయి షాడోకి అప్పగించిన ఆ డండర్ హెడ్ ఎక్కడ? ముందు అతనికి సస్పెన్షన్ ఆర్డర్స్ ఇవ్వాలి” పళ్ళు పటపటమని కొరుకుతూ అన్నాడు డి.ఎస్.పి.

కాస్తంత అవతలగా నిలబడి ఉన్నాడు ఆ ఇన్స్‌పెక్టర్. చెమటలు పట్టేశాయి అతనికి.

“పావలా టీకి కక్కుర్తి పడటం అంటే ఇలాగే ఉంటుంది. డబ్బులు ఇచ్చి టీ తాగి ఉన్నట్లయితే ఈ పరిస్థితి ఎరైజ్ అయి ఉండేది కాదు... ఆ టీ కొట్టు మనిషి తప్పకుండా మీకు హెల్ప్ చేసి ఉండేవాడు... అవునా కాదా?” ఖంగు మంటూ అతనికి వినిపించాయి ఆ మాటలు.

అతనికే కాదు. అవతల వున్న డి.ఎస్.పి.కి కూడా వినవచ్చాయి. "కులకర్ణి సార్ మీరా? మీరేనా??" ఆనందంగా అడుగుతూ ఎదురువచ్చాడు.

సగం వరకూ కాలి ఆరిపోయిన సిగార్ని అలాగే మునిపళ్ళతో నొక్కిపట్టి ఉంచిన కులకర్ణిగారు దాన్ని అవతలికి విసిరేసి చిరునవ్వు నవ్వారు.

"సార్... కన్నుమూసి తెరిచేంతలో ఎంత గోల చేశాడో చూశారా? రెండే రెండు దొంగతనాలు... అల్లకల్లోలమయి పోయింది ఈ విలేజి... లెక్క చెప్పలేనంత సొత్తు. మాకు తల ఎత్తుకోలేనంత అవమానం..." దగ్గిర నిలబడి మొర పెట్టుకున్నాడు డి.ఎస్.పి. దొర.

"తుపాను రానే కూడదు మై ఫ్రండ్... వస్తే రిజల్ట్ ఇలాగే ఉంటుంది. ఇప్పుడు నీ ప్రాబ్లెమ్ ఏమిటి?" కోటు జేబులోంచి ఇంకో సిగార్ని తీస్తూ అడిగారు కులకర్ణి.

"ఆ రెహమాన్ సేట్ మా మీద..." అంటూ ఆ పైన చెప్పలేక తలవంచుకున్నాడు డి.ఎస్.పి.

"ఓ.కే... మీరు అఫిషియల్గా అతన్ని ఎంత పోయిందో కాయితం మీద రాసివ్వమని ఒత్తిడి చేయండి. పిచ్చి మాటలు మాట్లాడితే ఇన్కమ్టాక్స్ వాళ్ళని పిలిపించడం జరుగుతుందని చెప్పండి... దెబ్బకి నోరు మూసేస్తాడు" అని సలహా చెప్పారు కులకర్ణి.

కాంతివంతం అయిపోయింది డి.ఎస్.పి.కి అసిస్టెంట్‌గా వచ్చిన ఇన్స్‌పెక్టర్‌కి. "ఇప్పుడే పోతున్నా సాబ్. ఇప్పుడే" అంటూ తన వెహికల్ వైపు పరిగెత్తబోయాడు.

"మా మీద ఒత్తిడి తగ్గడం అయితే తగ్గుతుందిగాని, పోయిన సొమ్ములో ఎంతో కొంత రికవర్ అవటం ఎలా సార్? ఆ పని జరక్కపోతే పై నుంచి వచ్చే మాటల్ని భరించడం ఇంపాజిబుల్ కదా" అన్నాడు డి.ఎస్.పి.

అతని వంకా, పోలీసుల వంకా, దూరదూరంగా నిలబడి ఉన్న గ్రామస్తుల వంకా ఒకసారి చూసి దీర్ఘంగా నిట్టూర్చారు కులకర్ణి. దొరికిన సొత్తును దొరికిన వెంటనే దానధర్మాలు చేసేస్తాడు షాడో... తన దగ్గిర ఉంచుకోడు... ఈ పాటికి కొల్లగొట్టినదంతా...

ఆపైన ఊహించడానికి కూడా మనస్సు అంగీకరించక పోవటంతో, "ఆల్‌రైట్... నాకు చేతనయింది చేస్తాను... టెలిఫోన్ ఎక్కడ ఉంది?" అని అడిగాడు.

గబగబా దారి చూపించాడు ఒక గ్రామస్థుడు.

పక్కనే ఉన్న పంచాయితీ ఆఫీసులో టేబిల్ మీద ఉన్న ఫోన్‌ని ఆయన దగ్గిరికి జరిపాడు.

సగం కూడా కాలని సిగార్‌ని అవతలికి విసిరేసి, ఒక నెంబర్‌కి డయల్ చేశారు కులకర్ణి.

మూడుసార్లు రింగ్ అయింది. "హల్లో ఎవరు మాట్లాడేది?" అంటూ వినవచ్చింది ఒక లేడీ వాయిస్.

"నా పేరు కులకర్ణి... రామ్‌దయాళ్ ఉన్నాడా?" అని అడిగారు కులకర్ణి.

ఆయన పేరు వినేసరికి విపరీతమైన మార్పు వచ్చింది అవతలి కంఠంలో. "ఒక్క నిముషం సార్... పిలుస్తాను" అంటూ రిసీవర్‌ని టేబిల్ మీద పెట్టింది.

అర నిముషంలో లైన్‌లోకి వచ్చాడు రామ్‌దయాళ్.

"నువ్వు, నీ తమ్ముళ్ళు నలుగురు షాడోకి బాగా కావాల్సిన వాళ్ళని నాకు తెలుసు. నాకు తెలుసని నీకు కూడా తెలుసు. అవునా?" గంభీరంగా అడిగారు కులకర్ణి.

రాజస్థాన్ రాష్ట్రంలో పాకిస్తాన్ బోర్డర్స్ దగ్గిర అటు సోల్జర్స్‌కి, ఇటు సోల్జర్స్‌కి తెలియకుండా స్మగ్లింగ్ కార్యక్రమాలు నిర్వర్తించటం రామ్‌దయాళ్ వృత్తి.

నలుగురు తమ్ముళ్ళు ఉన్నారు అతనికి. రంగరాజు, ధనుష్కోటి, దీనబంధు, తుకారాం.

పంచ పాండవుల మాదిరి సరిగ్గా ఐదుగురంటే ఐదుగురు ఉన్న ఆ ఫ్యామిలీ పేరు చెపితే చాటుమాటు వ్యాపారాలు చేసే సర్కిల్స్‌లో చాలా బెదురు...

"నీ ఫ్రెండ్ ఆ ముందు చూపులేని ఇడియట్ ఎక్కడ ఉన్నాడో వెంటనే నాకు తెలియాలి" సూటిగా తన పనేమిటో చెప్పారు కులకర్ణి.

భారత దేశపు సార్వభౌమాధికారాన్ని క్వశ్చన్ చేసే క్రిమినల్ కారెక్టర్స్ అంతు చూడటానికి ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన సి.ఐ.బి.కి సర్వాధికారి కులకర్ణి గారు. క్రిమినల్ కారెక్టర్స్‌ని ఎదుర్కోవాలంటే సామాన్యమైన తెలివితేటలున్న పర్సనాలిటీలు సరిపోవు. కట్‌త్రోట్ మెంటాలిటీ ఉన్నవారే అందుకు సర్వసమర్థులు.

ఆ పర్సనాలిటీలను సెర్చిచేస్తూ దేశమంతా సంచరిస్తున్నారాయన.

“అమోఘమైన ఇంటలిజెన్స్... అనితర సాధ్యమైన సాహసం. చేచేతులారా జీవితాన్ని చెడకొట్టు కుంటున్నాడు నీ స్నేహితుడు” అవతలి నుంచి రామ్‌దయాళ్ సమాధానమివ్వక పోవటంతో తన సంభాషణను కంటిన్యూ చేశారాయన.

ఏదో మెలికపెట్టి షాడోని ఆయన సి.ఐ.బి.లోకి లాకుపోవటనికి ట్రై చేస్తున్నారని రామ్‌దయాళ్‌కి తెలుసు.

“షాడోని నేను కలిసి రెండు నెలలకు పైనే అయింది సాబ్. నిన్న సాయంత్రం వరకూ రాంచీ పట్టణంలోనే ఉన్నట్టు నాకు తెలుసు. ఎట్ ప్రెజెంట్ ఎక్కడ తిరుగుతున్నాడో మాత్రం తెలియదు” ముక్తసరిగా తనకు తెలిసిన వివరాలను బయట పెట్టాడు.

“నువ్వు అబద్ధం చెపుతున్నావ్ మై ఫ్రెండ్...” నిర్మొహమాటంగా విభేదించారు కులకర్ణి. “ఆ డండర్‌హెడ్‌ని నేను కలిసి తీరాలి. ఈ మాటని నువ్వు వెంటనే అతనికి చేరవేయాలి. దటీజ్ ఫైనల్” ఖంగుమంటున్న కంఠంతో చెప్పి రిసీవర్‌ని క్రెడిల్ చేసేశారాయన.

కోటు జేబులో నించి ఫ్రష్ సిగార్ ఇంకొకదాన్ని బయటికి తీస్తూ డి.ఎస్.పి దగ్గిరికి వచ్చారు.

"మాకు ధైర్యాన్నిచ్చే కబురు ఏదయినా తీసుకువచ్చారా?" నీరసంగా అడిగాడు డి.ఎస్.పి. సిగార్‌ని వెలిగించుకుంటూ తల విదిలించారు కులకర్ణి.

"గెట్ మి ఒన్ ఆర్ టు డేస్... ఐ విల్ ట్రై టు డు మై లెవెల్ బెస్ట్" అంటూ దూరంగా నిలబెట్టి ఉంచిన తమ అంబాసిడర్ కారుకేసి అడుగులు వేశారు.

* * * * *

"తెల్లవారి నాలుగు గంటలైంది. ఆకలితో నా పొట్ట అల్లకల్లోలమైపోతోంది. లేచి కూర్చో గురూ... సిటీలోకి పోయి టిఫిన్ చేద్దాం" పదోసారో, పదిహేనోసారో బతిమాలుకున్నాడు గంగారాం, షాడో పక్కన కూర్చుని.

చాంద్‌పూర్ నించి తీసుకువచ్చిన పోలీస్ వాన్‌ని ఒక పల్లపు ప్రదేశంలోకి నెట్టేసి, కాలి నడకన బిజువా సిటీ దరిదాపుల్లోకి వచ్చేశారు వాళ్ళిద్దరూ.

రోడ్డు పక్కనే కనిపించిన ఒక పెద్ద మర్రిచెట్టు కింద పడకవేశాడు షాడో... ఎంత బతిమాలినా లేవడం లేదు. కనీసం కళ్ళు విప్పి కూడా చూడటం లేదు.

"నేను నెత్తి, నోరు కొట్టుకున్నా నువ్వు లేవకూడదని డిసైడ్ అయిపోయిన తర్వాత చేయగలిగింది ఏమీ లేదు. నేను సిటీలోకి వెళ్ళి వస్తా. జాగ్రత్తగా నిద్రపో" అంటూ అక్కడి నించి బయలుదేరాడు గంగారాం.

అరఫర్లాంగు దూరం నడిచిన తర్వాత కనిపించింది అతనికి బిజువా షుగర్ ఫ్యాక్టరీ చెరుకు లోడును తీసుకుపోతున్న ఒక చెరుకు బండి. ఏదో లారీ

ఎదురుగా వస్తూ ఉండటాన్ని చూసి బండిని రోడ్డు మార్జిన్ దగ్గిరికి పోనిచ్చాడు బండి ఓనర్. చిత్తడి నేల కావడం వల్ల డుబుక్కున బురదలో దిగబడిపోయాయి చక్రాలు.

“లాగండి. బైటికి లాగండి. ఆలస్యం చేస్తే ఫ్యాక్టరీలో ఇంకా ఆలస్యం అవుతుంది. రేపు సాయంత్రానికి గాని ఇంటికి చేరుకోలేము. లాగండి” కంచు గంట వంటి కంఠంతో గంయ్ గంయ్‌మని అరుస్తూ బండిని లాగే ఎడ్లమీద విరుచుకు పడుతున్నాడు.

అరవటం, అడ్డమైన తిట్లు తిట్టడంతో ఆగటం లేదతను. చేతిలో ఉన్న పొడవాటి వెదురు చువ్వతో ఆ మూగజీవాలను విరగబాదుతున్నాడు.

దెబ్బ పడినప్పుడల్లా మోరలు పైకెత్తి దీనంగా శబ్దాలు చేస్తున్నాయి అవి. శరీరాలమీద పెద్ద వాతలు తేలుతున్నా, పట్టించుకోకుండా బురదలో ఉన్న చక్రాల్ని గట్టి నేలమీద లాగటానికి ప్రయత్నం చేస్తున్నాయి.

“పాపం భాయీ... నోరు వాయి లేని ఆ పిచ్చి మొఖాల్ని అట్టా కొట్టడం మహా పాపం... కొంచెం కోపం తగ్గించుకో” తల వంచుకుని తన దారిన తను వెళ్ళిపోలేక నెమ్మదిగా బండి ఓనర్‌కి హితబోధ చేశాడు గంగారాం.

“నోరు మూసుకుని నీ దారిన నువ్వు వెళ్ళిపో... నీ చచ్చు సలహాలు ఇక్కడ ఎవరికీ అవసరం లేదు” తల కూడా తిప్పకుండా అతన్ని హెచ్చరించాడు ఓనర్.

చుర్రుమంది గంగారాంకి. మాటలతో టైమ్‌ని వేస్ట్ చేయలేదతను. ఒక్క గంతులో అతన్ని సమీపించి అరచేత్తో వీపు మీద చరిచాడు ఒకే ఒక చరుపు.

ఛట్ మని వినవచ్చింది పెద్ద చప్పుడు. పెద్ద బుల్‌డోజర్ ఏదో వచ్చి వెనక నుంచి గుద్దుకున్నట్టు ఢామ్మని ముందుకు పడిపోయాడు ఆ ఓనర్. నుదురు నేలకు పొడుచుకోవడంతో కీచుగా అరిచి కళ్ళు తేలేశాడు.

"నీ నోరే నీకు శత్రువు భాయీ... మాట్లాడటం చేత కాని చవటలకి ఇదే గతి పడుతుంది..." అంటూ అతన్ని అమాంతం చేతుల్లోకి తీసుకుని రోడ్డుకు ఆవలివైపున ఉన్న ఒక మైలురాయి దగ్గిర పడుకోబెట్టాడు గంగారాం. బండి దగ్గిరికి తిరిగి వచ్చి, మొట్టమొదటిగా కాడికి కట్టి ఉన్న మూగ జీవాలను ఊడదీసి ఇవతలికి లాగాడు.

"మతి లేని వెధవ మీ యజమాని. బండిని నడపటం చేతకాని మట్టి మొఖం. తెలివి వాడికి ఎలాగూ లేదు. మీకు కూడా లేనట్టు ప్రవర్తిస్తే ఎలా? చూడండి ఒళ్ళు ఎలా వాచిపోయిందో!" మృదువుగా మందలిస్తూ, చిత్తడి నేలకు పది అడుగులు కిందగా ఉన్న నీటి కాలువ దగ్గిరికి వాటిని తీసుకుపోయాడు.

ఎంత దూరం నించి బండిని లాగుకుంటూ వస్తున్నాయోగాని, విపరీతమైన దాహంతో ఉన్నాయి అవి. ముట్టెల్ని కిందికి దించి ఆత్రంగా తాగసాగాయి.

"ఆగండి. ఒకేసారి తాగితే ప్రాబ్లెమ్స్ వస్తయ్. నెమ్మదిగా తాగాలి" అంటూ వాటిని వెనక్కి లాగి, అతి నెమ్మదిగా నీళ్ళు తాగించాడు గంగారాం. కాలువ నీటినే వాటి ఒంటిమీద జల్లి, వెదురుచువ్వ దెబ్బల మీద అరిచేతులతో మృదువుగా అద్దాడు... రెండు నిముషాలపాటు తాపీగా నిలబడనిచ్చి, తిరిగి బండి దగ్గిరికి తీసుకొచ్చాడు.

అతను ఏం చేయాలో చెప్పకముందే మెడల్ని కిందికి వంచి, కింద పెట్టిన కాడిని ఎత్తుకున్నాయ్ ఆ జీవాలు.

“శబ్బాష్... అదీ అసలయిన లక్షణం... మీరు మనసు పెట్టాలేగాని, మీకు ఎదురనేదే ఉండదు. లాగండి... బండిని బయటకు లాగండి....” అని వాటిని హుషార్ చేస్తూ ఒక చక్రానికి తన భుజాన్ని ఆనించి పెట్టాడు గంగారాం.

ఆ మెచ్చుకోలు మాటలకి ముచ్చట పడిపోయాయో లేక అలసట తీరటం వల్ల జారిపోయిన శక్తి తిరిగి వచ్చిందో గాని, బర్రుమంటూ బండిని బురదలో నించి బయటికి లాగేశాయి ఆ జీవాలు. గట్టినేల మీదికి పోగానే, ఆగి, తలల్ని తిప్పి అతనికేసి చూశాయి.

“మీరు నిజంగా చాలా గ్రేట్... హేపీగా మీ పని మీరు చేసుకోండి... ఆ సుత్తిమొఖం డైరెక్షన్స్‌ని గుడ్డిగా ఫాలో కాకుండా జాగ్రత్తగా నడుచుకోండి” వాటి తలలు నిమురుతూ చెప్పాడు గంగారాం.

మైలురాయి దగ్గిర మగతగా పడివున్న బండి ఓనర్ అటూ ఇటూ కదలటం కనిపించింది అతనికి. క్షణం కూడా ఆలస్యం చేయలేదతను. ఇంకోసరి వాటి తలల్ని నిమిరి చకచకా నడవటం మొదలు పెట్టాడు. పది మైళ్ళ దూరం నడిచాక ఎదురయింది అతనికి బిజువా సిటీ అవుట్‌స్కర్ట్స్‌లో ఉన్న ఒక పెద్ద రహదారి హోటల్.

నేషనల్ హైవే మీద ప్రయాణం చేసే వెహికిల్స్‌లో చాలా భాగం ఆగిపోయే చోటు అది. స్టీరింగ్స్ ముందు కూర్చుని నడుములు పట్టేసినవారు రిలాక్సవటానికి వరుసల్లో వేయబడి ఉన్నాయి నులక మంచాలు.

ఖాళీగా వున్న ఒక మంచంకేసి నడుస్తూ, ఉన్నట్లుండి ఆగిపోయాడు అతను. గాలిని వాసన చూసే బ్లడ్‌హౌండ్ మాదిరి తలను పైకెత్తి చుట్టూ చూశాడు.

"కూర్చోండి భాయిసాబ్... రిలాక్స్ అవండి..." అతన్ని చూడగానే పెద్ద ట్రేలో ఐస్ వాటర్ జగ్‌ని, ఒక గ్లాస్‌ని పెట్టుకుని, ఎదురువస్తూ అన్నాడు ఒక వెయిటర్.

"వాసన వస్తోంది బే..." చుట్టూ చూడటాన్ని మానుకోకుండా అన్నాడు గంగారాం.

"ఏం వాసన సాబ్?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"పోలీస్ వాసన..." అన్నాడు గంగారాం.

ఉలిక్కిపడి నోటిని వెళ్ళబెట్టేశాడు వెయిటర్.

"మా ఓనర్ ఎంత బతిమాలినా వినకుండా వచ్చి రాత్రినించీ ఇక్కడే తిష్టవేశారు. వచ్చేపోయేవాళ్ళని గమనించడం కోసం రహస్యంగా లోపల కూర్చున్నారు. ఎవరికీ రావటం లేదు అనుమానం. మీకు ఎలా తెలిసింది సాబ్?" ఆశ్చర్యంగా అడిగాడు.

"తిష్ట ఎందుకు వేశారు బే?" ఎలా తెలిసిందో చెప్పకుండా ముందుగా అడుగుతూ నులక మంచం మీద సెటిల్ అయిపోయాడు గంగారాం.

"చాంద్‌పూర్ నుంచి షాడో ఇటుగా వస్తాడని వీళ్ళ అనుమానం సాబ్... వాళ్ళ పిచ్చిగాని నేనే షాడోనని మొఖం మీద బోర్డు కట్టుకుని వస్తాడా? అసలు ఆ షాడో ఎలా ఉంటాడో కూడా వీళ్ళకి తెలియదు. తెలిసిందల్లా మా ఓనర్ లాంటి అమాయకులని బెదిరించి మామూళ్ళు వసూళ్ళు చేసుకోవటమే..." మంచినీళ్ళ గ్లాసును అందిస్తూ సీరియస్‌గా చెప్పాడు వెయిటర్.

కనులు చిట్లించి చూసిన గంగారాంకి, ఓనర్ కూర్చునే కాష్ కౌంటర్ వెనుక కనిపించారు అరడజను మంది పోలీసులు. వంటి మీద చీమలు పాకిన సెన్సేషన్ కలగటంతో సంభాషణను కంటిన్యూ చేయలేదతను.

చాంద్‌పూర్ నుంచి మెస్సేజి వచ్చి ఉంటుంది. పబ్లిక్‌గా రోడ్డు మీద నిలబడితే సిటీ అంతా ఆ విషయం తెలిసి అల్లకల్లోలమై పోతుందని- చాటుగా మాటువేశారు. ఏమాత్రం తేడాగా కనిపించినా నిర్మొహమాటంగా పట్టుకుని స్టేషన్‌కి నడిపిస్తారు...

"వేడివేడిగా పది పరోటాలు... ఉల్లిపాయలతో పాటు పచ్చిమిరపకాయలు కూడా పొట్లం కట్టు. అర్జంట్" తనలో స్టార్ట్ అయిన టెన్షన్ ముఖం మీద కనిపించకుండా జాగ్రత్త పడుతూ చెప్పాడు వెయిటర్‌కి. చెప్పటమే కాదు ఎడ్వాన్సుగా ఒక కరెన్సీ నోటును కూడా చేతిలో పెట్టాడు.

రాకెట్‌లా హోటల్లోకి పరిగెత్తాడు వెయిటర్. నాలుగే నాలుగు నిముషాల్లో పెద్ద పొట్లాన్ని తెచ్చి అతనికిచ్చాడు.

"ఆగు మిస్టర్. ఒక్క క్షణం ఆగు..." అంటూ పొట్లాన్ని పట్టుకుని పైకి లేవబోతున్న గంగారాని ఆపటానికి ప్రయత్నించింది ఒక కంఠం.

ఉలికిపాటును నేర్పుగా కప్పిపెట్టుకుంటూ అటు చూసిన గంగారాంకి కనిపించారు కాష్ కౌంటర్ దగ్గర్నించి వెలుపలికి వచ్చేస్తున్న పోలీసులు.

రిస్కులు తీసుకోవడం అనవసరం అనే నిర్ణయానికి వచ్చేశాడు గంగారాం. వస్తున్న పెద్ద మనుషులు షేక్‌హేండ్స్ ఇవ్వటానికి రావటం లేదు. నిలబెట్టి ప్రశ్నలు వేస్తారు... లేనిపోని ఇబ్బందుల్ని క్రియేట్ చేస్తారు...

ఆగినట్టే ఆగి, ఒక్కసారిగా గొంతు చించుకుని అరిచాడు అతను. "అయ్యబాబోయ్... పట్టుకోండి... వాడిని పట్టుకోండి..." నాలుగే నాలుగు అంగల్లో అతని దగ్గిరికి వచ్చేశారు పోలీసులు.

"ఎవర్ని పట్టుకోవాలి? ఎవర్ని?" ఆశ్చర్యంగా అడిగారు.

"అడుగో పరిగెత్తుతున్నాడు... బహుశా షాడోనే అయి ఉంటాడు.. అడుగో... అడుగో..." సిటీవైపు చెయ్యి చూపిస్తూ మరింత ఎగ్జైటెడ్‌గా చెప్పాడు గంగారాం.

షాడో పేరు వినబడేసరికి వళ్ళు జలదరించింది కాబోలు. క్షణం కూడా ఆలస్యం చేయలేదు వారందరిలోకి సీనియర్‌మోస్ట్ కానిస్టేబిల్‌కి... "ఫోను, ఫోను

చెయ్యండి. కంట్రోల్ రూమ్‌కి కబురు అందించండి...'' అంటూ తిరిగి కాష్ కౌంటర్ దగ్గిరికి పరిగెత్తాడు.

''చూస్తూ నిలబడతారేంటి సాబ్... పరిగెత్తండి. పట్టుకోండి'' రోడ్డుకేసి జాచిన చేతిని కిందికి దించకుండా మిగిలిన వారిని హెచ్చరించాడు గంగారాం. ఎగ్జాంపుల్ చూపించడానికి తను పది అడుగుల దూరం పరిగెత్తాడు.

అతను మరోసారి చెప్పాల్సిన అవసరం లేకపోయింది. లాటీలను బిగించి పట్టుకుని తాము కూడా పరుగు మొదలు పెట్టారు మిగిలిన కానిస్టేబిల్స్.

వారితో కలిసి ఇంకో పది అడుగుల దూరం పోయి సడన్‌గా ఆగిపోయాడు గంగారాం.

ఆ విషయాన్ని వెంటనే గ్రహించలేకపోయారు వాళ్ళు. గమనించేసరికి చాలా ఆలస్యం అయిపోయింది. గిరుక్కున వెనక్కి తిరిగి, రోడ్డు పక్కన ఉన్న చెట్ల చాటుకిపోయి మటుమాయం అయిపోయాడు అతను.

*　　　*　　　*　　　*　　　*

ఉదయం పదకొండు గంటల వరకూ పరమ ప్రశాంతంగా ఉన్న బిజువా పట్టణం కాస్తా పదకొండు గంటల పదినిముషాలకు భూకంపం వచ్చినట్టు అల్లకల్లోలం అయిపోయింది. కర్రలు, కత్తులు, ఐరన్ రాడ్లు పట్టుకుని వీధుల్లో తిరగడం మొదలుపెట్టారు పౌరులు.

''అటో ఇటో తేలిపోవాల్సిందే ఇవాళ... ఆ షాడోని పట్టుకుని చితక్కొట్టి పారేయాల్సిందే...'' పెద్ద కంఠంతో ఖాన్‌జీ దర్గా దగ్గిర నిలబడి ఎనౌన్స్ చేశాడు బజ్జీదాదా.

“నీవన్నట్లు షాడోని పట్టుకుని చితక్కొట్టటానికి ఏదైనా ఆయుధం కావాలి. నీ దగ్గర ఆ తోలు సంచీ తప్ప ఏదీ లేదు... అసలు ఏముందిరా ఆ సంచీలో?” నవ్వుతూ అడిగాడు పక్కనే ఉన్న ఒక పౌరుడు.

బిజువాలో అందరికంటే సంపన్నుడని పేరు పొందిన మధోసేట్ దగ్గిర పని చేస్తుంటాడు బజ్జీదాదా... అంతకు ముందు రోజు తన దగ్గిరికి చేరిన సంపాదనంతా తీరికగా లెక్క పెట్టిస్తున్నప్పుడు మాధోసేట్‌కి తెలిసింది సిటీలోకి షాడో వచ్చేశాడన్న వార్త.

వెనుకా ముందు చూడకుండా కరెన్సీ కట్టల్ని ఒక తోలు సంచిలో పెట్టి బజ్జీదాదాకి అప్పగించాడు అతను.

“తీసుకుపోయి బేంక్‌లో కట్టెయ్... ఎటుపోయి ఎటు వచ్చినా మనకి ఇబ్బంది వుండదు” అని ఆర్డర్ ఇచ్చాడు.

ఇప్పుడు కరెన్సీ కట్టలున్న ఆ తోలుసంచీ ప్రసక్తి వచ్చేసరికి, అసలు తను ఎందుకు వీధిలోకి వచ్చాడో గుర్తుకు వచ్చింది బజ్జీదాదాకి.

“బేంక్ దగ్గిరికి పోయి వస్తా...” అని తన్ను పలకరించిన పౌరుడికి చెప్పి పెద్ద పెద్ద అడుగులతో మెయిన్ రోడ్డువైపు బయలుదేరాడు.

ఒక మలుపు తిరుగుతుండగా కనిపించింది అతనికి ఒక చిన్న గుంపు... “ఏమయింది బే? ఏం జరిగింది?” దగ్గిరికి పోతూ అడిగాడు అతను.

“బిగ్గిరిగా మాట్లాడకు... షాడో... కనిపించాట్ట...” చిన్న కంఠంతో చెప్పాడు అతనికి ఒక వృద్ధుడు.

“ఎక్కడ? ఎక్కడ?” ఆశ్చర్యంగా అడిగాడు దాదా.

“అదిగో... ఆ గల్లీలో” అంటూ ఒక చిన్న సందును చూపించాడు ఆ వృద్ధుడు.

“షాడో కనిపిస్తే చూస్తూ ఎందుకు నిలబడ్డారు? పోయి ఇరగేయచ్చుగా” మరింత ఆశ్చర్యంగా అడిగాడు.

“అంత ధైర్యం ఇక్కడ ఎవరికీ లేదు... ఎంత చెప్పినా ఎవరూ కదలటం లేదు. ఆ షాడోని పట్టిస్తే ప్రభుత్వం కనీసం కోటి రూపాయలైనా ఇచ్చేస్తుంది. పోలీసుల మాట వేరే చెప్పాల్సిన అవసరం లేదు. నెత్తుల మీద పెట్టుకుంటారు” ఇంకా ఇంకా గొంతు తగ్గించి మరింత రహస్యంగా చెప్పాడు ఆ వృద్ధుడు.

నోరు ఊరిపోయింది బజ్జీదాదాకి... కోటి రూపాయలు, పోలీసుల దగ్గిర పెరిగిపోయే పరపతి....

“నేను పట్టుకుంటాను...” అంటూ పెద్ద పోటుగాడిలా ముందుకు అడుగు వేశాడు.

“అదీ అసలైన మాట... అసలు సిసలు మగాడివి అంటే నువ్వే. నీ వెనకాలే నేను కూడా వస్తా.... పద.... పద” అంటూ అతన్ని మరింత ఉత్సాహపరిచాడు వృద్ధుడు.

కోటి రూపాయలు అప్పణంగా వచ్చి తన ఒళ్ళో పడిపోయినట్టే పగటి కలలు కంటూ చకచకా గల్లీలోకి అడుగు పెట్టాడు బజ్జీదాదా.

రెండు ఖబరస్థాన్‌లు ఉన్నాయి ఆ గల్లీలో... అరడజను ఖాళీ స్థలాలు కూడా అక్కడే ఉండటంతో జన సంచారం అనేది లేదు. అందువల్ల అప్పుడు జరిగింది ఏమిటో ఎవరికీ తెలియదు. బజ్జీదాదా గల్లీలోకి ఎంటరైన మరుక్షణం కదలిక వచ్చింది గుంపులో ఉన్న వారందరికీ... కూడబలుక్కున్నట్టు అందరూ ఒకేసారి కదిలారు.

అరక్షణం ఆలస్యంగా అర్థమయింది అసలు విషయం బజ్జీదాదాకి.... "మోసం... దగా... వంచన..." అని అరుస్తూ వేగంగా వెనక్కి తిరగబోయాడు.

ఫట్ మంటూ పడింది ఒక దెబ్బ అతని తలమీద. పగిలిపోయినంత బాధ నరాల్ని జివ్వుమనిపిస్తుండగా ముందుకు తూలాడు అతను. సరిగ్గా అప్పుడే అతని చంకలో ఉన్న తోలు సంచీని లాగేసుకున్నాడు అతనికి షాడోని గురించి చెప్పిన మనిషి.

"కొట్టేయండి... ఇంకో గంటదాకా లేచి నిలబడకూడదు" అని తమతోపాటుగా గల్లీలోకి వచ్చిన గుంపులోని వారికి చెపుతూ వెనక్కి పారిపోయాడు.

కోటి రూపాయలకు ఆశపడటం వల్ల తనకు ఎటువంటి గతిపట్టిందో తలుచుకుని బజ్జీదాదా విచారించడం మొదలు పెట్టకముందే దబదబమని కురిసింది దెబ్బల వర్షం. తలమీది దెబ్బకు ముందుకు తూలిన అతను తిరిగి నిఠారుగా నిలబడలేదు... తల గిర్రున తిరుగుతూ ఉండగా నేలమీద పడిపోయాడు.

వెంటనే వెనుతిరిగి కన్నుమూసి కన్ను తెరిచేటంతలో మాయం అయిపోయారు గుంపులోని జనం.

*                    *                    *                    *                    *

"నలభై లక్షలు... ఆఫ్టరాల్ ఒక తోలు సంచీలో పెట్టి ఎటువంటి ఎస్కార్టు లేకుండా ఒంటరి మనిషితో పంపించారా? మీకసలు బుద్ధి, జ్ఞానం ఉన్నయ్యా?" పన్నెండు గంటల రెండు నిముషాలకల్లా టూ టౌన్ స్టేషన్‌కి వచ్చిన మాధోసేట్‌ని అడిగాడు ఇన్స్‌పెక్టర్ నిఖిల్.

"ఇవన్నీ మాకు మామూలే... పోయిన సంవత్సరం కోటి ఎనభై లక్షలు నేనే పట్టుకుపోయి పెద్ద బజార్లో పంపిణీ చేసి వచ్చాను..." నిబ్బరంగా చెప్పాడు మాధోసేట్.

"వాటెబౌట్ దిస్ బజ్జీదాదా? తనే తెలివిగా నొక్కేసి ఎవరో తల పగల కొట్టినట్టు నాటకం ఆడుతున్నాడేమో?" కాజువల్‌గా అడిగాడు నిఖిల్.

"వాడు నా రైట్ హేండు... చదువు సంధ్యలు లేని మడ్డి మొఖమేగాని నమ్మకస్తుడు... నాకు అనుమానం లేదు...." చెప్పాడు మాధోసేట్.

"నమ్మకస్తుడే... అందులో సందేహం ఏమీ లేదు. కాకపోతే షాడోని మాకు పట్టించి చిటికెలో మీలాగా కోటీశ్వరుడి పోవాలని అనుకున్నాడు అంతే" కాస్తంత వ్యంగ్యంగా అంటున్న నిఖిల్‌ని కోరగా చూశాడు మాధోసేట్.

"మాటలు అనవసరం... నా డబ్బు నాకు తిరిగి వచ్చేయాలి... మీరు వెతికి పెడతారా పెట్టరా?" అడిగాడు.

గట్టిగా నిట్టూర్చి తల విదిలించాడు నిఖిల్. బిజువా పట్టణంలో మాధోసేట్ మాటకి తిరుగులేదు... అతని దృష్టిలో చేతకానివాడిలా ముద్రపడితే, తన డిపార్ట్‌మెంట్‌లో కూడా అదే మాట రిపీట్ అవుతుంది.

“ఓ.కే. సర్... నేను ఎంక్వయిరీ చేస్తాను. ఇదిగో ఈ షాడో గోల కొంచెం చల్లారగానే...” అంటుండగానే, “మీరు ఆర్చుకు తీర్చుకుని బయలుదేరే సమయానికి బిజువాకి మూడొందల మైళ్ళ దూరం వెళ్ళిపోతారు. ఆ బటాచోర్లు... షాడో గీడో నాకు అనవసరం. ముందు నా పని పూర్తి చేయాలి” కరుకుగా అన్నాడు మాధోసేట్.

“సారీ సర్... పై నుంచి ఆర్డర్స్... షాడో మా ఫస్ట్ ప్రియారిటీ....” కొంచెం గట్టిగానే చెప్పాడు నిఖిల్.

చటుక్కున చేయి జాచి అతని టేబిల్ మీది ఫోన్‌ని తీసుకుని ఏదో నెంబర్‌ని డయల్ చేశాడు మాధోసేట్. ఆ నెంబర్ ఎవరిదో అర్థమయ్యేసరికి గొంతు కొంచెం ఎండుకుపోయిన సెన్సేషన్ కలిగింది నిఖిల్‌కి.

అతను ఊహించినట్టే ఒక నిముషం తర్వాత మాధోసేట్ అతనికి అందిస్తున్న రిసీవర్‌లో నుంచి ఖంగు ఖంగు మంటూ వినవచింది డి.జి.పి. గారి కంఠం.

“షాడో ప్రాబ్లం మొత్తం సిటీకి ఉంది. నీ ఒక్కడికే కాదు. ముందు సేట్‌జీ పని చూడు... ఈ సాయంత్రానికల్లా నాకు రిజల్ట్ కనిపించాలి... అర్థం అయిందా?”

తనకు తెలియకుండానే అటెంక్షన్‌లో నిలబడి తల ఊపాడు నిఖిల్. "అలాగే సార్. అదే పని చేస్తాను సార్" అంటూ రిసీవర్‌ని క్రెడిల్ చేసి సేట్‌జీ వంక చూశాడు.

"సాయంత్రం ఐదు గంటల కల్లా మీకు హోమ్ మినిస్టర్‌గారి దగ్గిర్నించి కూడా వస్తుంది ఫోన్... రెడీగా ఉండండి" అంటూ నిష్కర్షగా చెప్పి వేగంగా బయటికి వెళ్ళిపోయాడు మాధోసేట్. తల పగిలిపోతున్న అనుభూతి కలుతుండగా, కుర్చీలో చేరగిలబడ్డాడు నిఖిల్.

"ఇది తప్పకుండా ఆ పహాడీవాలా గాంగ్ పనే అయి ఉంటుంది సాబ్. రెండు సంవత్సరాల నించీ చీడపురుగు మాదిరి సిటీని పట్టుకుని వేధిస్తోంది. పట్టుకోవడం మాత్రం ఎవరికీ చేతకావడం లేదు" నెమ్మదిగా దగ్గిరికి వచ్చి చిన్నగా చెప్పాడు హెడ్ కానిస్టేబిల్.

ఒక నెలే అయింది నిఖిల్ ఆ స్టేషన్‌కి వచ్చి... అతను చెప్పిన మాటల్ని విని, "నాకు ఆ గాంగ్ వివరాలు కావాలి... వీలైతే అడ్రసులు కూడా" అన్నాడు.

చిన్నగా నవ్వి సాధ్యం కాదన్నట్లు తల అడ్డం తిప్పేశాడు హెడ్ కానిస్టేబిల్. "మనం చేయని ప్రయత్నం అంటూ ఏమీలేదు సార్. వాళ్ళెవరో ఎవరికీ అంతు బట్టడం లేదు.... వాళ్ళని ట్రేస్ చేయడం కంటే షాడోని ట్రేస్ చేయడం చాలా తేలిక" అన్నాడు.

"ఇప్పుడు నేనేం చేయాలి?" అడిగాడు నిఖిల్.

సరాసరి డి.జి.పి గారి దగ్గర్నించి వచ్చే ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ కోసం ఎదురు చూడడమేనని అతనికి చెప్పలేదు ఆ హెడ్‌కానిస్టేబిల్. "మాధోసేట్ మహా పవర్‌ఫుల్. బిజువా సిటీలో మూడొంతుల మంది అతను చెప్పిన వాళ్ళకే ఓట్లు వేస్తారు... జాగ్రత్త సార్" అని చెప్పాడు.

*         *         *         *         *

"ఎప్పుడో గంట క్రితం తిన్న పరోటాలు అరిగిపోయి మళ్ళీ ఆకలేస్తోంది. మనం ఈ చెట్టును వదిలి అవతలికి పోవడం ఎప్పుడు?" మర్రిచెట్టు కిందే పడుకుని సిగరెట్ కాల్చుకుంటున్న షాడోని అడిగాడు గంగారాం.

"మన గురించి బిజువా పోలీసులకు మెస్సేజ్‌లు వచ్చే ఉంటయ్. అనవసరంగా అటుపోయి లేనిపోని బాధలు పడటం దేనికి?" అడిగాడు షాడో.

"ఆ మాట నిజమే అనుకో... కాని ఇక్కడే మకాం పెడితే ఎవరికో ఒకరికి అనుమానం వచ్చేస్తుంది. బిజువాలోకి కాకపోతే జిగ్ని పట్టణానికి పోదాం... నాకు ఎటువంటి పట్టింపులు లేవు..." అన్నాడు గంగారాం.

"బిజువాని కంట్రోల్ చేస్తోంది ఎవరు?" అడిగాడు షాడో. పైజామా జేబులోంచి నలిగిన చిన్న పాకెట్ డైరీ వంటి బుక్‌ని బయటికి తీశాడు గంగారాం. మట్టి మరకలతో చికాకుగా కనిపిస్తున్న పేజీలను తిరగేసి, "మాధోసేట్... మార్కెట్ ఏరియాలో చిన్న చిన్న వ్యాపారస్తులకి అప్పులిచ్చి మహా బాగా సంపాదించాడు..." అని చెప్పాడు.

"అతన్నోసారి చూడాలని కోరికగా వుంది" చివరికంటా కాలిన సిగరెట్‌ని అవతలికి విసిరేసి, ఇంకో సిగరెట్‌ని పెదవుల మధ్య పెట్టుకుంటూ చెప్పాడు షాడో.

“పని ఏదీ లేకపోతే నువ్వు ఆ పాడు సిగరెట్లను అదే పనిగా కాల్చేస్తావ్... ఆరోగ్యం చెడితే బాధపడేది నేను. నువ్వు కాదు... మనం జిగ్నీకి పోతున్నాం బిజువాకి కాదు” ఖచ్చితమైన కంఠంతో ఎనౌన్స్ చేశాడు గంగారాం.

అతను ఆ సిటీని ఎందుకు ఎవాయిడ్ చేయాలని అనుకుంటున్నాడో వివరణ అడగలేదు షాడో.

“పరోటాల కోసం పోయి లేనిపోని గోల స్టార్ట్ చేసి వచ్చావు. అవునా?” అని అడిగాడు.

ఇబ్బందిగా చూసి దంతాలన్నీ కనిపించేటట్టు నవ్వాడు గంగారాం. “నీ పేరు చెప్పి రెండు గంతులు వేసేసరికి చెమటలు పట్టేసినయ్ వాళ్ళకి... ఆ సీను నువ్వు చూసి ఉండాల్సింది” అని అన్నాడు.

వెలిగించుకోబోయిన సిగరెట్‌ని విసిరేసి లేచి నిలబడ్డాడు షాడో. “కమాన్ లెటజ్ గో...” అంటూ బిజువా వైపు అడుగులు వేశాడు.

అంత వరకూ అతను తలకింద పెట్టుకుని పడుకున్న పట్టు గుడ్డ మూటని భుజం మీద వేసుకుని వెనకాలే బయలుదేరాడు గంగారాం.

బిజువా అవుట్ స్కర్ట్స్ దగ్గిరికి చేరుకునేసరికి వారికి కనిపించాయి పోలీస్ బలగాలు... రోడ్డుకు అటూ ఇటూ వేన్స్‌ని నిలబెట్టి, వచ్చీపోయే వారిని చెక్ చేస్తున్నారు వాళ్ళు. అనుమానంగా అనిపిస్తే పక్కన కూర్చోబెట్టి, రకరకాల ప్రశ్నలతో బంబార్డ్ చేస్తున్నారు.

"నేను ముందే చెప్పాను. నువ్వు వినిపించుకోలేదు" ఆగిపోయి, వెనక్కి పరిగెత్తటానికి రెడీ అవుతూ కంప్లైంట్ చేశాడు.

"ముందుగా నువ్వు వెళతావా? నన్ను వెళ్ళమంటావా?" అతని మాటలు వినబడనట్లు అడిగాడు షాడో.

పదికి పైగా ఉన్నాయి పోలీస్ వాహనాలు. వందమంది కానిస్టేబిల్స్... ఎనిమిది మంది ఇన్స్పెక్టర్స్...

తేడా అంటూ వస్తే? ఆపైన ఊహించటానికి మనసు అంగీకరించక పోవటంతో, అసహ్యంగా మొఖంపెట్టి ఒక్కసారి తల విదిలించాడు గంగారాం.

పట్టుగుడ్డ మూట నిండా ఉన్నాయి చాంద్‌పూర్‌లో కొల్లగొట్టుకు వచ్చిన నగలు, తాకట్టు దస్తావేజులు... డబ్బు కట్టలు... మూటని చూపించమని వాళ్ళు అడిగిన మరుక్షణం బట్టబయలు అయిపోతుంది గుట్టు.

"ఏంటి ఆలోచిస్తున్నావ్? నన్ను వెళ్ళమంటావా?" మరోసారి షాడో హెచ్చరించడంతో ఎడతెగని ఆలోచనల్లోంచి బయటపడ్డాడు గంగారాం.

"ఎప్పటికప్పుడు నన్ను ఏదో ఒక ఇరకాటంలో పెట్టి తమాషా చూడడం నీకు బాగా అలవాటయిపోయింది. నిన్ను అని ప్రయోజనం లేదు... అసలు ఈ గొడవకంతా కారణం ఈ బిజువా పోలీసులు... వాళ్ళకి నషాళానికి అంటుకునేటట్టు ఇవ్వాలి ఒక కిక్కు" అంటూ చకచకా ముందుకు అడుగులు వేశాడు గంగారాం.

రోడ్డు పక్కనే వున్న ఒక చెట్టుకు ఆనుకుని నిలబడి సిగరెట్ వెలిగించుకున్నాడు షాడో. పాదరసం కంటె చురుకుగా కదులుతాయి గంగారాం ఆలోచనలు.

ఎటువంటి క్రిటికల్ కండిషన్‌లోనైనా బ్యాలెన్స్ కోల్పోవటం జరగదు. ఇప్పుడు ఎదురుగా ఉన్న సిచ్యుయేషన్‌ని అతను ఎలా ఫేస్ చేస్తాడో చూడాలి... గుండెల నిండా పొగను పీల్చుకుని రింగులు రింగులుగా బయటికి వదులుతూ కనులను చిట్లించాడు షాడో.

కదలికల్లో ఎటువంటి తడబాటును ప్రదర్శించకుండా ఒక ఇన్స్‌పెక్టర్ దగ్గిరికిపోయాడు గంగారాం.

"ఎవరివి బే నువ్వు? ఎక్కడినించి వస్తున్నావ్? ఏమిటా మూట?" ఒకే బ్రీత్‌లో వెంట వెంటనే మూడు ప్రశ్నలు వేసేశాడు ఆ ఇన్స్‌పెక్టర్.

"నా పేరు డీలారాం కొడుకు భగవాన్ రాం అంటారండీ... జిగ్ని పట్టణానికని బయలుదేరి దారి తప్పానండీ. వస్తుంటే దారి మధ్యలో" అంటూ మాటని ఆపాడు గంగారాం.

"ఏముంది బే ఆ మూటలో?" ఏ ప్రశ్న అయితే బయటికి రాకూడదని అనుకుంటున్నాడో ఆ ప్రశ్న అతని చెవుల పడనే పడింది. పెదవుల మధ్యన ఉన్న సిగరెట్‌ని గురించి మర్చిపోయి ఊపిరి బిగపట్టాడు దూరంగా ఉన్న షాడో.

"మూటలో ఏముందని అడుగుతుంటే మాట్లాడవేంటి? ఏముంది?" రెట్టించాడు ఇన్స్‌పెక్టర్.

అటూ ఇటూ చూసి అతనికి దగ్గిరిగా జరిగాడు గంగారాం. "దారి తప్పి వస్తుంటే రోడ్డు పక్కన ఒక చెట్టు కింద నాకు ఇది దొరికింది సాబ్..." అంటూ పైజమా జేబులో నించి ధగధగ మెరిసిపోతున్న ఒక నెక్లస్‌ని బయటికి తీసి అతనికి చూపించాడు.

దగ్గిర దగ్గిరగా లక్షా యాభైవేలు ఖరీదుచేసే ఆ ఆభరణాన్ని చూసేసరికి కళ్ళు తిరిగి ఒక్కసారిగా ఊపిరి ఆగిపోయినంత పని అయింది ఇన్స్‌పెక్టర్‌కి.

"ఎక్కడ? ఎక్కడ దొరికింది ఇది?" చటుక్కున దాన్ని చేతుల్లోకి తీసుకుంటూ అడిగాడు.

"పది మైళ్ళు ఉంటుంది సాబ్... పెద్ద మర్రిచెట్టు... ఎవరో చాలాసేపు అక్కడే కూర్చున్నట్టు గుట్టలు గుట్టలుగా సిగరెట్ పీకలు... సారా ప్యాకెట్లు మాత్రం కనిపించలేదు" వినయంగా వెల్లడించాడు గంగారాం.

"కమాన్ ఎవ్రీబడీ... కమ్ హియర్..." పెద్ద కంఠంతో మిగిలిన ఇన్స్‌పెక్టర్స్‌ని దగ్గిరికి పిలిచాడు ఆ అధికారి. అందరికీ ఆ నెక్లస్‌ని చూపించాడు.

"మైగాడ్. ఇది షాడో పనే అయి ఉంటుంది. చాంద్‌పూర్ నించి వస్తూ వస్తూ అక్కడ రెస్ట్ తీసుకోవటానికి ఆగి ఉంటాడు... అసలు గట్టిగా మాట్లాడితే తన దగ్గిర ఉన్న సొత్తునంతా అక్కడే ఎక్కడో దాచిపెట్టటమో, పాతి పెట్టటమో చేసి ఉంటాడు. నో డౌట్ ఎబౌట్ ఇట్" వెంటనే తన అభిప్రాయాన్ని వెల్లడించాడో ఇన్స్‌పెక్టర్.

అతను ఆ మాటలు అనటం, మిగిలిన ఇన్స్పెక్టర్ల శరీరాలు జలదరించటం ఒకేసారి జరిగింది. చాంద్‌పూర్ దొంగతనాల్లో మాయమైన సొత్తును రికవర్ చేయటం అంటే– అప్పటికప్పుడు ప్రమోషన్స్ పొందటమే...

"కమాన్ ఎవ్రీబడీ... ఉయార్ గోయింగ్ టు దట్ ప్లేస్" ఖంగుమంటున్న కంఠంతో అందరినీ తనతో రమ్మని పిలిచాడు మొట్టమొదటి ఇన్స్పెక్టర్.

"అయ్యబాబోయ్... షాడో కొట్టేసిన సొత్తా ఇది? నిజంగానేనా?" విపరీతమైన ఎగ్జైట్‌మెంట్‌తో అడిగాడు గంగారాం. అడగటంతో ఆగలేదతను.

"నేను కూడా వస్తాను సాబ్... నేనే ఆ చెట్టును మీకు చూపిస్తాను. ప్రభుత్వం నాకు కూడా బహుమతులు ఇస్తుంది... ఈ దెబ్బతో నేను లక్షాధికారిని అయిపోతాను... నన్నూ తీసుకుపొండి సాబ్..." అన్నాడు.

అతని మాటలు ఎవరి చెవులకీ చేరలేదు. "కమాన్... కమాన్... మూవ్... మూవ్..." అర్జంటుగా అందరినీ ఇంకోసారి హెచ్చరించాడు మొదటి ఇన్స్పెక్టర్.

బర్రు బర్రుమని మోతలు చేస్తూ స్టార్ట్ అయినాయి వారి వాహనాలు... ఆలస్యం చేస్తే అక్కడే ఉండిపోవాల్సి వస్తుందన్న భయం కలిగేటట్టు గబగబా వాటిలోకి వడివడిగా జంప్ చేశారు కానిస్టేబిల్స్ అందరూ.

అందరికీ ఒకటే ఆశ... షాడో కొల్లగొట్టిన సొత్తును రికవర్ చేసి డిపార్ట్‌మెంట్‌లో మంచి పేరు కొట్టేయాలి.

తనను కూడా వెంటబెట్టుకు పొమ్మంటున్న గంగారాం గురించి మర్చిపోయారు వాళ్ళు. అతని దగ్గిరున్న మూటని చెక్ చేయాలని కూడా

విస్మరించారు. చూస్తూ చూస్తూ ఉండగానే కదిలాయి వేన్స్. స్పీడ్‌గా అతను చెప్పిన మర్రిచెట్టును వెతుక్కుంటూ వెళ్ళిపోయాయి.

చిటికెలో నిర్మానుష్యమైపోయింది రోడ్డు. "నిన్ను కూడా తమతో రమ్మని ఆర్డర్ ఇచ్చి ఉంటే ఏం చేసేవాడివి?" గంగారాం దగ్గిరికి వస్తూ అడిగాడు షాడో.

"అటువంటి మాటలు వాళ్ళ నోళ్ళ వెంట రావు గురూ... నన్ను వెంట తీసుకుపోతే ఆ సొత్తు ఆచూకి చెప్పింది నేనేనని అందరికీ తెలిసిపోతుంది. అది వాళ్ళకి ఇష్టం ఉండదు" నమ్మకంగా చెప్పాడు గంగారాం.

"అయినా సరే... రమ్మంటే?" రెట్టించాడు షాడో.

"ఇక్కడ పాయింటు నేను అక్కడికి వెళ్ళడం కాదు... వాళ్ళ అటెంక్షన్‌ని మన పట్టుగుడ్డల మూట మీదినించి డైవర్ట్ చేయటం... వేన్ ఎక్కుతూ కిందికి వదిలేసే వాడిని. మేము అటుపోగానే నువ్వు వచ్చి తీసుకునేవాడివి" నవ్వుతూ చెప్పాడు గంగారాం.

దటీజ్ గంగారాం... ఎటువంటి క్రిటికల్ కండిషన్లో అయినా స్పీడ్‌గా ఆలోచించే అతని చురుకుదనాన్ని మెచ్చుకుంటూ ఆప్యాయంగా భుజం తట్టాడు షాడో.

"నాకు ఆకలి దంచేస్తోంది. కష్టమన పనులన్నిటినీ నాకు వదిలేసి నువ్వు మాత్రం హాయిగా కూర్చుంటావు" తన సంతోషాన్ని కనిపించకుండా కప్పి పెట్టుకోవటనికి కోపం నటిస్తూ అన్నాడు గంగారాం.

చిన్నగా నవ్వి సిటీలోకి నడిచాడు షాడో.

*　　　　*　　　　*　　　　*　　　　*

యూనిఫామ్‌ని వదిలేసి సివిల్ డ్రెస్‌లోకి మారిపోయాడు ఇన్స్‌పెక్టర్ నిఖిల్. బ్యాంక్‌కి వెళ్ళి తన ఎకౌంట్లో ఉన్న ఆఖరి వెయ్యి రూపాయలు డ్రా చేసి, బయటికి కనిపించేటట్టు పైజేబులో పెట్టుకున్నాడు.

"సిటీలో మోసాలు రోజురోజుకీ ఎక్కువై పోతున్నాయి... కళ్ళు మూసి కళ్ళు తెరిచేటంతలో అంతా జరిగిపోతుంది. ఎందుకైనా మంచిది ప్యాంటు జేబులో పెట్టుకోండి సాబ్" సవినయంగా సలహా ఇచ్చాడు అతనితోపాటు బ్యాంక్‌కి వచ్చిన పోలీస్ హెడ్‌కానిస్టేబిల్.

మోసాల్ని, నేరాల్ని అడ్డుకోవాల్సిన పోలీసులే అలా భయపడటం చాలా అవమానమని అతనితో అనలేదు నిఖిల్. ఓ నవ్వు నవ్వి మెయిన్ రోడ్డు మీదికి వచ్చాడు.

"మన వాళ్ళని ఇంకో ఇద్దరిని వెంట బెట్టుకుని అక్కడికి పోదాం సాబ్" కొంచెం దూరం పోగానే అతనికి మరో సలహా ఇచ్చాడు హెడ్‌కానిస్టేబిల్.

"మనం పెళ్ళి భోజనాలకు వెళ్ళటం లేదు... మంది ఎక్కువైతే మన పని మట్టి కొట్టుకుపోతుంది. నోరు మూసుకుని నడువ్" కఠినంగా అన్నాడు నిఖిల్.

మెయిన్ రోడ్డు మీది నించి చిన్న చిన్న వీధుల్లోకి పోవటం స్టార్ట్ అవగానే మొదటిలాగానే మళ్ళీ మాటలు మొదలు పెట్టాడు హెడ్‌కానిస్టేబిల్.

"అనవసరమైన శ్రమ సార్ ఇది. పహడీవాలా గ్యాంగ్‌ని పట్టుకోవటానికి పెద్ద పెద్దవాళ్ళే ట్రై చేసి కామ్‌గా వెనక్కి వెళ్ళిపోయారు... ఒక్కసారి చక్కర్లు కొట్టగానే మనకి కనిపిస్తాడని అనుకోవటం భ్రమ... వెనక్కి వెళ్దాం సార్"

ఖాన్‌జీ దర్గా దగ్గిరకి పోగానే, అతన్ని వెనక్కి పంపించేయటం బెస్ట్ అనిపించింది నిఖిల్‌కి. "నువ్వు ఒక పని చెయ్యి. కాస్సేపు ఇక్కడే కూర్చుని రెస్ట్ తీసుకో. నేను ఇంకో రెండు సందుల్ని చూసి వస్తాను" అంటూ అతన్ని అక్కడే వదిలి తను ముందుకు సాగాడు.

"ఏంటి బాబాయ్? యూనిఫామ్ వదిలేసి తిరుగుతున్నారేంటి?" ఒంటరిగా మిగిలిపోయిన హెడ్‌కానిస్టేబిల్‌ని అడిగాడు దర్గా దగ్గిరున్న బడ్డీ కొట్టు యజమాని.

"పహడీవాలా గ్యాంగ్‌ని పట్టుకోవాలిట..." కొట్టు ముందున్న బెంచి మీద కూర్చుని ఒక షోడా ఇవ్వమని చెయ్యి చాపి అడిగాడు హెడ్‌కానిస్టేబిల్.

"చాలా పట్టుకున్నారు... మీ వల్ల కాదని పది రూపాయల పందెం" నవ్వుతూ అన్నాడు కొట్టు యజమాని.

"ఆ మాటని ఇప్పటికి యాభైసార్లన్నా చెప్పి ఉంటాను. వయసులో ఉన్నాడు... ఇంకా పెళ్ళి కాలేదు... రక్తం చాలా వేడిగా ఉంటుంది. మంచి మాటలు బుర్రకి ఎక్కవు" చిరాకుగా అంటూ అతను అందించిన షోడాని తీసుకున్నాడు పోలీస్ హెడ్‌కానిస్టేబిల్.

"మన పోలీసులందరూ ఆ షాడోని పట్టుకోవటానికి తిరుగుతుంటే మీరు మాత్రం పని తప్పించుకోవటానికి చూస్తున్నారు. పహడీవాలా గ్యాంగ్ ఆ షాడో కంటే ఎక్కువ కాదు... ముందు ఆ సంగతి చూడాలి" మనసులోని మాటని బయటపెట్టాడు కొట్టు యజమాని.

“ఇంకెంతసేపురా... ఈ సాయంత్రానికల్లా అయ్యగారికి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వచ్చేస్తాయి. రేపు ఈ పాటికల్లా నేను కూడా హాయిగా వేన్‌లో కూర్చుని ఆ షాడో కోసం వెతుకులాట మొదలు పెడతాను...” కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ చెప్పి, వెనకాల ఉన్న ఒక సిమెంట్ పోల్‌కి ఆనుకుని కూర్చున్నాడు హెడ్‌కానిస్టేబిల్.

*  *  *  *  *

బజ్జీదాదా నెత్తి పగలగొట్టి నిలువు దోపిడీ చేసిన సందులో నించి అవతల ఉన్న వీధిలోకి పోయాడు నిఖిల్. సిటీ అంతా షాడో కోసం గాలింపులు జరుపుతోంది. పోలీస్ అనే పర్సనాలిటీలు అన్నీ ముఖ్యమైన సెంటర్స్‌ని కవర్ చేస్తున్నాయి. మాధోసేట్ వ్యవహారం తెలిసి తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నీ తీసుకుంటున్నారు సేట్‌జీలు అందరూ... నేర్పుగా మోసాలు చేయటానికి తగిన వాతావరణమది.

పహాడీవాలా గ్యాంగ్ గురించి హెడ్‌కానిస్టేబిల్ తనకు చెప్పిన మాటలు నిజమే అయితే, డెఫినిట్‌గా ఏదో ఒక ప్రదేశంలో తన మీద ఎటాక్ జరిగి తీరాలి. ఇరుకు ఇరుకుగా ఉన్న వీధిలో కరెంట్ పోల్ దగ్గిర నిలబడి చుట్టూ చూశాడు అతను.

“ఏంటి సార్? సిటీకి కొత్తగా వచ్చారా?” రెండు నిముషాల తర్వాత వినిపించింది అతనికి ఆ కంఠం.

“అవును... జామి బజార్ దగ్గిరికి పోవాలి... ఎవర్ని అడిగినా సరిగ్గా చెప్పటం లేదు” అటుకేసి చూస్తూ చెప్పాడు నిఖిల్. పాతిక సంవత్సరాల కంటే కొంచెం తక్కువ వయసుగల యువకుడు కనిపించాడు అతనికి.

“నేను కూడా అక్కడికే పోతున్నాను. నాతో రావచ్చుగాని, ముందు– ఆ జేబులో ఉన్న నోట్లని తీసి ప్యాంటు జేబులో పెట్టుకోండి. సిటీలోకి షాడో వచ్చాడని అంటున్నారు. ఎటుపోయి ఎటు వస్తుందో మన జాగ్రత్తలో మనం ఉండాలి” చెప్పాడు అతను.

పెద్దగా నవ్వాలని అనిపించింది నిఖిల్‌కి. పాకెట్లో ఉన్న చిల్లర నోట్ల కోసం కక్కుర్తి పడతాడా షాడో?

“రండి సార్... ఇప్పటికే నాకు చాలా ఆలస్యమైపోయింది” అంటూ ఒక గల్లీ దగ్గిరికి పోయాడా యువకుడు.

అతన్ని అనుసరించాడు నిఖిల్. మూడు సందులు తిప్పాడతను. నాలుగో సందులో ఉన్న ఒక పాతకాలపు భవంతి దగ్గిర ఆగి, “చాలా దాహంగా ఉంది. ఇది నాకు తెలిసినవాళ్ళ ఇల్లు. లోపలికి పోయి నీళ్ళు తాగి వస్తాను” అంటూ లోపలికెళ్ళాడు. జేబులో చేతులు పెట్టుకుని అతని కోసం వెయిటింగ్ మొదలు పెట్టాడు నిఖిల్.

“అదుగో... అతనే... సివిల్ డ్రెస్‌లో వస్తే మనకి తెలియదని అనుకుంటున్నాడు” పై అంతస్తులోని ఒక కిటికీ చాటు నుంచి నిఖిల్‌ని ఒక వృద్ధుడికి చూపిస్తూ చెప్పాడు దారి చూపించటానికి తీసుకొచ్చిన యువకుడు.

“ఇక్కడిదాకా ఎందుకు తీసుకువచ్చావ్? జేబులో ఉన్న నోట్లని కొట్టేసి రావచ్చు కదా” అన్నాడు వృద్ధుడు.

“కొత్తగా వచ్చాడు. కొంచెం తెలివితేటలు ఎక్కువ. మాధోసేట్ వ్యవహారంలో మాటలు పడుతున్నాడు. ఇవాళ కాకపోయినా రేపయినా మనకి తలనొప్పి తెచ్చి పెడతాడు” పరిశీలనగా అన్నాడు ఆ యువకుడు.

“ఏం చేద్దామని నీ ఆలోచన?” అడిగాడు వృద్ధుడు.

“రిస్కు తీసుకోవడం అనవసరం... ఫరిదా మైదానం దగ్గిరికి తీసుకుపోతాను. మన వాళ్ళని రెడీగా ఉండమని చెప్పు. కాళ్ళు చేతులు విరగేసి వదులుదాం... ఇంక ఈ జన్మలో మన జోలికి రాడు, రాలేడు” చెప్పాడతను.

“మంచి ఆలోచన, అలాగే చేద్దాం, నువ్వెళ్ళు” అన్నాడు వృద్ధుడు. పదే పది సెకన్లలో ఒక్కసారిగా వీధిలోకి వచ్చేశాడు యువకుడు. “రండి పోదాం” అంటూ నిఖిల్‌ని వెంటబెట్టుకుని బయలుదేరాడు.

*　　*　　*　　*　　*

“ఫరీదా మైదానం అంటార్ట దీన్ని... చందాలు పోగేసి మంచి గుడి ఏదో కట్టించాలని ప్లాను వేస్తున్నార్ట” చిన్న చిన్న ముళ్ళపొదలతో, చెత్త గుట్టలతో నిండి ఉన్న పెద్ద ఖాళీ స్థలాన్ని చూపిస్తూ షాడోకి చెప్పాడు గంగారాం.

మైదానానికి కొంచెం ఇవతలగా ఉన్న హోటల్లో కూర్చుని ఉన్నారు వాళ్ళు. వేడి రొట్టెలు, బఠానీలు వేసి వండిన కూర పెద్ద పెద్ద ప్లేట్లలో పెట్టి తీసుకువస్తున్నాడు వెయిటర్. తెచ్చిన ప్లేటును తెచ్చినట్లే ఖాళీ చేస్తున్న గంగారాం

వంక ఆశ్చర్యంగా చూస్తున్నాడు అతను. "కరువుగొట్టు మొఖంలా కనిపిస్తున్నానా?" అడిగాడి గంగారాం.

"అబ్బెబ్బే. అదేం కాదు సాబ్" అన్నాడు వెయిటర్.

"డబ్బులు లేని బేరం అనుకుంటున్నావా?" మళ్ళీ అడిగాడు గంగారాం. అక్కడే ఉంటే మీదపడి కొట్టేస్తాడని అనుమానం వచ్చి వెళ్ళిపోయాడు వెయిటర్.

"నీకు పొగరు కొంచెం ఎక్కువ అయినట్లుంది" తినటం ముగించి, సిగరెట్ వెలిగించుకుటూ అన్నాడు షాడో.

"పొగరు కాదు గురూ. పోతురాజులా నిలబడి గుడ్లు మిటకరిస్తున్నాడు. దిష్టి తగిలితే ఇంకా ఏమైనా ఉందా? అందుకే హడల కొట్టాను" నవ్వుతూ చెప్పి ఎదుట ఉన్న ప్లేటు మీదికి దృష్టిని మరలించుకోబోతూ, ఎందుకో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు గంగారాం.

"ఏమయింది నీకు?" విసుగ్గా అడిగాడు షాడో.

"ఖాళీగా ఉంటుందని ఈ హోటల్ దగ్గిరికి వచ్చాం... అటు చూడు... ఎంత మంది వస్తున్నారో!" రోడ్డు మీదికి చూపిస్తూ చెప్పాడు గంగారాం. తలతిప్పి చూసిన షాడోకి వెంటనే అక్కడ కనిపించారు పది మంది పౌరులు. సీరియస్‌గా చూస్తూ వచ్చి ఖాళీగా ఉన్న కుర్చీలన్నింటినీ ఆక్రమించుకున్నారు వాళ్ళు.

"ఆ పట్టుగుడ్డ మూట ఏంటి? ఏముంది అందులో?" గంగారాంను అడిగాడు వారిలో ఒకతను.

ఖాళీగా ఉన్న కుర్చీలో పెట్టాడు గంగారాం తన పట్టు గుడ్డమూటని... వెంటనే దాన్ని తీసి ఒళ్ళో పెట్టుకుంటూ "డబ్బులు, నగలు... ఉన్నాయి సార్" అని సమాధానమిచ్చాడు.

"మర్యాదగా ఒక ప్రశ్న అడిగితే ఏంటి బే? ఒళ్ళు ఎలా ఉంది?" కోపంగా అడిగాడా వ్యక్తి.

"నా ఒళ్ళు బాగానే ఉంది. నీకు సంబంధించని విషయాల్లో వేళ్ళు పెడితే చెడిపోయేది నీ ఒళ్ళే... నాది కాదు" సీరియస్‌గా అన్నాడు గంగారాం.

"ఏంటి బే వాగుతున్నావ్?" మహా కోపంగా అంటూ చఱున కుర్చీలో నించి లేచాడు ఆ వ్యక్తి.

ఒక అడుగే వేశాడు అతను. రెండో అడుగు వేయలేదు. "అడుగో... మనోడు వచ్చేశాడు... పదండి పదండి" అంటూ కుర్చీలని ఖాళీచేసి వీధిలోకి వెళ్ళిపోయారు మిగిలిన వాళ్ళు. "నువ్వు ఇక్కడే ఉండు. తిరిగొచ్చి నీ పని చెప్తా" కోపంగా గంగారాంకి వార్నింగ్ ఇస్తూ తను కూడా అక్కడి నుండి వెళ్ళిపోయాడు ఆ వ్యక్తి.

"ఎందుకు సాబ్ వాళ్ళతో పెట్టుకున్నారు? ఒట్టి జులాయిలు... చిటిక వేస్తే చాలు పోట్లాటలకి రెడీ అయి పోతారు..." మీగడ వేసి పైన పంచదార జల్లిన చాయ్ కప్పుని తీసుకువచ్చి గంగారాం ఎదుట పెడుతూ అతని వైపు చూసి చిన్నగా అన్నాడు వెయిటర్.

“ఎవరు బే వాళ్ళు?” వేడి వేడి చాయ్‌ని ఒక సిప్ చేసి రుచిని మెచ్చుకుంటూ అడిగాడు గంగారాం.

“పేర్లు ఎవరికీ తెలియవు సాబ్... ఏం చేస్తూ ఉంటారో కూడా తెలియదు. ఎప్పుడు చూసినా జేబుల నిండా డబ్బులుంటయ్... ఎంత ఉన్నా ఒట్టి చిల్లర మేళం” చెప్పాడు.

“పనేం చేస్తుంటారో తెలియని వాళ్ళ దగ్గిర డబ్బులు దండిగా ఉంటే మొట్టమొదటగా అనుమానించాల్సిన పోలీసులు ఏం చేస్తున్నార్రా?” అడిగాడు గంగారాం.

“ఒకటి రెండు సార్లు పట్టుకుపోయి పది రోజుల తర్వాత వదిలి పెట్టేశారు... ఏం చేయాలో తెలుసుండదు” చెప్పి అవతలికి వెళ్ళిపోయాడు వెయిటర్.

“ఇది నీకు విచిత్రంగా కనిపించడం లేదూ?” షాడో వంక చూస్తూ అడిగాడు గంగారాం.

“ఉయ్ డోన్ట్ కేర్... మనకి అనవసరం. లెటజ్ గెట్ ది హెల్ అవుటాఫ్ హియర్” అన్నాడు షాడో.

మూటని భుజం మీద వేసుకున్నాడు గంగారాం. పైజమా జేబులో నించి మూడు పెద్ద నోట్లని తీసి ముందుకు జాచాడు.

“ఒక్క క్షణం... చిల్లర తీసుకు వస్తాను” అంటూ క్యాష్ కౌంటర్ దగ్గిరికి వెళ్ళబోయిన వెయిటర్‌ని ఆపి, ఇంకో పెద్ద నోటును తీసి అతని చేతిలో పెట్టాడు.

“నీ సర్వింగ్ మాకు పిచ్చి పిచ్చిగా నచ్చేసింది. చిల్లరతో పాటు ఉంచుకో” అంటూ రోడ్డు మీదికి దారి తీశాడు. టిప్ ఇవ్వటమంటే ఏమిటో తెలియని ఏరియాలో ఉన్న హోటల్ అది. అప్రయత్నంగా అటెంక్షన్‌లో నిలబడి మిలిటరీ మనిషిలా శాల్యూట్ చేశాడు ఆ వెయిటర్.

“ఇంకోసారి తప్పకుండా రండి సార్. ఈ సారి నేనే కిచెన్‌లో నిలబడి స్వయంగా తయారు చేయిస్తాను రొట్టెల్ని” పెద్ద కంఠంతో గట్టిగా అరిచి చెప్పాడు.

“ఇప్పుడు మనం ఎక్కడికి పోవాలి గురూ?” ఎక్కడికో తెలిసినా తెలియనట్లు నటిస్తూ అడిగాడు గంగారాం.

“మాధోసేట్ ఇంటిని ఒకసారి చూడాలి...” ముక్తసరిగా చెపుతూ సడన్‌గా ఆగిపోయాడు షాడో. ఆశ్చర్యంగా చూసిన గంగారాంకి కూడా వినిపించాయి అరుపులు.

వాళ్ళకి కుడి పక్కన ఉన్న ఫరిదా మైదానంలో నించి అస్పష్టంగా వినవస్తున్నాయి అవి... “పట్టుకోండి... పారిపోనీయకండి. పట్టుకోండి” అంటూ.

‘మనకి అనవసరం గురూ... మన పనేదో మనం చూసుకోవాలి’ అనబోతూ ఆ మాటల్ని మధ్యలోనే మింగేశాడు గంగారాం. రోడ్డు మీద ఆగిపోయిన షాడో చటుక్కున పక్కకు తిరిగి, పొదల్లోకి పరిగెత్తటమే అందుకు కారణం. భుజం మీది మూట పడిపోకుండా గట్టిగా పట్టుకుని, తను కూడా అతని వెనక పరిగెత్తాడు గంగారాం.

అడ్డం వచ్చిన పొదల్ని అతి నేర్పుగా తప్పించుకుంటూ మైదానం మధ్యలోకి వేగంగా పోయాడు షాడో. విషాలంగా ఉన్న ఒక చెత్తగుట్ట దగ్గిర కనిపించాడతనికి తలమీద తగిలిన దెబ్బను ఒక చేత్తో అదుముకుంటూ పరిగెత్తుకు వస్తున్న పర్సనాలిటీ ఒకతను. "మామూలు మనిషి కాదు. అతను పోలీస్ డిపార్ట్‌మెంట్ మనిషి" షాడో వెనకే ఆగిపోతూ డిక్లేర్ చేసేశాడు గంగారాం. ఒకే ఒక చూపుతో ఎదుటి మనిషి ఎవరో, ఎలాంటి వాడో, అతను చేసే వృత్తి ఏమిటో చెప్పగల తెలివి అతనిది.

షాడోకి తెలుసు ఆ సంగతి. ఐనా సరే కొంచెం ఆశ్చర్యపడకుండా ఉండలేకపోయాడు.

"పోలీస్ మనిషి అయితే మన కోసం వెతుకుతూ రోడ్ల మీద చక్కర్లు కొడుతూ ఉండాలి. ఈ పొదల్లో ఏం పని?" అని అడిగాడు.

ఆశ్చర్యపోతూ అతనిని "అంతరాత్మ మాటల్ని విని ఆ ప్రకారం నడుచుకునే మనిషి అయి ఉంటాడు. మనల్ని పట్టుకుని దేశాన్ని ఉద్ధరించటం కంటే, ఎదుట ఉన్న క్రైమ్‌ని సాల్వ్ చేయటం మంచిదని భావిస్తూ ఉండవచ్చు" అంటూ మూటని కింద వదిలేశాడు. "నీకు భుక్తాయాసం... కాస్సేపు రెస్ట్ తీసుకో" ఆ మనిషి వెనకాలే వస్తున్న జనాన్ని చూస్తూ అన్నాడు షాడో.

"ఇందాక ఎకస్ట్రాలు మాట్లాడిన వాడు కనిపించాడు. ఆగే ప్రసక్తి లేదు" అంటూ వింటి నించి వెలువడిన బాణంలా ముందుకు దూసుకుపోయాడు గంగారాం.

“తప్పుకో బ్రదర్. పక్కకి తప్పుకో” అని దెబ్బలు తిన్న మనిషిని హెచ్చరిస్తూ, అతన్ని ఫాలో అవుతున్న గుంపు మీద ఒక్కసారిగా కలబడ్డాడు.

“కొట్టండిరోయ్... కొట్టేయండి” అరిచాడో వ్యక్తి.

ముందుగా అతని నోటి మీద ఒక దెబ్బ వేశాడు గంగారాం. అదే ఊపులో ఇంకో ఇద్దరి మొఖాల్ని పగలగొట్టి, చెవులు చిల్లులు పడేలా పొలికేక పెట్టాడు.

పొట్టిగా, పిచ్చివాడిలా కనిపించే గంగారాం మాట మహా మృదువుగా ఉంటుంది. కోపం వస్తే మాత్రం దారుణంగా మారిపోతుంది అతని గొంతు. పొలికేక పెట్టటం అంటే అవతలివాళ్ళ ఒళ్ళు జలదరించడమే. తలల మీద పిడుగులు పడినట్లు బెదిరిపోవడమే.

అదే జరిగింది ఇప్పుడు.

ఆ శబ్దాన్ని భరించటం కష్టమైపోతున్నట్టు ఒక్కసారిగా వెనక్కి తగ్గారు దెబ్బలు తినని వ్యక్తులు. తిరిగి ముందుకు దూకే అవకాశం మాత్రం వాళ్ళకి లభించలేదు.

ఒక నిముషం, ఇరవై రెండు సెకన్లలో గుంపులోని వారందర్నీ నేల మీద పొర్లించేశాడు గంగారాం.

“వాళ్ళలో ఒక్కడు కూడా పారిపోకూడదు” తనకు తగిలిన దెబ్బను లక్ష్యపెట్టకుండా అతన్ని హెచ్చరించాడు పారిపోయి వచ్చిన వ్యక్తి.

హోటల్లో అవాకులు పేలిన మనిషి దగ్గిరికి పోతున్నాడు గంగారాం. నడుము విరిగిపోయేటట్టు తన్నాలో, జుట్టు పట్టుకుని నోటి మీద నాలుగు పీకాలో డిసైడ్ చేసుకోవటానికి ట్రై చేస్తున్నాడు.

"ఎందుకు పట్టుకోవాలి వీళ్ళందర్నీ?" చటుక్కున వెనక్కి తిరిగి, నడుము మీద చేతులు వేసుకుంటూ అడిగాడు.

"వీళ్ళు పహడీవాలా గ్యాంగ్ జనం... మోసాలు చేయటం వీళ్ళ వృత్తి" పడిపోయిన వాళ్ళ కాళ్ళు చేతులు కట్టేయటానికి తాడు కోసం చూస్తూ చెప్పాడు ఆ వ్యక్తి.

ఎకస్ట్రాలు మాట్లాడిన మనిషి మొఖం పగలగొట్టేయాలన్న ఆలోచనని వెంటనే వాయిదా వేసేసుకుంటూ షాడోవైపు గుర్రుగా చూశాడు గంగారాం.

"ఒక మనిషిని ఇంత మంది చుట్టుముట్టి చావకొట్టటాన్ని చూడలేక ఇన్‌వాల్వ్ అయ్యాము మేము.... మోసగాళ్ళని, రౌడీల్నీ పోలీసులకి పట్టించటానికి కాదు..." ప్యాంటు జేబులో చేతులు పెట్టుకుని నిఠారుగా నిలబడి అతనివైపు నిశితంగా చూస్తూ అన్నాడు షాడో.

"అదేమిటి? నేరాలను అరికట్టడంలో పోలీసులకు సహకరించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి మీదా ఉంటుంది. మీరు నాకు హెల్ప్ చేసి తీరాల్సిందే" ఆశ్చర్యంగా చూసి, అంతలోనే సీరియస్ అవుతూ అన్నాడు ఆ వ్యక్తి.

"సారీ బాస్... మా పద్ధతులు మాకు ఉంటాయి... మేము వచ్చిన పని అయిపోయింది. నీ తిప్పలేవో నువ్వు పడటం మంచిది" అని చెప్పి వడివడిగా మెయిన్ రోడ్డు వైపు బయలుదేరాడు గంగారాం.

"ఆగండి... ఒక్క క్షణం ఆగండి" అరిచాడు ఆ వ్యక్తి.

ఆగలేదతను... అలాగే వెళ్ళిపోయాడు రోడ్డుమీదికి... అతని వెనుకే నడుస్తున్న నల్లప్యాంటు యువకుడినైనా కన్విన్స్ చేద్దామని తను కూడా వేశాడా వ్యక్తి రోడ్డుకేసి నాలుగు అడుగులు. తగిలిన దెబ్బలనించి కొంచెంగా కోలుకున్నారు కింద పడిపోయిన జనం.

ఉన్నట్లుండి పైకి లేచి, పిక్కబలం చూపించారు ఒక్కసారిగా. రోడ్డు వైపు తిరిగిన వ్యక్తి అదిరిపడి వెనక్కి చూసేసరికి చాలా ఆలస్యం అయిపోయింది. పొదల చాటుకు పోయి కలికానికి కూడా కనిపించకుండా మాయం అయిపోయారు వాళ్ళందరూ.

* * * * *

"యువ్వార్ సస్పెండెడ్... గజదొంగ షాడోని పట్టుకోవటాన్ని వదిలేసి నీ ఇష్టం వచ్చినట్లు రోడ్లమీద షికార్లు చేశావ్. ఎందుకూ పనికిరాని లోఫర్ గ్యాంగ్‌తో పోట్లాట పెట్టుకుని మన డిపార్ట్‌మెంట్ పరువు తీసేశావ్...." ఖంగుమంటున్న కంఠంతో స్టేషన్ గోడలు ప్రతిధ్వనించేటట్టు అరిచాడు డి.జి.పి. సాయంత్రం నాలుగు గంటల సమయంలో స్వయంగా స్టేషన్‌కి వచ్చి.

"సార్... అది లోఫర్ గ్యాంగ్ కాదు సార్... తప్పకుండా పహడీవాలా గ్యాంగే అయివుంటుంది" కొద్దిగా తల వంచుకుని– చెప్పాడు నిఖిల్.

"రుజువు ఏది? రోడ్డుమీద కనిపించే ప్రతి అడ్డమైన రాలుగాయి లందరూ పహడీవాలా గ్యాంగ్ మెంబర్సేనంటే నమ్ముతారా ఎవరైనా? వేరీజ్ ది ప్రూఫ్?" మరింత కోపంగా అడిగారు డి.జి.పి.

పూర్తిగా వంగిపోయింది నిఖిల్ తల... ఉబికి వస్తున్న నవ్వును అదిమి పెట్టుకుంటున్నాడు హెడ్‌కానిస్టేబిల్... ఎందుకూ పనికి రానివాడిలా చూస్తున్నాడు.

"ఆల్‌రైట్ ఇన్స్‌పెక్టర్... మాధోసేట్ పని పూర్తయిందా లేదా?" ఉన్నట్లుండి సబ్జెక్ట్‌ని మారుస్తూ అడిగారు డి.జి.పి.

పోలీస్ ఉద్యోగంలో చేరటమంత బుద్ధి తక్కువ పని మరొకటి లేదని వెంటనే అనిపించింది నిఖిల్‌కి. షాడో కోసం వెయిట్ చేస్తానంటే ముందు మాధోసేట్ పని చూడమని, ఆ పనిమీద పోయివస్తే, ఎందుకు పోయావని వినవస్తున్నాయి మాటలు.

తప్పు తమ మీద పడకుండా ఎదటివాళ్ళ మీదికి నెట్టేయటం అంటే అదే... ఎదురు తిరగకూడదు, డిసిప్లిన్‌గా ఉండాలి.

"పని పూర్తి కాలేదు సార్. కొంచెం టైమ్ కావాలి" సమాధానం ఇచ్చాడు అతను.

"ఓ.కే. ఫోర్త్ టౌన్ ఇన్స్‌పెక్టర్‌కి ఛార్జి అప్పగించి ఇంటికి పో... నీలాంటి డండర్ హెడ్స్‌ని అపాయింట్ చేసుకుని డిపార్ట్‌మెంట్ తప్పు చేసింది. గెట్ రిలీవ్డ్ ఫ్రమ్ యువర్ డ్యూటీ..." పేకముక్కలు విసిరినంత తేలికగా మాటల్ని వదిలి, విసవిసా బయటికి వెళ్ళిపోయారు డి.జి.పి.

గిర్రున తిరగబోయిన కంటి నీళ్ళను అతిబలవంతంగా కళ్ళల్లోనే అదుముకుని స్టేషన్ ముఖద్వారం వరకూ ఆయన వెనకాల వచ్చాడు నిఖిల్. వెనుతిరిగి అతని వంక చూడను కూడా చూడకుండా వెహికిల్‌లో కూర్చుని వేగంగా వెళ్ళిపోయారాయన.

వెహికిల్‌లో ఉండగానే ఫోర్త్ టౌన్ ఇన్స్‌పెక్టర్‌కి మెసేజ్ పంపించాడు కాబోలు– అరగంట కూడా గడవక ముందే వచ్చేశాడు ఆ పెద్దమనిషి. నాలుగే నాలుగు నిముషాల్లో ఛార్జీ తీసుకుని ప్రిలిమరీస్‌ని పూర్తిచేసి, వేడి వేడి చాయ్ తెప్పించాడు వీడ్కోలు పలకటం కోసం.

మర్యాద కోసం కామ్‌గా చాయ్ తాగి, అక్కడి నుండి నెమ్మదిగా బయటికి వచ్చాడు నిఖిల్.

తన మోటార్ వెహికిల్‌ని స్టార్ట్ చేసి సిటీ మధ్య భాగంలో ఉన్న తన రెసిడెన్స్ వైపు పోనిచ్చాడు.

*　　*　　*　　*　　*

చీకటి పడిన రెండు గంటలకల్లా అరుపులతో కేకలతో దద్దరిల్లిపోయింది బిజువా సిటీ.... "షాడో వచ్చేశాడు... పట్టుకోండిరోయ్... పట్టుకోండి" అని అందరినీ హెచ్చరిస్తూ వీధుల్లో పరుగులు మొదలు పెట్టారు జనం.

సైరన్లు మోగిస్తూ, హారన్లని వాయిస్తూ బర్రుబర్రున రోడ్లమీద తిరగటం ప్రారంభించాయి పోలీస్ వెహికల్స్. మూడు మూరల పొడుగుండే లాటీ కర్రల్ని బిగించి పట్టుకుని గస్తీ తిరగటం స్టార్ట్ చేశారు అక్కడికి ప్రత్యేకంగా పిలిపించిన రిజర్వ్ కానిస్టేబిల్స్....

“ఇటువంటి అవకాశం కావాలని కోరుకున్నా ఇంకోసారి మనకి లభించదు... పట్టపగలు మోసాలు చేస్తే ఏమొస్తుంది? సందట్లో సడేమియాలాగా రెండు డెకాయిటీలు చేసేద్దాం. తప్పు ఆ షాడో మీదికి వెళ్ళిపోతుంది. మన గురించి ఎవరూ ఆలోచించరు” దర్గా సెంటర్లో నిలబడి తన అభిప్రాయాన్ని వెల్లడించాడు ఒక యువకుడు.

కొత్తగా కొనుక్కు వచ్చిన బీడీ కట్టలోనించి బీడీని తీసి వెలిగించుకుంటూ సాలోచనగా తల ఊపాడు అరవై సంవత్సరాల వయస్సు ఉండే పహడీవాలా.

“మంచి ఆలోచన. మరి ఎక్కడ మొదలెట్టాలో నువ్వే చెప్పు” అంటూ ఆ యువకుడిని ఉత్సాహపరిచాడు.

“గౌరవ్ బజార్లో డబ్బులున్న వాళ్ళు చాలా మంది ఉన్నారు. పోలీసుల రద్దీ కూడా తక్కువ” అన్నాడా యువకుడు.

“అయితే ఆలస్యం దేనికి? త్వరగా అందర్నీ పిలువ్” అంటూ సిటీ మధ్య భాగంలో ఉండే గౌరవ్ బజార్ వైపు వడివడిగా అడుగులు వేశాడు పహడీవాలా.

*　　*　　*　　*　　*

గౌరవ్‌బజార్‌కి అరకిలో మీటర్ దూరంలో ఉన్న టౌన్ హాల్లో మానిటరింగ్ సెల్‌ని ఏర్పాటు చేసింది పోలీస్ డిపార్ట్‌మెంట్. వైర్‌లెస్ సెట్లు, టెలిఫోన్లు వాటిని అటెండ్ అయ్యేందుకు ఆపరేటర్లు– చూడడానికి చాలా హడావుడిగా ఉంది అక్కడి వాతావరణం.

నేషనల్ హైవే మీద షాడో వదిలేసిన నెక్లస్‌ని చూసి అటుగా వచ్చిన ఇన్స్‌పెక్టర్స్‌ని, కానిస్టేబిల్స్‌ని తిట్టిన తిట్టు తిట్టకుండా అరగంట తిట్టి– ఆయాసం వచ్చింది కాబోలు– ఆగిపోయిన డి.జి.పి. దగ్గిరికి వచ్చారు కులకర్ణి.

"చూడండి సార్... మావాళ్ళ తెలివితేటల్ని బాగా చూడండి... నెక్లెస్‌ని తెచ్చిచ్చిన వాడిని వదిలేసి చేతులు ఊపుకుంటూ వెళ్ళివచ్చారు" చెమటలు కమ్మిన ముఖాన్ని హేండ్ కర్చీఫ్‌తో తుడుచుకుంటూ చెప్పాడు.

"అతన్ని వెంట బెట్టుకుపోతే ప్రభుత్వం ప్రకటించిన బహుమతులన్నీ అతనికే ఇవ్వబడతాయని భయపడినట్టున్నారు... మీ బలహీనతల్ని చక్కగా ఉపయోగించుకున్నాడు ఆ షాడో" సీరియస్‌గా చెప్పారు కులకర్ణి.

"వాట్? వాట్ డు యూ మీన్?" అదిరిపడినట్టు కుర్చీలో కొంచెం ముందుకు వంగుతూ అన్నాడు డి.జి.పి.

"లక్షా యాభైవేలు ఖరీదు చేసే బంగారు నగ ఎవరికైనా దొరికితే అస్తారపదంగా తీసుకొచ్చి ఇవ్వటానికి ఇది పురాణకాలం కాదు... బాగా ఆలోచించండి. నాకు వినపడిన పోలికల్ని బట్టి అది షాడో స్నేహితుడు గంగారాం చేసిన పనే. సందేహం లేదు. మీ వాళ్ళని అటు రోడ్డు మీదికి పంపి అతను హ్యాపీగా సిటీలోకి వచ్చేశాడు" సిగార్ పొగని గుప్పుగుప్పున వదులుతూ చెప్పారు కులకర్ణి.

అదిరిపడటానికి కూడా ఓపిక లేకపోయింది డి.జి.పి. గారికి. "చాంద్‌పూర్‌లో జరిగిన గొడవకే సగం పరువు పోయింది. ఇప్పుడు ఇక్కడ ఏదైనా

జరిగితే తలెత్తుకోవటం ఇంపాజిబుల్. ఏదో ఒక ఉపాయం చెప్పండి కులకర్ణి. మాకు హెల్ప్ చేయండి" అని అర్థించాడు.

"గాలివాటంగా వచ్చి, గోల చెయ్యడం షాడో విషయంలో సామాన్యంగా జరగదు. ప్రత్యేకమైన ప్రణాళికతోనే వస్తాడతను. ఇప్పుడు మీరు ఇంత మంది ఎలర్ట్‌గా ఉండగా అతని సిటీలోకి వచ్చాడంటే– తప్పకుండా ఎవరినో టార్గెట్ చేయటానికే అయివుంటుంది.

సిటీలో ఉన్న ఇంపార్టెంట్ పర్సనాలిటీలన్నిటికీ సెక్యూరిటీ ఏర్పాటు చేశారా?" అడిగారు కులకర్ణి.

పక్కనే ఉన్న ఎస్.పి.ల వంక, డి.ఎస్.పి.ల వంక చూశాడు డి.జి.పి. "ఎస్. సర్... ఉయ్ హావ్ కవర్డ్ ఎవ్రీ బడీ..." తడుముకోకుండా చెప్పారు వాళ్ళు.

"ఓ.కే... నేను ఒకసారి సిటీ అంతా చూసివస్తాను... మీకు అవసరం అయితే నాకు కబురు అందించండి. వచ్చేస్తాను" అంటూ దూరంగా నిలబెట్టి వచ్చిన తన అంబాసిడర్ వైపు కదలబోయారు కులకర్ణి.

సరిగ్గా అదే సమయంలో ఆ ప్రాంతంలో గొల్లు గొల్లున వినవచ్చాయి పెద్ద పెద్ద అరుపులు.

"షాడో ఎటాక్ చేశాడు. గౌరవ్‌బజార్లో రెండిళ్ళని నిలబెట్టి దోచుకున్నాడు... అడ్డం వచ్చిన యజమానుల్ని ఇష్టం వచ్చినట్టు బాదేశాడు" లౌడ్ స్పీకర్లోనించి వినబడినట్టు పెద్దగా వినవచ్చింది ఒక కంఠం.

మిలటరీ కమాండోల మాదిరి స్పీడ్‌గా బయటికి పరిగెత్తుకు వచ్చారు లోపల వున్న అధికారులు అందరూ. "కమాన్ కులకర్ణి సార్... అక్కడికి పోదాం" అంటూ కులకర్ణిగారి చెయ్యిపట్టుకుని తన వెహికిల్ దగ్గరికి త్వరత్వరగా తీసుకుపోయాడు డి.జి.పి.

*　　　　*　　　　*　　　　*　　　　*

"అయిపోయింది సాబ్... నా కూతురి పెళ్ళికని చేయించిన నగలన్నీ మాయం అయిపోయాయి. నిలువు దోపిడీ జరిగింది. నా కుటుంబం నాశనమై పోయింది" బుగ్గల మీదికి జారుతున్న కన్నీటిని తుడుచుకోను కూడా తుడుచుకోకుండా స్వయంగా డి.జి.పి. గారికి రిపోర్టు చేశాడు దోపిడీకి గురైన ఒక ఇంటి యజమాని.

రెసిస్ట్ చేశాడు కాబోలు– బలమైన ఇనుపరాడ్‌తో కొట్టారట దొంగలు... తల భాగం పగిలి దుస్తులన్నీ రక్తసిక్తం అయిపోయి ఉన్నాయి.

"ఉరి తీసేయాలి కులకర్ణి సార్.. కనిపించిన వెంటనే కాల్చి అవతల పారేయాలి" విపరీతమయిన ఆవేశంతో రగిలిపోతూ ఎనౌన్స్ చేశాడు డి.జి.పి.

దెబ్బలు తిన్న ఆ కుటుంబంలోని వ్యక్తుల్ని చూస్తూ "తొందరపడకండి సార్... ఇది షాడో చేసిన పని కాదు" ఆలోచిస్తూ అన్నారు కులకర్ణి.

"వ్వాట్? వాట్ డూ యూ మీన్?" అమితమైన ఆశ్చర్యంతో అడిగాడు డి.జి.పి.

"అడ్డం వస్తే ఎటువంటి వస్తాదుల్నయినా దెబ్బ కొట్టడం షాడోకి అలవాటే... బట్... పొరపాటున కూడా ఆడవారి జోలికి పోడు అతను.

అందులోనూ...” అంటూ ఆ కుటుంబ యజమాని మనవరాలు ఆరేళ్ళ బాలికను చూపిస్తూ మాటల్ని కంటిన్యూ చేశారు కులకర్ణి.

“పసిబిడ్డలంటే షాడోకి అపూర్వమైన అభిమానం. పసిబిడ్డలు చూస్తున్నారని అనుమానం వస్తే అతను దోపిడీని వదిలేసి వెనక్కి వెళ్ళిపోయిన వృత్తాంతాలు చాలా ఉన్నాయి. ఈ బిడ్డ చెంప మీద బలంగా కొట్టబడింది... ఇది డెఫినిట్‌గా షాడో పని కాదు” ఎర్రగా కందిపోయిన ఆ బిడ్డ చెంపని నిమురుతూ చెప్పారాయన.

“షాడో కాకపోతే ఈ సమయంలో ఇలా ఇంకెవరు చేస్తారు?” అయోమయంగా అడిగాడు డి.జి.పి.

“అదే మనం తెలుసుకోవాలి. అదీ చాలా క్విక్‌గా జరిగిపోవాలి. ఎందుకంటే” మాటల్ని ఆపారు కులకర్ణి.

“విషయం చెప్తూ ఆపేశారేమిటి? చెప్పండి సార్... త్వరగా చెప్పండి” వెంటనే రిక్వెస్ట్ చేశాడు డి.జి.పి. గారి వెనకాల నిలబడి ఉన్న ఒక డి.ఎస్.పి.

“తన పేరు పెట్టుకుని తనని బద్‌నామ్ చేసేవాళ్ళని షాడో కలలో కూడా క్షమించడు. చాలా వైల్డ్‌గా రియాక్ట్ అవుతాడు. ఆ గోలని అస్సలు తట్టుకోలేము మనం” అంటూ రోడ్డు మీదికి వచ్చారు కులకర్ణి.

ఆయన చూస్తూండగానే దొంగతనం జరిగిన రెండో హౌస్ దగ్గిరికిపోయి చాలా అర్జంటుగా తిరిగి వచ్చాడు ఆయనతో మాట్లాడిన డి.ఎస్.పి.

“మీరు చెప్పింది యథార్థమేనేమో అనిపిస్తుంది సాబ్... రెండేళ్ళ పసిగుడ్డును ఉయ్యాలలో నించి తీసి కింద పడేశారట” అని రిపోర్టు చేశాడు అతను.

బిజువా సిటీని, ఆ ప్రాంత ప్రజలను ఇంక ఆ దేవుడే కాపాడాలని బయటికి చెప్పలేదు కులకర్ణి.

“ఆల్ రైట్. నేను సిటీలోకి పోయి వస్తాను” అంటూ ఎవరి సమాధానం కోసం ఏమాత్రం ఎదురుచూడకుండా చీకట్లలోకి అడుగులు వేశారు.

* * * * *

“ఆగు గురూ... ఆవేశపడకు... సందు దొరికితే చాలు చెమడాలు ఎక్కేయటానికి రెడీగా ఉన్నారు పోలీసులు” స్పీడ్‌గా వీధిలోకి వెళ్ళబోయిన షాడో చెయ్యి పట్టుకుని ఆపుతూ బతిమాలుకున్నాడు గంగారాం.

“పోలీసులకి భయపడి మనం చాటుమాటుగా తిరుగుతూ ఉంటే అవతల జరగాల్సిన డామేజీ జరిగిపోతుంది. ఆ బద్మాష్‌లు ఎవరో” కోపంగా అంటూ గంగారాం వంక చూసి చటుక్కున మాటల్ని ఆపేశాడు షాడో.

అతని చేతిని వదిలి అరచేత్తో మొఖం మీద టపటపా చరుచుకుంటున్నాడు అతను. ముఖ్యమైన విషయాన్ని మర్చిపోయినందుకు సిగ్గుపడుతున్నట్టు నాలుక కరుచుకుంటున్నాడు. “ఇప్పటిదాకా బాగానే ఉన్నావుగా. ఇంతలోనే ఏమైంది నీకు?” చిరాకుగా అడిగాడు షాడో.

“ఫరిదా మైదానం దగ్గిర మనం చాలా పెద్ద తప్పు చేశాం గురూ... పోలీస్ మనిషికి మనం చచ్చవటల్ని పట్టించి ఇవ్వటమేంటని వచ్చేశాం. ఇప్పుడు ఈ

ప్రాబ్లెమ్ ఆ పోలీస్ మనిషి చెప్పిన పహడీవాలా గ్యాంగ్ పనే అయి ఉంటుంది" చిన్న కంఠంతో చెప్పాడు గంగారాం.

"మనకి కరెక్టుగా తెలియదు గదా..." స్పీడ్ సడన్‌గా తగ్గిపోవటంతో సాలోచనగా అన్నాడు షాడో.

"నువ్వు ఇక్కడే కూర్చో. నేను వెళ్ళి ఎంక్వయిరీ చేసొస్తాను. వీలయితే ఆ పోలీస్ మొఖం ఎక్కడయినా కనిపిస్తే వెంట పెట్టుకు వస్తా. వెళ్ళమంటావా?" అతని మొఖంలోకే చూస్తూ అడిగాడు గంగారాం.

"వెళ్ళిరా..." ముక్తసరిగా అన్నాడు షాడో.

"నేను లేనని చెప్పి నువ్వు ఎక్కడికీ పోకూడదు. గట్టిగా మాట్లాడితే నువ్వు ఇక్కడినించి ఒక్క అడుగు కూడా అవతలికి వెయ్యకూడదు" అన్నాడు గంగారాం.

"వెయ్యనులే. వెళ్ళు" పక్కనే ఉన్న అరుగు మీద చతికిల పడుతూ చెప్పాడు షాడో. ప్యాంటు జేబులో నించి సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు. అతన్ని ఆవరించుకున్న ఆవేశం కంట్రోల్‌కి వచ్చిందని పూర్తిగా రూఢి చేసుకుని చీకట్లలోకి పరిగెత్తాడు గంగారాం.

సరిగ్గా ఒక అరగంట తరువాత తెరుచుకున్నాయి షాడో కూర్చున్న అరుగుకు దగ్గిరగా ఉన్న ఒక ఇంటి తెలుపులు. జుట్టు నెరిసిన ఓ వృద్ధురాలు బయటికి తొంగి చూసి "ఎవరూ ఆ అరుగు మీద?" అని అడిగింది.

“మాది జిగ్ని పట్టణం తల్లీ.... మార్కెట్‌కి చిలగడ దుంపలు తీసుకు వచ్చాను. డబ్బులింకా చేతికి రాలేదు... నా తమ్ముడి కోసం ఎదురు చూస్తున్నా” తడుముకోకుండా సమాధానం ఇచ్చాడు షాడో.

“అయ్యయ్యో... ఈ మాయదారి షాడో మూలకంగా మార్కెట్‌లో ఉన్న సేట్‌జీలు అందరూ ఇనప్పెట్టెలకి తాళాలు వేసేసుకుని ఉంటారు. తెల్లారేదాకా నీ గురించి ఆలోచించరు... ఏదైనా హోటల్‌కి పోయి విశ్రాంతి తీసుకోక పోయావా?” అడిగింది ఆమె.

“డబ్బులు అయిపోయినయ్యమ్మా. దుంపల డబ్బులు చేతికి వస్తేనే ఏదైనా చేయడం” అప్పటికప్పుడు ఇంకో సమాధానాన్ని వినిపించాడు షాడో.

“అయ్యో పాపం... అదా సంగతి... ఇంతకీ ఏమైనా తిన్నావా?” సాదరంగా అడిగింది ఆ ఇల్లాలు.

అబద్ధం చెప్పటానికి నోరు రాక అటూ ఇటూ కాకుండా తల తిప్పాడు షాడో. “నాలుగు రొట్టెలున్నాయ్. కూర కూడా ఉంది. ఊరగాయ పచ్చడితో తినచ్చు. లోపలికి రా నాయనా. ఖాళీ కడుపుతో రాత్రంతా గడపటం చాలా కష్టం. రా” అంటూ అతని సమాధానం కోసం ఎదురు చూడకుండా లోపలికి వెళ్ళింది ఆమె.

ఆలస్యం చేసినా, అనవసరమని బెట్టు చేసినా ఆమెకు లేనిపోని అనుమానాలు వస్తాయని అరుగు మీది నించి లేచాడు షాడో. ఆమె అందించిన

ఇత్తడి చెంబులోని నీళ్ళతో కరచరణాలు శుభ్రపరుచుకుని, ఇంటి వరండాలో కూర్చున్నాడు.

ఒక పింగాణీ పళ్ళెంలో రొట్టెలు, కూర పెట్టి నోరు ఊరిపోయేటట్టు కనిపించే ఊరగాయ పచ్చడిని వడ్డించి ఆప్యాయంగా తెచ్చి ఇచ్చిందామె.

“నీ పేరేంటో అడగలేదు” లోపలి గది గుమ్మం మీద తీరిగ్గా కూర్చుంటూ అడిగింది.

“రాజులు అంటారమ్మా. తెలుగు వాడిని. ఈ ఏరియా వాడిని కాదు...” తన భాష, యాస అనుమానాన్ని కలిగిస్తాయని ముందు జాగ్రత్తగా చెప్పేశాడు షాడో.

“ఎవరైతేనేం బాబూ... అందరం ఈ దేశంలో వాళ్ళమే... మాట పద్ధతి వేరైనా మనవన్నీ ఒకటే మనసులు. తేడాలు చూపించుకోవటం చాలా తప్పు” ఆర్ద్రంగా అన్నది ఆమె.

“ఒంటరిగా ఉంటున్నావా తల్లీ? ఇంట్లో తోడు ఎవరూ లేరా?” రొట్టెల్ని విరిచి పచ్చడితో నంజుకుంటూ ఆప్యాయంగా అడిగాడు షాడో.

“నా దేవుడు మిలటరీలో పనిచేస్తూ పది సంవత్సరాల క్రితం కాలం చేశాడు. ఒకడే పిల్లాడు... ఉద్యోగం కోసం భార్యతో సహా దుబాయ్ వెళ్ళిపోయాడు...” భర్త జ్ఞప్తికి వచ్చాడు కాబోలు– తడి అయిన కళ్ళను పమిట చెంగుతో తుడుచుకుంటూ షాడోకి చెప్పింది ఆమె.

“ఒంటరిగా ఎలా ఉండగలుగుతున్నావ్?” ఆమె వైపు సానుభూతిగా చూస్తూ అడిగాడు షాడో.

“కష్టంగానే వుంది. తప్పదుగా... వెనకాల గదులు రెండింటిని ఒక పోలీస్ కుర్రాడికి అద్దెకు ఇచ్చాను. ప్రస్తుతానికి అతనే తోడుగా ఉంటున్నాడు” చెప్పింది.

పోలీస్ మాట చెవుల పడేసరికి ఎలర్ట్ అయిపోయాడు షాడో. సాధ్యమైనంత త్వరగా బయటపడడం మంచిదనే ఉద్దేశ్యంతో గబగబా తినటాన్ని ముగించాడు.

“ఇప్పుడు ఇంట్లోనే ఉన్నాడా అతను?” అని అడిగాడు ఆఖర్లో.

“లెక్క ప్రకారమైతే ఉండ కూడదు. అందరితో కలిసి ఆ మాయదారి షాడోని వెతకటానికెళ్ళి ఉండేవాడు” ఏం చెప్పాలో తెలియక మాటని ఆపిందామె.

“వెళ్ళలేదా? ఎందుకని? అతని ఒంట్లో బాగోలేదా? ఆత్రంగా ఆమెను రెట్టించాడు షాడో.

“అదేం కాదు... ఆ పహడీవాలా గ్యాంగ్‌ని పట్టుకోలేక పోయాడని సస్పెండు చేశార్ట. వాళ్ళకి మతిలేక చేయటమే గాని, ఇంత వరకూ ఎవరూ పట్టుకోలేక పోయిన ఆ దుష్మన్‌లని ఈ పిల్లాడు ఒక్కడే ఎట్టా పట్టుకోగలడు?” ఛట్‌మని షాడో కళ్ళముందు కదలాడాడు ఫరిదా మైదానంలో తమకు ఎదురైన వ్యక్తి. ఇతను అతనేనా?

“కంబళీ ఇస్తాను. పడుకుంటావా నాయనా?” అడిగింది వృద్ధురాలు.

“అవసరం లేదమ్మా. అవతల నా తమ్ముడు నా కోసం వెతుక్కుంటూ వస్తూ ఉంటాడు... వెళ్ళొస్తాను తల్లీ” అంటూ నమస్కారం చేశాడు.

ఆవరణలో నించి బయటికి వచ్చి అంతకు ముందు కూర్చున్న అరుగు దగ్గిరికి పోయాడు. సిగరెట్‌ని తీసి వెలిగించుకుంటూ ఉండగా అతని మనసులో అడుగు పెట్టింది ఒక ఆలోచన. గుండెల నిండా రెండు సార్లు పొగని పీల్చుకునే సమయానికి పూర్తిగా డిసైడ్ అయిపోయాడు.

* * * * *

“ఎలర్ట్‌గా ఉండండి తెల్లవారే దాకా ఎవరూ నిద్రపోకూడదు... ఎక్కడా కూర్చోకూడదు. తిరుగుతూనే ఉండాలి... అర్థం అయిందా?” మాధోసేట్ ఇంటి దగ్గర డ్యూటీకి వచ్చిన కానిస్టేబిల్స్‌కి ఆర్డర్ వేశాడు ఫోర్త్ టౌన్ ఇన్స్‌పెక్టర్. నిఖిల్ కింద పనిచేసిన హెడ్ కానిస్టేబిల్ ఉన్నాడు ఆ గ్రూపులో “మీరేమీ ఫికర్ చేయకండి సాబ్... షాడో ఇటు రాలేదు. వస్తే మటాష్” నమ్మకంగా చెప్పాడు.

తృప్తిగా తల ఊపి తన మోటార్ బైక్‌ని కదిలించాడు ఫోర్త్ టౌన్ ఇన్స్‌పెక్టర్. ఇంకో వీధిలో ఉన్న మరో సెటప్‌ని సూపర్‌వైజ్ చేయటానికి వెళ్ళిపోయాడు.

అతను వీధి మలుపు తిరగగానే, పెద్ద కంఠంతో, ఆ ఇంటి ఆవరణలో నిలబడి ఉన్న మాధోసేట్‌ని ఒక్కసారిగా పిలిచాడు పోలీస్ హెడ్ కానిస్టేబిల్.

“చాయ్‌లు పంపించండి సేట్‌జీ... మెలకువగా ఉండాలంటే వేడివేడిగా ఏదైనా లోపలికి పోవాల్సిందే...” అని చెప్పాడు. పోలీసుల్నే కాదు– బజ్జీదాదా నాయకత్వంలో ఇంకో పదిహేను మంది వర్కర్స్‌ని తోడు పెట్టుకున్నాడు

మాధోసేట్. ఇంటి చుట్టూ, ఇంటి లోపలా ధగధగ వెలిగిపోతున్నాయి లైట్లు... ఆవరణలో ఉన్న చెట్లమీది నించి చిన్న ఎండుటాకు రాలి కింద పడినా అందరికీ కనిపించేటంత వెలుగుతో నిండి ఉంది ఆ ప్రదేశం.

"కొద్దిపాటి క్యాషు... నగలు తప్ప ఇంట్లో ఇంకేమీ లేదు. కాబట్టి మనం అతిగా భయపడాల్సిన అవసరం లేదు. ఎందుకైనా మంచిదని ఈ కాపలా ఏర్పాటు చేసుకోవటమే" అని హెడ్‌కానిస్టేబిల్‌కి చెప్పి, బజ్జీదాదాని దగ్గిరికి పిలిచాడు. "దావూద్ టీ సెంటర్ తెరిచే ఉంటుంది. అందరికీ ప్లాస్కుల్లో పోయించుకురా" ఆర్డర్ ఇచ్చాడు.

ఆరు అడుగుల పొడవున్న బాణాకర్రని బిగించి పట్టుకుని, మొలలో దోపుకున్న పిడిబాకును తడుముకుంటూ అటుగా బయలుదేరాడు బజ్జీదాదా.

ఆ రోజున జరిగిన అవమానం సరి అవ్వాలంటే, అందరినీ ఆకర్షించే ఎడ్వెంచర్ ఏదో ఒకటి చేసి తీరాలి... షాడో కంటపడితే ఎంత బాగుంటుంది? లోలోపల ఎన్నెన్నో కోరికల్ని పెంచి పోషించుకుంటూ పక్కవీధిలో ఉన్న దావూద్ టీ కొట్టు దగ్గిరికి పోయాడు అతను.

"వరుసగా రెండు నెలల్నించీ రోజుకి పాతిక యాభై లాసే వస్తోంది, దుకాణం బంద్ చేసేయమని నా బీబీ ఒకటే గోల చేస్తోంది. ఈ షాడో దయవల్ల నా దశ తిరిగి పోయింది. రెండు నెలల లాసు ఈ ఒక్క రోజులో పూడి పోయింది" బాగా పరిచయం ఉండటం వల్ల బజ్జీభాయ్‌ని చూడగానే సంతోషంగా చెప్పాడు దావూద్.

షాడో మూలకంగా తన యజమానికి ఎంత తలనొప్పిగా ఉందో అతనికి చెప్పలేదు బజ్జీదాదా.

"నాకు కనిపిస్తే మాత్రం కాళ్ళు చేతులు తీసేయటం గ్యారెంటీ... ఆ షాడో మూలకంగానే నేను ఎంత అవమాన పడ్డానో నాకు తెలుసు" అంటూ మాధోసేట్ ఆర్డర్‌ని అతనికి వినిపించి– "త్వరగా పంపించు... అందరూ వెయిటింగు" అంటూ వెనక్కి వెళ్ళిపోయాడు.

"ఇదేదో పైసలు వచ్చే బేరం కాదు... పది రూపాయలంటే రెండు కోత పెట్టి ఎనిమిదికి లెక్క చెప్పి, ఐదు చేతుల్లో పెడతాడు... మాధోసేట్ మహా పిసినారి" వెచ్చగా టీ బాయిలర్ దగ్గర కుర్చీ వేయించుకు కూర్చున్న ఒక నల్ల ప్యాంటు యువకుడితో చెప్పుకున్నాడు దావూద్.

"ఒక్కొక్కళ్ళు అంతే భాయీ... కాని తప్పి చావదు కదా" అన్నాడా యువకుడు.

పెద్ద జగ్ లోకి ఇరవై మందికి సరిపడే డికాక్షన్ తీసుకుని, పాలు కలిపి, పై నుంచి కిందికి, కింది నించి పైకి బర్రుబర్రుమని తిరగపోశాడు దావూద్, నాలుగు సార్లు. తళతళ మెరిసిపోయేటట్టు కడిగి రెడీగా ఉంచిన ఫ్లాస్కులోకి వంపి, మూత బిగించాడు. "కాస్తంత చూస్తూ ఉండు భాయీ... అక్కడ ఇచ్చేసి చిటికెలో వచ్చేస్తాను" అంటూ అడుగు బయట పెట్టబోయాడు.

కర్రలు, టార్చిలైట్లు, కిరోసిన్ లాంతర్లు పట్టుకుని బిలబిల లాడుతూ వచ్చేశారు పాతిక మంది పౌరులు. "అరే దావూద్ భాయీ... చాయ్ పొయ్యి.

అరిచి అరిచి గొంతులు రాచుకు పోయినయ్'' అంటూ ఆర్డరిచ్చాడు వారిలో ఒకతను.

వారందరి వంక, చేతుల్లో ఉన్న ఫ్లాస్కు వంక చూసుకుని, గట్టిగా నిట్టూర్చాడు దావూద్.

"నీ సమస్య ఏమిటి భాయీ?'' అది చూసి వెంటనే అడిగాడు నల్లటి ప్యాంటు యువకుడు.

"కాస్సేపు ఆగమంటే ఆగే జనం కాదు వీళ్ళు. ఇంకో చోటికి వెళ్ళిపోతారు. అవతల ఆలస్యం అయితే మాధోసేట్ కల్లు తాగిన కోతిలా గంతులు మొదలు పెడతాడు'' తన డైలమాని అతనికి చెప్పుకున్నాడు దావూద్.

"మరేం పరవాలేదు భాయీ... ఫ్లాస్కు ఇటివ్వు... నేను ఇచ్చి వస్తాను'' అంటూ కుర్చీలో నించి లేచి చాలా స్వతంత్రంగా ఫ్లాస్కుని తీసుకున్నాడు ఆ యువకుడు.

గుండెల మీది నించి కొండంత బరువు దిగిపోయినట్లు తేలిగ్గా నిట్టూర్చి ఆనందంగా నవ్వాడు దావూద్.

"త్వరగా వచ్చేస్తే స్పెషలుగా మలయ్ చాయ్ ఇస్తాను'' అంటూ వచ్చిన వారికి టీలు తయారు చెయ్యడంలో బిజీ అయిపోయాడు. చేతిలో ఉన్న సిగరెట్‌ని రెండు పీల్పులు పీల్చి డ్రైనేజి కాలువలోకి విసిరేశాడు నల్ల ప్యాంటు యువకుడు. వినపడీ వినపడనట్లు విజిల్ వేస్తూ మాధోసేట్ బంగళా వైపు బయలుదేరాడు.

బంగళాకి వంద అడుగుల దూరంలో ఉన్న ఒక చీకటి సందు దగ్గిర నీడల్లో నిలబడి కనిపించాడు అతనికి పొట్టి వ్యక్తి.

“కాపలా చాలా టైటుగా వుంది.... ఇన్స్‌పెక్టర్ నిఖిల్‌ని ఎప్పుడూ వెక్కిరించి వేళాకోళం చేసే హెడ్‌కానిస్టేబిల్ అడుగో...” అంటూ ముందుకు చూపించాడు.

“పహడీవాలా గ్యాంగ్‌ని పట్టుకోవడం కంటె, మనల్ని పట్టుకోవడమే తేలిక అనుకుంటున్నట్టున్నాడు” పెద్దగా నవ్వుతూ ఏవేవో జోకులు వేస్తున్న ఆ హెడ్‌కానిస్టేబిల్ వంక చూస్తూ అన్నాడు నల్ల ప్యాంటు యువకుడు.

“నేను రెడీగా ఉన్నాను. నీదే ఆలస్యం” ఆ మాటలు వినిపించుకోకుండా అసహనంగా అన్నాడు పొట్టివ్యక్తి.

“ఓ.కే... నేను ఇక్కడి నుండి మూవ్ అవుతున్నాను” అంటూ ఫ్లాస్కును జాగ్రత్తగా పట్టుకుని ముందుకు అడుగులు వేశాడు నల్ల ప్యాంటు యువకుడు.

“ఏంటి బే టీ తీసుకురావడానికి ఇంత ఆలస్యం? దావూద్ ఏమైపోయాడు? ఇంకొళ్ళతో చాయ్ పంపించేటంత పెద్దవాడైపోయాడా?” అతన్ని చూడగానే అడిగాడు హెడ్‌కానిస్టేబిల్– జోకులు వెయ్యటాన్ని ఆపి.

“పెద్ద బజారు దగ్గిర్నించి పాతిక మంది జనం వచ్చేశారు... షాడో ఎవరికో కనిపించాట్ట... ఇటుగా వస్తాడేమోనని చాయ్ దుకాణం దగ్గిరే మకాం పెట్టారు” ఫాస్కులోని చాయ్‌ని చిన్న చిన్న గ్లాసుల్లోకి వంపి అతనికి అందిస్తూ కారణం చెప్పాడు యువకుడు.

"చెప్పు... లోపలికి పోయి మాధోసేట్‌కి కూడా చెప్పు" వెంటనే అతన్ని తొందర పెట్టాడు పోలీస్ హెడ్‌కానిస్టేబిల్. అతనితో పాటు వచ్చిన కానిస్టేబిల్స్‌కి కూడా టీ ఇచ్చి కాంపౌండ్‌లోకి అడుగుపెట్టాడు యువకుడు.

"టార్చిలైట్లు రెడీగా పట్టుకోండి... షాడో వచ్చేశాట్ట... కరెంటు లైను తెంపేసి చీకట్లో ఎటాక్ చేయచ్చు" అక్కడి వారికి కూడా సప్లయి చేస్తూ చెప్పాడు.

"ఏడిచాడు... ఇది చాంద్‌పూర్ కాదు. బిజువా... ఇక్కడి వాళ్ళని బోల్తా కొట్టించడం దేవుడికి కూడా సాధ్యపడదు" సగర్వంగా ఎనౌన్స్ చేశాడు బజ్జీదాదా పక్కనే నిలబడి ఉన్న వర్కర్ ఒకతను. అతను ఆ మాట అనడం– ఫట్ మని ఒక పెద్ద శబ్దం రావడం ఒకేసారి జరిగింది.

శబ్దం వినబడటం– అప్పటి వరకూ దేదీప్యమానంగా వెలుగుతున్న కరెంట్ లైట్లు అన్నీ చటుక్కున కొండెక్కటం వెంట వెంటనే జరిగి పోయాయి.

"అయ్య బాబోయ్... ట్రాన్స్ఫార్మర్ దగ్గిరేదో అయింది. పొండి. అక్కడికి పొండి" అరిచాడు బజ్జీదాదా.

చేతిలో ఉన్న ఫ్లాస్కును జాగ్రత్తగా ఒక గోడ పక్కన పెట్టాడు నల్ల ప్యాంటు యువకుడు. పిడికిలి బిగించి అతని నోటి మీద బలంగా పొడిచాడు.

తళుక్కు తళుక్కుమనే రంగు రంగుల నక్షత్రాలు ప్రత్యక్షం అయ్యాయి బజ్జీదాదా కళ్ళ ఎదుట. చిన్నగా శబ్దం చేసి నిలుచున్న వాడు నిలుచున్నట్టే కిందికి జారిపోయాడు. కింద పడక ముందే గట్టిగా పట్టుకుని, గోడ దగ్గిరే పడుకో బెట్టాడు

ఆ యువకుడు. నాలుగే నాలుగు అంగల్లో బంగళా ముఖద్వారం దగ్గిరికి పోయాడు.

కరెంట్ దీపాలు కణకణమని వెలుగుతూ ఉండగా, టార్చిలైట్లు దండగ అనుకున్నాడు మాధోసేట్... తప్పు తెలిసొచ్చి, "లైట్లురోయ్... లైట్లు..." అని అరవటం మొదలుపెట్టాడు. "ఎక్కడున్నయి సాబ్? ఎక్కడ?" అతని పక్కకి పోతూ చిన్నగా అడిగాడు నల్ల ప్యాంటు యువకుడు.

ఆ చీకట్లో అతను పరాయివాడని గుర్తుపట్టలేక పోయాడు మాధోసేట్. "లోపల ఉన్నయ్... అమ్మగారికి చెప్పి వెంటనే తీసుకురా" అని ఆర్డర్ ఇచ్చాడు.

అతని మాట పూర్తికాక ముందే ద్వారం దగ్గిర్నించి లోపలికి జంప్ చేశాడు ఆ యువకుడు. స్పీడ్‌గా ముందు గదుల్ని దాటి వెనుక భాగంలోకి పోయాడు.

అలాంటి ఎమర్జెన్సీ అంటూ వస్తే ఏం చేయాలో తెలుసు మాధోసేట్ భార్యకి. చకచకా వెలిగిస్తోంది కొవ్వొత్తుల్ని...

"తీసుకుపో... తీసుకుపోయి అయ్యగారికి అప్పచెప్పు" అంటూ తల ఎత్తి, ఒక్కసారిగా అదిరిపడింది.

"నీ భర్త వట్టి పనికి మాలినవాడు... తన తప్పుల్ని ఎదుటి వాళ్ళ మీదికి నెట్టేసే అహంకారి..." ఆమె ఎదుట నిలబడిన యువకుడు మృదువుగా చెప్పాడు.

"నీకు... దణ్ణం పెడతాను. నా భర్తని ఏమీ చెయ్యకు. నీకు ఏం కావాలంటే అది తీసుకుపో" వివర్ణమయిన మొఖంతో తడబడుతూ అతనితో అన్నది ఆమె.

“నువ్వు అరిచి కేకలు పెట్టకుండా ఉంటే నీ భర్తనే కాదు. ఎవరినీ ఏమీ చెయ్యను. అరిస్తే మాత్రం అందరి పనీ అవుట్” ఖచ్చితమైన కంఠంతో చెప్పాడతను.

“అరవను. అసలు కళ్ళతో చూడను కూడా చూడను. అంతా నీ ఇష్టం” అంటూ అక్కడికక్కడ చతికిలపడి కళ్ళను గట్టిగా మూసుకున్నది ఆమె.

“ఏవిరా లైట్లు? ఎంత సేపురా తీసుకురావటం?” ఖంగుమంటూ వినవచ్చింది ముఖ ద్వారం దగ్గిర ఉన్న మాధోసేట్ కంఠం.

లైట్లు ఆరిపోయిన తర్వాత సరిగ్గా యాభై రెండు సెకన్లు మాత్రమే గడిచాయి. యాభై మూడో సెకనులో అతని పక్కన ప్రత్యక్షమయ్యాడు నల్ల ప్యాంటు యువకుడు.

“పందిరి మంచం తలగడ కింద ఉన్న సీక్రెట్ అరలో నించి నగల్ని మూడు నోట్ల కట్టల్ని మాత్రమే తీసుకున్నాను. ఇనప్పెట్టె దగ్గిరికి పోయే టైము లేదు....” అతనికి మాత్రమే వినిపించేటట్టు నెమ్మదిగా చెప్పాడతను.

“ఎవరివి? నువ్వెవరివి?” కీచుగా అరిచాడు సేట్‌జీ.

“షాడోని... అసలు పేరు మాత్రం అది కాదు. పోలీసుల్ని అడుగు చెప్తారు” అంటూ చిన్నగా నవ్వి కాంపౌండ్‌లోకి పరిగెత్తాడు ఆ యువకుడు.

“పట్టుకోండిరోయ్... షాడోని పట్టుకోండి...” గొంతు చినిగి పోయేటట్టు అరిచాడు మాధోసేట్.

కన్ను పొడుచుకున్న ఏమీ కనిపించని ఆ కటిక చీకటిలో ఎవర్ని పట్టుకోవాలో తెలియక పిచ్చి చూపులు చూస్తున్న అతని వర్కర్స్ మధ్యలో నించి ప్రహరీ గోడ దగ్గిరికి పోయాడు ఆ యువకుడు.

"ఇక్కడే ఉన్నా... ఇక్కడే" చిన్నగా వినిపించింది పొట్టి వ్యక్తి కంఠం. చేతిలో ఉన్న మూటని అతనికి అందించాడు యువకుడు. వెంటనే వెనక్కి తిరిగి, రోడ్డు మధ్యలో ఉన్న కానిస్టేబిల్స్ పక్క నించి వేగంగా చీకటి సందులోకి వెళ్ళిపోయాడు పొట్టి వ్యక్తి. గోడ పక్కన పెట్టిన ఫ్లాస్కును తీసుకుని నితారుగా నిలబడ్డాడు నల్ల ప్యాంటు యువకుడు. ఛట్ మంటూ వెలిగాయి లైట్లు.

"పట్టుకోండిరోయ్... షాడో పారిపోతున్నాడు... పట్టుకోండి... దొంగ..." బిగ్గిరిగా వినిపించాయి చీకటి సందు దగ్గిర్నించి అరుపులు.

రాకెట్లలా అటు పరిగెత్తారు పోలీసులు... వాళ్ళ వెనుకే వెళ్ళారు వర్కర్స్... లైట్లు వెలిగిన వెంటనే లోపలికి పోయి, పందిరి మంచాన్ని చూసుకుని, బెదురుగా నిలబడి ఉన్న భార్యని తిడుతూ ముఖ ద్వారం దగ్గిరికి వచ్చాడు మాధోసేట్.

"ఇరవై చాయ్‌లు తెచ్చాను సాబ్... పైసలు ఇప్పిస్తే నేను వెళతాను" ఫ్లాస్కు పట్టుకుని అక్కడే నిలబడి ఉన్న యువకుడు వెంటనే అడిగాడు.

మీదపడి కొట్టినంత పని చేశాడు మాధోసేట్... అతన్ని, అతన్ని పంపిన ఆ దావూద్‌ని పాతాళానికి పంపించటం జరుగుతుందని వార్నింగ్ ఇచ్చాడు.

"షాడో వచ్చి నీ ఇంటికి కన్నం వేస్తే, దానికి మేము ఏం చేస్తాం సాబ్. మీరూ మీరూ చూసుకోవాల్సిన వ్యవహారమది. నా డబ్బులు నా మొఖం మీద

పడేస్తే నా దారిన నేను పోతాను. ఇచ్చేయండి" తమకు ఎంత రావాలో చెప్పి, అలాగే మొండిగా నిలబడ్డాడు యువకుడు.

టాప్ పిచ్‌కి వెళ్ళిపోయింది మాధోసేట్ బ్లడ్‌ప్రెజర్.... ఎర్రగా కంది పోయిన మొఖంతో బంగళా ప్రతిధ్వనించేటట్టు అరుపులు స్టార్ట్ చేస్తున్న సమయంలో లోపలి నించి బయటికి వచ్చింది అతని భార్య, ఫ్లాస్కు పట్టుకుని నిలబడిన యువకుడిని చూసేసరికి తెల్లబోయింది.

"నాకు రావాల్సిన పైసలు నాకు ఇవ్వాండి మేం సాబ్" ఆమెకు కూడా చెప్పాడతను. కంటికి కనిపించని రాక్షసుడు ఎవరో వెంటపడి తరుముతున్నట్టు లోపలికి పరిగెత్తి ఒక కరెన్సీ నోటును తెచ్చి అతనికి అందించిందామె. జీరపడిన కంఠంతో ఏదో అనబోయింది.

"మాట అంటే మాటే తల్లీ... మళ్ళీ మీకు కనిపించను" అంటూ గిరుక్కున వెనక్కి తిరిగి రోడ్డు మీదికి వెళ్ళిపోయాడు యువకుడు. నోరు తెరిచి అతను ఎవరో తన భర్తకు చెపితే వెనక్కి వచ్చేస్తాడేమోనన్న భయంతో మౌనంగా ఉండి పోయింది మాధోసేట్ భార్య.

* * * * *

స్పీడ్‌గా వచ్చి బిజువా సిటీ ఉత్తర భాగంలో ఉన్న హోటల్ జానెమన్ దగ్గిర ఆగింది చాలా అందంగా, హుందాగా కనిపిస్తున్న పాతకాలపు చెవర్లెట్ కారు.

స్టీరింగ్ ముందు నుంచి కిందికి దిగి, బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాడు కండలు తిరిగిన శరీరంతో చూడటానికి అపర భీముడిలా కనిపించే రంగరాజు.

అతని పక్కనే కూర్చున్న దీనబంధు, ధనుష్కోటి కూడా కిందికి దిగి, వెనకాల డోర్‌ని తెరిచి పట్టుకున్నారు... ఆఖరి తమ్ముడు తుకారాంతో కలిసి కార్లో నుంచి బయటికి వచ్చాడు రాజస్థాన్ నించి ఏకబిగిన ట్రావెల్ చేస్తూ అక్కడికి వచ్చిన రామ్‌దయాళ్.

తనకు తెలియకుండానే కుర్చీలో నించి లేచి నిలబడ్డాడు వారి ఠీవిని గమనించిన జానెమన్ రిసెప్షనిస్టు.

"ఎ.సి. రూములు రెండు... రెండు, మూడు రోజులు ఉంటాం" అతని దగ్గిరికి పోతూ చెప్పాడు రంగరాజు... లాల్చీ జేబులో నించి ఫెళఫెళ లాడుతున్న కొత్త కరెన్సీ నోట్లను తీసి రెక్‌లెస్‌గా డెస్క్ మీద పడేశాడు.

నోరు తెరిచి వారి పేర్లను అడగటానికి భయపడ్డాడు రిసెప్షనిస్టు. బెదురు చూపులతో పక్కకి చూశాడు.

విశాలంగా ఉంది ఆ ప్రదేశం. అక్కడ బస చేసినవారు హ్యాపీగా కూర్చుని కబుర్లు చెప్పుకోవటానికి వీలుగా మెత్తటి సోఫాలు, కుర్చీలు వేయబడి ఉన్నాయి. సిగార్ పొగను గుప్పున వదులుతూ, ఆ రోజు న్యూస్ పేపర్‌ని చదువుతున్నారు ఒక సోఫాలో కూర్చుని ఉన్న కులకర్ణి గారు.

"రామ్‌దయాళ్ అని రాసుకో...." రిసెప్షనిస్టు కంగారును గమనించి చెప్పారాయన. అప్పుడే మెట్లు ఎక్కి లోపలికి వస్తున్న రామ్‌దయాళ్ పెదవుల మీద వెంటనే ప్రత్యక్షం అయిందొక చిరునవ్వు.

“రామ్ రామ్ కులకర్ణీ సాబ్... ఎలా వున్నారు? చాలా కాలమైంది కలిసి” దగ్గిరికిపోయి నమస్కారం చేస్తూ అన్నాడు.

“కుశల ప్రశ్నలు తర్వాత... నేను చెప్పిన పని ఏమైంది” కనుబొమల మధ్యలో నుంచి సీరియస్‌గా చూస్తూ అడిగారాయన.

“అందుకే అంత దూరం నించి వచ్చాం. కాస్తంత రెస్టు తీసుకుని నెమ్మదిగా వెతికి పట్టుకుంటాం” ఎదురెదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ చెప్పాడు రామ్‌దయాళ్.

“నువ్వు ఆర్చుకు తీర్చుకుని వెతకటం మొదలు పెట్టేలోపల అల్లకల్లోలమై పోతుంది ఈ సిటీ.... రాత్రి జరిగింది ఏమిటో తెలిసిందా? చూస్తూ అడిగారాయన.

“మాధోసేట్ వట్టి వెధవ... నా దోస్తుకి చురుకు తగిలే పనేదో చేసి ఉంటాడు” తడుముకోకుండా చెప్పాడు రామ్‌దయాళ్.

“అదేమిటి?” ఆశ్చర్యంగా అడిగారు.

“నా దోస్తుని పట్టుకోవాలన్న ఆశతో, పహడీవాలా గ్యాంగ్‌కి దొరికి పోయాడు. మాధోసేట్ దగ్గిర పనిచేసే బజ్జీదాదా. ఆ తప్పును తీసుకుపోయి అన్నెం పున్నెం ఎరగని ఇన్స్‌పెక్టర్ నిఖిల్ నెత్తిన రుద్ది అతన్ని సస్పెండ్ చేయించాడు మాధోసేట్....

అతని ఖర్మ కాలి ఆ సంగతి నా దోస్త్‌కి తెలిసుంటుంది. దెబ్బమీద దెబ్బ కొట్టాడు” నమ్మకంగా చెప్పాడు రామ్‌దయాళ్.

ఎక్కడో రాజస్థాన్ నించి వచ్చిన అతనికి ఆ విషయాలు ఎలా తెలిశాయోనని ఆశ్చర్యపడలేదు కులకర్ణిగారు. సామాన్యమైంది కాదు రామ్‌దయాళ్ నెట్‌వర్క్. ఏ విషయమైనా, ఎంతటి రహస్యమైనా చిటికెలో అతని దగ్గిరికి చేరిపోతుంది.

అంతకు ముందు రోజు నించీ ఆ సిటీలోనే ఉంటున్న తనకు మాత్రం తెలియలేదు ఇన్స్‌పెక్టర్ నిఖిల్‌కి జరిగిన అన్యాయం విషయం గురించి.

"పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో డిసిప్లిన్‌కి చాలా పెద్ద విలువ ఉంటుంది. ఆ ఇన్స్‌పెక్టర్ సస్పెండ్ అయ్యాడంటే అందుకు ఇంకేదో బలమైన కారణం ఉండే ఉంటుంది" అంటూ బిజువా సిటీ అధికారుల్ని వెనకేసుకు వచ్చే ప్రయత్నం చేశారాయన.

"నా దోస్త్‌కి డిసిప్లిన్ గురించి తెలియదు. తను కల్పించుకున్నాడంటే– ఈ విషయంలో ఏదో అన్యాయం జరిగినట్టే లెక్క" అని నమ్మకంగా చెప్పాడు రామ్‌దయాళ్.

"ఓ.కే... ఓ.కే... ఏదో జరిగిందని నేను ఒప్పుకుంటాను. మరి నా పని సంగతి ఏమిటి?" సంభాషణను పొడిగించడం ఇష్టం లేనట్టు మొదటికొచ్చారు కులకర్ణి.

"మధ్యాహ్నం దాకా టైము ఇవ్వండి. పూర్తి చేస్తాను" అంటూ తన తమ్ముళ్ళకేసి చూశాడు రామ్‌దయాళ్.

అటెంక్షన్‌లో నిలబడి ఉన్నారు వాళ్ళు. నోళ్ళు తెరిచి ఒక్క మాట కూడా మాట్లాడకుండా రోడ్డు మీదికి వెళ్ళిపోయారు.

*      *      *      *      *

"బాబూ... నువ్వింకా నిద్రపోతూనే ఉన్నావా?" ద్వారం దగ్గిర్నించి మృదువుగా మాట వినిపించడంతో ఉలిక్కిపడి నిద్ర లేచాడు నిఖిల్. కళ్ళు నులుముకుంటూ వెళ్ళి తలుపులు తీశాడు.

"ప్రతి రోజు తెల్లారక ముందే నిద్ర లేచే వాడివి... ఇవాళ ఏమయింది బాబూ?" ఆప్యాయంగా అడుగుతూ తను తీసుకువచ్చిన చాయ్ కప్పును అతనికి అందించింది అతని హౌస్ ఓనర్ అయిన వృద్ధురాలు.

"లేచి చేసే పని ఏదీ లేదు కదమ్మా... ఉన్న ఉద్యోగం కాస్తా ఊడిపోయింది కదా" ఆమెతో కొంచెం బాధగా అంటూ ఆ కప్పును ఒక టేబుల్ మీద పెట్టి బాత్‌రూమ్ వైపు పరిగెత్తాడు నిఖిల్.

మొఖం కడుక్కుని వచ్చి చేతుల్లోకి తీసుకున్నాడు.

"నిన్ను బాధ పెట్టినందుకు ఆ మాధోసేట్‌కి రెండో దెబ్బ తగిలింది పేపర్ చూడు" అంటూ తను తీసుకువచ్చిన పేపర్‌ని కూడా అతనికి అందించింది ఆమె.

టీ తాగటాన్ని కూడా మరిచిపోయాడు నిఖిల్. పై నుంచి కిందిదాకా చదివి గట్టిగా నిట్టూర్చాడు.

"నిన్ను కలుసుకోవటానికి ఇందాక ఒక కొత్త మనిషి వచ్చాడు... పోలీస్ కాదు... అసలు ఈ ఊరివాడు కూడా కాదు..." ఆ గదిలోనే ఒక మూలగా వున్న ఒక కుర్చీలో కూర్చుంటూ చెప్పింది హౌస్ ఓనర్.

"ఏం కావాలిట?" చాయ్‌ని సిప్ చేస్తూ అడిగాడు.

"నిన్న సాయంత్రం పహడీవాలా గ్యాంగ్ వాళ్ళు అతన్ని దోచుకోవటానికి ట్రై చేశార్ట. అదృష్టం బాగుండి తప్పించుకున్నాట్ట... వాళ్ళు ఎక్కడ ఉండేది తను చూశాట్ట..." చెప్పింది వృద్ధురాలు. శరీరంలో నుంచి ఒక్కసారిగా ఆవిర్లు వస్తున్న ఫీలింగ్ నిఖిల్‌ని ఆవరించుకుంది.

"ఎక్కడ ఉన్నాడు? నాకు ఎక్కడ దొరుకుతాడు?" ఆతృతగా అడుగుతూ బెడ్ మీదినించి లేచాడు.

"ఖాన్‌జీ దర్గా దగ్గిర ఉంటాట్ట... అంతకు మించి ఏమీ చెప్పలేదు" సమాధానం ఇచ్చిందామె.

అర్జంటుగా డ్రెస్ ఛేంజి చేసుకున్నాడు నిఖిల్. అలమరాలో న్యూస్ పేపర్స్ కింద దాచిపెట్టిన ఆరంగుళాల రాంపురి కైజారుని ప్యాంటు జేబులో పెట్టుకుంటూ తన వెహికిల్ దగ్గిరికి వడివడిగా పోయాడు.

*    *    *    *    *

"లాభం లేదు... షాడో సాబ్ ఇవాళ మనకి కనిపించడు..." రెండు గంటలపాటు వీధులన్నీ తిరిగిన తర్వాత ఖాన్‌జీ దర్గా దగ్గిరికి వస్తూ తన మనసులో ఉన్న అభిప్రాయాన్ని వెల్లడించాడు తుకారాం.

“వెతకటం మొదలు పెట్టి ఎంతో సేపు కాలేదు... ఇంకో రెండు గంటలు తిరిగి చూద్దాం” అన్నాడు దీనబంధు.

“నాకు ఆకలేస్తోంది. ఏదో ఒకటి తిని తీరాలి. మంచి హోటల్ కనిపిస్తుందేమో చూడండి” అన్నాడు రంగరాజు.

రామ్‌దయాళ్ సోదరుల్లో ఆకలికి ఆగలేనిది అతను ఒక్కడే. “అదిగో దర్గా దగ్గిర ఏదో ఉంది. పదండి” అంటూ అటు దారితీశాడు ధనుష్కోటి. దర్గా పక్కనే రెండు మీడియమ్ సైజు గదుల్లో నడప బడుతున్న ఒక చిన్న హోటల్లోకి పోయారు వారందరూ కలిసి.

“కట్ట కట్టుకుని ఒకేసారి ఊడిపడ్డారు... ఏమయింది బే దీనబంధు?” ఎండలో నించి వచ్చినందువల్ల, లోపల ఉన్న తక్కువ వెలుగుకు కళ్ళు అలవాటు పడే లోపల వారిని గంభీరంగా అడిగింది ఒక కంఠం.

ఉలిక్కిపడి అటుకేసి చూసిన దీనబంధుకు కనిపించాడు ఒక మూలగా కూర్చుని ఉన్న పొట్టి మనిషి.

‘అయ్య బాబోయ్... గంగారాం...’ బిగ్గిరిగా అరవబోయి, ఆఖరి క్షణంలో నోటిని చేతితో గట్టిగా అదిమేసుకున్నాడు దీనబంధు. మహా వేగంగా అతనికి దగ్గిరికి వెళ్ళి భుజం మీద బలంగా ఒక చరుపు చరిచాడు.

“నీడ పట్టున కూర్చుని తెగ తింటున్నావు కాబోలు... ఒళ్ళు బాగా వచ్చేసింది... అన్నయ్య రాలేదా?” ఆ దెబ్బను అలవోకగా భరిస్తూ అడిగాడు గంగారాం.

“జానెమన్ హోటల్లో దిగాం... షాడో సాబ్ ఎక్కడ?” ఖాళీగా ఉన్న కుర్చీలన్నిటిని గంగారాం చుట్టూ చేర్చి కూర్చుంటూ అడిగారు వాళ్ళందరూ.

“రాత్రి మాధోసేట్ పని పట్టాం. గురువుగారు రెస్టులో ఉన్నాడు...” అందరికీ టీలు, రంగరాజుకి రొట్టెలు ఆర్డర్ ఇస్తూ వారికి చెప్పాడు గంగారాం.

“మరి నువ్వు....” అతను అక్కడ ఏం చేస్తున్నాడో తెలుసుకోవటానికి అడిగాడు రంగరాజు.

“చిన్నపని ఒకటి ఉంది. వెయిటింగు...” అంటూ రోడ్డు మీదికి చూసి, చిన్నగా విజిల్ వేశాడు గంగారాం. అతనితో పాటు అటుకేసి చూసిన సోదరులు నలుగురికీ చిన్నగా అడుగులు వేస్తూ వస్తున్న ఒక యువకుడు కనిపించాడు. “సివిల్ డ్రెస్సులో ఉన్న పోలీసు... అవును కదూ?” వెంటనే వారితో అన్నాడు ధనుష్కోటి.

అతన్నే చూస్తూ తల ఊపాడు గంగారాం.

“అటో ఇటో తేల్చి పారేయాలంటే వెంటనే చెప్పు. రోడ్డు మీద ఉన్నవాళ్ళు గట్టిగా చూసే లోపల నలుగు పెట్టేసి వెళ్ళిపోదాం” కుర్చీలో నుంచి లేవటానికి రెడీ అవుతూ హుషారుగా అన్నాడు రంగరాజు.

“అతను ఇన్స్పెక్టర్ నిఖిల్... పహడీవాలా గ్యాంగ్‌ని పట్టుకోలేక పోయినందుకు పై అధికారులు సస్పెండ్ చేశారు” చెప్పాడు గంగారాం.

“ఏం చేయాలో చెప్పు. చేసేద్దాం” ఉత్సాహంగా అన్నాడు దీనబంధు.

“అతనంతట అతనుగా ఆ గ్యాంగ్‌ని పట్టుకోవాలి... ఆ సంగతి అతని అధికారులకు తెలియాలి. అతని ఉద్యోగం అతనికి వచ్చేయాలి” క్లుప్తంగా వివరించాడు.

“నీ దగ్గిర ప్లానేమైనా ఉందా?” అడిగాడు ధనుష్కోటి.

“అతనికి ఆ గ్యాంగ్ మెంబర్స్ ఎలా ఉంటారో తెలుసు. మనం చెయ్యవలసిందల్లా అతన్ని అటుకేసి ఉసికొల్పి, వెనకాల నిలబడటమే. అవసరం అయితేనే మనం కల్పించుకోవాలి” చెప్పాడు గంగారాం.

“నువ్వు ఎలా చెపితే అలాగే... పోయి మాట్లాడతావా?” అడిగాడు.

తన భారీ కాయాన్ని కుర్చీలో నించి కదిలించాడు గంగారాం. తాపీగా రోడ్డు మీదికి పోయి నిఖిల్ వంక చూశాడు.

“నువ్వు... నువ్వు నిన్న ఫరీదా మైదానం దగ్గిర నాకు కనిపించావ్” ఒక్కసారి చూడగానే అతన్ని గుర్తుపడుతూ అన్నాడు నిఖిల్.

“అర్జంటు పనుండి హడావుడిగా వెళ్ళిపోయాను... వెళ్ళిన తర్వాత తప్పు చేశానని అనిపించింది. అందుకే ఇవాళ నీ ఇంటికి వచ్చాను” చెప్పాడు గంగారాం.

“ఆ గ్యాంగ్ ఎక్కడ ఉందో తెలుసని అన్నావుట... ఎక్కడ?” అడిగాడు నిఖిల్.

“అది మాత్రం ఆ ముసలి తల్లికి ఇంట్రస్టు కలగటం కోసం కల్పించిన మాట... విషయం ఏమిటంటే– ఆ దొంగ నాయాళ్ళు నీ వెంట పడ్డారంటే–

ఖచ్చితంగా వాళ్ళ ఆనుపానులు నీకు తెలిసే ఉంటయ్... మర్చిపోయి ఉంటే గుర్తు చేయటం కోసం వచ్చాను'' చెప్పాడు.

అబద్ధం చెప్పి తనను అక్కడికి రప్పించి నందుకు ఆర్డినరీ పోలీస్ మాదిరి అరిచి కేకలు పెట్టలేదు నిఖిల్.

"నిన్న మొన్నటి వరకూ మోసాలు చేయటంతో ఆగేవాళ్ళు. నిన్న నా మీద ఎటాక్ చేయటాన్ని చూస్తే ఎంతకైనా తెగించ గలరని అనిపిస్తోంది. వెంటనే పట్టుకోకపోతే ప్రాబ్లెమ్ సీరియస్ అవుతుంది'' సాలోచనగా అన్నాడు.

"నీడలో కూర్చుని వేడి వేడి చాయ్ తాగితే ఆలోచనలన్నీ సరైన దారిలోకి వస్తయ్...'' సజస్ట్ చేశాడు గంగారాం.

తెల్లటి పలువరుస బయటికి కనిపించేలా అందంగా నవ్వి, చెప్పిన దానికి తల ఊపాడు నిఖిల్.

గంగారాంతో కలిసి హోటల్లోకి వచ్చాడు.

"తినటం తాగటం పూర్తి అయితే ఖాళీ చేసి వెళ్ళిపోవచ్చుగా... గబ్బిలాల్లా ఎందుకు ఇక్కడే వేలాడటం?'' కదలకుండా కూర్చున్న రాందయాళ్ సోదరుల వంక గుర్రుగా చూస్తూ అన్నాడు గంగారాం. అఫెండ్ అవుతారని అనిపించింది నిఖిల్‌కి వాళ్ళ పర్సనాలిటీలు చూసేసరికి. తను కల్పించుకోవాలో వద్దో అతను తేల్చుకునే లోపల కుర్చీల్ని ఖాళీ చేసేశారు వాళ్ళు.

తింటూ తింటూ ఉన్న రొట్టెల ప్లేటును పట్టుకుని అపర భీముడి లాంటి రంగరాజు కూడా కామ్‌గా ఇంకో టేబిల్ దగ్గిరికి వెళ్ళిపోవటాన్ని చూసేసరికి,

మతిపోయినట్లే అయింది నిఖిల్‌కి. ''అసలు నువ్వు ఎవరివి భాయీ?'' ఖాళీ అయిన కుర్చీల్లో ఒకదాన్ని సెలక్ట్ చేసుకుని కూర్చుంటూ అడిగాడు.

''మనది ఈ ఏరియా కాదు... నువ్వు నేను ఆ మైదానంలో తప్ప ఇంకెక్కడా ఎదురుపడింది లేదు'' చాయ్‌కి ఆర్డర్ ఇస్తూ చెప్పాడు గంగారాం.

సెగలు వెలువరిస్తున్న చాయ్‌ని నాలుగే నాలుగు గుక్కల్లో ఫినిష్ చేసేశాడు నిఖిల్. ప్యాంటు జేబులో నించి ఒక సిగరెట్‌ని తీసి వెలిగించుకున్నాడు.

సస్పెండ్ అయిన క్షణం నుంచీ ఏదో తెలియని ఆవేదన అతని గుండెల్ని కొద్దిగా బరువెక్కిస్తోంది. ఉద్యోగం ఊడిపోతుందన్న భయం మాత్రం కాదు అది...

ఇంత బతుకు బతికి ఏమీ చేతకాని వాడిలా ఇంటిదారి పట్టాల్సి వస్తోందన్న వేదన కావచ్చు. విచిత్రంగా మాయమై పోయింది అది ఇప్పుడు. ఎదురుగా కాలు మీద కాలు వేసుకుని పిచ్చివాడి మాదిరి కనిపించే ఆ పొట్టి మనిషిని చూస్తున్న కొద్దీ ఏదో కాన్ఫిడెన్స్- ఏదైనా సరే చేసి పారేయగలమన్న విశ్వాసం... నిఖిల్ మనసులో మెదులుతున్న ఆలోచనలు తనకు అర్థం అవుతున్నట్టు తల విదిలించి చిన్నగా నవ్వేశాడు గంగారాం.

''మనసు పెట్టి చేయదలుచుకుంటే ఈ ప్రపంచంలో మనిషికి సాధ్యం కాని పని అంటూ ఏమీ లేదు. ఫెయిల్యూర్స్ రావచ్చు... తల బొప్పెలు కట్టవచ్చు. అయినా సరే పట్టువదలకుండా వెంటపడే వాడికి విజయం తప్పదు. ఈ మాట నీకు ఎవరైనా చెప్పారా?'' అడిగాడు.

"చదువు కోవటం మొదలు పెట్టిన దగ్గిర్నించీ ఏదో ఒక పాఠంలో వినిపిస్తూనే వుంది ఈ మాట. కొత్తదేమీ కాదు" తను కూడా నవ్వుతూ అన్నాడు నిఖిల్.

"ఉద్యోగంలో చేరిన రోజు నించీ పహడీవాలా గ్యాంగ్ వంటి దగాకోరు పర్సనాలిటీలను ఏదోక రూపంలో చూస్తూనే ఉండి ఉంటావ్... ఇప్పుడు కొత్తగా ఏదీ రాలేదు. మరి ఎందుకు తడబడి పోతున్నావ్?" అడిగాడు గంగారాం.

"ఆ దగాకోర్లను చూసికాదు... మా డి.జి.పి.గారి ఎత్తి పొడుపులు" అంటూ సడన్‌గా మాటల్ని ఆపేశాడు నిఖిల్. "మైగాడ్... అదే... అదే వాళ్ళ అడ్డా అయి ఉంటుంది... ఐయామ్ ష్యూర్ ఆఫ్ ఇట్ సందేహం లేదు" మొఖం మీద అరచేత్తో చరుచుకుంటూ చెప్పాడు.

"నాకర్థమయ్యేటట్టు చెప్పు" సజస్ట్ చేశాడు గంగారాం.

"కొత్త నోట్లు పాకెట్లో పైకి పెట్టుకుని నేను బజార్లలో తిరుగుతుంటే..." అంటూ మొదలు పెట్టి, తనను వాళ్ళు ఖాళీ ప్రదేశాంలోకి ఎలా లీడ్ చేశారో చెప్పాడు నిఖిల్. దారి మధ్యలో మంచి నీళ్ళ కోసం ఆగిన బిల్డింగ్‌ని గురించి పర్టిక్యులర్‌గా పాయింట్ అవుట్ చేశాడు.

"సస్పెండ్ అయ్యానన్న డిప్రెషన్లో గుర్తు చేసుకోలేక పోయాను... ఎందుకో సడన్‌గా ఇప్పుడు బయటికి వచ్చేసింది" అతనితో సంతోషంగా చెప్పాడు.

దూరంగా వెళ్ళి కూర్చున్నారన్న మాటేగానీ, రామ్‌దయాళ్ సోదరుల చెవులన్నీ ఆ టేబిల్ వైపే ఉన్నాయి... మాటల్లో పెట్టి అతను మర్చిపోయిన

విషయాన్ని ఎంతో నేర్పుగా బయటికి రప్పించిన గంగారాం తెలివికి ఏమంత అతిగా ఆశ్చర్యపోలేదు వాళ్ళు.

"షాడో సాబ్ వెనకాల తిరగాలంటే ఆపాటి తెలివితేటలు ఉండి తీరాలి... ఏది ఏమైనా ఆలోచనల్లో గంగారాంని బీట్ చేయటం చాలా కష్టం" చిన్న కంఠంతో తన అభిప్రాయాన్ని బయట పెట్టాడు దీనబంధు. మర్చిపోయిన మాట తనంతట తనుగా బయటికొచ్చాక కుదురుగా కూర్చోవటం ఇన్స్పెక్టర్ నిఖిల్‌కి సాధ్యపడలేదు.

"ఆలస్యం చేస్తే ఆ దగాకోర్లు స్థావరాన్ని మార్చేస్తారు... వెంటనే వెళ్ళి ఎటాక్ చేసేస్తే ఓ పని అయిపోతుంది"

అంటూ కుర్చీలో నుంచి లేచి, ప్యాంటు జేబులో చెయ్యి పెట్టాడు పైసలు బయటికి తీయటం కోసం.

"నువ్వు నా అతిధివి. బిల్లు నేను ఇస్తాను. నువ్వు వెళ్ళి నీ పని చూసుకో" చెప్పాడు గంగారాం.

థాంక్స్ చెప్పటం కూడా మర్చిపోయి పరుగు లాంటి నడకతో బయటికి వెళ్ళిపోయాడు నిఖిల్.

అతను పాతిక గజాల దూరం పోగానే రంగరాజు వైపు తిరిగి సైగ చేశాడు గంగారాం.

"మేము రెడీ... నువ్వు నడుస్తూ ఉండు.." రొట్టెల్ని తినటం ముగించి, చాయ్ కప్పును ముందుకు జరుపుకుంటూ అన్నాడతను. అప్పటి వరకూ తాగిన

టీలన్నిటికీ బిల్లు చెల్లించే బాధ్యతను ఆ సోదరుల మీదికే నెట్టి, తను కూడా వీధి వైపు బయలు దేరాడు గంగారాం.

*　　　*　　　*　　　*　　　*

ఒక్క కుర్చీ గాని, టేబిల్ గాని లేకుండా శూన్యంగా ఉన్న పెద్ద గదిలో గచ్చు మీద బాసిపట్టు వేసుకు కూర్చున్నాడు పహడీవాలా. అరవై సంవత్సరాలకు కొంచెం అటూ ఇటూగా ఉండే వృద్ధుడు అతను. చుట్టూ ఉన్న తన గ్యాంగ్ మెంబర్స్ వంక చూసి పెద్దగా నవ్వాడు.

అతని ఎదురుగా గుట్టగా పోసి ఉన్నయ్ గతరాత్రి దోపిడీలో సంపాదించుకు వచ్చిన నగలు... ఒక వైట్ పేపర్ని పట్టుకుని ఐటమ్స్ వారీగా వాటి విలువను నోట్ చేస్తున్నాడు అతని అనుచరుల్లో ఒక వ్యక్తి.

“మాధోసేట్ బ్యాంకులో కట్టమని పంపించిన డబ్బును కూడా ఆ లెక్కలోనే రాయి” ఉన్నట్లుండి అతనికి సలహా ఇచ్చాడు అతను. రాయటాన్ని పూర్తి చేసి టోటల్ని అందరూ వినేటట్లు ఎనౌన్స్ చేశాడు ఆ వ్యక్తి. “ఇరవై రెండు లక్షలు విలువ చేసే నగలు... మాధోసేట్ డబ్బుతో కలిపి నలభై ఎనిమిది లక్షలు క్యాష్” అని–

“షాడో ఇంకా సిటీలోనే ఉన్నాడు. పోలీసులు ఇంకా అటూ ఇటూ పరుగులు తీస్తూనే ఉన్నారు. ఇవాళ కూడా ఇంకో ఎటాక్ చేద్దాం. షాడో ఎద్దడి తగ్గిపోతే మళ్ళీ ఇలా చేయటానికి వీలుండదు” ఉన్నట్లుండి అన్నాడు కూర్చుని ఉన్నవారిలో ఒకతను.

ఆ మాట తనకు నచ్చినట్టు తల ఊపుతూ అందరి వంకా చూశాడు పహడీవాలా.

"మీరేమంటారు?" అని అడిగాడు.

"నువ్వు ఎలా చెపితే అలాగే... షాడో ఈ చుట్టుపట్ల ఉండగా మనల్ని గురించి పట్టించు కోలేరు ఎవరూ!" ఆ సజషన్‌ని బలపరిచాడు వెంటనే ఇంకో అనుచరుడు.

"ఆ సస్పెండ్ అయి తిరుగుతున్న ఇన్స్‌పెక్టర్ సంగతేమిటి?" అడిగాడు పహడీవాలా.

"వాడి పని అయిపోయింది. అధికారం లేకపోతే వాళ్ళందరూ కోరలు తీసిన పాములు. దమ్ము, ధైర్యం ఉండవు" నమ్మకంగా అన్నాడు ఇన్స్‌పెక్టర్ నిఖిల్‌ని ఖాళీ ప్రదేశంలోకి లీడ్ చేసిన అనుచరుడు.

అయితే మనం ఈ నగల్ని, డబ్బుని పంచుకోవటాన్ని ఇంకో రోజుకి వాయిదా వేసేద్దాం. రాత్రికి ఎంత సంపాదిస్తామో చూసుకుని రేపో, ఎల్లుండో మళ్ళీ ఇంకోసారి కూర్చుందాం" అన్నాడు పహడీవాలా.

వెంటనే ఒక పెద్ద అట్టపెట్టెను తెచ్చి నగల్ని, క్యాష్‌ని అందులో సర్దాడు వైట్ పేపర్ పట్టుకున్న వ్యక్తి. జాగ్రత్తగా తీసుకుపోయి అవతలి గదిలో ఉన్న అటక మీద భద్రపరిచి కిందికి దిగాడు. "పంపకాలు పూర్తి అయిన వెంటనే మనం ఈ జాగాని ఖాళీ చేసి ఇంకో చోటికి వెళ్ళిపోవాలి... చాలా ముఖ్యం" ఒక అనుచరుడు అందించిన బీడీని వెలిగించుకుంటూ అన్నాడు పహడీవాలా.

“చాలా సౌకర్యంగా ఉంది ఇది. నగల్ని గురించి పట్టించుకునే వాళ్ళు ఎవరూ లేరు. ఎందుకు ఖాళీ చేయటం?” వెంటనే అడిగాడు ఆ అనుచరుడు.

“ఇన్స్పెక్టర్ నిఖిల్‌ని రోడ్డు మీద నిలబెట్టి మంచి నీళ్ళ సాకుతో లోపలికి వచ్చాడు మనవాడు. సస్పెండ్ అయిన బాధలో ఆ నిఖిల్‌కి ఈ ప్రదేశం గురించి వెంటనే జ్ఞాపకం రాలేదు” సమాధానమిచ్చాడు పహడీవాలా.

“జ్ఞాపకం వచ్చినా ఇప్పుడు వాడు చేయగలిగింది ఏమీ లేదు. మనల్ని పట్టుకోవటం వాడికి చేతకాదు...” సగర్వంగా అన్నాడు ఆ పనిచేసిన హీరో.

అంటూ ఎందుకో వీధి గుమ్మం కేసి చూసి కరెంట్ షాక్ కొట్టినట్టు ఒక్కసారిగా అదిరిపడ్డాడు.

“ఏంటి బే? ఏమయింది?” అని అడుగుతూ అటుకేసి చూసిన పహడీవాలాకి కూడా తగిలిందా షాక్.

“ఉద్యోగం ఊడినంత మాత్రాన మిమ్మల్ని వదిలి పెట్టటం ఎలా సాధ్యపడుతుంది? వెతుక్కుంటూ వచ్చేశాను” అంటూ గుమ్మాన్ని దాటి లోపలికి వచ్చాడు నిఖిల్.

“కొట్టండి... తల పగల కొట్టేయండి” ఖంగుమంటున్న కంఠంతో అందర్నీ హెచ్చరించాడు పహడీవాలా. పిడికిళ్ళు బిగించి తను కూడా ముందుకు దూకాడు.

తన సిన్సియారిటీని నిరూపించుకోవటానికి ఎదురుగా ఉన్న ఒకే ఒక అవకాశాన్ని వదిలి పెట్టుకునే ఆలోచన నిఖిల్‌కి లేదు.... పెదవులు బిగించి ఎటాక్ చేయటంలో బిజీ అయిపోయాడతను. వట్టి చేతులతో అతన్ని పడగొట్టటం

అసంభవమని గ్రహించి, వెనుక గదిలోకి పరిగెత్తారు పహడీవాలా అనుచరులు ముగ్గురు... ఒక అలమరా దగ్గిర పెట్టిన ఐరన్ రాడ్లను, అలమరాలో భద్రపరిచిన పేష్కప్‌లను తీసుకోబోతుండగా...

"ఒక్క మనిషిని కొట్టటానికి అన్ని ఆయుధాలు అనవసరం... చేతనయితే వట్టి చేతులతోనే పని పూర్తి చేసుకోండి" అంటూ వినవచ్చింది ఒక కంఠం.

అదిరిపడి వెనక్కి చూసిన వాళ్ళకి చాలా క్లియర్‌గా కనిపించాడు ఫరీదా మైదానంలో తమ దుమ్ము దులిపిన పొట్టి మనిషి. ఎప్పుడు వచ్చాడో, ఎలా వచ్చాడోగాని, పెరటి తలుపుల్ని నీట్‌గా తెరిచి లోపలికి వచ్చి ఉన్నాడు. ఒంటరిగా లేడు. వెంట ఇంకో నలుగురు వ్యక్తులు మాత్రం వరుసగా నిలబడి ఉన్నారు...

పెద్దగా అరిచి ముందు గదిలో ఉన్న తమ వారందర్నీ ఎలర్ట్ చేయాలని అనుకున్నారు ఆ ముగ్గురూ... అరవటానికి నోళ్ళను కూడా తెరిచారు. అయితే చిన్నపాటి శబ్దం కూడా బయటికి రాలేదు.

కంటికి కనిపించనంత వేగంతో కదిలి, ఆ ముగ్గురి మీదా బ్రహ్మరాక్షసుల మాదిరి విరుచుకు పడ్డారు ఆ వచ్చిన వాళ్ళు. రెండే రెండు క్షణాల్లో తెలివితప్పి తలలు కిందకు వేలాడేశారు ఆ ముగ్గురూ...

ఏం చేయాలో ఎలా చెయ్యాలో ముందుగానే నిర్ణయించుకుని వచ్చినట్టు, పడిపోయిన వారి దుస్తుల్ని పర పరా చింపి, ఆ గుడ్డ ముక్కలతోనే వారి కాళ్ళు, చేతుల్ని కదలకుండా కట్టి పడేశారు కొత్తగా వచ్చిన వాళ్ళు.

ముందు గదిలో గొడవ మరింతగా ముదిరిపోయింది కాబోలు. "తీసుకు రండిరా... కత్తులు తెచ్చి పొడిచి పారేయండిరా..." బిగ్గిరిగా అరుస్తున్నాడు పహడీవాలా.

మళ్ళీ వెనక గది లోకి వచ్చారు ఇంకో ముగ్గురు... ఈ సారి ఆయుధాలున్న అలమరా దగ్గిరికి పోకముందే తెలివితప్పి కింద పడిపోయారు... చిటికెలో కాళ్ళు చేతులు కదిలించటానికి వీలు లేకుండా బంధింప బడ్డారు.

"ఏమై పోయార్రా? ఎక్కడ?" అని అరవటం మొదలు పెట్టిన పహడీవాలా తల పగిలి పోయేటట్టు కొట్టి, మిగిలి ఉన్న అనుచరుల్ని ఫుట్‌బాల్ ఆడేశాడు నిఖిల్.

అతని స్పీడ్‌ని అడ్డుకోవటం అసాధ్యమై, వీధిలోకి పరిగెత్తారు వాళ్ళు. కన్నుమూసి కన్ను తెరిచేటంతలో కనిపించనంత దూరం వెళ్ళిపోయారు. ఆలస్యం చేస్తే తనని వట్టి చేతులతోనే చంపేస్తాడేమోనన్న అనుమానం కలిగింది కాబోలు– సందు చూసుకుని తనూ వారిని అనుసరించి అదృశ్యం అయిపోయాడు పహడీవాలా.

చిమచిమ లాడిపోతున్న చేతుల్ని ప్యాంటుకేసి రుద్దుకుంటూ వెనుక గదిలోకి బయలు దేరాడు నిఖిల్. మూడు అడుగులే వేశాడు... నాలుగో అడుగు వేయక ముందే ఆ బిల్డింగ్ ముందు ఆగింది ఒక వ్యాన్. బిలబిల లాడుతూ అందులో నించి కిందికి దూకి, వేగంగా ఇంట్లోకి వచ్చేశారు పది మందికి పైగా ఉన్న అపరిచిత వ్యక్తులు.

“ఎవరు మీరు? ఎవరు?” మరోసారి ఫైటింగ్‌కి రెడీ అయిపోతూ వారిని అడిగాడు నిఖిల్.

“జర్నలిస్టులం మేము. బిజువా సిటీని పట్టి పీడిస్తున్న పహడీవాలా గ్యాంగ్ అడ్డాని మీరు కనిపెట్టారని, పెద్ద ఫైటింగ్ జరుగుతోందని మాకు ఫోన్ వచ్చింది... పహడీవాలా ఎవరు? ఎక్కడా?” పెద్ద పెద్ద మైకులను అతని ముందుకు చాస్తూ అడిగారు వాళ్ళు.

అడగటంతో ఆగలేదు. క్లిక్ మంటూ శబ్దాలు చేయడం మొదలు పెట్టాయి వారి దగ్గరున్న కెమేరాలు... ఫ్లాష్ బల్బుల వెలుగుతో పట్టపగలులా తయారైందా ప్రదేశం.

“ఫైటింగ్ జరిగిన మాట వాస్తవమే పహడీవాలా మాత్రం తప్పించు కున్నాడు” చిన్న కంఠంతో అన్నాడు నిఖిల్.

“అదేంటి సార్... అరడజను మందిని కట్టిపడేశారు... పారిపోయాడని అంటారేమిటి?” వెనుక గదిలోకి తొంగి చూసి పెద్దగా అరిచినంత పనిచేశాడు ఒక రిపోర్టర్.

ఉలికిపాటును నేర్పుగా కప్పిపెట్టుకుంటూ తను కూడా అటు చూశాడు నిఖిల్. ఆయుధాల కోసం వచ్చి అర్థాంతరంగా నేలను కావిలించుకున్న హీరోలను గమనించే సరికి మతిపోయిందతనికి.

“వీళ్ళు మోసాలు చేసి కొట్టేసిన సొత్తు ఏమైనా దొరికిందా? ఎంత దొరికింది? ఎక్కడ ఉంది?” అతనికి ఆలోచించుకునే వ్యవధి కూడా ఇవ్వకుండా

అడిగాడు ఇంకో రిపోర్టర్. ఆ బిల్డింగ్ దగ్గిరికి వచ్చేవరకూ క్లియర్‌గానే ఉన్నాయి నిఖిల్ ఆలోచనలు. ఐతే బిల్డింగ్ లోపల ఉన్న జనాన్ని చూసేసరికి, బ్యాలెన్స్‌ని కోల్పోయి ఎటాక్ చేశాడు. మోసాలు చేసి వాళ్ళు సంపాదించిన సొత్తు ఎక్కడ ఉందో తెలుసుకున్న తర్వాత చేయాల్సిన పని అది.

"చెప్పండి సార్... సొత్తు ఏమయిందో చెప్పండి" అసహనంగా ఆ రిపోర్టర్ రెట్టించే సరికి తన ఆలోచనల్లో నుంచి బయట పడ్డాడు అతను.

"అదీ... ఆ సొత్తంతా ఎక్కడ ఉన్నదో" సరైన మాటల్ని వెతుక్కుంటూ అతను మొదలు పెట్టేసరికి, అవతలి గదిలో నించి ఒక చిన్న సవ్వడి అతని చెవికి చేరింది.

క్షణం కూడా ఆలస్యం చేయలేదతను. "ఒన్ మినిట్ ప్లీజ్. ఓన్లీ వన్ మినిట్" అంటూ ఆ గదిలోకి పరిగెత్తాడు.

"రిపోర్టర్లంటే సామాన్యులు కారు... తికమక ప్రశ్నలు వేసి నిన్ను గాభరా పెట్టేస్తారు" నవ్వుతూ అన్నాడు ఆ గదిలో తలుపు చాటున నిలబడి ఉన్న పొట్టి వ్యక్తి.

ఎక్కడో ఖాన్‌జి దర్గా దగ్గిర హోటల్లోనే ఆగిపోయిన ఆ మనిషి ఆ బిల్డింగ్‌లోకి ఎలా వచ్చాడో, తనకు కనిపించకుండా లోపలి గదుల్లోకి ఎలా ఎంటరయ్యాడో అడగాలని అనిపించినా ఆ పని చేయలేదు నిఖిల్.

"తొందర పడ్డాను... సగం మంది దాకా పారిపోయారు... పహడీవాలా అంటే వాళ్ళల్లో ఎవరో నాకు తెలియదు... ఆ రిపోర్టర్లు..." అంటూ మాటల్ని ఆపేశాడు.

"అది తెలుసుకోవడం ఏమంత కష్టమైన పని కాదు. పడి పోయిన దొంగ నాయాళ్ళను పైకి లేపి రెండు తగిలిస్తే తెలిసి పోతుంది" నవ్వుతూనే చెప్పాడా మనిషి.

"విషయం ఏమిటో పూర్తిగా తెలియకుండా పోట్లాటకి దిగానని వాళ్ళు గ్రహిస్తే నా పరువు ఇంకోసారి పోతుంది" దీనంగా మొఖం పెట్టి చెప్పాడు నిఖిల్.

"అటక మీదికి ఎక్కు..." ఆ మాట రహస్యంగా ఎవరికీ వినబడనట్టు అన్నాడు పొట్టి మనిషి.

ఎందుకు? ఏమిటి? అనే ప్రశ్నలు వేయకుండా పైకెక్కాడు నిఖిల్. రకరకాల అట్టపెట్టెలున్నయ్ అటక మీద... ఒక పెట్టె అతని దృష్టిని ఆకర్షించింది. తెరిచి చూసేసరికి ఊపిరి ఆగిపోయినంత పని అయింది.

"ఎలా తెలుసు? ఈ సొత్తు ఇక్కడ ఉంటుందని ఎలా కనిపెట్టావ్?" పెట్టెతో సహా కిందికి వస్తూ అడిగాడు.

"చీమల జాతికి చెందిన వాడిని. బెల్లం ముక్క ఎక్కడుందో పని కట్టుకుని చీమలకు చెప్పాల్సిన అవసరం లేదు అలాగే దొంగసొత్తు గురించి నాకు కూడా" అంటూ చేయి జాచి అతని భుజం తట్టాడు పొట్టి మనిషి.

గదికి అవతలగా పెట్టి ఉంచిన ఒక పట్టు గుడ్డ మూటని అతనికి అందించాడు. "చాంద్‌పూర్‌లో షాడో దోచుకున్న సొత్తు ఇది... రికవరీ చేయటం కోసం అక్కడి పోలీసులు తల్లకిందులుగా తపస్సు చేస్తున్నారు. దాన్ని కూడా రిపోర్టర్ల ముందు పెట్టి, దారిలో ఎక్కడో దొరికిందని చెప్పేయ్" అంటూ మరో ద్వారం కేసి కదిలాడు.

"ఒక్క క్షణం... ఒకే ఒక్క క్షణం..." హడావుడిగా పిలిచాడు నిఖిల్ "నువ్వు... నువ్వు ఎవరివి? షాడో అంటే నువ్వేనా?" ఆత్రుతగా అడిగాడు.

"నేను షాడోనా?" చిన్నగా నవ్వాడు పొట్టి మనిషి.

"ఇప్పుడు నువ్వు నాకు చేస్తున్న సహాయం సామాన్యులు ఎవరూ చేయలేరు... ఇలాంటి పనులు ఒక్క షాడో మాత్రమే చేస్తాడని అందరూ అంటూ ఉంటారు" అంటూ ఆపైన ఏం చెప్పాలో తెలియక మాటల్ని ఆపాడు.

"ఎవరో ఏదో అన్నారని చెప్పి అనవసరమైన ఆలోచనలతో నీ మెదడును ఖరాబు చేసుకోకు. ఈ దెబ్బతో నీ ఉద్యోగం నీకు వచ్చేస్తుంది. నీతిగా, నిజాయితీగా పని చేసుకో..." అంటూ రెండు అంగల్లో ద్వారాన్ని అధిగమించి అవతలికి వెళ్ళిపోయాడు పొట్టి మనిషి. అటువైపే చూస్తూ నిలబడి పోయిన నిఖిల్‌ని బిగ్గిరిగా పిలిచి ఈ లోకంలోకి రప్పించారు ముందు గదిలో ఉన్న రిపోర్టర్లు.

బరువుగా ఉన్న అట్టపెట్టెని, పొట్టి మనిషి ఇచ్చిన పట్టు గుడ్డ మూటని పట్టుకుని వారి దగ్గిరికి పోయాడు నిఖిల్.

*  *  *  *  *

“సంవత్సరాల తరబడి బిజువా సిటీని పీడించుకు తింటున్న పహడీవాలా గ్యాంగ్ పట్టివేత... మాధోసేట్ పోగొట్టుకున్న సొత్తు రికవరీ... చాంద్‌పూర్‌లో షాడో దోచుకున్న సొత్తు కూడా దొరికిందట...”

పెద్ద పెద్ద అక్షరాలతో ప్రింట్ చేయబడిన ఈవెనింగ్ ఎడిషన్స్ వీధుల్లోకి వచ్చేసరికి, జానెమన్ హోటల్లో కూర్చుని ఉన్న కులకర్ణిగారు నిట్టూర్చి తల విదిలించాడు.

రెండు రోజుల వరకూ మకాం పెడతామని రిసెప్షనిస్టుకు చెప్పిన రామ్‌దయాళ్ తన తమ్ముళ్ళతో కలిసి, మూడు గంటలకే గదుల్ని వెకేట్ చేసేశాడు.

నోరు తెరిచి అడగక ముందే ఆశించిన పనుల్లో ఒకటి అయిపోయింది. చాంద్‌పూర్ డి.ఎస్.పి.కి ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం జరిగింది. షాడోని కలిసి మాట్లాడాలనే కోరిక మాత్రం అలాగే ఉండి పోయింది.

“రాజధాని నించి ఇంకా అదనంగా కొన్ని బలగాల్ని రప్పించాలని అనుకుంటున్నాను సార్... ఈ దెబ్బతో షాడో అంతు చూసి తీరాల్సిందే...” అర గంట తర్వాత ఆయన దగ్గిరికి వచ్చి తను చేయదలుచుకున్న పనిని గురించి వివరంగా చెప్పాడు డి.జి.పి.

“సస్పెండ్ అయిన ఇన్స్‌పెక్టర్ సంగతి ఏం చేశారు? ఈ సిటీలో ఉన్న ఇన్స్‌పెక్టర్స్ ఎవరూ చేయలేని పని అతను చేసి చూపించాడు...” అన్నారు కులకర్ణి.

“మాధోసేట్ పోగొట్టుకున్న సొమ్మును మాకు చూపించిన వెంటనే అతని ఉద్యోగం అతనికి ఇచ్చేశాము... పారిపోయిన పహాడీవాలాని పట్టుకునే పని అప్పగించాము” తాము చేసినది అతనికి చెప్పాడు డి.జి.పి.

“ఓ.కే... ఇక వీధుల వెంట తిరగటాన్ని ఆపి ఎవరి పనుల్ని వారు చూసుకోమని చెప్పండి. టెన్షన్ అనవసరం” అన్నారు కులకర్ణి.

“అదేమిటి సార్? మరి ఆ షాడో?” ఆశ్చర్యంగా ఆయన వైపు చూసి అడిగారు డి.జి.పి.

“మాధోసేట్ కోసమే సిటీలోకి వచ్చాడు షాడో. నిఖిల్ మూలకంగా మొదట పోగొట్టుకున్న సొత్తును మీకు అందేటట్టు చేశాడు. రెండోసారి దోచుకున్న నగలు మాత్రం మీకు దొరకలేదు. గమనించారా?” అడిగాడు కులకర్ణి.

అవునన్నట్టు తల ఊపాడు డి.జి.పి.

“షాడో బిజువాని వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. అతను మీకు ఇప్పట్లో కనిపించడు. మాధోసేట్ సొత్తు కూడా ఇక రికవర్ కాదు...” నమ్మకంగా అన్నారు కులకర్ణి.

“అన్యాయం... ఇది అక్రమం” అన్నాడు డి.జి.పి.

“మీరు ఎలా అనుకున్నా జరగబోయేది అదే” అంటూ సోఫాలో నించి లేచి ద్వారం వైపు అడుగులేశారు కులకర్ణి.

*   *   *   *   *

“ఒక్కసారి ఒక్కటంటే ఒక్కసారి ఆ పెద్దాయనకి ఎదురుపడి రెండు మాటలు మాట్లాడవచ్చు కదా. ఇప్పటికి ఎన్నోసార్లు అడిగాడు. అసలు మేము వచ్చింది. ఈ మాట చెప్పటం కోసమే” మృదువుగా అన్నాడు రామ్‌దయాళ్.

సిగరెట్ పొగని రింగులు రింగులుగా వదులుతూ చెవర్లెట్ సీటు వెనక్కి చేరగిల బడ్డాడు షాడో.

“రామ్‌దయాళ్ అంత ఇదిగా అడుగుతుంటే సమాధానం చెప్పవేమిటి గురూ?” రెండు నిముషాలు గడిచిన తర్వాత కూడా అతను ఏ విషయం గురించి మాట్లాడక పోవటంతో విసుగ్గా అడిగాడు గంగారాం.

బిజువా సిటీని దాటి అప్పటికి వంద కిలో మీటర్ల దూరం వచ్చేసింది రంగరాజు నడుపుతున్న ఆ చెవర్లెట్.

ఉన్నట్టుండి సిగరెట్‌ని విండోలో నించి అవతలికి విసిరి ఒళ్ళు విరుచుకున్నాడు షాడో. కారును రోడ్డు పక్కగా ఆపమని రంగరాజుకు సైగ చేశాడు.

కీచు ధ్వనులు చేస్తూ సడన్‌గా ఆగిపోయింది చెవర్లెట్. “పోలీసుల నుంచి తప్పించుకోవటానికి పరిగెత్తి పరిగెత్తి బోరు కొట్టేసింది. కొన్ని రోజులు కామ్‌గా రెస్ట్ తీసుకోవాలని నేను అనుకుంటున్నాను...” తనకేసి చూసిన రామ్‌దయాళ్‌తో చెప్పి కిందికి దిగాడు షాడో.

“మరి కులకర్ణి సాబ్ సంగతి?” పట్టువదలని విక్రమార్కుడి మాదిరిగా మళ్ళీ అడిగాడు రామ్‌దయాళ్.

“ఆలోచించి చెపుతా. ఇప్పటికిప్పుడు జరిగే పని కాదు అది” అంటూ అతనికి, అతని సోదరులకి చెయ్యి ఊపి, కారును కదిలించమని రంగరాజుకి సైగ చేశాడు.

“కులకర్ణి సాబ్‌తో మాట్లాడటం నీకు ఇష్టం లేకపోతే అలాగే... మాతోపాటు వచ్చేయ్... హ్యాపీగా మా ఎడారిలో చక్కర్లు కొడదాము...” అన్నాడు రామ్‌దయాళ్.

తల అడ్డం తిప్పి మళ్ళీ సైగ చేశాడు షాడో.

అతను ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత మార్చటం ఎవరికీ సాధ్యపడదని రంగరాజుకి తెలుసు. నోరు తెరిచి మరొక్క మాట కూడా మాట్లాడకుండా చెవర్లెట్‌ని ముందుకు కదిలించాడు అతను.

అది దృష్టి పథం నించి దూరం అయిపోయేదాకా ఆగి, “ఇప్పుడు మనం ఎటు పోదాం?” అడిగాడు గంగారాం.

“మంచి పల్లెటూరు చూసుకుని కొన్ని రోజులు కామ్‌గా నిద్రపోదాం” అంటూ ముందుకు అడుగు వేశాడు షాడో. గుజరాత్ స్టేట్‌కి దారితీసే రహదారి వారిద్దరికీ రెండు కిలో మీటర్ల దూరం పోయిన తర్వాత కనిపించింది.

మరో రెండు కిలో మీటర్ల దూరం పోగానే ఎదురయింది రైల్వే ట్రాక్. రాత్రి ఎనిమిది గంటల వరకూ ఆ ట్రాక్ మీదనే కూర్చుని వెయిట్ చేశారు ఇద్దరూ. ఎనిమిది గంటల పది నిముషాలకు అటుగా వచ్చింది ఒక గూడ్స్ ట్రైన్. ఒక మలుపు దగ్గిర కొంచెం స్లో అయింది.

ఖాళీగా కనిపించిన ఒక వ్యాగెన్ అంచుల్ని పట్టుకుని ఒకే ఒక దుముకుతో పోయి లోపల పడ్డాడు షాడో.

ట్రైన్ తిరిగి స్పీడ్ అందుకో బోతుండగా గంగారాంకి చెయ్యి అందించి లోపలికి లాగేశాడు.

గలీజు గలీజుగా ఉంది వ్యాగెన్ లోపలి భాగం. దుమ్ము, ధూళి, చెత్తా చెదారం... మోకాళ్ళ మీద కూర్చుని ఒక పక్కన చేతులతోనే శుభ్రం చేశాడు గంగారాం. బిజువా నించి పట్టుకు వచ్చిన మాధోసేట్ నగల మూటని తలగడ మాదిరి అరేంజి చేశాడు. సగం వరకూ కాలిన సిగరెట్‌ని అవతలికి విసిరి ఆ మూట మీద తల పెట్టుకుని అర నిముషంలో గాఢమైన నిద్రలోకి జారిపోయాడు షాడో.

బాసిపట్టు వేసుకుని వ్యాగెన్ ఎంట్రన్స్ దగ్గిరే కూర్చున్నాడు గంగారాం. నిద్ర వస్తున్నా లెక్క చేయకుండా కాపలా కాయటం స్టార్ట్ చేశాడు.

చీకటి పడింది... చకచకా నడవటం మొదలు పెట్టింది సమయం... మూడు గంటల సమయంలో ఏదో స్టేషన్లో ఆగింది ట్రైన్. ఒళ్ళు విరుచుకుని ప్లాట్‌ఫాం మీదికి దూకాడు గంగారాం... వాగెన్‌కి, వాగెన్‌కి మధ్య ఉండే లింకుల్ని టెస్ట్ చేస్తూ అటుగా వచ్చాడు ఒక టెక్నీషియన్. "ఇది ఏ ఊరు భాయీ?" అడిగాడు గంగారాం.

తను చేస్తున్న పనిని చటుక్కున వదిలేసి, అమితమైన ఆశ్చర్యంతో అతని వంక చూశాడు ఆ టెక్నీషియన్. తన తప్పేమిటో వెంటనే తెలిసి వచ్చింది గంగారాంకి.

అది ఏ స్టేషనో తెలియకుండా అసలు లోపలికి రావడం ఎలా జరిగింది? ప్రయాణం చేస్తూ మధ్యలో మెలుకువ వచ్చి అడిగాడని అనుకోవటానికి– పక్కన ఉన్నది పాసింజర్ కాదు. సరుకులు రవాణా చేసే గూడ్సు.

నాలుక కరుచుకుని, మనసులోనే నెత్తిమీద టపటపా రెండు దెబ్బలు వేసుకుని, అర్జంటుగా అతను మాట మార్చక ముందే. చాలా వైల్డ్‌గా రియాక్ట్ అయ్యాడు ఆ పెద్ద మనిషి. "ఎవరు నువ్వు? ఎంత దూరం నించి వస్తున్నావ్?" అని అడగడంతో ఆగకుండా, షర్టును ఒడిసి పట్టుకున్నాడు. "పద... స్టేషన్ మాస్టర్ దగ్గిరికి నడువ్... నీలాంటి వాళ్ళని గోడకి నిలబెట్టి రాళ్ళతో కొట్టేయాలి..." అంటూ స్టేషన్‌లోకి లాక్కుపోయే పయత్నం చేశాడు.

"తప్పయి పోయింది. వదిలేయ్ భాయీ... ఇంకెప్పుడూ ఇలాంటి వాటిలోకి ఎక్కను. ఒకవేళా ఎక్కినా దారి మధ్యలో కిందికి దిగి ఏ స్టేషనని అడగను" అతని గడ్డం పట్టుకుని చాలా జాలిగా, వినయంగా అన్నాడు గంగారాం.

"వేసిన తలుపులు వేసినట్టుండగానే వాగెన్లలో ఉన్న సరుకులు మాయం అయిపోతున్నాయి. నువ్వే చేస్తూ ఉండి ఉంటావ్ ఆ పని. పద పద" మరింత పట్టుదలగా అంటూ గట్టిగా నెట్టడం మొదలు పెట్టాడతను.

"దొంగతనంగా ఎక్కిన మాట వాస్తవం... నువ్వు చెపుతున్న పనులతో నాకు ఎటువంటి సంబంధము లేదు" ఖచ్చితమైన కంఠంతో చెప్పాడు గంగారాం.

"దొంగ రాస్కేల్స్ ఎవరూ తాము దొంగలమని ఒప్పుకోరు. చొక్కా విప్పి వెన్ను మీద రెండు వడ్డిస్తే సంబంధమున్నదీ లేనిదీ తేలిపోతుంది" వికృతంగా మొఖం పెట్టి చాలా విసురుగా అన్నాడు ఆ వ్యక్తి.

అనడంతో ఆగలేదు "రండిరోయ్... రండి... రండి... ఇక్కడికి రండి" అని దూరంగా నిలబడివున్న రైల్వే పోలీసులు ఇద్దర్ని అటుగా పిలిచాడు.

పిలిచానని అనుకున్నాడు అతను. పిలుపు పెదవుల్ని దాటకముందే మెడ మీద పడింది గంగారాం పిడికిలి.

లావుపాటి కాంక్రీట్ దిమ్మ ఏదో వచ్చి మెడకి తగిలినంత బాధ ఆ టెక్నీషియన్ని ఆవరించుకుంది.

గట్టిగా పట్టుకున్న గంగారాం షర్టుని వదిలి మొదలు నరికిన చెట్టులా వెనక్కి పడబోయాడు. గబుక్కున పట్టుకున్నాడు గంగారాం అమాంతంగా పైకెత్తి తను ఏ వాగెన్లోనించి దూకాడో ఆ వాగెన్‌లోకి దొర్లించాడు.

అతను ఆ పని పూర్తి చేయటం, పొడుగాటి లాటీలని విలాసంగా ఊపుకుంటూ ప్లాట్ ఫాం రెండో పక్క నించి ఇంకో ఇద్దరు పోలీసులు అటుగా రావడం ఒకేసారి జరిగింది. "ఎవడ్రా నువ్వు?" వస్తూనే గంగారాంని చూసి కరుకుగా అడిగాడు వారిలో ఒకతను.

"నేనా? నేను ఫటాన్‌పురా పవనపుత్ర గంగూభాయ్ నండి..." సమాధానం ఇచ్చాడు గంగారాం.

"పన్నాలాల్ ఏమయిపోయాడు? వాగెన్స్‌ని టెస్ట్ చేస్తూ ఇటుగానే వచ్చాడు..." అడిగాడు రెండో పోలీసు.

తను వాగెన్‌లోకి దొర్లించింది అతను అడుగుతున్న పెద్ద మనిషినే అని అర్థం అయింది గంగారాంకి.

ఈ సారి కూడా తడుముకోలేదతను. "పన్నాలాల్‌కి నేను బావమరిది నండి... కడుపులో నొప్పిగా ఉందని చెప్పి ఇంటికి పోయాడండి... పనిలో తేడా రాకుండా నన్ను ఇక్కడ నిలబెట్టాడండీ..." వాగెన్‌లోకి వెళ్ళిపోయిన మనిషి ప్లాట్‌ఫాం మీద వదిలేసిన టార్చిలైటును, లావుపాటి రెంచిని చేతుల్లోకి తీసుకుంటూ చెప్పాడు.

"చీకటి వేళల్లో డ్యూటీకి డుమ్మా కొట్టడం పన్నాలాల్‌కి ఈ మధ్య చాలా ఎక్కువ అయిపోయింది. స్టేషన్ మాస్టర్ మెతక మనిషి కాబట్టి ఆటలు సాగుతున్నయ్... ఎప్పుడో ఎవరో ఒకరు పట్టుకుంటారు... అప్పుడు ఒంటికి పట్టిన కొవ్వు వదిలిపోతుంది" వెక్కిరింపుగా అంటూ ముందుకు వెళ్ళిపోయారు ఆ పోలీసులు ఇద్దరూ.

చేతుల్లోకి తీసుకున్న సామానును మళ్ళీ కింద పెట్టేసి, గుండెల నిండా ఊపిరి పీల్చుకున్నాడు గంగారాం.

ప్లాట్‌ఫాం మీదే నిలబడి అనవసరమైన చికాకుల్ని నెత్తిమీదికి తెచ్చుకోవటం కంటే, హాయిగా వాగెన్‌లోకి వెళ్ళిపోవడమే మంచిదని అనిపించింది అతనికి. అయితే, అది ఏ ఊరో తనకు ఇంకా తెలియలేదని గుర్తుకు వచ్చి, ధైర్యంగా ముందుకు అడుగు వేశాడు.

పాతిక అడుగుల దూరం కూడా పోక ముందే కనిపించింది అతనికి పక్కనే ఉన్న ఫెన్సింగ్‌కి తగిలించి ఉన్న బోర్డు... అటు తిరిగి ఇటు తిరిగి మనం అహ్మదాబాద్‌కి చేరుకున్నామన్న మాట. బాగుంది. వాగెన్లో నుంచి ఊళ్ళోకి పోయి ఏదైనా హోటల్లో మకాం పెడితే ఎలా ఉంటుంది?' అని అనుకుంటూ ముందుకు పోయాడతను.

డిమ్‌గా ఉన్న లైట్ల స్థానంలో ధగధగ మెరుస్తున్న నియోన్ దీపాలు కనిపించాయి. మసక చీకటి కాస్తా పట్టపగలుగా మారిపోయింది. నిద్ర మొఖాలతో కునికిపాట్లు పడుతున్న ప్రయాణీకులు అగుపించారు.

రష్‌గా వుంది ఒక క్యాంటీన్. రెండు బ్రెడ్ ప్యాకెట్స్‌ని ఖరీదు చేశాడు గంగారాం. రెండు సిగరెట్ ప్యాకెట్స్‌ని తీసుకున్నాడు. రెండు డిస్పోజబుల్ గ్లాసుల్లో చాయ్ పోయించుకుని స్పీడ్‌గా వెనక్కి వచ్చేశాడు.

ఎక్కడికి దొర్లించాడో అక్కడే కదలకుండా పడి ఉన్నాడు పన్నాలాల్... తెలివి వస్తున్న లక్షణాలు కనిపించటం లేదు. గ్లాసుల్ని కింద పెట్టి అతన్ని అతి జాగ్రత్తగా ప్లాట్‌ఫాం మీద ఉన్న ఒక బెంచి మీద పడుకో బెట్టాడు గంగారాం. అతని సామానును పక్కన ఉంచాడు.

తన పైజమా జేబులోనించి మూడు కరెన్సీ నోట్లను తీసి అతని పక్క జేబులో భద్రపరిచాడు.

"నీ పేరు ఉపయోగించుకుని పోలీసుల్నించి తప్పించుకున్నాను. అందుకు నీకు ఋణపడిపోయాను..." అంటూ అతని బుగ్గల్ని తట్టి వాగెన్‌లోకి జంప్ చేశాడు.

"అహ్మదాబాద్ వచ్చేసిందా?" అప్పటి వరకూ కదలకుండా పడుకుని ఉన్న షాడో, ఇంకో పక్కకి బద్ధకంగా వత్తిగిల్లుతూ అడిగాడు అతన్ని.

కింద పెట్టిన గ్లాసుల్లో ఒక గ్లాసును అతనికి అందిస్తూ, "నీకు ఎలా తెలిసింది?" అని అడిగాడు గంగారాం.

"రైల్వే జంక్షన్ ఇది. బహుశా ఈ బండి కచ్ ఏరియా వైపుకు వెళుతుంది. లాస్ట్ అండ్ ఫైనల్ స్టాప్ భుజ్ పట్టణం కావచ్చు..." లేచి కూర్చుని గ్లాసులోని వేడి వేడి చాయ్‌ని సిప్ చేస్తూ అతనికి చెప్పాడు షాడో.

ఆ మాట ముందుగానే తనకు తెలిసి వుంటే కిందికి దిగేటప్పుడు ఒళ్ళు దగ్గిర పెట్టుకుని దిగేవాణ్ణి అని అనుకుంటు తన గ్లాసును ఖాళీ చేసి బ్రెడ్ ప్యాకెట్స్‌ని ఓపెన్ చేశాడు గంగారాం. ఒక ప్యాకెట్ ఖాళీ అవుతున్న సమయంలో కదిలింది ట్రైన్... ఆ తరువాత ఇంకో అరగంట మాత్రమే మెలుకువగా ఉన్నాడు గంగారాం.

అహ్మదాబాద్‌ని దాటి పది కిలో మీటర్లు దూరం కూడా పోకముందే నిద్రలోకి జారిపోయాడు తను కూడా.

తిరిగి మెలకువ వచ్చేసరికి పది గంటలు దాటింది. భుజం పట్టుకుని గబగబా కదుపుతున్నాడు షాడో. "త్వరగా లేవాలి. ఆలస్యం చేస్తే అరెస్ట్ అయిపోతాం" అని కూడా హెచ్చరిస్తున్నాడు.

గబుక్కున లేచి అతనితో పాటు కిందికి దూకేశాడు గంగారాం. షాడో చేసిన హెచ్చరికలో అసత్యం ఏమీలేదు. "క్యాచ్ దెమ్... పట్టుకోండి... పట్టుకోండి" అని కేకలు పెడుతూ మహా వేగంగా పరిగెత్తుకు వచ్చారు పది మంది రైల్వే పోలీసులు. "ఎందుకు? ఎందుకు మనల్ని పట్టుకోవడం?" రన్నింగ్ రేస్‌లో పాల్గొంటున్నట్టు అతి వేగంగా పరుగు తీస్తున్న షాడోని అనుసరిస్తూ అయోమయంగా చూస్తూ అతనిని అడిగాడు గంగారాం.

"అహ్మదాబాద్‌ని దాటి నలభై కిలో మీటర్లు రాగానే వెనకాల ఉన్న రెండు వాగెన్స్ తాళాలు బ్రేక్ అయిపోయాయట... సగానికి సగం సరుకు గల్లంతయి పోయిందట" అడ్డం వచ్చిన ఒక పెద్ద బండరాయి మీది నించి అవతలి వైపుకు జంప్ చేస్తూ చెప్పాడు షాడో.

"నీకెలా తెలిసింది ఇది?" అడిగాడు గంగారాం.

"ట్రైన్ ఆగగానే రెండో పక్క నించి దిగి గార్డు దగ్గిరికి పోయాను..." గంగారాంకు చెప్పాడు షాడో.

"అంటే ఆర్చుకుని తీర్చుకుని నన్ను లేపావన్నమాట... లేచీ లేవగానే పరుగులు తీయడం ఆరోగ్యానికి మంచిది కాదని నీకు తెలియదా?" ఎంక్వయిరీలు

చేసేందుకు వెళ్ళేటప్పుడు తనను కూడా వెంటబెట్టుకు పోనందుకు కోపం వచ్చి, సీరియస్‌గా అడిగాడు గంగారాం.

"అనవసరమైన మాటలతో టైమ్‌ని వేస్ట్ చేయడం కూడా ఆరోగ్యానికి మంచిది కాదు. స్పీడ్ పెంచకపోతే పట్టుబడి పోవడం డెఫినిట్" హెచ్చరించాడు షాడో.

భుజం మీది నించి వెనక్కి చూసిన గంగారాంకి– వెంటనే కనిపించింది ఎటువంటి ప్రదేశంలోనైనా ఈజీగా ప్రయాణం చేయగల జీప్. దానితో పాటు రైఫిల్స్ పట్టుకుని కూర్చున్న రైల్వే పోలీసులు కూడా అగుపించారు.

"వాగెన్లను పగల కొట్టింది మనమే అనుకుంటున్నారు... అది చాలా తప్పు కదా..." చేయని పనికి దోషిగా నిలబడటం ఇష్టం లేక కోపంగా అన్నాడు అతను.

"నిజమే... వెనక్కి వెళ్ళి వాళ్ళతో చెప్పు... నేను మాత్రం ఆగేది లేదు" అంటూ ఒక ఎత్తయిన గట్టుమీదికి పోయాడు షాడో. నవ్వుతూ మొదలైన ఆ చేజింగ్ వెరీ సీరియస్‌గా మారిపోతున్నదని వెంటనే అర్థమైంది అతనికి. వేగంగా వచ్చేస్తోంది రైల్వే వారి వెహికిల్. అతను నిలబడిన గుట్టను ఆనుకుని అతివేగంగా పరుగులు తీస్తోంది ఒక నది...

లోతు ఎంతుందో, దిగడం మంచిదో కాదో తెలియటం లేదు... ఆలస్యమైన కొద్దీ దగ్గిరికి వచ్చేస్తోంది వెహికిల్.

"కాల్చేస్తారు... రైఫిల్ పైకి ఎత్తుతున్నారు" అర క్షణం ఆలస్యంగా షాడో దగ్గిరికి వచ్చి, వెనక వైపుకు చూస్తూ ఆందోళనగా అన్నాడు గంగారాం.

అతను ఆ మాట అనడం, చెవులు చిల్లులు పడేటట్టు రెండు రైఫిల్స్ గర్జించడం వెంట వెంటనే జరిగి పోయింది. "ఉద్యోగంలో చేరిన తర్వాత మొట్టమొదటిసారిగా కాలుస్తున్నట్టున్నారు..." దూరంగా పోయి పడిన బుల్లెట్ల వంక చూస్తూ కామెంట్ చేశాడు గంగారాం.

అలాగే నిలబడితే ఏదో ఒక బుల్లెట్ తప్పకుండా తమకు దగ్గిరిగా వచ్చి తీరుతుందని గ్రహించి, రెండో ఆలోచన చేయకుండా నది వైపు దిగాడు షాడో.

స్పీడ్‌గా పోయి ఎగిరి దూకాడు నీళ్ళల్లోకి.

"నన్ను వదిలేసి నీ దారిన నువ్వు వెళ్ళిపోవడం అన్యాయం" అంటూ నదిలోకి జంప్ చేశాడు గంగారాం.

దుమ్ము తెరలు రేపుతూ వచ్చి గట్టు కింద ఆగింది రైల్వే వారి వెహికిల్. రైఫిల్స్‌ని రెడీగా పట్టుకుని పోలీసులు గట్టుమీదికి ఎక్కే సమయానికి, నీటి వాలున రెండు వందల మీటర్ల దూరం వెళ్ళిపోయారు స్నేహితులు ఇద్దరూ.

* * * * *

భుజ్ పట్టణంలో ట్రైన్ దిగాడు సంతోష్... ఎయిర్‌బ్యాగ్‌ని భుజం మీద వేసుకున్నాడు... సూట్‌కేస్‌ని ఎడమ చేతితో పట్టుకుని, మెయిన్ రోడ్డు మీదికి వచ్చాడు.

వెంటనే అతని దగ్గిరికి వచ్చాడు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌కి చెందిన కానిస్టేబిల్ ఒకతను. "మీ ఐడెంటిటీ చూపించండి" అంటూ మర్యాదగా అడిగాడు.

బోర్డర్స్‌కి దగ్గిరిగా ఉండే ఏరియా అవడం వల్ల, సెక్యూరిటీ కట్టుదిట్టంగా ఉంటుందని సంతోష్‌కి తెలుసు. చేతిలో ఉన్న సూట్‌కేసును కింద పెట్టకుండానే, కుడి చేత్తో ప్యాంటు జేబులో నించి ఒక పేపర్‌ని తీసి అతనికి ఇచ్చాడు. ఒకేసారి చూశాడా కానిస్టేబిల్ ఆ పేపర్ వంక, వెంటనే అటెంక్షన్‌లో నిలబడి శాల్యూట్ చేశాడు స్మార్ట్‌గా.

"ఇన్స్‌పెక్టర్ సంతోష్... అహ్మదాబాద్ టూ టవున్ స్టేషన్ నించి కచ్ ఏరియాలోని బింద్రా మండలానికి ట్రాన్స్‌ఫర్.. అదేమిటి సార్? పనస పండు లాంటి సిటీలో నించి ఈ చికాకు ఏరియాలోకి? ఎందుకు?" అడిగాడు.

"తాడు బొంగరం లేనివాడిని దోస్త్... వెనకా ముందు ఎవరూ లేని ఒంటరివాడిని. అహ్మదాబాద్ నించి ఇటుగా వచ్చే ట్రెయిన్స్ అన్నీ దోపిడీలకి గురి అవుతున్నాయని కంప్లయింట్... స్పెషల్ డ్యూటీ నాకు పడింది" నవ్వుతూ సమాధానం చెప్పాడు సంతోష్...

"నిజమే సార్... మాకు మా డ్యూటీలు ఉండటం వల్ల మేము కల్పించుకోలేక పోతున్నాం. ఇప్పుడు నా వల్ల కాదగిన పనేమైనా ఉంటే చెప్పండి" అన్నాడతను.

"బింద్రా వెళ్ళాలి నేను... వెంటనే స్టేషన్లో జాయిన్ అయిపోవాలి... ట్రాన్స్‌పోర్టేషన్ ఏదయినా..." అని చెప్తూ మాటల్ని ఆపాడు సంతోష్.

"అంతా చికాకు ఏరియా అని ఇందాక చెప్పాను కదా సార్... పొద్దున ఒకసారి సాయంత్రం ఇంకోసారి మాత్రమే బస్ సౌకర్యం ఉంది... అది కూడా

బింద్రాకి నాలుగు మైళ్ళ దూరంలో ఆగిపోతుంది. అక్కడి నించి లెఫ్ట్‌రైట్... మీ స్టేషన్‌కి మెస్సేజి ఇచ్చి ఏదయినా వెహికిల్..." అంటూ చటుక్కున మాటల్ని ఆపాడు కానిస్టేబిల్.

పెద్దగా హారన్ మోగిస్తూ ఒక మోటార్ వెహికిల్ అక్కడికి రావడమే కారణం. "ఇదేమిటి? పొద్దున ఎప్పుడో వెళ్ళిపోవాలి కదా... ఇప్పుడు రావడం ఏమిటి?" ఆశ్చర్యంగా కండక్టర్‌ని అడిగాడు కానిస్టేబిల్.

"రిపేరొచ్చింది. పని పూర్తయ్యే సరికి ఈ టైమైంది" అని అతనికి చెప్పి "రండి బాబూ రండి... బింద్రా... బావన్.... బుల్జీ" అంటూ ఆ చుట్టుపట్ల ఉండే ఊళ్ళ పేర్లను పెద్దగా అరవడం మొదలు పెట్టాడు కండక్టర్.

"ఎక్కండి సార్... మీరు చాలా లక్కీ... మీరు తప్ప ఇంకెవరూ ఎక్కరు. ఈ టైములో బస్సు ఉంటుందని తెలియదు కదా" సంతోష్ సూట్‌కేసుని, ఎయిర్‌బ్యాగ్‌ని తీసుకుని బస్‌లో పెడుతూ చెప్పాడు కానిస్టేబుల్.

బోర్డర్స్‌ని కాపలా కాయడంలోను, ఎటువంటి స్మగ్లింగ్ కార్యక్రమాలు జరగకుండా ఎలర్ట్‌గా ఉండటంలోను స్పెషలిస్టులు బోర్డర్ సెక్యూరిటీ సిబ్బంది.

"థాంక్యూ వెరీ మచ్ మై ఫ్రెండ్..." అంటూ అతనికి కృతజ్ఞతలు తెలియజేసుకుని సీటులో కూర్చున్నాడు సంతోష్. కండక్టర్‌ని కబుర్లలోకి దించి ఆ ఏరియాని గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి ప్రయతనం చేశాడు గాని, ఫలితం మాత్రం లేకపోయింది.

అతనికి టిక్కెట్ ఇచ్చి హ్యాపీగా నిద్రలోకి జారిపోయాడు కండక్టర్. అతన్ని చూసేసరికి సంతోష్‌కి కూడా ముంచుకు వచ్చేసింది నిద్ర.

"బింద్రా... బింద్రా వచ్చేసింది లేవండి సాబ్" డ్రైవర్ బస్‌ని ఆపి బిగ్గిరిగా అరిచేసరికి ఉలిక్కిపడి లేచాడతను. తన లగేజిని తీసుకుని గబగబా కిందికి దిగాడు. దుమ్ము తెరలు రేపుతూ బస్ వెళ్ళిపోయాక చుట్టూ చూశాడు.

ముళ్ళ పొదలు, చిత్తడి నేల, కొండ గుట్టలు, మట్టి దిబ్బలు... డిప్రెషన్ కలిగించేటట్లుంది ఆ ప్రదేశం.

నిలబడి ఉంటే టైమ్ వేస్ట్ కావడమే తప్ప– బింద్రాలోకి పోయేందుకు ఎటువంటి సదుపాయము లభించదని అర్థం అయింది అతనికి ఒక అరగంట తర్వాత... గట్టిగా ఒక నిట్టూర్పు విడిచి లగేజిని పట్టుకున్నాడు.

ఇంకా అడుగు కదపలేదు... స్పీడ్‌గా వచ్చి అతని సమీపంలో ఆగింది ఒక టాంగా. ఇవాళో రేపో కాలం చేసేటట్టు కనిపిస్తున్న ఒక ముసలి గుర్రం లాగుతోంది దానిని.

"బింద్రాలోకి వెళ్ళాలి... లిఫ్ట్ ఇవ్వగలరా?" టాంగాలో నించి కిందికి దూకి తన ఎదుటికి వచ్చిన ఇద్దరు దృఢకాయుల్ని అడిగాడు అతను.

చేతులు జాచాడు ఒకతను... తన లగేజి కోసం జాచాడనుకున్నాడు సంతోష్. "థాంక్యూ... థాంక్యూ వెరీ మచ్..." అంటూ సూట్ కేసుని అందించబోయాడు.

నిర్మొహమాటంగా అతని కడుపులో పొడిచాడు రెండో దృఢకాయుడు. ఎదురు చూడని పరిణామం.

ఎవరో తెలియని వ్యక్తులు.

"వాట్... వాటీజ్ దిజ్? ఎవరు మీరు?" ఆశ్చర్యం ఆందోళన కలగలిపిన కంఠంతో అడుగుతూ నీరసంతో ముందుకు తూలాడు సంతోష్.

"బింద్రాలో పనిచేస్తావా? అది అంత తేలిక అనుకుంటున్నావా?" అంటూ ఇంకో రెండు పోట్లు పొడిచాడు ఆ వ్యక్తి... ఎర్రటి రక్తం వెల్లువలా బయటికి ఉబుకుతుండగా– కింద పడిపోయాడు సంతోష్... లాగిపెట్టి అతని తొడల మీద రెండు తన్నులు తన్ని మొదటి దృఢకాయుడికేసి చూశాడు పొడిచిన వ్యక్తి. "వీడి పనైపోయింది. వెళ్ళిపోదాం" అంటూ సంతోష్ వదిలేసిన సూట్ కేసును, ఎయిర్‌బ్యాగ్‌ని తీసుకుని టాంగాకేసి జంప్ చేశాడు ఆ మనిషి.

రెండో వ్యక్తి ఎక్కి కూర్చోగానే కదిలింది అది. స్పీడ్‌గా ఆ ప్రదేశాన్ని వదిలి బింద్రా వైపు వెళ్ళిపోయింది.

* * * * *

"బుద్ధి జ్ఞానం ఉన్నవాడు ఎవడూ ఈ ఏరియాలోకి రాడు... దాహంతో నా గొంతు ఎండుకు పోతోంది" నడుస్తున్న వాడు సడన్‌గా ఆగి ఎనౌన్స్ చేశాడు గంగారాం.

దాహం షాడోకి కూడా వేస్తోంది... గొంతు ఎంతగా ఎండుకు పోయిందంటే... సిగరెట్ పొగ గొంతులోకి పోతుంటే ఎటువంటి సెన్సేషన్ కలగటం లేదు.

ఎటు చూసినా ముళ్ళపొదలు... తేమతో నిండి ఉన్న నేల "ఇంకో గంటపాటు తిరిగితే బూట్లు నానిపోయి నాశనమై పోతయ్... ఒట్టి పాదాలతో పోతే కాళ్ళు పుళ్ళు పడతయ్" తన అబ్జర్వేషన్‌ని చెప్పాడు గంగారాం.

"బింద్రా ఇక్కడికి దగ్గర్లోనే ఉండాలి... కొంచెం ఓపిక పడితే వెళ్ళిపోవచ్చు" అంటూ సడన్‌గా మాట ఆపి ఏదో గుర్తొచ్చినట్లు ఆకాశంలోకి చూశాడు షాడో.

"ఏమిటి గురూ? ఏమిటది?" తను కూడా అటుకేసి చూస్తూ అతనిని అడిగాడు గంగారాం.

ఎక్కడో వెనకాల వదిలేసి వచ్చిన రైల్వే పోలీసులు పట్టువదలని విక్రమార్కుల మాదిరి తమ వెనుకే వచ్చేశారేమోనని అతని అనుమానం.

రైల్వే పోలీసులు కనిపించలేదు అతనికి. గోలగోలగా అరుస్తూ గాలిలో చక్కర్లు కొడుతున్న కొన్ని పక్షులు కనిపించాయి. "అవెందుకు అలా డిస్టర్బ్ అవుతున్నాయ్? నక్కలో, కుక్కలో, పిల్లులో వాటి మీద దాడి చేస్తున్నాయా?" ఆశ్చర్యంగా వాటి వైపు చూస్తూ అడిగాడతను.

"సమ్‌థింగ్... అట్లాంటిదే... పోయి చూస్తే తెలుస్తుంది" అంటూ పరుగు లాంటి నడకతో అటుకేసి పోయాడు షాడో. రెండు నిలువుల ఎత్తున ఎదిగి వున్నాయి ఆ ప్రదేశంలో అతనికి పేరు తెలియని ఏవో చెట్లు... ఆ చెట్ల కింద వెల్లకిలా పడిపోయి కనిపించాడతనికి ఓ యువకుడు.

"ప్రాణం ఉంది గురూ... అయిపోలేదు..." రెండు అంగల్లో పోయి ఆ యువకుడి నాడిని పట్టుకుని చూస్తూ ఉద్వేగంగా అన్నాడు గంగారాం.

"నువ్వు ముందు నడువ్... బింద్రాకి తీసుకుపోదాం" అంటూ ఆ మనిషిని చేతుల్లోకి ఎత్తుకోబోయాడు షాడో. అతని చేతులు తగలగానే చటుక్కున కళ్ళు తెరిచాడా మనిషి. "ఎవరు నువ్వు? ఎవరు చేశారీ పని? ఎందుకు?" గబగబా అడిగాడు గంగారాం.

చిన్నగా దగ్గాడు ఆ మనిషి. చేరెడు రక్తం పెదవుల చివర్ల నించి కిందికి జారింది. తన గుండెల్ని పట్టుకుని ఎవరో గట్టిగా నొక్కిన అనుభూతి కలిగింది షాడోకి.

బలంగా కనిపిస్తున్నయ్ అతని ఒంటి మీది కత్తిపోట్లు. రక్తం చాలా నష్టం అయిపోయింది. బ్లడ్ నోటిలో నించి కూడా వస్తోందంటే– ఆపైన ముందుకు సాగలేదు షాడో ఆలోచనలు. "ప్లీజ్... నన్ను కదిలించే ఆలోచన చేయాల్సిన అవసరం లేదు. నా పని అయిపోయింది..." అస్పష్టంగా వినవచ్చాయి అతని నుండి ఆ మాటలు.

"ఎవరివి భాయీ? నువ్వు ఎవరివి??" మరోసారి అతనిని గట్టిగా అడిగాడు గంగారాం.

"బింద్రా ఏరియాని బేస్‌గా చేసుకుని రైలు దొంగతనాలు, దురాగతాలు జరుగుతున్నాయని ఒక రిపోర్టు... నేను బింద్రాకి ట్రాన్స్‌ఫరయ్యాను. దురదృష్టమేమిటంటే" చెపుతూ మళ్ళీ బ్లడ్‌ని కక్కుకున్నాడు ఆ మనిషి.

"ఇతను రైల్వే పోలీస్..." షాడో వంక చూస్తూ అన్నాడు గంగారాం. ఆ మాటలు వినిపించాయి కోబోలు–

"కాదు... ఆర్డినరీ పోలీస్‌నే..." అంటూ ప్యాంటు జేబును తడుము కోవటానికి ట్రై చేశాడు.

శక్తి ఆల్‌మోస్ట్ అయిపోయింది... కొంచెంగానే కదిలింది చెయ్యి... అయినా సరే అతను అలా ప్రయత్నం చేస్తూ ఉండటాన్ని చూసి, తనే జేబులో చొరవగా చెయ్యి పెట్టి, ఒక వాలెట్‌ని మడతలు పెట్టి ఉన్న మరొక కాయితాన్ని బయటికి తీశాడు షాడో.

"రైల్వే మనకి చాలా అవసరం. ఆ వ్యవస్థ దెబ్బ తింటే మన జీవితాలు కూడా దెబ్బ తింటాయి. నేను ఇక్కడికి రావటం ఎవరికో ఇష్టం లేనట్టుంది. ఆ డెకాయిట్స్ ఎవరో ఈ చుట్టుపట్లే ఉండి ఉంటారు" అంటూ షాడో వంక ఆప్యాయంగా చూశాడు ఆ మనిషి.

"ఏమిటి బ్రదర్... ఇంకా ఏమైనా చెప్పాలా?" మృదువుగా అడిగాడు షాడో. మాట్లాడలేదు ఆ మనిషి. షాడోని అలాగే చూస్తూ ఉండిపోయాడు.

తన మాటలు అతనికి వినబడలేదేమోనన్న అనుమానంతో ముందుకు వంగబోయిన షాడో భుజం పట్టుకుని "అయిపోయాడు గురూ... పాపం ప్రాణాలు వదిలేశాడు" అని నెమ్మదైన స్వరంతో అన్నాడు గంగారాం.

అతనెవరో పూర్తిగా తెలియదు. రెండు నిముషాల క్రితం వరకూ ఎప్పుడూ అతన్ని చూసి ఉండలేదు. అయినా సరే చెమ్మగిల్లాయి షాడో కళ్ళు.

"ఇప్పుడు ఏం చేద్దాం గురూ?" నెమ్మదిగా అడిగాడు గంగారాం.

*   *   *   *   *

“వచ్చేశాడురోయ్... కొత్త ఇన్స్‌పెక్టర్ వచ్చేశాడు” చెవులు చిల్లులు పడిపోయేటట్టు అరుస్తూ వీధిలోకి వచ్చేశాడు కుందూ. ఇరవై సంవత్సరాల వయసు మాత్రమే ఉంటుందతనికి. కుడికాలు అవుటు. అందరూ కుంటి కుందూ అని పిలుస్తూ ఉంటారు.

బింద్రాలో ఉన్న ఒకే ఒక వీధిలో చిట్టచివరి ఇంట్లో ఏర్పాటు చేయబడిన పోలీస్ స్టేషన్‌కి క్లీనరు, వాచ్‌మేన్, చిన్నా చితకా పనులు చేసి పెట్టేది– అతనే.

వీధి మధ్యలో ఉన్న సారా కొట్టు దగ్గర కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న పది మంది పౌరుల్లో వచ్చింది చలనం.

“ఎలా ఉంటాడురా అతను? ఎంత వయసుంటుంది?” కుతూహలంగా అడిగాడు ఒకతను.

“కుర్రాడే... చూడటానికి చాకులా ఉన్నాడు. కాకపోతే చిన్న ఇబ్బంది” అన్నాడు కుందూ.

“ఏంటిరా అది?” కుతూహలంగా అడిగాడు పౌరుడు.

“బస్ దిగి అటూ ఇటూ చూడటానికి పొదల్లోకి పోయాట్ట లగేజిని ఎవరో కొట్టేశారట. ఇక్కడ ఉద్యోగం చేయమని ఇచ్చిన కాయితం తప్ప అతని దగ్గర ఇంకేమీ లేదు. కనీసం యూనిఫామ్ కూడా వేసుకోలేదు” ఏదో గొప్ప విషయాన్ని చెపుతున్నట్టు మొఖం పెట్టాడు కుందూ.

“పోరా బడుద్దాయ్... తన సామానే పోగొట్టుకునే వాడు ఇంకా మన సామానుల్ని ఎలా కాపాడుతాడురా? ఈ కొత్త ఇన్స్‌పెక్టర్ ఎవడో గాని ఎందుకూ

పనికిరాని జిడ్డులా ఉన్నాడు. పోయి నీ పని చూసుకో'' విషయాలన్నీ చెప్తున్న అతనిపై చిరాకు పడ్డాడు.

''అదేంటి? అందరూ వచ్చి రామ్ రామ్ చెప్పరా! నమస్కారాలు చెయ్యరా?'' ఆశ్చర్యంగా అడిగాడు కుందూ.

''ఏంటిరా చెప్పేది ఆ చేతకాని వాడికి... పోపో'' మరింత చిరాకుగా కసురుకున్నాడు ఆ పౌరుడు.

చిన్నబోయింది కుందూ మొఖం. కొత్త ఇన్స్పెక్టర్ వచ్చాడని చెప్పగానే అందరూ తనతో పాటు వచ్చి ఆయనకి నమస్కారాలు పెడతారని అనుకున్నాడతను.

''మీరెవరూ రాకపోతే... పోయి బిల్లూ కాకాకి చెపుతాను.... అతన్నే స్టేషన్‌కి తీసుకుపోతాను'' విసురుగా అంటూ సారా దుకాణానికి దగ్గర్లో ఉన్న ఒక సందులోకి పరిగెత్తాడు కుంటికాలిని ఎగరేసుకుంటూ.

కమ్మరి పని చేస్తాడు అతను చెప్పిన బిల్లూ కాకా. చక్రం ఊడిపోయిన ఒక ఎడ్ల బండిని రిపేర్ చేస్తూ తల ఎత్తి అతనికేసి చూశాడు.

''కొత్త ఇన్స్పెక్టర్ వచ్చేశాడు కాకా'' అతిగా ఎగ్జైట్ అవడం వల్ల కొంచెం ఆయాసంగా వగరుస్తూ చెప్పాడు కుందూ.

ఆరడుగుల మీద ఇంకో మూడు అంగుళాల ఎత్తు ఉంటాడు బిల్లూ కాకా, విశాలమైన భుజాలు, కండలు తిరిగిన శరీరం. వయసు అరవై దాటుతున్నా ఇంకా బలంగానే కనిపిస్తూ ఉంటాడు.

“కొత్తోళ్ళయినా, పాతోళ్ళయినా మనకి ఒరిగి ఒళ్ళో పడేది ఏమీ ఉండదురా కుందూ. పాత కథలే తిరిగి తిరిగి కనిపిస్తూ ఉంటయ్” తల వంచి తిరిగి తన పనిలో తను బిజీ అయిపోతూ చెప్పాడు అతను.

చిన్న బోయింది కుందూ ముఖం. తను చెప్పగానే అతను ఛెంగున లేచి నిలబడి స్టేషన్‌కి వస్తాడని అనుకున్నాడతను.

“అదేంటి కాకా... అట్టా మాట్టాడతావ్. పోలీస్ ఇన్స్‌పెక్టర్ అంటే న్యాయాన్ని, ధర్మాన్ని నిలబెట్టేవాడని నువ్వేగా చెప్పావ్?” నీరసం ధ్వనిస్తున్న మాటలతో అడిగాడు.

“ఒకప్పుడు రా... ఇప్పుడు కాదు. ఇరవై ఏళ్ళ నించీ చూస్తున్నాను, ముక్కుకు సూటిగా పోయేవాడు ఒక్కడు కూడా నాకు కనిపించలేదు. వచ్చిన రెండో క్షణం నించీ ప్రతివాడు తోతాపురి కాళ్ళు పట్టుకునేవాడే... లంచాలు మరిగి నీ లాంటి వాడిని, నా లాంటి వాడిని నిర్లక్ష్యం చేసేవాడే” బరువుగా నిట్టూరుస్తూ అన్నాడు బిల్లూకాకా.

అతను ఆ మాటలు అన్న తరువాత గుర్తుకు వచ్చింది కుందూకు– తను ఆ వార్తని ఇంకా తోతాపురికి విన్నవించలేదని. “భలే గుర్తు చేశావ్ కాకా... ఇప్పుడే వస్తాను” అంటూ గిరుక్కున వెనుతిరిగి, బింద్రా దక్షిణం పక్కకి ఒక్కసారిగా పరుగు మొదలు పెట్టాడు.

చేతుల్లో వున్న లావుపాటి సమ్మెటను కింద పడేసి, అతని వంక చూస్తూ గాఢంగా నిట్టూర్చాడు బిల్లూకాకా.

బింద్రాని దాటి బుల్జీ గ్రామం వెళ్ళే దారిలో పద్ధెనిమిది సంవత్సరాల క్రితం దోపిడీకి గురైంది కొత్తగా అటుకేసి వచ్చిన ఒక కుటుంబం. కర్రో కత్తో తీసుకుని ఎదురు తిరిగినట్లున్నాడు ఆ కుటుంబ యజమాని–

నిలబెట్టి నరికేశారు దొంగలు. ఆడవాళ్ళు ఇద్దరుంటే వాళ్ళని కూడా ఖతమ్ చేసేశారు. వాళ్ళ కంట పడకుండా ఎలా తప్పించుకున్నాడో ఏమోగాని, రెండేళ్ళ వయసున్న కుందూ ఒక్కడే ప్రాణాలతో బయటపడ గలిగాడు.

సంతానం లేనివారు చాలా మంది ఉన్నారు బుల్జీ గ్రామంలో. మొదటో అతన్ని తమ దగ్గిరికి చేరతీసినా, అతని అవిటితనాన్ని చూసి కొంచెం అసహ్యించుకున్నారు. అట్టా ఇట్టా చేసి బింద్రా చేరవేయబడ్డాడు అతను.

వాళ్ళు వీళ్ళు అందరూ చేరి తలా ఒక చెయ్యీ వేశారు. నెమ్మదిగా పెరిగి పెద్దవాడయినాడు కుందూ... తన బతుకు తను బతకడం నేర్చుకున్నాడు. ఎంత బిగపట్టుకున్నా ఆగకుండా మరోసారి గట్టిగా వెలువడింది బిల్లూ కాకా గుండెల్లో నించి ఇంకో పెద్ద నిట్టూర్పు.

"వస్తున్నాను ఇన్స్పెక్టరూ... నీ కోసం కాదు. కేవలం మా కుందూగాడు బాధపడకుండా ఉండటం కోసమే" అంటూ లేచి, ఒంటికి అంటిన దుమ్మును దులుపుకుంటూ స్టేషన్ వైపు బయలు దేరాడు.

*　　　*　　　*　　　*　　　*

పాకిస్తాన్ సైడు నుంచి బోర్డర్స్ దాటి వచ్చిన కరాచీ పొగాకు చుట్టని పళ్ళ కింద బిగపెట్టి గట్టిగా పొగ పీలుస్తున్న తోతాపురి చెక్కల బిల్డింగ్ దగ్గిర నిలబడి–

బిగ్గరిగా నమస్కారం పెట్టాడు కుందూ. “తోతాపురి సాబ్... కొత్త ఇన్స్పెక్టర్ స్టేషన్లోకి వచ్చాడు” అని అరిచాడు.

“పోరా... పొద్దున్నే ఏంటిరా నీ కాకి గోల....” అసహ్యంగా ముఖం పెట్టి విసురుగా అతనిని కసిరాడు చెక్కల బిల్డింగ్ని ఆనుకుని ఉన్న ఎత్తయిన అరుగు మీద విలాసవంతంగా కూర్చుని ఉన్న బద్రీనాథ్.

బాడీ గార్డు అతను తోతాపురికి. కుడి భుజం... ఎడమ భుజం ఇంకా మాట్లాడితే అతని తర్వాత అతనంత దర్జాని ఒలకబోసే పెద్ద మనిషి అతను.

“అది కాదు బద్రీనాథ్ సాబ్... కొత్తోళ్ళు స్టేషన్కి వస్తే వెంటనే వచ్చి చెప్పమని తోతాపురి సాబ్ ఆర్డర్. అందుకే వచ్చా” అతని వెక్కిరింపు చూపుల్ని ఏమాత్రం పట్టించు కోకుండా చెప్పాడు కుందూ.

“మాకు తెలుసు లేవోయ్... నువ్వు చెపితే తెలుసు కోవాల్సిన కర్మ ఇంకా మాకు పట్టలేదు. పో పో...” మరింత కరుకుగా హెచ్చరించాడు బద్రీనాథ్.

చింతాకంతయి పోయింది కుందూ ముఖం. కళ్ళల్లో గిర్రున తిరిగిన నీటిని బలవంతంగా అదుముకుంటూ వెనుతిరిగాడు. సరిగ్గా అదే సమయంలో కట్టడంలో నించి బయటికి వచ్చాడు తోతాపురి సాబ్. చేతిలో వున్న పొగాకు చుట్టని అవతలికి విసిరేస్తూ, “విన్నానురా కుందూ... నువ్వు ఒక పని చెయ్యాలి” అన్నాడు.

చిటికెలో మాయం అయిపోయింది కుందూ బాధ... “చెప్పండి సాబ్. ఏం చెయ్యమంటారో వెంటనే చెప్పండి” వెనక్కి తిరిగి ఉత్సాహంగా అన్నాడు.

“ఇప్పుడు నాకు తీరిక లేదు... సాయంత్రం ఒకసారి వచ్చి కనిపించమని చెప్పు మీ ఇన్స్పెక్టర్‌ని... చెపుతావా?” అడిగాడు తోతాపురి సాబ్. మరింత ఉత్సాహంగా తల ఊపాడు కుందూ... తన అవిటి కాలిని ఎగరేసుకుంటూ స్టేషన్‌కి పరుగు మొదలు పెట్టాడు.

* * * * *

“ఇది గ్రామం కాదు. ఎడారి... ఎవళ్ళు ఏమైపోయినా వీళ్ళకు పట్టదు” వీధిలోకి చూస్తూ అన్నాడు గంగారాం.

“ఓపిక పట్టండి గంగూభాయ్ గారూ... గ్రామంలోకి అడుగు పెట్టగానే ఎదురువచ్చి నీకు హంగు ఆర్భాటాలతో నమస్కారాలు చేయటానికి నువ్వు రాజకీయ నాయకుడివి కాదు...” అన్నాడు షాడో.

చెక్కలతో కట్టబడిన పెద్ద గోడవున్ వంటి కట్టడంలో ఏర్పాటు చేయబడి ఉంది పోలీస్ స్టేషన్. రెండు లాకప్ గదులు... ఒక చిన్న గది... విశాలమైన హాలు అంతే.

హాలు మధ్యలో ఉన్న కుర్చీలో కూర్చుని, ఎదురుగా ఉన్న టేబిల్ మీద కాళ్ళు పెట్టుకుని వెనక్కి వాలి కూర్చున్నాడు అతను. సిగరెట్‌ని వెలిగించుకుని పొగని రింగులు రింగులుగా సీలింగ్ వైపు వదులుతున్నాడు.

“అడుగో... ఎవరో భారీ పర్సనాలిటీ వస్తున్నాడు...” ఉన్నట్లుండి ఎలర్ట్ సిగ్నల్ ఇచ్చాడు వీధి గుమ్మం దగ్గిరే కుర్చీ వేసుకు కూర్చున్న గంగారాం.

టేబిల్ మీద పెట్టిన పాదాల్ని షాడో కిందకి దింపక ముందే, పెద్ద పెద్ద అడుగులతో లోపలికి వచ్చాడు బిల్లూ కాకా. వస్తూనే తానెవరో చెప్పుకున్నాడు. "మీ పేరేమిటో నాకు తెలియదు" అని అన్నాడు.

కనుచివరల నించి గంగారాం కేసి చూశాడు షాడో.

"ఇన్స్‌పెక్టర్ సాబ్ పేరు సంతోష్... అహ్మదాబాద్ దగ్గిర్నించి వచ్చారు... వెరీ స్ట్రిక్టు... మహా కోపం... జాగ్రత్తగా మాట్లాడండి" టేప్ రికార్డర్‌లా ఎనౌన్స్ చేశాడు.

టేబిల్ మీది పాదాలు కిందికి దిగకపోవటాన్ని చూడనట్టు నటిస్తూ నమస్కారం పెట్టాడు బిల్లూకాకా. "మీకు ఏవైనా అవసరం అయితే కుందూని పిలవండి..." అని చెప్పి అర్జంటుగా వెనక్కి వెళ్ళిపోయాడు.

"మన మీద కొంచెం కూడా సదభిప్రాయం ఏర్పడలేదు. ఎందుకు పనికిరాని చవటలమనే అనుకుంటున్నాడు" బిల్లూ కాకా మనసులోని మాటల్ని అర్థం చేసుకున్నాడు కాబోలు– నెమ్మదిగా కామెంట్ చేశాడు గంగారాం.

అదే సమయంలో యాక్టివేట్ అయింది ఆ హాల్లోనే ఒక గోడ దగ్గిర ఉన్న వైర్‌లెస్ సెట్టు. "ఇన్స్‌పెక్టర్ సంతోష్... ఇన్స్‌పెక్టర్ సంతోష్... ఆర్ యూ దేర్?" అదే పనిగా అడగటం మొదలు పెట్టింది ఒక కంఠం.

చివరికంటా కాలిన సిగరెట్‌ని కింద పడేసి, బూటు కాలితో నలుపుతూ గంగారాం కేసి చూశాడు షాడో.

"ఏం చేద్దాం? విషయం చెప్పి మన దారిన మనం పోదామా?" హడావుడిగా కుర్చీలో నుంచి పైకి లేచి ఆ సెట్ దగ్గిరికి పోతూ అడిగాడు గంగారాం.

"మేగ్జిమమ్ పది రోజులు... మహా అయితే ఇంకో వారం... అంతకు మించి ఇక్కడ ఉండటం ఇంపాజిబుల్" సాలోచనగా అతనిని చూస్తూ అన్నాడు షాడో.

నిర్మోహమాటంగా సెట్ మీది ఒక హేండిల్‌ని గిరగిరా తిప్పి, "ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కి తోడుగా వచ్చిన సివిలియన్ గంగూభాయ్‌ని మాట్లాడుతున్నాను. సంతోష్ సాబ్ అర్జెంటు కేసును అటెండవుతున్నారు. డ్యూటీలో చేరారు. రేపో ఎల్లుండో రిపోర్టును సబ్‌మిట్ చేస్తారు" అక్షరం అక్షరంలో అదో రకమైన ఠీవిని ప్రదర్శిస్తూ చెప్పాడు.

"ఓ.కే... పని అయిపోగానే అతన్నే మాట్లాడమని చెప్పు గంగూభాయ్... ఓవర్ అండ్ అవుట్" అంటూ కనెక్షన్‌ని కట్ చేసింది ఆ కంఠం.

"కనీసం అర డజను మంది కానిస్టేబిల్స్ ఇక్కడ పని చేయాలి... పంపిస్తామని గాని, ప్రాసెస్ చేస్తున్నామని గాని చెప్పడం లేదు... ఒకే ఒక మనిషి ఆ రైల్వే ప్రాబ్లమ్‌ని ఎలా సాల్వ్ చేస్తాడనుకుంటున్నారో?" తనలో తను అనుకుంటున్నట్టు పైకే అన్నాడు గంగారాం.

“ఎకస్ట్రాలు మాట్లాడితే రట్టు అయిపోతుంది మన గుట్టు... నోరు మూసుకో” విసుగ్గా అతన్ని హెచ్చరించాడు షాడో. కుర్చీలో సర్దుకు కూర్చోబోతుండగా– మళ్ళీ సుడిగాలిలా స్టేషన్లోకి వచ్చేశాడు అవిటి కుందూ.

“తోతాపురి సాబ్ అంటే ఈ చుట్టుపట్ల ఉన్న వాళ్ళందరి కంటె పెద్ద షావుకారు. సాయంత్రం మిమ్మల్ని కలుసుకోమని చెప్పారు” లోపలి కొస్తూనే ఎనౌన్స్ చేశాడు.

“ఆకలి దంచేస్తోంది కుందూ... మంచి భోజనం ఎక్కడ దొరుకుతుంది?” ఆ మాటల్ని పట్టించు కోకుండా అడిగాడు షాడో. “తుల్జీబాయి వంట బాగా చేస్తుంది. మహా రుచిగా ఉంటాయి రొట్టెలు, కుర్మా అయితే అబ్బో... నోరు ఊరినట్టు నాలుకను చప్పరిస్తూ చెప్పాడు కుందూ. అక్కడితో ఆగలేదు. చనువుగా “నన్ను వెళ్ళి తీసుకు రమ్మంటారా?” అని కూడా అడిగాడు.

“అవిటి వాడనే జాలి కూడా లేకుండా ఇతన్ని ఇష్టం వచ్చినట్టు ఉపయోగించు కునేవాళ్ళు కాబోలు... జీతం అంటూ ఏమైనా ఇచ్చారో లేదో” సానుభూతిగా చూస్తూ షాడోకి వినిపించేటట్లు అన్నాడు గంగారాం.

“అవన్నీ తర్వాత చూద్దాం... ముందు తిండి” అంటూ కుర్చీలో నించి పైకి లేచి, తుల్జీబాయి హోటల్‌కి దారి చూపించమని కుందూకి చెప్పాడు షాడో.

ఎగురుకుంటూ ముందు నడిచాడతను. పది నిముషాల తరువాత జమ్ము గడ్డితో కప్పబడిన ఒక పాకవంటి కట్టడం దగ్గిరికి వారిని తీసుకుపోయాడు.

నలుగురు యావరేజి ఫిమేల్స్‌ని ఒకటి చేస్తే ఎంత లావుగా కనిపిస్తారో అంతకు కొంచెం ఎక్కువ లావుగానే ఉన్నది చూడటానికి తుల్జీబాయి.

ఖాళీగా ఉన్న తన హోటల్లోకి ఎంటరైన షాడో, గంగారాంలని చూసి సంతోషించాల్సిన ఆమె చిరాకుగా మొఖం పెట్టడం ఆశ్చర్యాన్ని కలిగించింది గంగారాంకి.

“రొట్టెలు పది... కుర్మాపది. అన్నీ కలిపి ఇరవై అయిదు. ముందే ఇవ్వాలి... నా పద్ధతి అది. పోలీసులకంటూ వేరే పద్ధతులు లేవు...” నిర్మొహమాటంగా చెప్పిందామె.

మారు మాట్లాడకుండా పైజమా జేబులో నించి ఒక కరెన్సీ నోటును తీసి టేబిల్ మీద పెట్టాడు గంగారాం. “మూడు భోజనాలు...” అని ఆర్డర్ ఇచ్చాడు.

“మీరు ఇద్దరే కదా” విచిత్రంగా చూస్తూ అడిగిందామె.

హోటల్ గుమ్మందాకా స్పీడ్‌గా వచ్చిన కుందూ లోపలికి మాత్రం రాలేదు. బయటే నిలబడి ఉన్నాడు.

“లోపలికి రా బే... బయట ఏం చేస్తున్నావ్?” అతని వైపు చూస్తూ చిరాకుగా పిలిచాడు గంగారాం.

బెదురు చూపులు చూస్తూ వచ్చాడు కుందూ...

“ఎందుకు బే అంత భయం?” అడిగాడు గంగారాం.

“భయం కాకపోతే వేరే ఏముంటుంది? వాడినసలు మనిషిగా చూశారా? గాడిద చాకిరీ చేయించుకోవడం... తినగా మిగిలిన ఎంగిలి రొట్టె ముక్కలు వాడి

మొఖాన పడేయటం... మీ పోలీసులు అసలు మనుషులేనా?" చిరుకోపంతో చకచకా మాటలు వదిలేసింది తుల్జీబాయి.

"కూర్చో బే... కుదురుగా కూర్చో" ఆ మాటలు తనకు వినబడనట్టు కుందూకి ఆర్డర్ ఇచ్చాడు గంగారాం.

తుల్జీబాయి తెచ్చిన రొట్టెల ప్లేటులో నించి ఏకంగా ఆరు రొట్టెల్ని అతనికే ముందుగా వడ్డించాడు.

తుల్జీబాయి మొఖంలో చటుక్కున ప్రత్యక్షం అయిన ఆశ్చర్యాన్ని, మెచ్చుకోలును చూసి కూడా చూడనట్టు నటించాడు షాడో.

"ఇంతకు ముందు ఏం జరిగిందో తెలియదు గాని, ఇప్పటి నించీ కుందూ మా మనిషి. అతను ఎప్పుడు వచ్చి ఏమడిగినా నిస్సందేహంగా ఇచ్చేయ్. ఎంతైందో లెక్కరాసి నాకు పంపించు" అంటూ గంగారాంకి సైగ చేశాడు.

తుల్జీబాయి మొఖంలో మెచ్చుకోలు భావం మాయమై పోయి మళ్ళీ వెక్కిరింపు ప్రత్యక్షం అవబోయింది. "ఇదిగో... ఈ డబ్బు అడ్వాన్సుగా ఉంచుకో... అప్పు పెట్టాల్సిన అవసరంగాని, మేము బాకీలు ఎగ్గొడతామన్న భయంగాని నీకు అక్కర లేదు" నాలుగు పెద్ద నోట్లను తీసి ఆమె ముందు పడవేస్తూ చెప్పాడు గంగారాం.

తన కళ్ళను తానే నమ్మలేనట్టు చూసింది తుల్జీబాయి. ఏదో చెప్పటానికి నోరు తెరిచింది.

“చంపేస్తున్నాడు బాబోయ్... కొట్టేస్తున్నాడు నాయనోయ్” అంటూ ఒక స్త్రీ కంఠం గగ్గోలుగా విన్పించింది.

ఉలిక్కిపడి లేవబోయిన కుందూని “నువ్వు తింటూ ఉండు బే” అని వీధిలోకి పరిగెత్తాడు గంగారాం.

పాతిక సంవత్సరాల వయసుండే ఒక యువతి జుట్టు పట్టుకుని, ఇష్టం వచ్చినట్టు కొడుతూ లాక్కుపోవటానికి ట్రై చేస్తున్నాడు ఒక దృఢకాయుడు.

“ఏమిటి సంగతి?” అడిగాడు గంగారాం.

“వెయ్యి రూపాయలు అప్పు తీసుకుంది తోతాపురి సాబ్ దగ్గిర. తీర్చమంటే నకరాలు పోతోంది” చెప్పాడా మనిషి.

“ఎంతని తీర్చాలి సాబ్? ఇప్పటికి రెండు వేలు కట్టాను. అయినా సరే బాకీ అలాగే ఉండి పోయిందంటున్నారు” ఏడుస్తూనే చెప్పిందా యువతి.

“ఏంటే వాగుతున్నావ్? ఎవడే నీ మాట వినేది? రా” అంటూ మళ్ళీ లాగాడు ఆ దృఢకాయుడు.

పళ్ళు బిగించి అతని భుజం మీద బలంగా దెబ్బ వేయబోయాడు గంగారాం. అతను కదలక ముందే ఫెడీమని ఆ వ్యక్తి మొఖం మీద పడింది దెబ్బ. అంత ఎత్తు అంత లావున్న అతను కాస్తా తెగులు తగిలిన కోడిలా గిర్రున తిరిగి ముందుకు పడిపోయాడు.

“తీసుకుపోయి లాకప్ లోకి నెట్టు, నడి బజార్లో న్యూసెన్స్. ఆడపిల్ల చెయ్యి పట్టుకుని అల్లరి చేయడం... దెబ్బలు కొట్టి మర్డర్ చేయటానికి ప్రయత్నించటం...

ఇంకా ఏమైనా సెక్షన్స్ ఉంటే గుర్తు చేసుకుని రిపోర్ట్ రాసేయ్'' పిడికిలిని ప్యాంటుకేసి రుద్దుకుంటూ చెప్పాడు.

అంత లావున్న తోతాపురి మనిషి ఒకే ఒక దెబ్బకు కిందపడి కళ్ళు తేలవేయడం ఒక వింత అయితే, పొట్టిగా ఉన్న గంగారాం అతన్ని గడ్డిమోపును ఎత్తినట్టు ఎత్తి భుజం మీద వేసుకోవటం ఇంకో వింతైంది.

నోళ్ళు తెరుచుకుని చూస్తున్నారు గుమికూడిన జనం.

''నువ్వు వెళ్ళిపో... రేపు నీ వాళ్ళతో స్టేషన్‌కి రా'' అదిరిపోయి చూస్తున్న యువతికి చెప్పాడు షాడో.

''సాబ్... మీరేం చేస్తున్నారో మీకు తెలియదు. తోతాపురి సాబ్‌కి ఈ పని నచ్చదు'' తిరిగి, హోటల్లోకి పోబోతున్న షాడోకి హెచ్చరిక చేశాడు ఒక పౌరుడు.

తల ఊపి తన టేబిల్ దగ్గిరికి వెళ్ళిపోయాడు షాడో.

''పుట్టినప్పుడు ఎనుబోతు దూడలు మహా తెలివిగా ఉంటయ్. వయసు పెరిగిన కొద్దీ మడ్డితనం వచ్చేస్తుంది'' అంతా చూస్తున్న తుల్జీబాయి కామెంట్ చేసింది.

''నాకు అర్థం కాలేదు'' ముక్తసరిగా అన్నాడు షాడో.

''వచ్చినప్పుడు అందరూ ఇలాగే చేసేవారు. ఒకసారి తోతాపురిని కలిసిన తర్వాత గాని రంగు బయటపడదు'' స్పీడ్‌గా చెప్పి లోపలి గదిలోకి వెళ్ళిపోయిందామె.

గంగారాం వడ్డించిన రొట్టెలన్నిటినీ ఆరగించి, ఇంకా ఆకలి తీరనట్టు చూస్తున్న కుందూ ప్లేటులో ఇంకో నాలుగు రొట్టెల్ని వేశాడు షాడో. "తాపీగా తిను... నెమ్మదిగా రా..." అని చెప్పి తను బయటికి వచ్చాడు.

అతను స్టేషన్‌కి రావటం– అందమైన గుర్రబ్బండిలో తోతాపురి సాబ్ స్టేషన్‌కి రావటం ఒకేసారి జరిగింది.

ఒట్టి చేతులతో రాలేదతను. స్టాంపు పేపర్ మీద రాసి ఉన్న ఒక ప్రామిసరీ నోటును తీసుకువచ్చి టేబుల్ మీద పడవేశాడు. అతను వసూలు చేసే వడ్డీ న్యాయబద్ధమైనది కాదనే అవకాశం షాడోకి లభించలేదు. ఎందుకంటే పాతికవేలు తీసుకున్నట్టు ఉంది ఆ కాగితంలో.

"దారి డొంకా లేని ఊళ్ళు మావి... చీటికి మాటికి కోర్టుల కెళ్ళటం మాకే మాత్రం సాధ్యం కాదు" తన మనిషి చేసిన పనిని సమర్థిస్తూ చెప్పాడు.

"అయినా సరే... ఆడ మనిషిని హింసించటం అమానుషం" లాకప్ దగ్గిరే కూర్చున్న గంగారాం వెంటనే సమాధానం ఇచ్చాడు.

"ఏదైనా మాట్లాడటానికి అర్హత, అధికారం అనేవి రెండూ ఉండాలి. అవి మీకు లేవు" నిర్మొహమాటంగా అన్నాడు తోతాపురి సాబ్.

అనటంతో ఆగలేదు. తన వెనుక నిలబడి ఉన్న తన అనుచరుడి వంక చూశాడు. వెంట బెట్టుకు వచ్చిన చేతి సంచిలో నించి ఒక పోలీస్ యూనిఫామ్‌ని తీసి బయటపెట్టాడు అతను. అదే సంచీలో నించి పోలీస్ యూనిఫామ్‌లో స్మార్ట్‌గా నిలబడి ఉన్న ఒక ఇన్స్‌పెక్టర్ ఫోటోని కూడా తీశాడు. ఊపిరి ఆగిపోయిన

అనుభూతి షాడోని ఆవరించుకుంది. ఏం మాట్లాడాలో తెలియక నోరు వెళ్ళబెట్టాడు గంగారాం. తమ చేతుల్లో ప్రాణాలు వదిలిన ఇన్స్పెక్టర్ సంతోష్ ఫోటో అది.

“తోతాపురి సాబ్ స్వయంగా వచ్చాడంటే ఈ ఇన్స్పెక్టర్ పని అయిపోయినట్టే. మాట వింటే చంచా అవుతాడు. వినకపోతే ట్రాన్స్ఫర్ అయిపోతాడు” చిన్న కంఠంతో తన అభిప్రాయాన్ని వెల్లడించాడు స్టేషన్‌కి దూరంగా గుమికూడిన గ్రామస్థుల్లో ఒకతను.

“అదేం కాదు. మా కొత్త ఇన్స్పెక్టర్ నికార్సు... తోతాపురి సాబ్ మాట చెల్లనే చెల్లదు” మోకాళ్ళ దాకా ఉన్న జుబ్బా అంచుకి చేతుల్ని తుడుచుకుంటూ హోటల్లో నించి వచ్చిన కుందూ అభ్యంతరం చెప్పాడు.

“ఏదో ఒకసారి వెంట తీసుకుపోయి రెండు రొట్టెల్ని పెట్టించినంత మాత్రాన మంచివాడైపోడు... చూస్తూ ఉండు నీకే తెలుస్తుంది” అన్నాడా పౌరుడు.

చేస్తున్న పనిని మధ్యలో వదిలేసి వచ్చిన బిల్లూ కాకా వైపు చూశాడు కుందూ. అతను ఊహించినట్లు అతని తరఫున మాట్లాడలేదు బిల్లూ కాకా. “వాదనలు వద్దురా. పోయి పని చూసుకో” అని తన దారిన తాను వెళ్ళిపోయాడు.

చిన్నబోయి స్టేషన్ దగ్గిరికి బయలుదేరాడు కుందూ.

“మీరెవరో నాకు తెలియదు. పోలీసులు మాత్రం కాదు. బహుశా ఇన్స్పెక్టర్ సంతోష్‌ని చంపి అతని చోట్లో వచ్చి ఉంటారు” తనంతట తనే కుర్చీలో కూర్చుంటూ గంభీరంగా అన్నాడు తోతాపురి సాబ్.

నాటకం మొదలు పెట్టిన కొద్ది సేపటికే ఎదురు దెబ్బ ఎలా తగిలిందో ఊహించటానికి ట్రై చేస్తూ తల విదిలించాడు షాడో.

“లెక్క ప్రకారమైతే ఈ మాటని అందరికీ చెప్పి మీ ఇద్దర్నీ చెట్లకు కట్టి కొట్టించాలి. కాని నేను ఆ పని చేయను” తనంతట తానే మళ్ళీ చెప్పాడు ఆ పెద్ద మనిషి.

“అంత అభిమానం ఎందుకో?” ఎంత వద్దని అనుకున్నా వెక్కిరింపుగా మాట్లాడకుండా ఉండలేక పోయాడు గంగారాం.

“ఈ ఊరు నాది. ఈ ఏరియా నాది. నా ఇష్టం వచ్చిన పనులు చేస్తాను. నేను చేసిందే కరెక్టు. అర్థం అయిందా?” అడిగాడు తోతాపురి సాబ్.

“అంటే మేము నువ్వేం చేస్తే దానికి తలలు ఊపేయాలా?” ఎదురు ప్రశ్న వేశాడు గంగారాం.

“వేరే దారి లేదు. మీరు ఎందుకు వచ్చారో నాకు తెలియదు. నేను చెప్పినట్టు వింటేనే మీ విషయం గుట్టుగా ఉంటుంది. లేకపోతే గొడవ అయిపోతుంది” ఖచ్చితమైన కంఠంతో చెప్పి కుర్చీ వెనక్కి వాలి కూర్చున్నాడు తోతాపురి. షాడో వంక క్రీగంట చూశాడు గంగారాం.

తల ఊపాడు షాడో. “ఊరికే ఎవరి మాటా వినం. ఏదో ఒక లాభం ఉండాల్సిందే” అన్నాడు.

“అదీ అసలయిన మాట... దండిగా ముట్ట చెపుతాను. దీనిలో సందేహం అవసరం లేదు” సంతోషంగా అంటూ కుర్చీలో నించి లేచాడు తోతాపురి.

“సంతోష్ లగేజి పంపిస్తాను. ఉపయోగపడితే చాలా సంతోషం” అంటూ బయటికి వెళ్ళిపోయాడు.

“సంతోష్‌ని పొడిపించింది వీడే. సందేహం లేదు” అన్నాడు గంగారాం.

“ఎందుకో తెలుసుకోవాలి. అంత వరకూ కామ్” అంటూ సిగరెట్ వెలగించు కున్నాడు షాడో. ఏదో మాట్లాడబోయాడు గంగారాం. అవిటి కుందూ స్టేషన్లోకి రావటంతో ఆగిపోయాడు.

* * * * *

ఎప్పుడో స్వాతంత్ర్యం రాకముందు ఒక సైకిల్‌ని కొన్నాడు బిల్లూ కాకా. గట్టిగా తొక్కితే విరిగిపోయేటట్టు కనిపిస్తున్న పెడల్స్‌ని జాగ్రత్తగా ఆపరేట్ చేస్తూ బింద్రా గ్రామం కొండ గుట్ట దగ్గిరికి పోయాడు షాడో.

“అదే గూడెం... బుల్జీ అవతల ఉండే పొదల్లో నుంచి వచ్చి ఇక్కడి గుడిసెలు వేసుకున్నారు చాలా మంది. తక్కువ వాళ్ళని చెప్పి గ్రామంలో ఇళ్ళు కట్టుకోనీయలేదు” గుట్ట అవతలి పక్కన ఉన్న గుడిసెల్ని చూపిస్తూ చెప్పాడు సైకిల్ వెనుక కూర్చున్న అవిటి కుందూ.

తను చెప్పిన ప్రకారం ఇన్స్‌పెక్టర్ సంతోష్ లగేజిని స్టేషన్‌కి పంపించాడు తోతాపురి. ప్యాంటు కొంచెం టైటు, షర్టు గుండీలు పట్టకపోవడం తప్ప అటు ఇటుగా షాడోకి సరిపోయింది యూనిఫాం.

“నువ్వు నా హెడ్ కానిస్టేబిల్‌వి... స్టేషన్ బాగోగులు నీవే” గంగారాకి చెప్పి బయలుదేరాడు అతను.

లాకప్‌లో ఉన్న తోతాపురి మనిషికి ఒక చాయ్ తెప్పించి ఇచ్చాడు గంగారాం. “మనం మనం ఒకటి అని తెలియక పట్టుకొచ్చాం. మరేమీ అనుకోబోకు. ఇంకోసారి ఎవరి జుట్టయినా పట్టుకోదలుచుకుంటే నాకు చెప్పు. సహాయం చేస్తాను” అంటూ బయటికి పంపించాడు. అంతకు ముందు మాదిరి గుంపుగా నిలబడి చూడలేదుగాని, ఒక కన్ను స్టేషన్ మీదే వేశారు బింద్రా పౌరులు.

“అదుగో... వచ్చేశాడు. నా మాటే నిజం... ఈ ఇన్స్‌పెక్టర్ కూడా లొంగిపోయాడు” వెక్కిరింపుగా అన్నాడు అంతకు ముందు తన అభిప్రాయాన్ని వెల్లడించిన పౌరుడు. బిల్లూ కాకా దగ్గరున్న పాత సైకిల్ కోసం పోతున్న కుందూకి గుచ్చుకున్నాయి ఆ మాటలు.

“నోరు తెరిచి ఒక్క మాటైనా మాట్లాడక ముందే అందరూ అసహ్యించుకుంటున్నారు మా ఇన్స్‌పెక్టర్ సాబ్‌ని... అన్యాయం కదా...” కొలిమి దగ్గిర కూర్చుని బీడీ కాల్చుకుంటున్న బిల్లూ కాకాతో చెప్పాడు కుందూ. తన యజమాని ఎటువంటి వాడైనా విశ్వాసం చూపించే కుక్కలు గుర్తుకు వచ్చాయి వెంటనే బిల్లూ కాకాకి. “కడుపు నిండా నీకు తిండి పెట్టించినంత మాత్రాన అతను మంచివాడని అనుకోవడం కుదరదురా... మంచి తనం అనే మాటకి అర్థాలు వేరే చాలా ఉన్నాయ్...” అతని తల నిమురుతూ చెప్పాడు.

“అవేమిటో చెప్పు. మా ఇన్స్‌పెక్టర్ సాబ్ మంచివాడో కాదో నేనే చెపుతాను” ఉత్సాహంగా అన్నాడు కుందూ.

“ఇప్పుడు కాదులే... తీరిగ్గా ఉన్నప్పుడు మాట్లాడుకుందాం... ఇంతకీ ఎందుకు వచ్చావ్?” అన్నాడు కాకా.

“సైకిల్ కావాలి కాకా... పాపం నడిచి వచ్చాడు... వాహనం ఏదీ వెంట తెచ్చుకోలేదు” చెప్పాడు కుందూ.

“తోతాపురి సాబ్‌కి కబురు చేస్తే టాంగాల దగ్గర్నించి జీప్ కార్ల వరకూ చిటికెలో వచ్చేస్తాయి కదా... నా డొక్కు సైకిల్‌తో పనేంటి?” ఆశ్చర్యంగా అడిగాడు కాకా.

“నేను కూడా అదే మాట చెప్పాను... ఆ సుఖాలు మన ఒంటికి సరిపడవు అన్నాడు” నవ్వుతూ చెప్పాడు కుందూ. చెప్పటంతో ఆగకుండా కొంచెం అవతల ఒక గోడకి ఆనించి వున్న సైకిల్ దగ్గరికి పోయాడు.

మొట్ట మొదటిసారిగా బిల్లూకాకా మనసులో అడుగు పెట్టింది మొదటి మాట... తోతాపురి దగ్గర దేబిరింపులంటే అసహ్యమా కొత్త ఇన్స్‌పెక్టర్‌కి!

అతని మనసులోని ఆలోచనల్ని గ్రహించలేని కుందూ, సైకిల్‌ని నడిపించుకుంటూ స్టేషన్ దగ్గిరికి వెళ్ళిపోయాడు. అతన్ని వెనకాల కూర్చోబెట్టుకుని సైకిల్ని వేగంగా గ్రామం వెలుపలికి పోనిచ్చాడు షాడో.

ఇప్పుడు గుట్టకి ఆవలి పక్కన ఉన్న గుడిసెల్ని చూపిస్తూ కుందూ చెప్పిన మాటలు అతని ఆలోచనలో పడేశాయి.

“వాళ్ళు కూడా బింద్రా కిందికే వస్తారు కదా?” అని అతని వైపు చూస్తూ అడిగాడు.

“ఊరికే రావడం కాదు... పంచాయితీకి పన్నులు కూడా కడుతూ ఉంటారు” చెప్పాడు కుందూ.

“అయితే ఒకసారి అక్కడికి వెళ్ళి రావాల్సిందే” అంటూ సైకిల్‌ని అటుకేసి నడిపించబోయిన షాడోని వెంటనే ఆపేశాడు కుందూ... “చీకటి పడబోతోంది. అక్కడ అందరూ సారా తాగి గంతులు వేస్తూ ఉంటారు. పోలీసులు కనబడితే అల్లరి చేసేస్తారు...” అన్నాడు.

“మామూలు పోలీసయితే అల్లరి చెయ్యటం తేలిక... మరి తోతాపురి సాబ్‌కి చెందిన పోలీసుల్ని కూడా చేస్తారా?” నవ్వుతూ అడిగాడు షాడో.

సమాధానం చెప్పలేకపోయాడు కుందూ... “అదీ... అదీ...” అంటూ నీళ్ళు నమలడం మొదలుపెట్టాడు.

“ఓ.కే. కుందూ... అనుభవం కలవాడివి నువ్వు. నీ మాటని కాదని అనలేను. రేపు ఎప్పుడయినా ఇంకోసారి వద్దాం” అంటూ అతన్ని కూర్చోబెట్టుకుని అక్కడి నుంచి వెనక్కి బయలుదేరాడు షాడో.

గ్రామంలోకి ఎంటర్ అవుతూ ఉండగానే గాలివాలున అతని చెవికి చేరింది ఒక గోల. పెద్ద పెద్ద అరుపులు. ఢాం ఢాం అంటూ శబ్దాలు... “అయ్యబాబోయ్... తుల్జీబాయి హోటల్ దగ్గిర్నించి... అక్కడ మళ్ళీ ఏదో గోల మొదలైంది” ఆందోళనగా అంటున్న కుందూ మాటల్ని వినిపించుకోకుండా సైకిల్ని వేగంగా తొక్కాడు షాడో.

కుందూ మాటలే నిజమయ్యాయి. పాతిక మంది కొత్త మనుషులు తుల్జీబాయి హోటల్ దగ్గిర చేరి గొంతులు చిరిగిపోయేటట్టు అరుస్తూ, ఒకరినొకరు కుమ్ముకుంటున్నారు. సగం ధ్వంసం అయిపోయింది హోటల్... అరడజను బల్లలు, బెంచీలు విరిగిపోయినయ్... గ్లాసులు, ప్లేట్సు సొట్టలు పడి కింద పొర్లాడుతున్నాయి.

"ఒరేయ్... ఒరేయ్... ఆగండిరా... ఆగిపోండిరా... మీ కచ్చల్లో పడి నన్ను ముంచేయకండిరా" బావురు బావురుమని ఏడుస్తూ వారిని అడ్డుకోవటానికి ప్రయత్నం చేస్తోంది తుల్జీబాయి. హోటల్ పాతిక అడుగుల దూరంలో ఉందనగానే సైకిల్ దిగి, ఆ సైకిల్‌ని కుందూకి అప్పగించి, వేగంగా ఆ గుంపు దగ్గిరికి వచ్చేశాడు షాడో.

కచ్ ఏరియా చిత్తడి నేలల్లో రకరకాల పక్షులు, చిత్ర విచిత్రమైన జంతువులు తిరుగాడుతూ ఉంటాయి. వాటిని వేటాడటమే వృత్తిగా జీవించేవారు కోకొల్లలు.

కరుకు వాతావరణాల్లో నివశించే వారి మనస్తత్వాలు కూడా అదే మాదిరి కరుకుగా ఉంటాయి.

"ఆగండి... అందరూ ఆగండి..." గుంపు దగ్గిరికి రాగానే పెద్ద కంఠంతో అందరికీ వినిపించేటట్టు కమాండ్ చేశాడు షాడో. ఫట్ మంటూ పడింది అతని వెన్నుమీద బలమైన దెబ్బ ఒకటి. బ్యాలెన్స్ నిలుపు కోవడం చేత కాలేదు షాడోకి. బుల్‌డోజర్ వచ్చి వెనకాల్నించి కొట్టినట్టు తూలి బోర్లా పడిపోయాడు. "కొట్టండి... మళ్ళీ లేవకుండా విరగ బాదేయండి" అరిచాడు ఎవరో...

మందపాటి లెదర్‌తో చేయబడిన పాదరక్షలు రెండు షాడో భుజాలకి కనెక్ట్ అయ్యాయి.

కరెంట్ షాక్ కొట్టినట్టు నాలుగు అంగుళాలు పైకి లేచి మళ్ళీ నేలను కౌగలించుకున్నాడు షాడో.

*        *        *        *        *

పోలీస్ స్టేషన్‌కి దగ్గిరిగా ఉన్న ఒక పచారీ దుకాణంలో నించి రెండు బ్రెడ్ ప్యాకెట్లను తెచ్చుకున్నాడు గంగారాం. ఆ దుకాణం పక్కనే ఉన్న చాయ్ షాపులో నించి రెండు గ్లాసుల నిండా టీ పోయించుకున్నాడు.

స్టేషన్ ముఖ ద్వారంలో కుర్చీ వేసుకుని బ్రెడ్ స్లయిస్‌ని టీలో ముంచుకుని ఆప్యాయంగా ఆరగిస్తున్నాడు. బిల్లూ కాకా పాత సైకిల్‌ని పట్టుకుని బలంగా నెట్టుకుంటూ అతని దగ్గిరికి పరిగెత్తుకు వచ్చాడు కుందూ.

"చంపేస్తున్నారు... షబాబా హంటర్స్ ఇన్స్‌పెక్టర్ సాబ్‌ని కింద పడేసి తన్నేస్తున్నారు" వగరుస్తూ రిపోర్ట్ చేశాడు. చేతుల్లో ఉన్న బ్రెడ్ ముక్కల్ని, చాయ్ గ్లాసుని అవతలికి విసిరేసి, స్టేషన్ గోడకి వేలాడుతున్న పెద్ద తుపాకీ దగ్గిరికి దూసుకుపోతాడని అనుకున్న అతనికి, వెంటనే కలిగింది విపరీతమైన ఆశ్చర్యం.

కుర్చీలో నించి లేవడం కాదు గదా... కనులెత్తి సీరియస్‌గా కూడా చూడలేదు ఆ పొట్టి పర్సనాలిటీ.

"మరేం పరవాలేదు బే కుందూ... ఇన్స్‌పెక్టర్ సాబ్‌కి అటువంటివన్నీ మామూలే" అని మాత్రం చెప్పి తన పనిలో తను బిజీ అయిపోయాడు.

"షబాబా హంటర్స్ అంటే మామూలోళ్ళు కాదు... చిత్తడి నేలల్లోకి పారిపోయారంటే వాళ్ళని పట్టుకోవడం దేవుడికి కూడా ఏమాత్రం సాధ్యపడదు" అతన్ని కన్విన్స్ చేయడానికి ప్రయత్నించాడు కుందూ.

అప్పటికి కూడా రాలేదు చలనం ఆ పొట్టి పర్సనాలిటీలో "డోన్ట్ వర్రీ బే... కావాలంటే అక్కడికే వెళ్ళిచూడు... నీకే అర్థం అవుతుంది" మరింత కామ్‌గా చెప్పాడు.

బిల్లూ కాకా సైకిల్‌ని ఏదైనా గోడకి ఆనించి నిలబెట్టాలనే మాటని మర్చిపోయి అలాగే వదిలేశాడు కుందూ. అది కింద పడిపోయి, విరిగి పోతున్నట్టు వికృత శబ్దం వినవచ్చినా లెక్క చేయకుండా వెనక్కి పరిగెత్తాడు.

గ్రామంలో మూడొంతుల మంది జనం తుల్జీబాయి హోటల్ దగ్గరే చేరుకుని కనిపించారతనికి. అడ్డం వచ్చిన వారిని మర్యాదగా పక్కకి నెడుతూ గుంపు ముందు వరసలోకి పోయి చిన్న సైజు ఎర్రతేలు కుట్టినట్టు అదిరి పడ్డాడతను. మొట్టమొదటి దెబ్బకే నేలను కౌగిలించుకున్న ఇన్స్‌పెక్టర్ సాబ్. ఇప్పుడు కనిపించ లేదతనికి నేలమీద, ఒంటికి అంటుకున్న దుమ్మును కూడా వదిలించుకోకుండా, పూనకం వచ్చిన వాడిలా విరగబడి పోతున్నాడు.

గవర్నమెంటు ఇచ్చిన పవర్ ఫుల్ రివాల్వర్ ఉంది అతని బెల్టులో. తన మీదికి వచ్చిన వారిని దానితో చెల్లాచెదరు చేయవచ్చు. అయినా దాన్ని బయటికి తీయడం లేదతను. ఒట్టి పిడికిళ్ళతోనే ఆ హంటర్స్‌ని రేవు పెట్టి ఉతికేస్తున్నాడు. "కొట్టండిరోయ్... కొట్టేయండి" జీరపడిన గొంతులతో ఒకరి నొకరు

హెచ్చరించుకుంటూ అతన్ని ఇంకోసారి నేలమీదికి దొర్లించటానికి ఏమాత్రం శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తున్నారు వాళ్ళు.

కుందూ చూస్తూ చూస్తూ ఉండగానే కింద పడిపోయారు అరడజను మంది. మరో నిముషం గడిచేసరికి ఒక్క హంటర్ కూడా నిలబడి కనిపించలేదు.

అప్పుడు– అందరూ కింద పడినప్పుడు బెల్టులోనించి రివాల్వర్ని తీసి గుండెలు జలదరించేటట్టు పెద్ద శబ్దంతో గాలిలోకి పేల్చాడు ఇన్స్పెక్టర్ సాబ్.

ఆ శబ్దాన్ని భరించటం కింద పడిపోయిన వాళ్ళకే కాదు గుమిగూడిన జనానికీ చేతకాలేదు. కూడబలుక్కుని చేసినట్టు ఒకేసారి చెవులు మూసుకున్నారు అందరూ...

"పైకి ఎవడైనా లేచాడంటే ఖబర్దార్... కాల్చి అవతల పారేస్తాను... అర్థం అయిందా?" పొగలు విడుస్తున్న రివాల్వర్ని అలాగే పైకి ఎత్తి పట్టుకుంటూ హంటర్స్ని ఉద్దేశించి గట్టిగా అరిచాడు ఇన్స్పెక్టర్ సాబ్.

మనిషి అనేవాడి మాటల్ని ఎప్పుడూ లెక్కచెయ్యని ఆ హంటర్స్లో ఒక్కడు కూడా తల ఎత్తి చూడలేదు... పడినవాళ్ళు పడినట్టే ఉండిపోయారు. "ఎందుకు? ఎందుకు జరిగింది ఈ గోల? ఎందుకు?" రివాల్వర్ని కిందికి దించి బెల్టులో పెట్టుకుంటూ అడిగాడు ఇన్స్పెక్టర్ సాబ్.

"వీళ్ళకి ఇవన్నీ మామూలే సాబ్... జేబుల నిండా డబ్బులున్నప్పుడు తెగ తాగి ఒకళ్ళతో గొడవలు పడుతూ ఉంటారు" గుంపులో నించి తన మొఖం కనిపించకుండా జాగ్రత్త పడుతూ చెప్పాడు పౌరుడు.

“మీలో మీరు గొడవలు పడితే నాకేమీ నష్టం లేదు. ఈ డోన్ట్ కేర్... కాని ఇప్పుడు మీరు పడిన గొడవ రిజల్టు ఏమిటో చూడండి” నాశనమై పోయిన తుల్జీబాయి హోటల్‌ని, ఫర్నీచర్‌ని పాత్ర సామానుల్ని వారందరికీ చూపిస్తూ పెద్ద గొంతుతో అన్నాడు ఇన్స్‌పెక్టర్ సాబ్.

“పొరపాటు అయిపోయింది సాబ్... మాది తప్పే” సారామత్తు కొంచెం కంట్రోల్ అయింది కాబోలు నెమ్మదైన స్వరంతో అన్నాడు ఒక హంటర్.

“తప్పయిపోయిందని కామ్‌గా చెపితే సరిపోదు... నష్టాన్ని మీరే యిచ్చుకోవాలి... జరిగిన నష్టం పూడ్చాలి” అంటూ హోటల్ గుమ్మంలో నిలబడి ఉన్న తుల్జీబాయి వంక చూశాడు ఇన్స్‌పెక్టర్ సాబ్. “చెప్పమ్మా.. ఎంత అయింది నష్టం?” అని అడిగాడు.

గొడవ చల్లారగానే ఎవరిదారిన వారు వెళ్ళిపోకుండా... ఇప్పుడు కొత్తగా స్టార్ట్ చేసిన టాపిక్‌ని వినేసరికి విపరీతమైన ఆశ్చర్యానికి గురి అయిందామె. ఏం సమాధానం చెప్పాలో తెలియక అయోమయంగా చూసింది.

“కుందూ? ఓయ్ కుందూ?” చుట్టూ చూస్తూ పెద్దదైన స్వరంతో పిలిచాడు ఇన్స్‌పెక్టర్.

అవిటికాలిని ఎగరేసుకుంటూ మూడంటే మూడు అంగల్లో అతని దగ్గరికి పోయాడు కుందూ.

“జరిగిన డామేజిని అంచనా వెయ్... ఎంత ఉంటుందో వెంటనే చెప్పు” ఆర్డర్ ఇచ్చాడు ఇన్స్‌పెక్టర్.

హోటల్లోకి పరిగెత్తాడు కుందూ... నాశనమైపోయిన సరంజామానంతా కళ్ళతోనే అంచనావేసి, “దగ్గరి దగ్గరిగా ఐదువేలు ఉంటుంది సాబ్” అని రిపోర్ట్ చేశాడు.

“ఆ నష్టాన్ని ఈ దండర్‌హెడ్స్ అందరూ యిచ్చుకోవాలి. ఒక్కొక్కళ్ళకి ఎంత పడుతుంది?” అడిగాడు.

కిందపడి వున్న హంటర్స్ అందర్నీ చూసి మనసులోనే గబగబా లెక్కకట్టి “తలకి రెండొందలు...” అని చెప్పాడు కుందూ.

“శభాష్ కుందూ... లెక్కల్లో నువ్వు మొనగాడివి” అంటూ అతన్ని మెచ్చుకుని, హంటర్స్ వైపు తిరిగాడు షాడో. అతను పనికట్టుకుని ప్రత్యేకంగా ఏం చేయాలో చెప్పాల్సిన అవసరం లేకుండా పోయింది.

“చాలామంది పోలీసోళ్ళని చూశాం. ఇప్పుడు ఇంకెవరైనా ఇక్కడ ఉండి ఉంటే మమ్మల్ని స్టేషన్‌కి లాక్కుపోయి మా జేబులు ఖాళీ చేసి ఊచల వెనక్కి నెట్టి కూర్చునేవాళ్ళు. కేసు పెట్టకుండా ఉండటానికి ఇంకా ఇంకా కావాలనేవాళ్ళు. నువ్వు మాత్రం చాలా కొత్త...” అంటూ పైకి లేచాడు ఒక హంటర్.

“తీయండిరా. ఇన్స్‌పెక్టర్ సాబ్ వేయించిన లెక్కకి ఇంకో వంద ఎక్కువగా ఇవ్వండి. ఎప్పుడొచ్చినా లేదనకుండా వేడి వేడిగా వడ్డించే తుల్జీబాయికి మాఫీ మాంగో” అని అందరికీ చెప్పాడు.

తగిలిన దెబ్బలకు తడుముకుంటూ పైకి లేచారు అందరూ. దుస్తుల్లో చేతులు పెట్టి వందలకు వందల నోట్లు బయటికి తీసి కుందూకి అందించారు.

“తప్పయిపోయింది తుల్జీబాయి. ఇంకా ఏమైనా అవసరం అయితే... గుర్తు పెట్టుకుని ఈసారి వచ్చినప్పుడు అడుగు. ఇచ్చేస్తాం. తాగిన మత్తులో ఏదో చేసేశాం. మనసులో పెట్టుకోకు” అన్నాడొక హంటర్.

తన కళ్ళను తనే నమ్మలేనట్టు చూస్తోంది తుల్జీబాయి. షబాబా హంటర్స్ ఎవర్నయినా మాఫీ అడగడమా? చేసిన తప్పుల్ని పబ్లిగ్గా ఒప్పుకోవడమా?

“అది మా పద్ధతి కాదు, నిజమే. కాని మీ కొత్త ఇన్స్పెక్టర్ పద్ధతి మాకు నచ్చింది. ఇదిగో ఇన్స్పెక్టర్ సాబ్... ఏదైనా అవసరం పడితే కబురు చేయండి. వందమందికి పైగా ఉన్నాం. రెక్కలు కట్టుకుని వచ్చేస్తాం” అంటూ గ్రామం వెలుపలికి బయలుదేరాడు మొదటి హంటర్. ఒకరి వెనుక ఒకరుగా వాళ్ళందరూ బయలుదేరిన తరువాత, తను స్టేషన్‌వైపు కదలబోయాడు ఇన్స్పెక్టర్.

“ఒకసారి లోపలికి రా ఇన్స్పెక్టరూ” కుందూ తన చేతుల్లో పెట్టిన నోట్ల వంక చూసుకోను కూడా చూసుకోకుండా ఇన్స్పెక్టర్‌ని పిలిచింది తుల్జీబాయి.

“గొడవ అయిపోయింది. వింత చూడటానికి ఇక్కడ ఏమీ లేదు. ఇక్కడి నుండి వెళ్ళిపొండి అందరూ” అవతలికి పోకుండా అలాగే నిలబడి ఉన్న బింద్రా పౌరులను హెచ్చరించాడు ఇన్స్పెక్టర్ సాబ్.

అయిష్టంగానే కదిలి ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు వాళ్ళందరూ.. నోరు తెరుచుకు చూస్తున్న కుందూ వంక చూసి చిన్నగా నవ్వాడు షాడో. భుజం మీద చెయ్యి వేసి తనతో పాటు లోపలికి తీసుకుపోయాడు.

చిన్న స్టీల్ గ్లాసులో నల్లటి కాషాయం వంటి ద్రవాన్ని పోసి తీసుకువచ్చింది తుల్జీబాయి.... "ఇది తాగు... తగిలిన దెబ్బలు ఏవైనా బరువు చేయదలుచుకుంటే ఆపేస్తుంది" అంటూ చనువుగా షాడో నోట్లోకి వంపింది.

గొంతంతా మండిపోయిన సెన్సేషన్‌ని అతి బలవంతంగా అదుముకుంటూ చిరునవ్వు నవ్వాడు షాడో.

"మంచిగా మాట్లాడారని ఆ దగుల్బాజీల్ని నమ్మబోకు. అసలు ఈ చుట్టుపట్ల జరిగే రైలు దొంగతనాలన్నీ వాళ్ళ పనే అనుకుంటూ ఉంటారు అందరూ..." చిన్న కంఠంతో అతన్ని హెచ్చరించింది తుల్జీబాయి.

చిటికెలో ఎలర్ట్ అయిపోయాడు షాడో... ఇంకా కొన్ని వివరాలు ఆమె చెపుతుందేమోనని ఎదురుచూశాడు కాని, ఆ తర్వాత ఒక్కమాట మాట్లాడ లేదామె. చకచకా చాయ్ తయారుచేసి, అతనికి, కుందూకి ఇచ్చింది.

*　　*　　*　　*　　*

రాత్రి పదిగంటల సమయంలో స్టేషన్ దగ్గరికి వచ్చి గుమ్మానికి అడ్డంగా పడుకుని ఉన్న గంగారాంని నిద్ర లేపాడు తోతాపురి సాబ్ రైట్ హేండ్ అయినటువంటి బద్రీనాథ్ "అయ్యగారు అర్జంటుగా రమ్మనమని చెప్పారు. ఆలస్యం చేయటానికి వీలులేదు... ఇన్స్‌పెక్టర్‌ని నిద్రలేపు" అని హెచ్చరించాడు అతను.

తన టేబిల్ దగ్గరే ఒక చెక్కబల్లమీద పడుకున్న షాడోని గబగబా నిద్ర లేపాడు గంగారాం....

"నన్ను కూడా రమ్మంటావా?" అని అడిగాడు.

"అవసరం అయితే వద్దువుగానీ... ఇప్పుడు వద్దు..." అంటూ స్టేషన్ వెలుపలికి వచ్చాడు షాడో.

రెడీగా ఉన్న టాంగాలో కూర్చున్నాడు.

అరగంట తర్వాత ఊరిని ఆనుకుని ఉన్న ఒక పెద్ద చెట్లతోపు దగ్గరికి అతన్ని తీసుకుపోయింది ఆ టాంగా.

నలుగురు అనుచరులు వెనకాల నిలబడి ఉండగా అసహనంగా అటూ ఇటూ పచార్లు చేస్తూ అక్కడ కనిపించాడు అతనికి తోతాపురి సాబ్.

"ఈ తోపులో రెండు రోజులకు ఒకసారి నేను పేకముక్కలు ఆడే ఆటను ఏర్పాటు చేస్తాను... చుట్టుపట్ల గ్రామాల నించి చాలామంది వస్తారు... ఇవ్వాళ బుల్జీ నుంచి వచ్చిన నారంగ్ అదే పనిగా గెలిచేస్తున్నాడు... అది మనకి నష్టం" షాడోని చూడగానే అన్నాడతను.

"నష్టపోయేది ఆడేవాళ్ళు. నువ్వు కాదు" అన్నాడు.

"ఆ నారంగ్‌తో ఆడుతోంది మనవాళ్ళే. మన డబ్బుతోనే ఆడుతున్నారు... ఆ నష్టం అంతా మనదే. వెళ్ళు.... వెళ్ళి వాడు మోసం చేస్తున్నాడని అరెస్టుచెయ్..." మరింత అసహనంగా అన్నాడు తోతాపురి.

"కార్డ్ ఆడటమంటేనే నేరం... అందరినీ అరెస్టు చేయాలి. అతన్ని ఒక్కడినే పట్టుకోవడం కుదరదు" సీరియస్‌గా చెప్పాడు షాడో.

"అదంతా నాకు తెలియదు. ఇవాళ వాడు ఆడకూడదు. ఆ మాట నేను అనకూడదు. నువ్వు ఏం చేస్తావో వెంటనే చెయ్యి. ఇప్పటికేవాడు అరవై వేలు

కొట్టేశాడు...” ఖచ్చితమైన కంఠంతో చెప్పాడు తోతాపురి. అంతటితో ఆగలేదతను. “మన ఒప్పందం మర్చిపోకు” అని అన్నాడు.

చెప్పిన పనిని వెంటనే చెయ్యకపోతే అతను సంతోష్ కాదని తను అహ్మదాబాద్‌కి వార్త పంపిస్తానని చెప్పే హెచ్చరిక అది. గట్టిగా నిట్టూర్చి చెట్లతోపులోకి ఎంటర్ అయ్యాడు షాడో... సూటిగా ఆటగాళ్ళ దగ్గరికి పోలేదతను. నడుస్తూ నడుస్తూ బెల్ట్‌లోని రివాల్వర్‌ని బయటికి తీసి గాలిలోకి గట్టిగా పేల్చాడు.

అంతే... వెంటనే వచ్చేసింది అతను కోరుకున్న ఎఫెక్ట్. రివాల్వర్ మోత వినబడిన మరుక్షణం చట్రాతి మీద కొట్టిన చిల్లపెంకులమాదిరి తలా ఒక పక్కకి పరిగెత్తారు ఆటగాళ్ళందరూ. కన్నుమూసి కన్ను తెరిచేటంతలో ఒక్క ఆటగాడు కనిపించకుండా మాయమైపోయారు.

“నేను చెప్పిందేమిటి? నువ్వు చేసిందేమిటి?” పట్టరాని కోపంతో పళ్ళు పటపటమని కొరుకుతూ, వట్టి చేతులతో వెనక్కి వచ్చిన షాడో నిలదీశాడు తోతాపురి.

“క్షమించాలి... సరైన ఎఫెక్టు కోసం పేల్చాను. అలా పారిపోతారని అనుకోలేదు” చెప్పాడు షాడో.

“కాదు సాబ్. కావాలనే చేశాడు. రేపు వాళ్ళందరికీ కబురు చేసి అందరి దగ్గరా ఎంతో కొంత పట్టేస్తాడు” గుర్రుగా చూస్తూ చెప్పాడు రైట్‌హేండ్ బద్రీనాథ్.

“ఎవరు ఎవరో నాకు ఎలా తెలుస్తుంది?” ఆశ్చర్యంగా బద్రీనాథ్‌ను చూస్తూ అడిగాడు షాడో.

“ఏది ఏమైనా నువ్వు తెలివితక్కువ పనిచేశావ్... ఇది మంచి పద్ధతి కాదు” తన కోపాన్ని అదుపులో పెట్టుకుంటూ నెమ్మదిగా అన్నాడు తోతాపురి.

“ఇంకోసారి ఇలా జరగదు... ఈసారి మా గంగూభాయ్‌ని వెంట పెట్టుకు వస్తాను. మీరు ఎవరిని పట్టుకోమంటే వాళ్ళని పట్టి ఊచల వెనక్కి నెట్టేస్తాను” నమ్మకంగా చెప్పాడు షాడో.

విసురుగా చూసి టాంగా ఎక్కాడు తోతాపురి.

తనను కూడా వెంట రమ్మంటాడేమోనని ఎదురుచూసిన షాడోని గురించి పట్టించుకోకుండా స్పీడ్‌గా వెళ్ళిపోయాడు– తన అనుచరులందరితో సహా. ఒంటరిగా మిగిలిపోయాడు షాడో. ప్యాంటు జేబులో చేతులు పెట్టుకుని నెమ్మదిగా నడవడం మొదలుపెట్టాడు.

దూరంనించి రైల్వేట్రాక్ మీద ఏదో గూడ్స్‌ట్రెయిన్ వెళుతున్న శబ్దం అతని చెవులకి చేరింది. ఉన్నట్లుండి వినవచ్చింది ఇంకో వికృతశబ్దం. సడన్‌గా బ్రేకులు వేయడం వల్ల చక్రాలు చేసే కీచుశబ్దం అది.

ఝల్లుమంది షాడో శరీరం... చాలా దూరంలో ఉంది రైల్వేట్రాక్... వెంటనే వెళ్ళి చూడటానికి తన దగ్గర ఎటువంటి వెహికిలు లేదు. కనీసం బిల్లూకాకా సైకిల్ కూడా లేదు... కాలినడకన వెళ్ళడం అవుటాఫ్ క్వశ్చన్.

తను అక్కడికి చేరుకునేసరికి తెల్లవారిపోతుంది... సంతోష్ మాదిరి నటించాలన్న నిర్ణయం వల్ల ఎటువంటి ఉపయోగము ఉండదేమోనన్న అనుమానం మొదటిసారిగా అతని మనస్సులోకి అడుగుపెట్టింది. ప్యాంటుజేబులో

ఉన్న సిగరెట్‌ని వెలిగించుకుని, గుండెలనిండా పొగపీల్చుకుంటూ గ్రామంవైపు కదిలాడతను.

* * * * *

"ఇన్స్‌పెక్టర్ సంతోష్... ఇన్స్‌పెక్టర్ సంతోష్..." ఖంగు ఖంగుమంటూ ఒక కంఠం వైర్‌లెస్ సెట్‌లోనించి వినిపించేసరికి, హడావుడిగా లేచాడు గంగారాం.

"ఏం చేస్తున్నాడు మీ ఇన్స్‌పెక్టర్? రాత్రి మళ్ళీ దొంగతనం జరిగింది. పదిలక్షల విలువచేసే సరుకు దోపిడీ జరిగింది..." కోపంగా అతన్ని అడిగింది ఆ కంఠం.

"రాత్రంతా ఇన్స్‌పెక్టర్ సాబ్ గ్రామంలో గస్తీ తిరిగాడు సాబ్... బోర్డర్స్ దగ్గిర్నించి ఎవరో కొత్త ముఖాలు బుల్జీకి వచ్చి అక్కడినించి బింద్రావైపు వచ్చాయని మాకు వర్తమానం అందింది..." నోటికి వచ్చిన మాటల్ని వినయంగా వెల్లడించాడు గంగారాం.

"మాకు కాకమ్మ కథలు చెప్పబోకండి... సంతోష్‌ని అక్కడికి పంపింది ఆ గ్రామంలో గస్తీ తిరవడానికి కాదు... రైల్వే లైన్‌మీద కన్నేసి ఉంచడానికి" చెప్పింది ఆ కంఠం.

కన్నువేసి ఉంచటానికి రైల్వేలైను ఎక్కడో ఆమడల దూరంలో ఉంటే ఎలాగని అడగలేదు గంగారాం. "సరయిన వెహికిల్ లేదు సాబ్... దయచేసి ఏదైనా ఏర్పాటు చేయగలిగితే..." అంటూ మాట ఆపాడు.

"అవన్నీ ఏర్పాటు చేస్తే అక్కడికి సంతోష్‌ని ఎందుకు పంపిస్తాం? ఏమున్నా లేకపోయినా ఏదో ఒకటి చేస్తాడనే కదా... సంతోష్‌కి చెప్పండి... మాకు

వెంటనే రిపోర్టు కావాలి...” ఖంగుమని సడన్‌గా అవుటాఫ్ లైన్ ఐపోయిందా కంఠం.

“సుఖంలేదు గురూ... ఈ డ్యూటీలు మనం చేయలేము. మనకి అనవసరం” కుందూ తెచ్చిచ్చిన చాయ్ తాగి సిగరెట్ వెలిగించుకుంటున్న షాడోతో అన్నాడు గంగారాం.

“ఇంకో రెండు రోజులు చూద్దాం...” సాలోచనగా గంగారాంతో అన్నాడు షాడో.

కుందూ అవతలికిపోయేదాకా ఆగి, “ఏమిటి నీ ఆలోచన?” అడిగాడతన్ని గంగారాం.

“సంతోష్‌ని చంపింది తోతాపురి జనం” నెమ్మదిగా అన్నాడు షాడో.

“ఆ మాట మనకి కరెక్టుగా తెలీదు కదా” షాడోతో అన్నాడు గంగారాం.

“తెలిసినందువల్ల వచ్చే నష్టంగాని ఏమీలేదు. సంతోష్ సరంజామా తోతాపురి దగ్గరికి చేరాయి కాబట్టి అతన్ని అనుమానించాలి... నా ఉద్దేశ్యం ఏమిటంటే...” అంటూ ఆగాడు షాడో.

చెవులు రిక్కించి దగ్గరికి జరిగాడు గంగారాం. “సంతోష్ ఎవరికో అడ్డం వస్తాడన్న భయంతోనే అతన్ని పొడివేశారు... ఆ పని చేసింది ఎవరో కరెక్టుగా తెలిస్తేనే మనం రైల్వే దొంగతనాలను ఆపగలం” గంగారాంతో చెప్పాడు షాడో.

"చెప్పిందే చెప్పి నా ప్రాణాలు తీయకు. సంతోష్‌ని తోతాపురి చంపించకపోతే సంతోష్ సరంజామా అతని దగ్గరికి చేరదు. కాబట్టి మన సమస్యకి సమాధానం కళ్ల ఎదుటే ఉంది" చిరాకుగా అన్నాడు గంగారాం.

చిన్నగా నవ్వి సగం వరకూ కాలిన సిగరెట్‌ని గుమ్మంలో నించి వీధిలో పడేటట్లు చూపుడువేలితో మీటాడు షాడో.

"అందుకే మనం తోతాపురికి చెంచాలుగా ప్రవర్తిస్తున్నాం. అతన్ని క్లోజ్‌గా అబ్జర్వ్ చేయాలి... ఆ తర్వాత అతని వేలితోనే అతని కళ్లను పొడవాలి" పైకి లేస్తూ చెప్పాడు..

"ఇంత పొద్దున్నే ఇప్పుడు నువ్వు ఎక్కడికి?" అనుమానంగా చూస్తూ అడిగాడు గంగారాం.

"గుట్ట అవతల ఉన్న గుడిసెల దగ్గరికి" అంటూ కదలబోయి ఆగాడు షాడో.

*          *          *          *          *

స్టేషన్ ముందు దారుణమైన గోల స్టార్ట్ అయింది. గోలు గోలున ఏడుపు ఒకటి వినిపిస్తోంది... "బయటికి రమ్మనండి. ఇన్స్‌పెక్టర్‌ని స్టేషన్‌లోనుంచి ఇవతలికి రమ్మనండి..." ఆవేశం నిండిన అరడజను కంఠాలు అదేపనిగా కేకలు మొదలుపెడుతున్నాయి.

"రాత్రంతా ప్రశాంతంగానే ఉంది. ఇంతలోనే ఏమొచ్చింది కడుపులో నొప్పి వీళ్ళకి?" ఆశ్చర్యంగా అంటూ బయటికి తొంగిచూడబోయి చటుక్కున తలని వెనక్కి తీసివేసుకున్నాడు గంగారాం.

“రెండొందల మంది... అందరూ యమ సీరియస్సు” చిన్నకంఠంతో షాడోకి చెప్పాడు అతను.

“రావాలి.... ఇన్స్‌పెక్టర్ బయటికి రావాలి” లౌడ్‌స్పీకర్‌లో నించి వినిపించినట్టు పెద్దగా వినవచ్చింది ఆ అరుపు.

టైట్‌గా ఉన్న షర్టు మడతల్ని ఒకసారి సరిచేసుకుని, చాలీచాలని ప్యాంటును పైకి లాక్కుంటూ బైటికిపోయాడు షాడో. “న్యాయాన్ని, ధర్మాన్ని రక్షించాల్సిన వాడివి నువ్వు. అన్యాయం జరక్కుండా ఆపాల్సినవాడివి” రెండు అడుగులు ముందుకేసి అడిగాడు ఒక మనిషి.

“ఏం జరుగిందో ముందు చెప్పండి. న్యాయమా, అన్యాయమా తర్వాత మాట్లాడదాం” కనులు చిట్లిస్తూ అడిగాడు షాడో. అతను ఆ మాట అనగానే రెండుగా చీలింది ఆ మనిషి వెనకాల ఉన్న గుంపు. భయంకరమైన కత్తిపోట్ల కారణంగా ప్రాణాలు వదిలిన ఒక యువకుడి శరీరం నేలమీద పడుకోబెట్టబడి కనిపించింది.

దగ్గరికిపోయి చూడాల్సిన అవసరం లేదని షాడోకి వెంటనే అర్థం అయిపోయింది. ప్రాణాలు పోయి చాలా సేపయినట్లు నెమ్మదినెమ్మదిగా కట్టెమాదిరి బిగుసుకుపోతోంది చూడటానికి ఆ శరీరం.

“ఎందుకు? జరిగింది ఇది? ఎవరు చేశారు?” ప్యాంటు జేబులోనించి సిగరెట్ ప్యాకెట్‌ని బైటికి తీయాలన్న కోరికను బలవంతంగా అదుముకుంటూ అడిగాడు.

“ఇట్లాంటి దారుణాలు చేసే అలవాటు ఇంకెవరికి ఉంటుంది? ఆ తోతాపురి చంచా బదరీనాథ్...” తడుముకోకుండా చెప్పాడు ఆ గుంపుకి నాయకుడి మాదిరి కనిపిస్తున్న మనిషి.

“ఎందుకు చేశాడు? ఇద్దరికీ తగాదాలు ఏమైనా ఉన్నయ్యా?” అతనిని అడిగాడు షాడో.

“ఊరవతల బతికే మాకు ఆ బద్మాష్‌తో తగాదాలు ఎందుకు ఉంటయ్. కారణం అది కాదు... వాడు... వాడు...” అంటూ ఎందుకో సడన్‌గా ఆగిపోయాడా మనిషి.

“చెప్పు. కారణం చెప్పు” ప్రాంప్ట్ చేశాడు షాడో.

“వాడు. ఇతని భార్య కల్తీ మీద కన్నేశాడు. రాత్రి బాగా తాగివచ్చి చెయ్యి పట్టుకున్నాడు. అది చూసి అడ్డం పోయేసరికి ఇతన్ని పొడిచేసి పారిపోయాట్ట” చెప్పటానికి చాలా బాధపడుతున్నట్టు ఆగి ఆగి చెప్పాడు ఆ మనిషి.

కల్తీ ఎవరో ప్రత్యేకంగా పనికట్టుకుని అతను చెప్పాల్సిన అవసరం లేకుండానే అర్థమైపోయింది షాడోకి.

పగలంతా ఎండలో నిలబడి కాయకష్టం చేసుకుంటూ ఉంటుంది కాబోలు– దృఢంగా, నల్లగా, రాతి వజ్రంలాగా మిలమిల మెరిసిపోతూ కనిపించిందామె.

పెటపెటలాడే పొంకాలు... ఎటువంటి వారి మనసులనైనా చిటికెలో చలింపచేసే చక్కనైన అందాలు...

అప్రయత్నంగా ఫ్యాంటు జేబులోనించి సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు షాడో. గుండెలనిండా పొగను పీల్చుకుంటూ ఆమె దగ్గరికిపోయాడు. పదిమంది ఆడవాళ్ళు గట్టిగా పట్టుకుని ఆపుతూ ఉండటంవల్ల అలా నిలబడి ఉన్నది ఆమె. లేకపోతే కింద ఉన్న భర్త శరీరం మీదపడి గావురు గావురుమని ఏడుస్తూ ఉండేది.

"జరిగింది ఏమిటో చెప్పమ్మా?" అడిగాడు షాడో.

"తీరని బాధలో ఉంది. తనేం చెపుతుంది? నేను చెపుతా. ఎందుకంటే ఆ బద్మాష్ రావటాన్ని నేను చూశాను" వెంటనే అన్నది కత్తీని పట్టుకుని ఉన్న ఒక మధ్య వయస్కురాలు. "రాత్రి రెండు గంటల సమయంలో తూలుకుంటూ వచ్చి మంచం మీద ఉన్న కత్తీ చెయ్యి పట్టుకున్నాడు. అరిచేసరికి మొగుడు లేచాడు.

అంతే... "కత్తిని తీసి పోటుమీద పోటుగా పొడిచేశాడు ఆ బద్మాష్... నేను వెర్రిగా అరిచేసరికి పారిపోయాడు" ఊపిరి తీసుకోవటానికి కూడా ఆగకుండా జరిగింది ఏమిటో వివరంగా చెప్పింది ఆమె.

"ఓ.కే... నేను బద్రీనాథ్‌ని స్టేషన్‌కి తీసుకువస్తాను. చేసిన పనికి తగిన శిక్ష పడేటట్టు చూస్తాను... మీరు వెళ్ళి మిగిలిన పనులు చూడండి" అన్నాడు షాడో.

దారి డొంకా అంటూ సరిగ్గాలేని బోర్డర్ విలేజస్ అవి... అటువంటి కేసుల్లో పోస్ట్‌మార్టమ్‌లు, పోలీస్ రిపోర్ట్‌లు అంటూ ప్రత్యేకంగా ఉండటానికి అవకాశాలు కనిపించని పరిస్థితి. ఇన్వెస్టిగేట్ చేసిన ఇన్స్‌పెక్టర్ చెప్పిందే వేదం... ఎక్కడో దూరంలో ఉన్న కోర్టులు కూడా పోలీసులు చెప్పినదాన్నే నమ్ముతాయి.

"నేను చేయాల్సింది చేస్తానని చెప్పాను కదా... తీసుకుపొండి" అన్న నిర్ణయాన్ని వెల్లడించినా వారెవరూ కదలక పోవటంతో కొంచెం అసహనంగా అన్నాడు షాడో.

"చేయాల్సింది సరిగ్గా చేస్తారా సాబ్? ఆ బద్మాష్‌ని నిజంగానే పట్టుకువస్తారా?" షాడోని అనుమానంగా అడిగారు మొదట మాట్లాడిన మనిషి.

తను తోతాపురి చంచాగా మారిపోయినట్టు అందరూ అనుకుంటున్న మాట వాళ్ళ దగ్గరికి కూడా వెళ్ళిపోయిందనే విషయం సుస్పష్టంగా తెలిసివచ్చింది షాడోకి.

"గంగూభాయ్.... ఎక్కడ ఉన్నావ్?" ఖంగుమంటున్న కంఠంతో పిలిచాడు స్టేషన్ ద్వారం దగ్గిర నిలబడి ఉన్న గంగారాంని.

"వచ్చేశా... ఇప్పుడు ఏం చేయమంటావ్ గురూ?" నాలుగు అంగల్లో వడివడిగా షాడో దగ్గరికి వచ్చి నిలబడుతూ అడిగాడు గంగారాం.

"ఐవాన్ట్ దట్ బద్రీనాథ్. తీసుకువచ్చి లోపలికి నెట్టేయ్" ఆర్డర్ ఇచ్చాడు షాడో. పొట్టమీది నించి జారిపోతున్న పైజామాని పైకి లాక్కుంటూ పరుగులాంటి నడకతో తోతాపురి బిల్డింగ్ దగ్గరికి బయలుదేరాడు గంగారాం.

*    *    *    *    *

"తోతాపురి సాబ్ పేరు చెపితే పంచెలు తడుపుకునే కోన్‌కిస్కాగొట్టంగాళ్ళు ఏదో రిపోర్టు ఇస్తే– దాన్ని నమ్మి నన్ను అరెస్టు చేస్తారా? అంత ధైర్యం మీకు ఉందా?" మీసాలు మెలివేస్తూ మహాగీరగా అన్నాడు తోతాపురి బిల్డింగ్ ఎదుట కూర్చుని ఉన్న బద్రీనాథ్.

“వాళ్ళు ఎటువంటి వాళ్ళయినా ఒక లిటిగేషన్ అంటూ స్టార్ట్ అయినప్పుడు– పద్ధతి ప్రకారం పోవాలి మనం. ఒకసారి స్టేషన్‌కి వస్తే మిగిలినవన్నీ మేము చూసుకుంటాం” వినయంగా చెప్పాడు గంగారాం.

“పొరపాటున కూడా రాను. ఏం చేస్తావో చేసుకో” కూర్చున్నచోటినించి కదలకుండా మరింత గీరగా సమాధానం ఇచ్చాడు బద్రీనాథ్.

లెక్క ప్రకారమయితే అగ్గిరాముడై పోవాలి గంగారాం. పళ్ళు పటపట కొరుకుతూ పెద్దపులి మాదిరి అతని మీదికి దూకాలి.

బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నారు తాము... తేడాగా ప్రవర్తిస్తే శాంతిభద్రతల్ని పరిరక్షించే పోలీస్ డిపార్ట్‌మెంట్ మీద పడుతుంది మచ్చ. అందుకే అతిప్రయత్నం మీద తనను తాను కంట్రోల్ చేసుకుంటూ– “అలా మాట్లాడకూడదు సాబ్... దయచేసి మా బాధల్ని కూడా కొంచెం అర్థం చేసుకోండి..... అవతల గుట్ట అవతలి నించి వచ్చినవాళ్ళు డెడ్‌బాడీని స్టేషన్ ముందు పెట్టి కదలకుండా నిలబడ్డారు. ఇది మా పై అధికారులకు తెలిస్తే లేనిపోని గోల... వచ్చేయండి సాబ్ నాతో” వినయాతి వినయంగా బతిమిలాడాడు.

“మా తోతాపురిసాబ్ విసిరేసే ఎంగిలి మెతుకులు ఏరుకునే కుక్కలు మీరు. మీ మాటలు నేను వినడం ఏమిటి బే?” అన్నాడు బద్రీనాథ్.

అంతే... నోరు తెరిచాడు గంగారాం. ఎడమపాదంతో నేలను బలంగా తన్నాడు... తలను పైకెత్తి గావురుమని పెట్టాడు ఒకే ఒక పొలికేక.

ఆటంబాంబులు ఏదో అక్కడికి వచ్చి పడినంత శబ్దం.... పక్కనే ఉన్న చెట్టుమీది పక్షులన్నీ బెదిరిపోయి గాలిలోకి ఎగిరిపోవడం.... కుర్చీలో కూర్చుని ఉన్న బద్రీనాథ్ చెవులు చిల్లులుపడిన 'అనుభూతి...'

"ఎంగిలి మెతుకులు ఏరుకునే కుక్కలం కాదురా... వేటాడే వేట కుక్కలం.... మా దెబ్బకి నువ్వేంటిరా. నిన్ను పుట్టించిన ఆ దేవుడు కూడా గడగడలాడాల్సిందే" అంటూ ముందుకు దూకి బద్రీనాథ్ మాడుమీద అరచేత్తో బలంగా చరిచాడు.

కళ్ళముందు రంగురంగుల నక్షత్రాలు ప్రత్యక్షమయినట్టు అనిపించింది ఆ పెద్దమనిషికి. గుండెలు గొంతులోకి వచ్చేసిన సెన్సేషన్ కలిగింది. తనకు తెలియకుండానే కుర్చీలోంచి జారి నేలమీద చతికిలపడ్డాడు.

మంచి-చెడు, న్యాయం-ధర్మం మొదలైన మాటలకు అర్థం తెలియనట్టు అతని జుట్టు పట్టుకుని పదిగజాల దూరం బరబరమని లాగాడు గంగారాం. తర్వాత అమాంతంగా ఎత్తి భుజంమీద వేసుకున్నాడు.

నోళ్ళు తెరుచుకు చూశారు స్టేషన్ ముందున్న జనం. తమ కళ్ళను తామే నమ్మలేకపోతునట్టు తలలు విదిలించారు. ఇసుకమూటని తీసుకుపోయి విసిరేసినంత నిర్లక్ష్యంగా బద్రీనాథ్‌ని లాకప్‌లోకి బలంగా విసిరేసి తలుపులకి తాళం పెట్టాడు గంగారాం.

"అరెస్టు చేశాము. చూశారుగా.... ఇక దయచేయవచ్చు. వెళ్ళిపొండి" ఘటోత్కచుడి మాదిరి అందరినీ ఎ(రగా చూస్తూ గంయ్‌మని ఒక అరుపు అరిచాడు.

కిందపెట్టిన శరీరాన్ని తీసుకుని గబగబా తమ గూడెంవైపు పరిగెత్తారు మగవాళ్ళు. నిస్త్రాణంగా నిలబడి ఉన్న కత్లీని జాగ్రత్తగా నడిపించుకుంటూ వారిని అనుసరించారు ఆడవాళ్ళు. అరక్షణం ముందువరకూ ఎంతో సందడిగా ఉన్న వీధి ఒక్కసారిగా నిశ్శబ్దంతో నిండిపోయింది.

* * * * *

"ఏమో అనుకున్నాను గాని... మీ ఇన్స్‌పెక్టర్లో కొంచెం రోషం పాశం ఎక్కువగానే ఉన్నట్టు కనిపిస్తోందిరా కుందూ..." ఎవరో ఆర్డర్ ఇచ్చిన వేటకత్తికి ఆకురాయితో పదును పెడుతూ అన్నాడు బిల్లూకాకా.

"నేను ముందు నుంచీ చెపుతూనే ఉన్నాను. అందరి లాంటి వాడు కాదు... డిఫరెంటు" ఆనందంగా అంటూ తన పొడుగాటి జుబ్బావంటి షర్టు కింది నించి ఒక పెద్ద పొట్లాన్ని బయటికి తీశాడు కుందూ.

"ఏంటిరా అది?" ఆశ్చర్యంగా అడిగాడు బిల్లూకాకా.

"రొట్టెలు బాబాయ్... పొద్దున, మధ్యాహ్నం, సాయంత్రం ఆకలి వేసినప్పుడల్లా, తుల్జీబాయి దగ్గరికిపోయి కావాల్సినన్ని రొట్టెలు తెచ్చుకోమని మా సాబ్ ఆర్డర్" పొట్లాన్ని ఊడదీసి, ఒక రొట్టెను బిల్లూకాకావైపు జాస్తూ చెప్పాడు కుందూ.

ఎందుకో తెలియదు గాని. నీటితో నిండిపోయాయి బిల్లూకాకా కళ్ళు.

“ఏంటి బాబాయ్? ఏమయింది?” ఆందోళనగా అడిగాడు కుందూ.

“అర్ధాకలితో అలమటించే నీకు కడుపునిండా తిండి దొరుకుతున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉందిరా, ఎప్పుడూ ఎవరి ముందో చేయి జాచే నువ్వు. ఇప్పుడు నాకు రొట్టె పెట్టడం చాలా విచిత్రం అనిపించిందిరా” అతను అందించిన రొట్టెను నములుతూ అన్నాడు బిల్లూకాకా.

“అంతా ఇన్స్‌పెక్టర్ మహిమ. నీకు ఒక విషయం తెలుసా?” ఉత్సాహంగా అన్నాడు కుందూ...

“ఏంటిరా అది?” ఎటువంటి కొత్త విషయాన్నయినా వినటానికి సిద్ధపడుతూ అడిగాడు బిల్లూకాకా.

“ఇన్స్‌పెక్టర్‌సాబ్‌తో వచ్చిన గంగూభాయి నన్ను అహ్మదాబాద్ హాస్పిటల్‌కి పంపించి నా కాలికి ఆపరేషన్ చేయిస్తానని అన్నాడు.... ఆపరేషన్ చేస్తే కాలు సరిగ్గా వచ్చేస్తుందిట”

“అబ్బో.... చాలా ఖర్చు కదరా... అంత డబ్బు ఎక్కడి నించి తెస్తాం?” ఆశ్చర్యంగా అడిగాడు.

“డబ్బుల్దేముంది కాకా? అది అసలు సమస్య కానేకాదుట... సమస్య ఏమిటంటే సరైన డాక్టరు దొరకటం... ఈ మాట నీకు చెప్పి ఎవరైనా ఉంటే విచారించమని అన్నాడు...” అతనికి చెప్పాడు కుందూ.

“కాలు బాగైన తర్వాత ఏం చేస్తావురా?” వినోదంగా చూస్తూ ఆసక్తిగా అడిగాడు బిల్లూకాకా.

“వీలైతే పోలీస్‌గానే ఉద్యోగం ఇప్పిస్తారంట... కుదరకపోతే వేరే ఉద్యోగం చూసి పెళ్ళి కూడా చేసేస్తారంట”

తింటూ తింటూ ఉన్న రొట్టెముక్క గొంతుకు అడ్డం పడినట్లయి, పెద్దగా దగ్గుతూ అరచేత్తో టపిటపిమని నెత్తిమీద చరుచుకున్నాడు బిల్లూకాకా.

“నీకు నమ్మకం కలగటం లేదు కదూ?” చిన్నముఖం చేసుకుంటూ నిష్ఠూరంగా అడిగాడు కుందూ.

“లేదురా... అలాంటిదేమీ లేదు... ఏది ఏమయినా నువ్వు అంటున్నట్టు మీ ఇన్స్‌పెక్టరు పోలీసులందరిలో చాలా డిఫరెంటు” ఒప్పుకున్నాడు బిల్లూకాకా.

రొట్టెల పొట్లాన్ని ఖాళీ చేసేశాడు కుందూ... “వస్తాను కాకా... టీలు తెచ్చి ఇవ్వాలి” అంటూ అవిటి కాలిని ఎగరేసుకుంటూ స్టేషన్‌వైపు వెళ్ళిపోయాడు.

పదును పెట్టాల్సిన వేటకత్తిని గురించి మర్చిపోయాడు బిల్లూకాకా. కొలిమి దగ్గర్నించి లేచి, ఆ షెడ్‌లోనే ఒక పక్కగా గోడకి వేలాడుతున్న సోనాబాయి పటం దగ్గరికి పోయాడు. అటూ ఇటూ రెండు ఏనుగులు తొండాల్ని ఎత్తి ఘీంకారాలు చేస్తూ ఉండగా– తామరపువ్వు మీద కూర్చుని చిద్విలాసంగా నవ్వుతోంది సోనాబాయి.

“నాకోసం నిన్ను ఎప్పుడూ వేడుకోలేదు... అభం శుభం తెలియని మా కుందూ గాడిని చల్లగా చూడు తల్లీ, వాడి కాలు బాగుపడి అందరి మాదిరిగా హాయిగా నడవాలి...” అంటూ నమస్కరించి ఇవతలికి వచ్చాడు.

*     *     *     *     *

“తాడు బొంగరం లేనివాళ్ళు పదిమంది గుంపుగా వచ్చి ఏదో చెపితే నా మనిషిని తీసుకొచ్చి పడేస్తావా? అసలు నీగురించి నువ్వు ఏమనుకుంటున్నావ్?” ఉరుములాంటి కంఠంతో స్టేషన్ అదిరిపోయేటట్టు అడిగాడు తోతాపురి సాబ్... సాయంత్రం నాలుగు గంటల సమయంలో.

“పదిమంది కాదు, రెండు వందల మంది... ఒక డెడ్‌బాడీ” అన్నాడు దూరంగా కూర్చున్న గంగారాం.

“అరేయ్... వేసేయండిరా వాడిని” ఉన్నట్టుండి సడన్‌గా రివర్స్ అయిపోయాడు తోతాపురి.

రెడీగా వున్నారు అతని అనుచరులు పదిమంది. బర్రుమంటూ కదిలారు గంగారంవైపు. తోతాపురి సాబ్ మీద గౌరవంతో టేబిల్ దగ్గర నిలబడి వున్నాడు షాడో. అతను కదలటం ఎవరికీ కనిపించలేదు.

ఇరవై సెకన్లలో గావుకేకలు పెడుతూ స్టేషన్ బయటికి పరిగెత్తుకుపోయారు ఎనిమిదిమంది. పగిలిపోయిన నాశికలలోనించి జలజలా కారుతున్న రక్తాన్ని ఆపుకోవటం చేతకాక కూర్చుండిపోయారు మిగిలిన ఇద్దరు.

“అయిపోయావ్ ఇన్స్‌పెక్టరూ... ఇవాల్టితో నువ్వు అయిపోయావ్. ఇప్పుడే నేను అహ్మదాబాద్ కబురు పంపి నీ గుట్టురట్టు చేసేస్తా” రంకె పెట్టాడు తోతాపురి.

టేబిల్ సొరగులో పెట్టిన రివాల్వర్‌ని లాగి, సేఫ్టీ పిన్‌ని అన్‌లాక్ చేశాడు షాడో. “లాకప్‌లోనించి ఆ బద్మాష్‌ని బయటికి లాగి కాల్చిపారేయ్. పారిపోతుంటే

పట్టుకోవటం కుదరక ఎన్‌కౌంటర్ చేశామని రిపోర్టు చేసేయ్'' అంటూ రివాల్వర్‌ని గంగారాం కేసి విసిరాడు.

''ఆగు... ఆగు... ఏం చేస్తున్నావ్ నువ్వు?'' కంగారుగా అంటూ గంగారాం దారికడ్డుగా నిలబడ్డాడు తోతాపురి.

''నువ్వు అహ్మదాబాద్‌కి కబురు పంపేలోగా ఇక్కడ జరగాల్సింది జరిగిపోతుంది'' అన్నాడు షాడో.

''పనిలో పనిగా ఈయన్ని కాల్చేస్తా. రెండో పని కూడా అయిపోతుంది...'' నిర్వికారంగా చెప్పాడు గంగారాం.

అంతకుముందు అక్కడికి వచ్చిన ఇన్స్‌పెక్టర్స్ అందరినీ బెదిరించినట్టు వీళ్ళని కూడా బెదిరిస్తే పనులు జరగకపోగా తేడాలు వచ్చేస్తాయని అర్థం అయింది కాబోలు– అతి ప్రయత్నంమీద నవ్వాడు తోతాపురి.

''ఏదో నవ్వులాటకి ఒక మాట అంటే అదే నిజమని అనుకుంటే ఎలా? మీరు తాపీగా కూర్చోండి. శాంతంగా మాట్లాడుకుందాం'' అంటూ తనే ముందుగా వెనక్కి వచ్చి కుర్చీలో చేరగిలబడ్డాడు తోతాపురి.

''తుమ్మితే ఊడిపోయే ముక్కును ఎంతకాలం పట్టుకు కూర్చుంటాం? మీరు నిముషానికి ఒకసారి అహ్మదాబాద్ అంటూ వుంటే మాకు మంటెత్తిపోతోంది.

ఇది మంచి పద్ధతి కాదు...'' సీరియస్‌గా అంటూ లాకప్‌లోకి చూశాడు గంగారాం. తన బాస్ తనని బయటికి తీసుకుపోతాడని ఆశగా చూస్తున్న బద్రీనాథ్ మొఖం బీజూకాకిలా నల్లగా మాడిపోయింది.

''జరిగిందేదో జరిగిపోయింది. మా వాడిని వదిలేయండి'' అంటూ నాలుగు నోట్లకట్టల్ని తీసి టేబిల్ మీద పెట్టాడు తోతాపురి. నలభై వేలకు పైగానే వున్న ఆ కరెన్సీని చూసి, గంగారాం కేసి తల తిప్పాడు షాడో.

''కొంచెం నోటిదురుసు ఎక్కువైనా తోతాపురి సాబ్ మనసున్న మనిషి. ఇంకో నలభై ఇవ్వమని అడుగు. లెక్కసరిపోతుంది'' కామ్‌గా చెప్పాడు గంగారాం.

మొఖంమీది నవ్వు మాయమై పోకుండా జాగ్రత్త పడుతూ ఇంకో నాలుగు కట్టల్ని టేబిల్‌మీద పెట్టాడు తోతాపురి సాబ్. ''చీకటి పడిన తర్వాత మీతో చాలా పనివుంది. రాత్రి పేకాట పెట్టిన చోటుకి రావాలి'' అంటూ కుర్చీలోనించి లేచాడు తోతాపురి.

లాకప్‌లో వున్న బద్రీనాథ్‌ని వెంటబెట్టుకుపోవడానికి వచ్చాడు అతను. ఆ పని జరగకుండా అవతలికి పోవటం జరగదని అర్థమై, గంగారాంకి సైగ చేశాడు షాడో.

''పోరా బయటికి పోయి బుద్ధిగా బతుకు. ఇంకోసారి నువ్వు గుట్టని దాటి ఆ గుడిసెల దగ్గరికి పోతే మాత్రం ఖతమైపోతావ్'' అంటూ తలుపులు తెరిచి బయటికి వదిలాడు గంగారాం.

చూపులకే గనుక మనిషిని మాడ్చి మసిచేసే శక్తి వుంటే గంగారాం అప్పటికప్పుడు బూడిద గుట్టగా మారిపోయి వుండేవాడు. అంత సీరియస్‌గా చూస్తూ తన బాస్ వెనకాలే బయటికి వెళ్ళిపోయాడు బద్రీనాథ్.

"ఇది గొడవ అవుతుంది. జనం మన మొఖాలమీద మట్టి జల్లుతారు" అంటూ టేబిల్‌మీది కరెన్సీని తన దుస్తుల్లో దాచుకున్నాడు గంగారాం.

సాలోచనగా సిగరెట్ వెలిగించుకుంటూ కుర్చీలో కూర్చున్నాడు షాడో. అప్పుడు తెలియలేదతనికి. సరిగ్గ చీకటిపడే సమయంలో మాత్రం అక్షరాలా యదార్థం అయ్యాయి గంగారాం మాటలు.

*　　　*　　　*　　　*　　　*

"కుందూగాడి మాటల్ని విని నువ్వేదో పోటుగాడివని అనుకున్నాను... నువ్వూ చంచావే... మనిషివి మాత్రం కాదు" వీధిలోకి వచ్చిన షాడోని అందరి ముందు పట్టుకుని చెడామడా తిట్టేశాడు బిల్లూకాకా.

అంటువ్యాధి వచ్చిన మనిషిని ఎవాయిడ్ చేసినట్టు షాడోని చూసి దూరదూరంగా తప్పుకోవటం మొదలుపెట్టారు బింద్రా ఊరిలోని పౌరులు.

తుల్జీబాయి అయితే బిల్లూకాకా మాదిరి దులిపి పారేసింది. "మీకు తిండి పెట్టే బదులు పశువులకి పెడితే ఎంతో కొంత నీతిగా బతుకుతాయి. నా హోటల్లోకి రావద్దు. బైటికి పొండి" అంటూ కొట్టినంత పని చేసేసింది.

"మాకు తిండి పెట్టకపోతే మరేం ఫరవాలేదు. మా కుందూకి పెట్టు..." ముక్తసరిగా చెప్పి, వెనకాల నిలబడి వున్న కుందూని ముందుకు నెట్టాడు షాడో.

“నేను ఒకసారి గుట్ట అవతలికెళ్ళి వస్తాను” అని గంగారాంకి చెప్పి, బిల్లూకాకా సైకిల్‌మీద బయలుదేరాడు.

అరగంట పట్టింది అతను గుట్ట దగ్గరికి చేరుకోవడానికి. చుట్టూ తిరిగి గుడిసెల మధ్యలోకి పోయేసరికి మరో అరగంట... మసక చీకట్లు కాస్తా చిమ్మచీకట్లుగా మారుతున్న సమయంలో వచ్చిన అతన్ని చూసి ఏమీ మాట్లాడలేదు అక్కడివాళ్ళు. ఇళ్ళలోకిపోయి గుప్పిట్ల నిండా కారం తీసుకు వచ్చారు ఆడవాళ్ళు. లావుపాటి పొడవైన కఱ్ఱల్ని, వేటకత్తుల్ని పట్టుకున్నారు మగవాళ్ళు.

నిండు వేసవికాలంలో ఎండకు ఎండి, ఫెళఫెళలాడుతున్న తాటాకుల మండీ మాదిరి తయారైంది వాతావరణం. ఒక నిప్పురవ్వ పడితే మండీ మొత్తం ఎలా భగ్గుమంటుందో ఒక్క వంకరమాట ఎవరు మాట్లాడినా మూకుమ్మడిగా మీద పడిపోతారని తెలిసిపోయింది షాడోకి...

అయినా సరే జరగలేదతను. బిల్లూకాకా సైకిల్‌ని సూటిగా గుడిసెల మధ్యకి తీసుకుపోయి, “కత్లీని చూడటానికొచ్చాను. మీకెవరికీ అభ్యంతరం లేకపోతే రెండు మాటలు మాట్లాడిపోతాను” అన్నాడు.

“నువ్వు ఏం మాట్లాడినా మా అందరి ఎదుటే మాట్లాడాలి. తేడా వస్తే అర్థమైందిగా పరిస్థితి?” అంటూ అతన్ని ఒక పక్కగా వున్న గుడిసె దగ్గరికి తీసుకుపోయాడు ఒక మనిషి. గుడిసెముందు మోకాళ్ళమీద తలపెట్టుకుని ఏడుస్తోంది కత్లీ. షాడోని చూడగానే చటుక్కున లేచి తలుపు చాటుకుపోయి నిలబడింది.

“మాటలతో సమసిపోయే కష్టం కాదు నీది. చెట్టంత మనిషిని పోగొట్టుకుంటే ఎలా ఉంటుందో నేనూహించగలను...” సైకిల్‌ని ఒక పక్కన వదిలి, గుడిసెముందు నిలబడుతూ మృదువుగా అన్నాడు షాడో.

కత్తీ వింది. చుట్టూ జనం అంతా విన్నారు....

“నీకు కలిగిన నష్టాన్ని నేను సరిచేయలేను. ఈ పని చేసిన బద్రీనాథ్‌ని వదిలేశానని అందరూ అనుకుంటున్నారు. ఎందుకు వదిలేశానో ఎవరికీ తెలియదు” ఒక్కొక్క మాటను ఆచితూచి వాడుతూ అన్నాడు షాడో.

“ఎందుకయ్యా ఉపయోగం లేని మాటలు? ఆ బద్మాష్‌ని వదిలినందుకు ఆ తోతాపురి నీకు దండిగా ముట్టచెప్పే వుంటాడు. మాకు తెలుసు” ఉన్నట్లుండి అన్నాడు గుంపులో ఉన్న ఇంకో మనిషి.

“అవును. అతి కష్టం మీద ఎనభైవేల రూపాయలు ఇచ్చాడు” అంటూ ప్యాంటుజేబులోనించి ఆ నోట్లకట్టల్ని తీసి గుడిసె గుమ్మంమీద పెట్టాడు షాడో.

“పోయిన నీ భర్తకి శాస్త్రోక్తంగా సంస్కారాలు చేయించు. మిగిలిన డబ్బుతో నీ జీవితాన్ని సరైన దారిలో పెట్టుకో” అని చెప్పాడు. ఆ నోట్ల కట్టల విలువను గ్రహించి, ఆశ్చర్యంగా చూశారు చుట్టూ గుమికూడిన జనం.

“మరి మరి ఆ బద్మాష్ సంగతి?” అడిగాడు మొదట గుంపులో నుండి మాట్లాడిన మనిషి.

“అతన్ని తీసుకుపోయి ఉరి తీయిస్తాననుకో... పోయిన మీ మనిషి తిరిగి వస్తాడా? కత్తీ జీవితం సుఖవంతం అవుతుందా?” అతనిని అడిగాడు షాడో.

"అలాగని వాడిని వదిలేస్తావా?" అడిగాడా మనిషి.

చిన్నగా నవ్వి తల అడ్డం తిప్పాడు షాడో. "నామీద నమ్మకం వుంచండి... ఎవరూ తప్పించుకోలేరు... కొంచెం టైమ్ కావాలి... తిరిగి ఇటువంటి పనులు ఈ ఏరియాలో జరగకుండా చూసే బాధ్యత నాదే..." అన్నాడు.

"ఏం చేస్తావో చెప్పు" మొండిగా రెట్టించాడా మనిషి.

"చేసిన తర్వాత చెప్తాను.... ఇప్పుడు చెప్పను... నేను వచ్చిన పని అయిపోయింది. ఇంక వెనక్కి వెళ్ళచ్చా?" అడిగాడు షాడో. ఏం చెప్పాలో ఆ మనిషికే కాదు. అక్కడ వున్నవారిలో ఎవరికీ తెలియలేదు.

తిరిగి సైకిల్‌ని తీసుకొని గుట్ట దగ్గరికి బైలుదేరాడు షాడో. ఈసారి నలభై నిముషాలే అవసరమయ్యాయి స్టేషన్ దగ్గరికి చేరుకోవటానికి. సైకిల్‌ని కుందూకి అప్పగించి– ద్వారంలోకి అడుగుపెట్టగానే కనిపించారతనికి లోపల వున్న కులకర్ణిగారు.

ఆరిపోయిన సిగార్‌ని పంటికింద నొక్కిపెట్టి, ఇంకోసారి వెలిగించుకోవటానికి మహా సీరియస్‌గా ప్రయత్నం చేస్తున్నారు ఆయన. "నువ్వు ఒక డండర్ హెడ్‌వి.... ఎందుకూ పనికిరాని మైండ్‌లెస్ ఇడియట్‌వి. అన్నిటినీ మించి పెద్ద ఇగోయిస్ట్‌వి. ఇవి చాలా? ఇంకేమైనా చెప్పమంటావా?" గుమ్మంలో ప్రత్యక్షం అయిన షాడోని చూడగానే కోరగా చూస్తూ మొదలుపెట్టారు.

స్పీడ్‌గా సైకిల్ తొక్కుకుంటూ రావటం వల్ల చెమటలు పట్టి ఉన్నాయి షాడోకి. షర్టు సగం తడిసిపోయింది. అనుకోని విధంగా ప్రత్యక్షమై వున్న ఆ పెద్దమనిషిని చూడగానే చెమటలు ఇంకా ఎక్కువైపోయాయి.

"వాళ్ళని వీళ్ళని దోచుకోవటంతో ఆగకుండా ఇంపర్సనేషన్ పనులు కూడా మొదలుపెట్టావన్నమాట... ఇప్పుడు నువ్వు ఆడుతున్న నాటకం గురించి ప్రభుత్వానికి తెలిస్తే ఏమవుతుందో ఊహించగలవా?" కనుబొమ్మల మధ్యలోనించి చిరుతపులిలాగా చూస్తూ అడిగాడు కులకర్ణి.

"ఎందుకుసార్ ఊరికే డైలాగులు వదిలి మమ్మల్ని అదరగొడుతారు? మా గుట్టు బయటపడితే ఏమైనా చేయటానికి అసలు మేం మీకు దొరకాలికదా!" సన్నగా అన్నాడు ఒక పక్కగా నిలబడివున్న గంగారాం.

"షట్ యువర్ బ్లడీ మౌత్.... కీప్ క్వయిట్" తాచుపాము మాదిరి చివ్వున అతనికేసి తలతిప్పి రంకెవేసినంత పనిచేశారు కులకర్ణి. అంతకు ముందు వరకూ కొంచెం విసురుగానే వీస్తున్న గాలి, ఉన్నట్లుండి ఆగిపోయిన అనుభూతి షాడోని ఆవరించుకుంది. ప్యాంటుజేబులో చెయ్యి పెట్టి సిగరెట్ ప్యాకెట్‌ని బయటికి తీశాడు.

"బుద్ధిజ్ఞానం ఉన్న పబ్లిక్ ఫిగరెవరూ ప్రత్యేకమైన పాట్రన్స్‌ని క్రియేట్ చేసుకోరు. అందరూ మంచి పనులు చేసి పేరు తెచ్చుకుంటుంటే– నువ్వు వెధవ పనులు చేసి మొనగాడిలాగా చెలామణీ అవుతున్నావు. ఎప్పుడు చూసినా ఒకే బ్రాండ్ సిగరెట్‌ని ఉపయోగిస్తే అది ఎప్పుడో నీ కొంప ముంచుతుంది. తెలియదా నీకు" ఉన్నట్లుండి సబ్జక్ట్‌ని మార్చి సీరియస్‌గా అడిగారు కులకర్ణి.

పనామా సిగరెట్స్ అంటే తనకు మహా ఇష్టమని ఆయనకి ఎలా తెలిసిందోనని ఆశ్చర్యపడలేదు షాడో. కామ్‌గా సిగరెట్ వెలిగించుకున్నాడు.

“భారతదేశపు రాజ్యాంగాన్ని, ఆ రాజ్యాంగం ఆమోదించిన క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ని గౌరవించే అధికారిగా ఇప్పుడు నిన్ను ఇప్పటికిప్పుడు అరెస్టు చేయించాలి. రెజిస్ట్ చేస్తే కాల్చి అవతల పారేయాలి...” సడెన్‌గా ఇంకో రూట్‌లోకి అడుగుపెడుతూ అన్నారు కులకర్ణి.

సిగరెట్ పొగను గుండెలనిండా పీల్చుకుని రింగులు రింగులుగా బయటికి వదులుతూ నిర్వికారంగా నిలబడ్డాడు షాడో. గంగారాం మాత్రం ఆ విషయాన్ని లైట్‌గా తీసుకోలేకపోయాడు. దగ్గర్లో ఉన్న ఒక చెక్కబల్లను అమాంతంగా గాల్లోకి ఎత్తి కులకర్ణిగారి మీదికి విసరాలన్నంత కోపం అతన్ని ఆవరించుకుంది.

“నువ్వేంటో నీ బతుకేంటో నీ బుద్ధేంటో నాకు బాగా తెలుసు. పిచ్చి ఆలోచనలు చేస్తే ఒళ్ళు పాడయిపోతుంది. కదిలావంటే కాళ్ళు చేతులు విరిగిపోతాయ్...” తలతిప్పి చూడకుండానే అతని ఆలోచనల్ని వెంటనే గ్రహించి, కామ్‌గా ఎనౌన్స్ చేశారు కులకర్ణిగారు.

“అహ్మదాబాద్‌లో ఇన్స్‌పెక్టర్ సంతోష్ గురించి నాకు తెలిసింది. ఇక్కడికొచ్చిన తర్వాత విషయం పూర్తిగా అర్థం అయింది” ఎంత ట్రై చేసినా వెలగని సిగార్ పీకవైపు నిశితంగా చూసి విసిరేసి, మరో కొత్తదాన్ని బయటికి తీస్తూ అన్నారు కులకర్ణి.

“మనదేశం బానిసత్వం నుంచి బయటపడటానికి గల కారణాల్లో– దేశం నలుమూలలా ఉన్న ప్రజలందరూ ఒకటి అవటం అనేది మొదటిది. అలా ఒకటి కావటనికి గల కారణాల్లో రైల్వే వ్యవస్థ మొట్టమొదటిది.

రైళ్ళే గనక లేకపోతే ఇప్పటికీ మనం ఒకటి అయి ఉండేవాళ్ళం కాదు. నేను చెప్పదలుచుకున్నది నీకు అర్థం అవుతోందా?” సిగార్ వెలిగించుకుని పొగను గుప్పు గుప్పున వదులుతూ అడిగారు కులకర్ణిగారు.

“ఒక్క ముక్క అర్థం అయితే నా పేరు మార్చుకుంటా” అనుమానంగా చూస్తూ అన్నాడు గంగారాం.

గబగబా రెండు పీల్పులు పీల్చి సిగరెట్‌ని అవతలికి విసిరేసి, గుమ్మాన్ని ఆనుకుని నిలబడ్డాడు షాడో.

“సో... ఇన్స్‌పెక్టర్ సంతోష్ ప్లేస్‌లో నువ్వు నిలబడటాన్ని నేను తప్పు పట్టలేకపోతున్నాను... నువ్వు ఏం చేయదలుచుకున్నావో అది త్వరగా చేసేయ్... ఈలోపల తోతాపురి తోక ఝాడిస్తే అడ్డుకోవటానికి నేను అహ్మదాబాద్‌లోనే ఉంటాను. పని పూర్తి అయిపోయిన తర్వాత మనం కాస్సేపు మాట్లాడుకోవాలి. ఓ.కే.నా?” చెక్కబల్ల మీది నించి లేచి నిలబడుతూ అన్నారు కులకర్ణి.

సమాధానం ఇవ్వలేదు షాడో... అలాగే చూస్తూ గుమ్మం దగ్గిరే నిలబడిపోయాడు. అతని పక్కనించి వీధిలోకి వడివడిగా అడుగులు వేశారు కులకర్ణి.

"ఎక్కువసేపు నేను ఇక్కడే ఉంటే అందరికీ అనవసరమైన అనుమానాలు వస్తాయి... ఎవరికంటా పడకముందే వెళ్ళిపోవాలి. విష్ యూ ఆల్ ది బెస్ట్" అంటూ చకచకా అడుగులు వేసి చీకట్లో కలిసిపోయారు.

మహా మహా వృక్షాల్ని సైతం అల్లల్లాడించగల పెనుదుమారం ఒకటి తమ పక్కనించి అవతలికి వెళ్ళినట్టు తేలికగా నిట్టూర్చి స్టేషన్‌లోకి అడుగుపెట్టాడు షాడో.

"ఆ ముసలాడు అంతంత మాటలు అంటుంటే బెల్లం కొట్టిన రాయిలా ఉలుకూ పలుకూ లేకుండా నిలబడి పోయావేంటి గురూ? నాకు ఎంత కోపం వచ్చిందో తెలుసా?" దగ్గిరగా వస్తూ అన్నాడు గంగారాం.

ఎలాంటి సమాధానమూ చెప్పలేదు షాడో. కుర్చీలో కూర్చుని టేబిల్ మీద కాళ్ళు పెట్టుకున్నాడు.

"అయినా నాకు తెలియక అడుగుతాను... ఎక్కడో మారుమూలన ఉన్న ఈ ఏరియాలో రైలు దొంగతనాలు జరిగితే– దేశం నాశనం అయిపోతుంది– వ్యవస్థ పాడైపోతుంది అని అనటం ఏమిటి?" పట్టినపట్టు వదలకుండా రెట్టించాడు గంగారాం. అప్పటికీ పెదవులు విప్పలేదు షాడో... చిరాకుగా తల విదిలించాడు.

"మాట్లాడటం ఇష్టం లేకపోతే ఆ సంగతి మాటల్లో చెప్పచ్చు గదా. తల విసరటాలు, చిరాకుపడటాలు దేనికి?" చిన్న మొఖం చేసుకుంటూ గొణిగాడు గంగారాం.

“ఆకలి దంచేస్తోంది. తినటానికి ఏదోటి కావాలి” ప్యాంటు బెల్టును తీసి అవతలికి విసిరేస్తూ అన్నాడు షాడో.

“తుల్జీబాయి మన మొఖాల మీద చాట కొట్టేసింది. అక్కడికిపోతే మనకి మంచినీళ్ళు కూడా దొరకవు. బడ్డీ కొట్టోడిని బెదిరించి బ్రెడ్ తీసుకువచ్చాను” అంటూ లాకప్ గది దగ్గిరపెట్టిన బ్రెడ్ ప్యాకెట్స్‌ని టేబిల్ మీదికి తెచ్చిపెట్టాడు గంగారాం.

రెండు సత్తుగ్లాసుల్లో చల్లారిపోయిన టీ ఉంది.

ఒక అలమరలో ఉన్న ఫైల్స్‌లోనించి గుప్పెడు కాయితాన్ని తీసి చిన్న మంటచేశాడు. గ్లాసుల్ని ఆ మంటమీద పెట్టి చల్లారిపోయిన టీని వెచ్చబెట్టాడు.

నాలుగో బ్రెడ్ స్లయిస్‌ని ఆరగిస్తున్న సమయంలో నెమ్మదిగా లోపలికి వచ్చాడు కుందూ.

“ఊరంతా తిరిగాను మీకు ఆహారమివ్వటానికి ఎవరూ ఒప్పుకోవడం లేదు.... పచారీ కొట్టు దగ్గర్నించి సరుకులు తీసుకువచ్చి నేనే రొట్టెలు చెయ్యనా?” అడిగాడు.

“నువ్వు తిన్నావా?” అడిగాడు షాడో.

“వద్దు వద్దన్నకొద్దీ తుల్జీబాయి బలవంతంగా తినిపించింది” తల వంచుకుని చెప్పాడు కుందూ.

“సరే... నువ్వు వెళ్ళిపడుకో మమ్మల్ని డిస్టర్బ్ చెయ్యకు” సత్తుగ్లాసు అడుగున ఉన్న గుక్కెడు టీని గొంతులోకి ఒంపుకొని అతనికి చెప్పాడు షాడో.

"విశేషం ఏమైనా ఉన్నదా గురూ?" అతనికి మాత్రమే వినిపించేటట్లు అడిగాడు గంగారాం. "మెడమీద కత్తిపెట్టి మనం తోతాపురి దగ్గిర బోలెడు డబ్బు వసూలు చేశాం. అది అతనికి నచ్చినట్టు లేదు. వెనకనించి ఏదో దెబ్బ కొట్టడానికి చూస్తాడు" అన్నాడు షాడో.

"ఏడిచాడు... మన ముసలాయన అహ్మదాబాద్‌లోనే ఉంటానని అన్నాడు గదా... వీడు ఇంకా చెయ్యగలిగింది ఏముంది?" అడిగాడు గంగారాం.

"అదే మనం తెలుసుకోవాలి... చీకటిపడిన తర్వాత ఊరి బయటికి రమ్మన్నాడు గదా... పోయి వద్దాం" అంటూ కుర్చీలోనించి లేచాడు షాడో.

పరమ సంతోషం అయిపోయింది గంగారాంకి.

"నీకు ఎలా ఉందోగాని, నాకు మాత్రం ఇక్కడ జైల్లో పెట్టినట్టుంది. ఎకాఎకీన ఎదురుపడి అటో ఇటో తేల్చుకోవడమే బెస్టు" అంటూ రెండే రెండు నిముషాల సమయంలో తను కూడా తయారైపోయాడు.

దూరంగా విసిరిన ప్యాంటు బెల్టుకు అటాచ్ చేయబడి ఉన్న హోల్‌స్టర్‌లోనించి రివాల్వర్ తీసి ప్యాంటు వెనుక భాగంలో భద్రపరుచుకున్నాడు షాడో. సిగరెట్ వెలిగించుకుని స్టేషన్ బయటికి వచ్చాడు. నిర్మానుష్యంగా ఉన్నాయి వీధులు. కటిక నిశ్శబ్దంతో నిండి ఉన్నాయి.

*  *  *  *  *

"కరాచీ నుంచి ఖరీదయిన మాల్ మనకి వస్తుంది. బోర్డర్ సెక్యూరిటీవాళ్ళ కళ్ళు కప్పి రైల్వేలైన్ వరకూ తీసుకు వస్తారు. అక్కడ మనం దాన్ని హేండోవర్ చేసుకోవాలి. మన బద్రీనాథ్ చేస్తాడు ఆ పని.... నువ్వు అతనికి కాపలాగా

వెళ్ళిరావాలి" అర్ధరాత్రి దాటిన తర్వాత చెట్లతోపు దగ్గిరికి వచ్చి చెప్పాడు తోతాపురి.

షాడో మౌనంగానే ఉన్నాడు గాని, ఊరుకోలేకపోయాడు గంగారాం. "ఈ పని చేయడం వల్ల మాకు జరిగే ఉపయోగం ఏమిటి?" అని అడిగేశాడు.

మీదపడి కొట్టేంత సీరియస్‌గా చూశాడు తోతాపురి. "మీ గురించి బయటికి చెప్పకపోవటమే ఆ ఉపయోగం" పళ్ళు బిగపెడుతూ అన్నాడు అతను.

"చూడు భాయీ.... పాడిందే పాట పాచిపళ్ళ దాసుడా అనే సామెత ఒకటుంది. చెప్పిందే చెప్పి, అదే పనిగా బెదిరించి మాచేత నువ్వు పనులు చేయించుకోలేవు. నీకు మాకు ఉన్న ఒప్పందం ఊళ్ళో జరిగే పనులవరకే.

"పొలిమేరలు దాటామంటే మాకు ఏదో ఒక ఫాయిదా ఉండాల్సిందే. మనకు వేరే దారిలేదు" మొండిగా చెప్పాడు గంగారాం. ఎంతో ప్రయత్నం మీద తనకు వచ్చిన కోపాన్ని అదుపులో పెట్టుకున్నాడు తోతాపురి.

"అచ్చాహై భాయీ... బహుత్ అచ్చాహై... ఇద్దరికీ కలిపి ఇరవైవేలు ఇస్తాను. పోయిరండి" అని చెప్పి, ఆ పైన అక్కడ ఆగకుండా తన టాంగా ఎక్కి వెళ్ళిపోయాడు.

అరనిముషం తర్వాత పూర్తి కండిషన్‌లో ఉన్న జీప్‌లో అక్కడికి వచ్చి స్నేహితులిద్దరికీ సైగ చేశాడు బద్రీనాథ్. కామ్‌గా అతని పక్కన కూర్చున్నాడు షాడో... వెనకాల వున్న మరో నలుగురు దృఢకాయుల మధ్య సర్దుకున్నాడు

గంగారాం. ఖచ్చితంగా ఒక గంట తర్వాత రైల్వేలైన్ దగ్గరికి పోయి, పెద్ద బండరాయి పక్కన ఆగింది జీప్.

"మేము వెళ్ళి సరుకు తీసుకువస్తాం. మీరిద్దరూ ఇక్కడే ఉండండి" అంటూ జీప్ దిగి తన సహచరులతో కలిపి పొదల్లోకి వెళ్ళిపోయాడు బద్రీనాథ్.

అప్పుడు సరిగ్గా అతను అవతలికి వెళ్ళినప్పుడు ఒక్కసారిగా జలదరించింది షాడో శరీరం.

చలిగాలి వీచినట్లు అనుభూతి. కంటికి కనిపించని ప్రమాదం ఏదో తమని చుట్టుముట్టబోతున్నట్టు– వార్నింగ్స్ ఇవ్వడం మొదలుపెట్టింది సిక్త్‌సెన్స్.

"గెటవుట్ గంగూ... గెట్ ది హెల్ అవుటాఫ్ హియర్" క్షణకాలం కూడా ఆలస్యం చేయకుండా గంగారాంని హెచ్చరించాడు అతను. షర్టు వెనుక రహస్యంగా దాచిన రివాల్వర్‌ని బయటికి తీయబోయాడు.

అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది. బండరాయి వెనుకనించి మూకుమ్మడిగా వచ్చి అతన్ని చుట్టుముట్టారు పదిమంది దృఢకాయులు. రివాల్వర్‌ని బయటికి తీస్తున్న అతని చేతిమీద బలంగా కొట్టాడు ఒక వ్యక్తి.

పిడికిలి బిగించి మొఖంమీద బాదాడు మరొక వ్యక్తి. లావుపాటి చెట్టుకొమ్మతో కాళ్ళను గాయపరిచాడు మరొకతను. కన్నుమూసి కన్ను తెరిచేటంతలో జరిగిపోయిందా సంఘటన. కళ్ళముందు టెక్నికలర్ నక్షత్రాలు ప్రత్యక్షం అవుతుండగా కిందపడిపోయాడు షాడో.

"పట్టుకొండిరా... ఆ రెండో బద్మాష్‌ని కూడా పట్టుకోండి" పడిపోయిన షాడో కాళ్ళు చేతుల్ని కదలకుండా బంధిస్తూ ఆర్డర్ ఇచ్చాడు లీడర్‌లాంటి వ్యక్తి.

బుల్‌డోజర్ల మాదిరి అడ్డం వచ్చిన పొదల్ని విరగదొక్కుకుంటూ పరుగు మొదలుపెట్టాడు గంగారాం. ఎంతవేగంగా పరిగెత్తినా వెనకాల వస్తున్నవాళ్ళని వదిలించుకోవడం ఇంపాజిబుల్ అని అర్థం అయింది అతనికి.

"అయిపోయిందిరా వాడి పని... పరిగెత్తండి... దొరికిపోతాడు" వెనుక నుంచి వినవచ్చాయతనికి ఆ మాటలు. ఎక్కడివాడక్కడ ఆగిపోయి ఆ మాటలన్న మనిషి మొఖం పగలకొట్టేయాలన్నంత కోపం గంగారాంని ఆవరించుకుంది. వివేకం అతని వెన్నుతట్టి హెచ్చరించింది.

కటిక చీకటి... కొత్త ప్రదేశం... ఎటుపక్క ఏముందో తెలియని పరిస్థితి... వెనకపడిన వారికి వత్తాసుగా ఇంకో పదిమంది వచ్చేస్తే? ఎగసుకు వస్తున్న ఆయాసాన్ని అతిప్రయత్నం మీద అదుముకుంటూ అలాగే ముందుకు పోయాడు అతను. పాతిక గజాల దూరం పోయిన తర్వాత తెలిసివచ్చింది అతనికి ఒక విషయం.

గట్టిగా ఉండే నేల అంతం అయిపోయింది. చీలమండల్ని దాటి ఒక జానెడు దూరం వరకూ పాదాలు మునిగిపోయే బురద నేల ప్రారంభం అయింది.

ఆ విషయం అర్థం అయిన మరుక్షణం– అమాంతంగా పక్కకు దూకి, బురదలో పెరిగే ఒక ముళ్లపొద దగ్గిర బోర్లాపడిపోయాడు అతను. రెండే రెండు క్షణాల్లో ఇటుకరాయి మాదిరి ఆ బురదలో కూరుకుపోయాడు.

“వెయ్యండిరా... టార్చిలైటు వేయండి” గంగారం పడిపోయిన ప్రదేశానికి పది అడుగుల దూరంలో నిలబడుతూ అన్నాడు ఒక దృఢకాయుడు.

దుస్తుల్లోనించి సన్నపాటి పెన్‌టార్చిని బయటికి తీసి చుట్టూ ఫోకస్ చేశాడు ఇంకో వ్యక్తి. ఛట్‌మని అతని చేతి మీద బలంగా కొట్టాడు మరో మనిషి.

“బుద్ధిలేని అడ్డగాడిదవి. టార్చి వెలుగు రైల్వే లైను మీదికి కనిపిస్తే కొంపలు అంటుకుంటయ్. రైలు రావటానికి ఎంతో టైమ్ లేదు” అంటూ హెచ్చరించాడు.

“లావుగా గుండ్రాయి మాదిరిగా ఉన్నాడు ఈ మనిషి. ఎంతో దూరం పరిగెత్తలేడని అనుకున్నాను. ఇంత సడన్‌గా ఎలా మాయం కాగలిగాడు?” బురదలో పడిపోయిన టార్చిని తీసుకుంటూ అడిగాడు దెబ్బతిన్న మనిషి.

“వెనక్కి పోయి చెపుదాం. ఏం చేయాలో తనే చూసుకుంటాడు” అంటూ వెనుతిరిగాడు కొట్టిన వ్యక్తి.

మరో పదిక్షణాల పాటు ఆ ప్రదేశాన్నంతా కలియచూసి, నెమ్మదిగా వెనుతిరిగారు అందరూ. వాళ్ళు తనకు దూరంగా వెళ్ళిపోయారని నమ్మకం కుదిరిన తర్వాత నెమ్మదిగా లేచి కూర్చున్నాడు గంగారాం. ఒంటికి అంటుకుని వున్న బురద దుర్వాసన వెలువరుస్తున్నా లెక్క చేయకుండా వచ్చిన దారినే వెనక్కి బయలుదేరాడు.

*    *    *    *    *

పట్టుపడిన ఇరవైరెండో నిముషంలో తెలివి వచ్చింది షాడోకి. స్పృహ తెలిసిన వెంటనే కళ్ళు తెరిచి చూడలేదతను. కాళ్ళు చేతుల్ని కదిలించలేదు.

నిశ్శబ్దంగా ఉంది వాతావరణం. పొదల్లో ఉన్న చిమటల వంటి పురుగులు కూడా ఎటువంటి శబ్దాలు చేయటంలేదు. అంటే వాటికి కూడా ఇబ్బంది కలిగించే విధంగా ఉన్నదన్నమాట పరిస్థితి. కదలికలు బయటికి కనిపించకుండా పాదాల్ని కదిలించటానికి చూశాడు.

చేతుల్ని కూడా టెస్ట్ చేసుకున్నాడు.

అంగుళంలో పావువంతు కూడా కదలటానికి వీలులేకుండా బంధింపబడి ఉన్నాయి అవి. మొఖం మీద పడిన దెబ్బ మూలంగా ముక్కు చెదిరి ఎర్రటి రక్తం షర్టు మీదికి జారుతోంది– అతి నెమ్మదిగా...

జీప్ దగ్గిర తమను నిలబెట్టి పొదల్లోకి పోయిన బద్రీనాథ్‌కి ఆ విషయం తెలిసిందో లేదో అర్థం కాలేదు అతనికి. కరాచీ నుంచి వచ్చే స్మగుల్డ్ సరుకును బద్రీనాథ్ దగ్గిర్నించి ఎగరేసుపోవటానికి వచ్చారు తనమీద దాడి చేసిన వాళ్లు? వేగంగా కొట్టుకోవటం మొదలుపెట్టిన గుండెల్ని అతిప్రయత్నం మీద చిక్కబట్టుకుని, చెవులు మరింతగా రిక్కించాడు అతను.

చీమ చిటుక్కుమన్నా పెద్దగా వినిపించేటంత ఆ నిశ్శబ్దంలో, పదిక్షణాల తరువాత అతని చెవులకి చేరింది– నలుగురు వ్యక్తులు గట్టిగా నిట్టూరుస్తున్న సవ్వడి.

‘‘ఏమైందిరా మీకు?’’ ఆ వెనుకే వినవచ్చిందో కంఠం.

‘‘ఎంతసేపు ఇక్కడ కూర్చోవాలి? బోరు కొట్టేస్తోంది’’ గొణిగింది ఇంకో కంఠం అదే స్థాయిలో.

“ఎంతసేపైనా కూర్చోవాల్సిందే. బోరు గీరు అంటూ పిచ్చి మాటలు మాట్లాడకండి. రైల్వే పోలీసులు మహా పట్టుదలగా తిరుగుతున్నారు. అలికిడి వినిపిస్తే చాలు రాబందుల మాదిరి మందగా ఇక్కడికి వచ్చిపడిపోతారు” హెచ్చరించింది మొదటి కంఠం.

ఝల్లుమంది షాడో శరీరం. బద్రీనాథ్‌తోపాటు వచ్చి– రైలు దొంగతనాలు చేసే ముఠాకి చిక్కిపోయాడాతను? ఆ ప్రశ్నకి సమాధానం లభించక ముందే, నేల అదురుతున్నట్టు ఒక చిన్న వైబ్రేషన్‌ని పసికట్టింది అతని శరీరం. రైల్వేట్రాక్‌కి దగ్గిరిగా ఉన్నాడు తను.

రైలు ఏదో ఇటువైపుగానే వస్తోంది. శబ్దం కంటె కొంచెం ముందుగానే వైబ్రేషన్స్ వస్తున్నాయి.

ఆ మాట అతను అనుకుంటున్న సమయంలోనే మొదట అస్పష్టంగా, ఆ తర్వాత అతిస్పష్టంగా వినవచ్చిందొక శబ్దం. దడదడమనటం మొదలుపెట్టాయి పట్టాలు.

“రెడీ... అందరూ రెడీ...” వినవచ్చింది హెచ్చరిక.

ఆపైన కళ్లు తెరవకుండా ఉండలేకపోయాడు షాడో. అతనిమీద దాడి చేసిన వ్యక్తులు అందరూ హడావుడిగా కదులుతున్నారు. పదిగజాల దూరంలోనే ఉన్నది ట్రాక్. లావుపాటి బండరాళ్ళను ఎత్తి ట్రాక్‌కి అడ్డంగా పడేసి, పక్కనే పొదల్లోకి వేగంగా పరిగెత్తారు అందరూ.

ఆ తర్వాత ఏం జరుగుతుందో పని కట్టుకుని ఒకరు చెప్పాల్సిన అవసరం షాడోకి లేకపోయింది.

ట్రాక్ మీద ఉన్న రాళ్ళను చూడగానే స్లో అయిపోయింది ట్రెయిన్. రైపిల్స్‌ని పట్టుకుని అక్కడికి పరిగెత్తుకుంటూ వస్తారు పోలీసులు. వాళ్ళు రాళ్ళని తీసి అవతల పడేస్తున్న సమయంలో వెనుక నుంచి దాడిచేసి తమ పని పూర్తి చేసుకుంటారు ఈ హీరోలు.

షాడో ఆలోచనలు పూర్తికాకముందే జరిగిపోయింది అతను ఊహించింది అంతా. ట్రాక్ మీది రాళ్ళను అవతలికి విసిరేసి, పెద్ద ఘనకార్యం పూర్తిచేసినట్టు మొఖాలు పెడుతున్న పోలీసులకి రెండు నిముషాలు ఆలస్యంగా చేరింది వెనకాల దూరంగా వున్న గార్డు అరుపు.

"దొంగలు... దొంగలు... పట్టుకోండి... పట్టుకోండి"

కిందపెట్టిన రైఫిల్స్‌ని మళ్ళీ చేతుల్లోకి తీసుకొని వాళ్ళందరూ అటుకేసి వేగంగా పరిగెత్తేసరికి, అక్కడ జరగకూడని పని కాస్తా జరిగేపోయింది.

గార్డు ఉన్న కంపార్టుమెంట్‌కి మూడు బోగీల ఇవతల ఉన్న వాగెన్ తాళాలు పగలగొట్టి పాతిక లక్షలు విలువ చేసే సరుకును స్వాధీనం చేసుకున్నారు దొంగలు. పొదల్లోకి పరుగుతీసి మటుమాయం అయిపోయారు.

పవర్‌ఫుల్ టార్చిలైట్లను పట్టుకుని అటూ ఇటూ పరుగులు తీస్తున్న పోలీసుల్ని చూసేసరికి, మొట్టమొదటిసారిగా షాడోకి అవగతం అయింది– తోతాపురి తనని అక్కడికి ఎందుకు పంపించాడో.

అటు తిరిగి ఇటు తిరిగి తన దగ్గరికి వస్తారు పోలీసులు. కట్లు ఊడతీసి తాగటానికి మంచినీళ్ళు ఇస్తారు. ఆ తర్వాత జరిగింది ఏమిటో తను అధికారులకు చెప్పటంకోసం తనని వెంటబెట్టుకుని తీసుకుపోతారు.

మొదటిచూపులోనే తను సంతోష్ కాదని అందరికీ అర్థం అయిపోతుంది. అంతవరకూ స్మూత్‌గా నడిచిన కథ ఒక్కసారిగా అడ్డం తిరిగుతుంది.

సడన్‌గా టార్చివెలుగు తన ముఖం మీదికి ప్రసరించటంతో అంతం అయిపోయాయి షాడో ఆలోచనలు.

"హేయ్... ఎవరక్కడ? ఎవరు?" ఆశ్చర్యంగా, అనుమానంగా అడుగుతూ నలుగురు పోలీసులు తనకేసి రావటం కనిపించింది అతనికి.

నేర్పుగా తనని ఇరికించిన తోతాపురి తెలివికి మనసులోనే జోహార్ చేస్తూ పట్టుబడిపోవటానికి రెడీ అయ్యాడు షాడో. దాదాపు పది గజాల దూరంలోకి వచ్చేశారు పోలీసులు. మరో పది అడుగులు వేస్తే అతని ముఖం చాలా స్పష్టంగా కనిపిస్తుంది వారికి. సడన్‌గా అతనికి ఎడమవైపు నుంచి వినవచ్చింది ఒక అరుపు. "దొంగ... దొంగ... దొంగ... పట్టుకోండి.... పట్టుకోండి" అని–

పెద్ద పెద్ద అడుగులు వేస్తూ వస్తున్న పోలీసులు అదిరిపడి అటుకేసి చూశారు. మళ్ళీ వినవచ్చిందా అరుపు. "పట్టుకోండిరోయ్... పారిపోతున్నారు"

ఎదుట ఉన్న అపరిచిత ఆకారాన్ని గురించి మర్చిపోయి స్పీడ్‌గా అటుకేసి పరిగెత్తారు వాళ్ళు.

వాళ్ళు అటుపోవటం– బురద నిండిన శరీరంతో గంగారాం షాడో పక్కన ప్రత్యక్షం అవటం ఒకేసారి జరిగింది. అతని కాళ్ళు చేతుల్ని బంధించి ఉన్న బంధనాల్ని వదిలించే ప్రయత్నం చేయలేదతను. అమాంతంగా భుజం మీద వేసుకుని పరుగు మొదలుపెట్టాడు.

*　　　*　　　*　　　*　　　*

"ఏరా కుందూ? ఏడిరా మీ ఇన్స్‌పెక్టరు?" ఉదయం ఎనిమిది గంటల వేళ టాంగాలో స్టేషన్ దగ్గరికి వచ్చి, కిందికి దిగకుండానే అడిగాడు తోతాపురి.

"ముఖ్యమైన పని ఉందని చెప్పి రాత్రి ఎక్కడికో వెళ్ళారు. ఇంకా రాలేదు" ఇబ్బందిగా చూస్తూ సమాధానం ఇచ్చాడు– స్టేషన్ ముందు నిలబడిన కుందూ.

"ఇంక రారురా... రాత్రి మళ్ళీ ఇంకో రైలు దోపిడీ జరిగిందిట. అసలు నన్ను అడిగితే ఆ పని చేసింది మీ ఇన్స్‌పెక్టరే అయి ఉంటాడు" నవ్వుతూ అన్నాడు తోతాపురి.

"కాదు... మా ఇన్స్‌పెక్టర్ అసలు అలాంటివాడు కాదు" అతనితో మొండిగా అన్నాడు కుందూ.

"ఇంకో రెండు గంటలు ఆగితే– రైల్వే పోలీసులు వచ్చి నీకే చెపుతారు. చూస్తూ ఉండు" అంటూ టాంగా డ్రైవర్‌కి సైగ చేశాడు తోతాపురి.

సన్నగా పొడుగ్గా ఉన్న వెదురుచువ్వను గాలిలోకి విదిలించాడు టాంగా డ్రైవర్. చర్మపు కొరడాలా ఛట్మని వినవచ్చింది శబ్దం. పెద్దగా సకిలించి టాంగాని ముందుకు లాగాల్సిన గుర్రం– ఈసారి చెవుడు వచ్చినట్టు అలాగే నిలబడింది.

"ఛల్‌రే– ఛల్ ఛల్‌రే బద్మాష్... ఛలో" వికృతమైన కంఠంతో హెచ్చరిస్తూ వెదురుచువ్వలతో ఒకటి అంటించాడు డ్రైవర్.

సకిలించడమైతే సకిలించింది గుర్రం. ముందు పాదాలను గాలిలోకి ఎత్తి సర్కస్ గుర్రంలాగా ఒక ఫోజు ఇచ్చింది. అడుగు మాత్రం ముందుకు వేయలేదు.

"అరే సైతాన్‌కి బచ్చే... ఏమైందిరా ఇవాళ నీకు?" ఆశ్చర్యంగా టాంగా మీదినించి కిందికి దూకి, దాని కళ్ళేలను పట్టుకుని ముందుకు లాగాడు డ్రైవర్.

తలను కిందికి వంచి సడెన్‌గా అతని గుండెలమీద పొడిచింది అది. గారపట్టి వున్న నోటిలోని దంతాలన్నీ కనిపించేటట్టు నోరు తెరిచి, భుజాన్ని పట్టుకుని గట్టిగా పీకబోయింది "బాప్‌రే బాప్... దీనికి దయ్యం పూనింది.

నడవటానికి ఓపికలేని ఈ ముసలి ఘోడాకి మీదపడి రక్కేంత కోపం వచ్చిందంటే నిజంగా పిచ్చిపట్టినట్టే" కంగారుగా అంటూ వెనక్కి దూకాడు డ్రైవర్.

"ఏమిటిరా ఆలస్యం? ఏంటి సంగతి?" విసుగ్గా మొఖం పెడుతూ కసురుకుంటున్నట్టు అడిగాడు తోతాపురి.

అలా అడుగుతున్న సమయంలో ప్రసరించిందతని చూపు– పాతిక అడుగుల దూరంలో ఉన్న బడ్డీకొట్టు మీదికి. సిగరెట్లు, బీడీలు, జర్దాకిళ్ళీలే కాదు– ప్లాస్కులో పోసి ఉంచిన టీని కూడా సప్లయి చేసే బంక్ కూడా అది– టీ తాగేవాళ్ళు తాపీగా కూర్చోవటానికి ఒక చెక్కబల్ల ఏర్పాటు చేసి ఉంది దాని పక్కభాగంలో.

ఆ బల్లమీద కూర్చుని సెగలు వెలువరిస్తున్న చాయ్‌ని ఆర్చుకు ఆర్చుకు తాగుతున్నాయి రెండు ఆకారాలు. తల దగ్గర్నించి పాదాలదాకా చిక్కటి బురదతో నిండి పొట్టిగా, లావుగా ఉన్న ఆకారం. నలిగిన యూనీఫాంతో, రక్తపు చారికలు ఉన్న మొఖంతో ఏదో బుల్‌డోజర్ కిందపడి అదృష్టవశాత్తు బతికి బట్ట కట్టినట్టు అగుపిస్తోంది రెండో ఆకారం. "ఎవరు బే వీళ్ళు? ఎప్పుడూ చూసినట్టులేదు" అనబోతూ ఆఖరిక్షణంలో ఆ మాటల్ని మింగేశాడు తోతాపురి.

చిత్తడి నేలల్లో పడి పొర్లిగింతలు పెట్టినందువల్ల కాబోలు భరించరానంత దుర్వాసన వస్తోంది ఆ ఆకారాల మీదినించి. ఆ వాసనను భరించలేక ముందుకు పోవటానికి నిరాకరిస్తోంది టాంగా గుర్రం...

"అరే... ఏమయింది ఇన్స్‌పెక్టర్ సాబ్? ఇదీ వేషం ఏమిటి?" విపరీతమైన ఆశ్చర్యంతో తలమునకలు అయిపోతున్నట్టు నటిస్తూ టాంగా దిగాడు తోతాపురి.

గబగబా బడ్డీకొట్టు దగ్గరికిపోయాడు.

"బద్రీనాథ్ ఇల్లు చేరుకున్నాడా?" ఖాళీ అయిన చాయ్ గ్లాసును అవతలపెడుతూ అడిగాడు షాడో.

"ఎప్పుడో వచ్చేశాడు... జీప్ దగ్గిర మీరు కనిపించలేదని రిపోర్టు చేశాడు" చిన్నకంఠంతో చెప్పాడు తోతాపురి. "ఇంతకీ ఏం జరిగింది సాబ్?" అని అడిగాడు.

"రాత్రి మళ్ళీ రైలు దొంగతనం జరిగింది. దొంగల్ని వెంటాడే సమయంలో బురదలో పడి దెబ్బలు తగిలించుకున్నాం. స్టేషన్‌కి పోయి కాస్తంత రెస్ట్ తీసుకున్న

తర్వాత మీతో మాట్లాడతాము.... మీరు వెళ్ళండి'' అప్పటిదాకా మౌనంగా వున్న గంగారాం ఇచ్చాడు ఒక సలహా.

అతని వంక మహాగుర్రుగా చూసి వెనక్కి వచ్చేశాడు తోతాపురి. ''బురద వాసన అసలు భరించలేము సాబ్. వాంతి వచ్చేస్తుంది. గుర్రం ఏమాత్రం ముందుకు కదలదు'' వెంటనే రిపోర్టు చేశాడు డ్రైవర్.

''వెనక్కిపోనీయ్... అది కూడా నేనే చెప్పాలా? పోనీ?'' కోపంగా అంటూ చిన్న జంప్ చేసి టాంగాలో చతికిలపడ్డాడు తోతాపురి. వెదురుచువ్వని విదిలించాల్సిన అవసరం లేకుండానే వెనక్కి తిరిగింది గుర్రం.

పడుచు గుర్రంలా పరిగెత్తి పదిక్షణాల్లో ఆ వీధిలోనుంచి అవతలికి వెళ్ళిపోయింది. ''చేయాల్సింది చేసేసి ఏమీ తెలియనట్టు పరామర్శ చేస్తున్నాడు. వాడు వట్టి దగుల్బాజీ...'' పళ్ళు బిగపడుతూ అన్నాడు గంగారాం.

ఇంకో చాయ్ తాగాలని ఎంతగా అనిపిస్తున్నా, అడిగే ధైర్యం చేయలేకపోయాడు షాడో. మందపాటి కండువాని ముక్కుకు అడ్డంగా పెట్టుకుని ఉన్నాడు బడ్డీ ఓనర్. అది చాలదన్నట్టు మధ్య మధ్యలో జర్దా కిళ్ళీల్లో ఉపయోగించే ఒక మాసాలా దినుసు వాసన చూసుకుంటున్నాడు.

''అడగగానే అవతలికి పొమ్మని కసురుకోకుండా చాయ్ ఎందుకు ఇచ్చాడో ఇప్పుడు అర్థమైంది. సరాసరి తుల్జీబాయి దగ్గరికి పోయి నాస్తా పెట్టమని అడిగితే ఎలా ఉంటుంది?'' అడిగాడు షాడోని గంగారాం.

లావుపాటి ఇనుపగరిటెను పట్టుకుని భద్రకాళిగా కేకలు పెడుతూ మీదిమీదికి వచ్చే తుల్జీబాయి రూపం కళ్ళముందు మెదిలేసరికి జలదరించింది షాడో శరీరం.

"అదృష్టం మనకి అనుకూలంగా ఉన్నప్పుడే అవతలికి పోవటం మంచిది. తేడా వస్తే రిజల్టు ఎలా ఉంటుందో చెప్పలేము" అని చెప్పి, స్టేషన్ వైపు నడవడం మొదలుపెట్టాడు. తాగిన చాయ్‌కి డబ్బులు ఇవ్వడంకోసం పైజామా జేబులో చెయ్యి పెట్టబోయాడు గంగారాం.

"వద్దు. నాకు మీ డబ్బులు వద్దు. ముందు మీరు ఇక్కడినించి అవతలికి పోతే అదే పదివేలు... వెళ్లిపొండి సారూ..." కంగారుగా అన్నాడు బడ్డీ ఓనర్.

"ఇదేదో బాగానే ఉన్నట్టుంది గురూ... మన కుందూని పంపించి ఈ బురదని రెండు బక్కెట్ల నిండా తెప్పించి పోలీస్టేషన్లో పెడదాం. రుబాబు చేయటానికి వచ్చేవాళ్ళు దాని దెబ్బకి హడలి త్వరగా అవతలికి పారిపోతారు" అంటూ షాడోని అనుసరించాడు గంగారాం.

*  *  *  *  *

"కాళ్ళు చేతులు కట్టేసి ట్రాక్ దగ్గిర వదిలిపెట్టామని చెప్పావ్. భుజ్ పట్టణంలో రైల్వేపోలీసులు అడిగే ప్రశ్నలకి సమాధానాలు చెప్పలేక జుట్టు పీక్కుంటూ ఉంటాడని అన్నావ్..." చక్కగా స్నానం చేసి, ట్రిమ్‌గా తయారై వచ్చిన బద్రీనాథ్‌ని అడిగాడు తోతాపురి.

"ఒకసారి నన్ను భుజ్ దాకా వెళ్ళి ఏం జరుగుతుందో చూసి రమ్మంటారా?" అడిగాడు బద్రీనాథ్.

“భుజ్‌దాకా వద్దులే. మన స్టేషన్ దాకా పోయిరా” కసిగా అన్నాడు తోతాపురి. తెల్లబోయాడు బద్రీనాథ్. విషయం అవగతమయ్యేసరికి తెల్లముఖం వేశాడు.

“వాడు సామాన్యుడు మాత్రం కాదు... కోన్‌కిస్కా అనుకుంటే మనమే దెబ్బ తినేటట్టున్నాం. నువ్వు ఒక పని చెయ్యి” సాలోచనగా అన్నాడు తోతాపురి.

“ఏం చేయమంటారు సాబ్... దూరం నించి రైఫిల్‌తో ఇద్దర్నీ కలిపి వేసేయమంటారా?” అని అడిగాడు.

“అది అనుకున్నంత తేలిక కాదనే నా అనుమానం. ముందు మన దగ్గిర ఉన్న సరుకునంతా దూరంగా పంపించేయాలి. వాడు రైల్వేపోలీసులతో ములాఖాత్ అయితే మహా ప్రమాదం” అన్నాడు తోతాపురి.

“అదెంత పని సాబ్? చీకటి పడిన వెంటనే మొదలుపెడతాం. తెల్లారేసరికి పూర్తి అయిపోతుంది... మీరు ఆ ఇన్స్‌పెక్టర్‌గాడిని గమనించకుంటూ ఉండండి” అంటూ బయటికి వెళ్ళిపోయాడు బద్రీనాథ్.

రెండు నిముషాలాగి బయట వెయిట్ చేస్తున్న ఇంకో అనుచరుడిని లోపలికి పిలిచాడు తోతాపురి. “నువ్వు పోయి ఆ ఇన్స్‌పెక్టర్‌ని నేను రమ్మంటున్నానని, అర్జంటుగా చేయాల్సిన పని ఒకటి ఉందని చెప్పు” ఆర్డర్ ఇచ్చాడు.

*　　*　　*　　*　　*

విపరీతమైన ఎండ.... గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండటం వల్ల దారుణమైన ఉక్కపోత... పన్నెండుగంటలు అవటానికి ఇంకో పదినిముషాలు వ్యవధి ఉన్నా పైనుంచి కిందిదాకా తడిసిపోయాడు గంగారాం చెమటలతో.

"ఈ చెమటల కంటె నాకు ఆ బురదే చాలా బాగుంది. వాసన చెడ్డది అయినా, ఒళ్ళు మాత్రం చల్లగా ఉంటుంది" కామెంట్ చేసినట్టు చెప్పాడు గంగారాం.

సిగరెట్ పొగల్ని రింగులు రింగులుగా వదులుతూ ఒక పెద్ద బండరాయిమీద కూర్చుని ఉన్నాడు షాడో.

బింద్రాకి ఉత్తరంగా– పాకిస్తాన్ బోర్డర్‌కి పది కిలోమీటర్లు ఇవతలగా ముళ్లపొదల మధ్యలో ఉన్నారు వాళ్ళిద్దరూ. "పదివేలు అప్పు తీసుకొని రెండు నెలలైంది. మూడే మూడు రోజుల్లో తీర్చేస్తానని చెప్పి, పొదల్లోకి పారిపోయాడు. అతన్ని పట్టుకుని ఆ బాకీ వసూలు చేసి పెట్టాలి. చాలా ముఖ్యం" అని చెప్పాడు షాడోని తన దగ్గరికి పిలిపించుకున్న తోతాపురి తొమ్మిది గంటల సమయమప్పుడు.

"పదివేలు మీకు ఒక లెక్కలోని కాదు. ఇంకొంచెం టైము ఇచ్చి చూడండి" ఏమాత్రం కల్మషం లేకుండా అతనికి సలహా ఇచ్చాడు షాడో.

"పొరపాటున కూడా ఇవ్వను. వీడికి ఇప్పుడు ఇస్తే అందరూ ఇలాగే అడుగుతూ ఉంటారు. నా వ్యాపారం నాశనమైపోతుంది. ఇచ్చిన అప్పు వసూలు

చేసుకోలేని చేతకాని వాడని అందరూ అనుకుంటారు. నువ్వు వెళ్ళి తీరాల్సిందే" ఖరాఖండిగా చెప్పేశాడు తోతాపురి.

వెళ్ళను అంటే అతని నోటివెంట ఎటువంటి డైలాగులు వస్తయ్యో తెలుసు కాబట్టి అధికంగా ఆలోచించలేదు షాడో. కామ్‌గా వెనక్కి వచ్చేశాడు. గంగారాం కూడా ఎటువంటి అబ్జెక్షను తెలియపరచలేదు గాని, కుందూ మాత్రం గుండెలమీద చెయ్యి వేసుకున్నాడు.

"అదంతా వట్టి చెత్త ఏరియా. నక్కల్ని తోడేళ్ళని బుర్ర ముక్కలుండే కొంగల్ని పట్టుకుని బతికే బగుతూ బంజారీలు మిమ్మల్ని చూస్తే మీ పని అయిపోయినట్టే..." తనని అడగకముందే తన అభిప్రాయాన్ని చెప్పేశాడు.

"నువ్వు చెపుతున్నట్టు అది అంత ప్రమాదకరమైన ఏరియా అయితే, అక్కడ తిరిగేవాడికి తోతాపురి ఎందుకు అప్పు పెట్టినట్టు?" వెంటనే అడిగాడు గంగారాం.

కుందూకి వెంటనే వచ్చింది ఆ ప్రశ్న. "నిజమే... ఇందులో తిరకాసుంది" తల బరుక్కుంటూ చెప్పాడు.

"నువ్వు ఏమీ మాట్లాడటం లేదు" టేబిల్ ముందు కూర్చుని, ఒక వైట్ పేపర్‌మీద సీరియస్‌గా ఏదో రాస్తున్న షాడో వైపు చూస్తూ అడిగాడు గంగారాం.

రాయటాన్ని పూర్తిచేసి కాయితాన్ని మడతపెట్టాడు షాడో. పై మడతమీద ఒక ఫోన్ నెంబర్ వేశాడు.

“కుందూ అహ్మదాబాద్ వెళ్ళాలి. డబ్బులు ఇవ్వు” అన్నాడు షాడో. ఎదురు చెప్పకుండా వెళ్ళి ఒక అలమరాలో దాచిపెట్టిన పట్టుగుడ్డమూటలో నించి చిన్న నోట్ల పొతికని బయటికి తీసుకొచ్చాడు గంగారాం.

“అహ్మదాబద్ రైల్వేస్టేషన్లో దిగగానే ఈ నెంబర్‌కి ఫోన్ చెయ్యి... ఎవరో ఒకళ్ళు వచ్చి నిన్ను మంచి డాక్టర్ దగ్గిరికి తీసుకుపోతారు. ఆ వచ్చేది నా స్నేహితులు. వాళ్ళు దగ్గిర ఉండగా నీకు ఎటువంటి భయము అవసరం లేదు. అక్కడికి వెళతావా?” కాయితాన్ని ఆ నోట్ల పొతికని కుందూకి ఇస్తూ అడిగాడు షాడో.

నీటితో నిండిపోయాయి కుందూ కళ్ళు.

రెండురోజులనించి వాళ్ళకి తను చిన్నపాటి రొట్టెల్ని కూడా పెట్టించలేకపోతున్నాడు. అయినాసరే వాళ్ళు తన గురించే ఆలోచిస్తున్నారు... ఏం చేయాలో ఏం మాట్లాడాలో తెలియలేదతనికి. చటుక్కున ముందుకు వంగి షాడో పాదాలకి నమస్కారం చెయ్యబోయాడు.

“అరే బేవకూఫ్. ఏం పని బే అది? నిముషానికి ఒకసారి నమస్కారాలు పెట్టించుకోవటానికి మేము దేవుళ్ళం కాదు బే... ఫికర్ చేయకుండా వెళ్ళి నీ కాలు బాగు చేయించుకో” మృదువుగా అంటూ నెత్తిమీద ఒక మొట్టికాయ వేసి వీధివైపు నెట్టాడు గంగారాం.

కన్నీటితో మలినం అయిన మొఖాన్ని షర్టు అంచుతో తుడుచుకుంటూ– “మీరు మాత్రం జాగ్రత్త సాబ్. బగుతూ బంజారీలు కనిపిస్తే వెనక్కి వచ్చేయండి” అన్నాడు.

బండరాయి మీద కూర్చుని ఉన్న షాడో కళ్ల ముందు ఫ్రెష్‌గా కదలాడింది ఆరోజు ఉదయం జరిగిన ఆ దృశ్యం. “మనం చేసిన పని గురించి అతను ఈపాటికి ఊరంతా టాంటాం చేసేసి ఉంటాడు. సందేహం లేదు” అతని ఆలోచనలు ఎలాంటివో పసిగట్టి అన్నాడు గంగారాం.

*           *           *           *           *

బిల్లూకాకా వచ్చాడు. తుల్జీబాయి వచ్చింది. గట్టిగా మాట్లాడితే బింద్రా పౌరుల్లో సగంమంది అడ్డురోడ్డు దగ్గరికి వచ్చేశారు– కుందూని సాగనంపటానికి.

“భుజ్ పోగానే స్టేషన్ మాస్టర్ దగ్గరికిపోయి నా పేరు చెప్పు. నేను ఎవరినో ఆయనకు తెలుసు. దగ్గిర ఉండి నిన్ను రైలు ఎక్కిస్తాడు మర్చిపోకు” అప్పటికి పదోసారో పదకొండోసారో కుందూకి చెప్పాడు బిల్లూకాకా.

“నువ్వు పుట్టిన తర్వాత అంత డబ్బుని ఎప్పుడూ చూసి ఉండవు. ఎక్కడా పారేసుకోకు. జాగ్రత్త చేసుకో” కుందూ దగ్గిర ఉన్న నోట్లపొతికని చూడగానే చెప్పింది తుల్జీబాయి.

“ఏమో అనుకున్నాము గాని, ఈ ఇన్స్‌పెక్టర్ చేసే పనులన్నీ చిత్రంగానే ఉన్నయ్. నిన్న రాత్రి కల్తీ దగ్గిరికిపోయి ఇప్పుడు కుందూకి ఇచ్చినట్టే బోలెడంత డబ్బు ఇచ్చాట్ట. రాత్రి రైలును ఆపిన దొంగల్ని పట్టుకోవటానికి బురదలోపడి పరుగులు తీశాట్ట” అన్నాడు మౌనంగా నిలబడి ఉన్న పౌరుడు ఒకతను.

“ఎలాంటి ఆహారం ఇవ్వకూడదని, అవసరాలు తీరటానికి సహాయం చెయ్యకూడదని మనం హరాం చెయ్యడం తప్పే అనిపిస్తోంది” అన్నాడు ఇంకో పౌరుడు.

“అసలు తనేం చేస్తున్నాడో, ఏం చెయ్యబోతున్నాడో మనలో ఎవరికైనా చెప్పి వుంటే బాగుండేది. తన మతమే తనది” అన్నాడు మరొకతను.

పెద్దగా హారన్ మోగించుకుంటూ బస్ అటుగా రావటంతో ఆగిపోయింది ఆ సంభాషణ. బేలగా చూస్తున్న కుందూని అతిబలవంతంగా బస్‌లో నెట్టి చిరునవ్వులతో చేతులు ఊపారు అక్కడున్నవారు అందరూ.

దుమ్ము తెరలు రేపుతూ అది దూరంగా వెళ్ళిపోయిన తర్వాత ఒకేసారి వెనుతిరిగారు అందరూ.

“ఇన్స్‌పెక్టర్ సాబ్ ఊళ్ళోకి రాగానే రొట్టెలు రెడీగా ఉన్నయని చెప్పండి. ఇంతకుముందు జరిగినదానికి నేను బాధపడుతున్నానని కూడా చెప్పండి” పౌరులందరికీ తన మాటగా చెప్పింది తుల్జీబాయి.

“కుందూగాడు లేడని కంగారుపడాల్సిన అవసరం లేదని కూడా చెప్పండి. కబురుచేస్తే నేనే వెళ్ళి వారికి పనులు చేసి పెడతా” అన్నాడు బిల్లూకాకా.

* * * * *

“అదుగో... అదుగో గురూ... ఆ పొదదగ్గిర...” ఉన్నట్లుండి షాడోకి ఒక పొదని చూపించాడు గంగారాం.

అదే సమయంలో దూరంగా పొదచాటునున్న ఆగంతకుడు అవతలికి అడుగువేశాడు.

"అయ్యబాబోయ్... వాడు తోక ఝాడిస్తున్నాడు. పట్టుకో గురూ" అంటూ అటు పరిగెత్తాడు గంగారాం.

"ఆగు గంగూ... ఆగు... ఆగిపో..." షార్ప్‌గా కమాండ్ చేశాడు షాడో. అతని మాటలకు అప్పుడప్పుడు అభ్యంతరాలు తెలియచేయటమే తప్ప వ్యతిరేకంగా మాట్లాడటం గాని ఎగెనెస్ట్‌గా చెయ్యటంగాని గంగారాంకి తెలియదు.

"నువ్వు ఎప్పుడూ ఇంతే... కదిలే వరకూ ఊరుకుని, ఆఖర్లో అరిచి కేకలు పెడతావ్" అంటూ ఎక్కడివాడక్కడ ఆగిపోయాడు. కాని అప్పటికే ఆలస్యం అయిపోయింది.

మెత్తమెత్తగా అతని పాదాలకు తగులుతున్న బురద మామూలుగా కంటె ఎక్కువ మెత్తగా అనిపించింది.

"అయ్యబాబోయ్... ఇదేంటి?" ఆందోళనగా అంటూ ఎగిరి వెనక్కి దూకబోయాడు అతను. మాటలు అతని పెదవులు దాటుతూ ఉండగానే, మోకాళ్ళ వరకూ దిగబడి పోయాడు అతను బురదలో. చూస్తూ చూస్తూ ఉండగానే తొడలు కూడ కిందికి దిగటం మొదలైంది.

"గురో... కొంపలు అంటుకున్నయ్... ఇదంతా ఊబి... పెద్ద ఊబి..." తన మాదిరిగానే గుడ్డిగా ముందుకు వచ్చి షాడో కూడా చిక్కుబడిపోతాడన్న భయంతో బిగ్గరిగా అరుస్తూ చెప్పాడు గంగారాం.

గుడ్డిగానే వచ్చాడుగాని, అతనిలా దిగబడిపోలేదు షాడో, అతనున్న ప్రదేశానికి ఐదు అడుగుల దూరంలో నేలమీద బోర్లాపడి, అతనికి చెయ్యి అందించాడు.

నడుముల వరకూ దిగబడిపోయాడు గంగారాం. ఎంతో ఆకలిమీద ఉన్నట్టుంది ఆ ఊబి. చిటుకు చిటుక్కున అతన్ని తనలోకే లాగేసుకుంటోంది.

పళ్ళు బిగపట్టి షాడో చేతుల్ని గట్టిగా పట్టుకున్నాడు అతను. శరీరంలోని శక్తినంతా చేతుల్లోకి తెచ్చుకుంటూ అతన్ని గట్టి నేలమీదికి లాగేయాలి షాడో... అరనిముషం గడిచినా అతను ఆ పని చేయకపోవటంతో, "ఏమయింది గురూ?" అని ఆశ్చర్యంగా అడిగాడు గంగారాం.

అతని మొఖంలోకి చూడటం లేదు షాడో. అతని వెనుక ఉన్న ముళ్ళపొద వంక చూస్తున్నాడు... తను కూడా అటుకేసి చూసిన గంగారాంకి వెంటనే కనిపించారో పాతికమందికి పైగా బగుతూ బంజారీలు.

ఎండకి ఎండి, వానకి తడిసి గట్టిపడి, నల్లగా మారిపోయిన శరీరాలు– రంగు రంగు పూసలదండలు, రకరకాల ఈకలు. కాళ్ళకి చేతులకి వెండి కడియాలు, ఒత్తుగా పెరిగి భుజాలమీదికి పరుచుకుంటున్న చింపిరిజుట్టు.... జానపద కథల్లో కనిపించే కొండజాతి వీరుల మాదిరిగా ఉన్నాయి చూడటానికి వారి అవతారాలు.

"మన పని అయిపోయినట్టేనా?" ఎందుకు పోయినట్టు తయారైన గొంతుతో షాడోని అడిగాడు గంగారాం.

"ఏం జరుగుతుందో చూద్దాం... నువ్వు ఎక్స్ట్రాలు మాట్లాడకు" అంటూ తిరిగి అతనిమీదికి దృష్టిని మరలించుకున్నాడు షాడో. ఊపిరి బిగపట్టి ఒక్కసారిగా అతన్ని తనకేసి బలంగా గుంజాడు.

మెత్తగా కదిలాడు గంగారాం. తన ప్రమేయం లేకుండానే బురదలోనించి గట్టి నేలమీదికి చేరుకున్నాడు.

లేచి నిలబడి ఒంటికి అంటుకున్న బురదను వదిలించుకునే అవకాశం అతనికి గాని, అతని చెయ్యి పట్టుకుని వెనక్కి పారిపోయే వ్యవధి షాడోకిగాని లభించలేదు.

ఆకాశం బద్దలయిపోయేటట్టు భీకరంగా అరుస్తూ ముందుకు వచ్చేశారు బగుతూ బంజారీలు. ఊబి నేలల గురించి బాగా తెలుసు కాబోలు- ఒక్కళ్ళు కూడా గంగారాం పడిన ఆ గుంటలో పడలేదు.

సూటిగా వచ్చి స్నేహితులిద్దరినీ చుట్టుముట్టారు. బరిశెల మాదిరి పొడవుగా ఉన్న బాణాకర్రల్ని వారిద్దరి గుండెలకీ గురిపెట్టి మరింత పెద్దగా అరిచారు.

"ఈ దొంగనాయాళ్ళు మనల్ని ఏదో అడుగుతున్నారు. ఏమిటో నాకు అర్థం కావటం లేదు..." షాడోతో అన్నాడు గంగారాం. ఇంకా ఇంకా గట్టిగా అరిచి, బాణకర్రలతో అతని తలమీద బలంగా కొట్టాడు ఒక బగుతూ.

గావురుమని అరిచి కిందికి జారిపోయాడు గంగారాం. ఎటువంటి బాధనయినా కనురెప్పకూడా కదిలించకుండా భరించగల అతను అలా ఒక్క దెబ్బకే నేలమీదికి వాలిపోవటంతో కంగారు పడ్డాడు షాడో.

"ఏమయింది గంగూ? ఆర్ యూ ఆల్‌రైట్?" అని ఆప్యాయంగా అడుగుతూ పక్కకు వంగి అతని ముఖంలోకి ప్రశ్నార్థకరంగా చూడబోయాడు.

వెంటనే పడింది అతని తలమీద కూడా ఇంకో బలమైన దెబ్బ. చుట్టూ ఉన్న ప్రపంచం అంతా వేగంగా గాఢమైన చీకటితో నిండిపోతున్నట్టు ఫీల్ అవుతూ సర్రున కిందికి జారిపోయాడు తను కూడా.

*        *        *        *        *

చీకటి పడిపోయింది కుందూ అహ్మదాబాద్ స్టేషన్‌లో ట్రెయిన్ దిగేసరికి. పుట్టి బుద్ధి ఎరిగిన తర్వాత బింద్రాని వదిలి బయటి ప్రపంచంలోకి అడుగు పెట్టలేదతను... రకరకాల విద్యుత్ దీపాలతో రాత్రివేళ పట్టపగలు మాదిరి తయారై కన్పిస్తున్న స్టేషన్‌ని చూసేసరికి అదోరకమైన భయం కలిగింది అతనికి.

అడుగులో అడుగు వేసుకుంటూ ఒక ఎంట్రన్స్ దగ్గరికి వచ్చాడతను. తెల్లని యూనిఫాంమీద నల్లటి కోటు వేసుకున్న ఒక పెద్దమనిషి మహాక్రూరంగా చూశాడు అతని వంక. "టిక్కట్టుందా?" అని ఉరుములాంటి గొంతుతో అడిగాడు ఆయన.

తడబడిపోయాడు కుందూ. తన దగ్గిర ఉన్న కాటన్ సంచిలోనించి టిక్కెట్‌ని బయటికి తీశాడు. టిక్కెట్‌తో పాటుగా బయటికి వచ్చిన నోట్లపొతికని ఆశ్చర్యంగా చూశాడు అతన్ని టిక్కెట్ అడిగిన పెద్దమనిషి.

"ఎక్కడికి పోవాలి?" అనునయంగానే అడిగాడు.

"నేను. అదీ... ఒక స్నేహితుడు వస్తాడని మా ఇన్స్‌పెక్టర్ సాబ్ చెప్పారు... ఫోన్ చెయ్యాలి" చెప్పాడు కుందూ.

"ఒక్క నిముషం నిలబడు... తర్వాత మాట్లాడతాను" అంటూ అతన్ని ఒక పక్కకి నెట్టి, అతని వెనుక వచ్చిన ప్రయాణీకుల దగ్గర్నించి టిక్కెట్లు వసూలు చేసుకోవటంలో బిజీ అయిపోయాడు ఆ పెద్దమనిషి.

తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తూ ఒక పక్కగా నిలబడి కుందూ దగ్గిరికి సడన్‌గా వచ్చేశాడు సుమారు పాతిక సంవత్సరాల వయసున్న నవయువకుడు ఒకతను.

"అరే. ఇక్కడ ఉన్నావా? నీకోసం స్టేషనంతా వెతుకుతున్నా... రారా" అంటూ చనువుగా చెయ్యి పట్టుకుని ఆప్యాయంగా ముందుకు లాగాడు.

"నువ్వు... మీరు ఎవరు?" అడిగాడు కుందూ.

"అరే నేనే భాయి... మీ ఇన్స్‌పెక్టర్ సాబ్ స్నేహితుడిని... నా గురించి నీకు చెప్పలేదా?" అడిగాడతను.

"ఫోను... ఫోను చేస్తే వస్తారని అన్నాడు... మరి నేను ఇంకా ఫోను..." అడబడకుండా ఉండటానికి ట్రై చేస్తూ అతనివైపు చూస్తూ ప్రశ్నించాడు కుందూ.

టిక్కెట్లు కలెక్ట్ చేసుకోవటంలో బిజీగా ఉన్న పెద్దమనిషి అతన్ని గురించి పట్టించుకోలేదు.

“మీ పేరేమిటి?” ఎదురుచూడని విధంగా ప్రత్యక్షం అయిన అపరిచితుడిని చాలా ఆశ్చర్యంగా చూస్తూ నెమ్మదిగా అడిగాడు కుందూ.

“అదేంటి భాయీ? నేనెవరినో నిన్ను పంపించిన వాళ్ళు నీకు చెప్పలేదా?” విచిత్రంగా చూస్తూ అన్నాడు ఆ మనిషి.

“ఫోన్ నెంబరు మాత్రమే ఇచ్చారు... పేరేదీ చెప్పలేదు” చిన్నమొఖం చేసుకుంటూ చెప్పాడు కుందూ.

“అదే... అదే అసలైన తప్పు. నా పేరు జానీసింగ్... నీ దగ్గిర ఉన్న ఫోన్ నెంబర్ నాదే...” అంటూ చనువుగా అతని చేయి పట్టుకున్నాడా మనిషి.

“ఇక్కడే నిలబడి కబుర్లు చెప్పుకుంటూ ఉంటే టిక్కెట్టు కలెక్టర్ సాబ్‌కి చెడ్డకోపం వచ్చేస్తుంది. అవతలికి పోయి మాట్లాడుకుందాం” అంటూ అవతలికి లాగాడు.

వెళ్లాలో వద్దో తేల్చుకునే వ్యవధి లేకుండా పోయింది. అసలు ఏం జరుగుతుందో అతనికి తెలిసేందుకు ముందే ఎంట్రన్స్ దగ్గిర్నించి దూరంగా తీసుకుపోబడ్డాడు. తన పనిలో తను బిజీగా ఉండిపోయిన టిక్కెట్ కలెక్టర్ ఆ విషయాన్ని కూడా గమనించలేదు.

“ఎప్పుడు తిన్నావో... ఏం తాగావో...” మహా అభిమానంగా అంటూ కుందూని స్టేషన్ ఆవరణలోనే ఉన్న ఒక క్యాంటిన్‌లోకి తీసుకుపోయాడు ఆ మనిషి.

వేడి వేడి చాయ్‌కి ఆర్డర్ ఇచ్చాడు.

ఫ్లాట్ అయిపోయాడు కుందూ. “కొత్తచోటు. మిమ్మల్ని ఎలా కలుసుకుంటానో అని భయపడ్డాను. మీ అంతట మీరే నన్ను వెతుక్కుంటూ వస్తారని అస్సలు అనుకోలేదు” ఆనందంగా చెప్పాడు అతనికి.

“నేను వచ్చింది కూడా అందుకే భాయీ. కొత్తచోటు. బడా బడా బద్మాష్‌లు తిరిగే ప్రదేశం. అన్నెం పున్నెం ఎరగని అమాయకుడివి. ఆలస్యం చేస్తే అన్యాయం అయిపోతావని ముందుగానే వచ్చేశాను....” సానుభూతిగా చూస్తూ చెప్పాడు ఆ మనిషి.

“ఈ మాట నాకు మా బిల్లూకాకా కూడా చెప్పాడు. అందుకే డబ్బంతా సంచీలో పెట్టి గట్టిగా పట్టుకుంటున్నాను” వెయిటర్ తీసుకువచ్చిన చాయ్ కప్పును నోటి దగ్గర పెట్టుకుంటూ అన్నాడు కుందూ.

“నేను ఉండగా నీకు, నీ డబ్బుకు వచ్చిన భయం ఏమీ లేదు... విడిగా పెట్టావా, పొట్లం కట్టావా?” చాలా కాజువల్‌గా చూస్తూ అడిగాడా మనిషి.

“విడిగానే పెట్టాను” అంటూ కప్పును కిందపెట్టి సంచీలోనించి నోట్లపొతికని, ఇన్స్‌పెక్టర్‌సాబ్ రాసిన లెటర్‌ని బయటికి తీసి చూపించబోయాడు కుందూ.

పూర్తిగా చూపించకముందే అతన్ని అడ్డుకున్నాడు ఆ మనిషి. “అందరూ చూస్తుండగానే అంత డబ్బును బయటికి తీయకూడదు... పొట్లం కట్టావా అని అందుకే అడిగాను” అంటూ అటూ ఇటూ చూసి ప్యాంటు జేబులోనించి ఒక న్యూస్ పేపర్ కాయితాన్ని బయటికి తీశాడు.

సంచీలోనించి పూర్తిగా బయటికి రాకుండా అడ్డుకున్న కుందూ చేతిలోని డబ్బును స్వతంత్రంగా తాను తీసుకుని ఆ కాయితంలో పొట్లం కట్టాడు.

''ఇంకో చాయ్ తాగితే బాగుంటుంది. వెయిటర్‌ని పిలువ్'' చేస్తున్న పని మీదినించి దృష్టిని మరలించకుండా చెప్పాడు పక్కకు చూసి, రెండు టేబిల్స్ అవతల ఉన్న వెయిటర్‌కి సైగ చేశాడు కుందూ. తిరిగి ఆ మనిషికేసి చూడగానే, ''ఇప్పుడు ఓకే. సంచీలో పెట్టేయ్'' అంటూ పొట్లాన్ని అతనికి ఇచ్చాడు ఆ మనిషి.

లావుగా, బొద్దుగా తయారైన పొట్లాన్ని సంచీలో పెట్టుకున్నాడు కుందూ. తమ దగ్గరికి వచ్చిన వెయిటర్‌కి ఇంకో రెండు టీలు తీసుకురమ్మని ఆర్డర్ ఇచ్చి, కుర్చీలో నించి లేచాడు ఆ మనిషి. ''బాత్‌రూమ్‌కి పోయి వస్తా నువ్వు చాయ్ తాగుతూ ఉండు'' అవతలికి వెళ్ళిపోయాడు.

*　　*　　*　　*　　*

లావుపాటి ఇనుపసమ్మెటతో ఎవరో పిచ్చికొట్టుడు కొడుతున్నట్టు ఫీల్ అవుతూ కళ్ళు తెరిచాడు షాడో.

ఎదురుగానే కూర్చుని ఉన్నాడు ఎత్తుగా, లావుగా ఉన్న ఒక బగుతూ బంజారీ మనిషి.

అర్థంకాని భాషలో కీసర బాసరగా మాట్లాడుతూ మళ్ళీ వేశాడు ఇంకో దెబ్బ– ఈసారి మొఖంమీద.

ఛట్ ఛట్‌మని రెండు మెరుపులు మెరిశాయి షాడో కళ్ళముందు. బాధ కొంచెం అధికం అవటంతో ఒక్కసారిగా నీళ్ళు కూడా ప్రత్యక్షమైనాయి.

అదేదో చాలా అవమానకరమైన విషయమన్నట్టు, అతని మొఖంవైపు చేయి చాచి మళ్ళీ కీసర బాసర బాషలో ఇంకా పెద్దగా మాట్లాడాడు ఆ మనిషి.

“ఒకే ఒక దెబ్బకే కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్న ఆడదానివని అంటున్నాడు. సందేహం ఎంత మాత్రము అవసరం లేదు” వెంటనే షాడోకి వినిపించింది గంగారాం కంఠం.

కనురెప్పల్ని వేగంగా కదిలించి కళ్ళల్లోని నీటిని అదుముకుంటూ తలతిప్పి ఎత్తయిన కొండరాళ్ళ మధ్యన ఉన్న ఖాళీ ప్రదేశంలో ఉన్నారని వెంటనే అర్థమైంది అతనికి.

మైనం పట్టాలతో కప్పబడిన గుడారాలవంటి గుడిసెలు ఉన్నాయి ఆ ప్రదేశంలో. తోకలు ఊపుతున్న శునకాలు, వికృతధ్వనులు చేస్తున్న సూకారాలు, చీమిడి ముక్కలున్న చిన్నపిల్లలు, సందడి సందడిగా తిరుగుతున్న స్త్రీలు– చాలా కోలాహలంగా ఉంది అక్కడి వాతావరణం.

“మనిద్దరినీ వీళ్ళ కాంప్ దగ్గరికి మోసుకువచ్చారు... ఎన్నిరోజులు ఉంచుతారో, ఏం చేయదలుచుకున్నారో ఏమాత్రం తెలియటం లేదు” మళ్ళీ తమ పొజిషన్ గురించి అతనికి వివరించి చెప్పాడు గంగారాం.

“మనం వచ్చింది తోతాపురి దగ్గిర అప్పు తీసుకుని పారిపోయిన బడారాస్కేల్ కోసం. మధ్యలో వీళ్ళు ఎంట్రన్స్ ఎందుకు ఇచ్చారో అడిగావా?” విసుగ్గా ముఖం పెట్టి గంగారాంను ప్రశ్నించాడు షాడో.

“అడుగో... వాడే మనకి కావల్సిన వెధవ...” కనులతోనే ఒకవైపు చూపించాడు గంగారాం.

అటుకేసి చూసిన షాడోకి ఒక టెంట్ ముందు విలాసంగా కూర్చుని అదేపనిగా చిలకనవ్వులు నవ్వుతున్న ఒక నాగరికుడు కనిపించాడు.

“నా పేరు రామ్‌దులానీ.... పక్షుల్ని పట్టే వలలు కొనటానికి తోతాపురి దగ్గిర అప్పుతీసుకున్నాను” వారు అడక్కుండా తనంతట తానే చెప్పాడు అతను.

ఆ పైన అతను చెప్పాల్సిన అవసరం లేకపోయింది. అప్పు తీర్చమని అడగగానే, బింద్రానించి సరాసరి పొదల్లోకి పారిపోయి వచ్చేశాడతను. తోతాపురి నిజమే చెప్పాడు. కావాలని తనను ఇరికించాడని అనుకోవటానికి వీల్లేదు. సడన్ బ్రేకువేస్తే లోడ్‌మీద ఉన్న లారీ ఎలా ఆగిపోతుందో, అలాగే ఆగిపోయాయి షాడో ఆలోచనలు.

బింద్రాలో ఉండాల్సిన ఆ నాగరికుడు పొదల్లోకి పారిపోయి రావటంలో ఆశ్చర్యం ఏమీ లేదు గాని, ఎవరినీ నమ్మకుండా ఒంటరి జీవితాన్ని గడిపే బగుతూ బంజారీలతో చేతులు కలపడం ఎలా సంభవించింది.

నోరు తెరిచి అడగకముందే ఆ ప్రశ్నకు కూడా సమాధానం లభించింది. టెంట్ వంటి గుడిసెలోనించి బయటికి వచ్చి ఆ మనిషి పక్కన కూర్చుంది ఒక బంజారా యువతి. ఆమె రూపాన్ని చూసేసరికి పంచదార వేసుకోకుండా చిక్కటి టీ తాగినట్టు చేదుగా తయారయింది షాడో నోరు. మహా వికృతంగా ఉన్నదామె.

“చిన్నతనంలో వేటకి వెళ్ళినప్పుడు నాలుగు నక్కలు మీదపడి కండలు ఊడిపోయేటట్లు బలంగా కరిచాయట... అందుకే ఇలా తయారయింది. ఈ తండాలో ఉండే మగవాళ్ళు ఎవరూ ముందుకు రాక ఒంటరిగా ఉండిపోయింది. వేటకు వచ్చిన నాకు తారసపడింది.

ఎందుకైనా మంచిదేనని ఉద్దేశ్యంతో మనువాడేశాను... ఫలితం చూశారుగా. ఈ తండాకి అల్లుడిని. నా జోలికి ఎవరూ రారు” నవ్వుతూ చెప్పాడు ఆ మనిషి.

“వీడి సాహసగాథలు వింటూ ఉంటే టైము వేస్ట్ కావటం తప్ప వేరే ఉపయోగం ఏదీ లేదు. ఇప్పుడు ఏం చేయాలో ఆలోచించు” గంగారాం హెచ్చరించటంతో మళ్ళీ స్టార్ట్ అయినాయి షాడో ఆలోచనలు.

తండాలో ఉండగా ఆ రాస్కెల్‌ని తాము చేయగలిగింది ఏమీలేదు... ముందు అర్జంటుగా అక్కడినించి జంప్ చేసేయాలి. “అది చాలా కష్టం గురూ. వీడికోసమే మనం పొదల్లోకి వచ్చినట్టు అందరికీ తెలిసి పోయింది. అందుకే మనల్ని పట్టేశారు.

అసలు ఈ పని జరగటానికే తోతాపురి మనల్ని వీడికోసం పంపించాడని నా అనుమానం” చెప్పాడు గంగారాం– షాడో మనసులోని ఆలోచనల్ని అర్థం చేసుకున్నట్టు.

“ఓకే... మనల్ని ఏం చేయబోతున్నారో అడిగి చూడు” ఎటువంటి పరిస్థితినైనా, ఎన్ని ఆపదలనైనా తట్టుకునేందుకు సిద్ధపడుతూ అన్నాడు షాడో.

“అరేయ్... ఎవ్రా అక్కడ ఉన్నది?” ఉన్నట్లుండి బిగ్గిరిగా అరిచాడు గంగారాం.

అంతకుముందు వరకూ షాడోని హింసించి, వెక్కిరించి తాపీగా అవతలికిపోతున్న బంజారా మనిషికి చివ్వున పొడుచుకు వచ్చేసింది కోపం. గిరుక్కున వెనక్కి తిరిగి వేగంగా వచ్చేశాడు అతని దగ్గరికి. చేతిలో ఉన్న కర్రను ఎత్తి అతని తలమీద ఒక దెబ్బ వేశాడు.

భరించరాని బాధతో కిందికి వాలిపోయి గోలగోలగా అరవాల్సిన గంగారాం– అలా చేయలేదు.

“మమ్మల్ని ఏం చేయబోతున్నారు బే? నిముషానికి ఒకసారి వచ్చి రెండు ఓటి దెబ్బలు వేయటమేనా ఏదయినా చేయడం ఉన్నదా?” రెండు కనులను మరింత పెద్దవిచేసి కోపంగా చూస్తూ అడిగాడు.

రెండో దెబ్బ వేయడానికి కర్రను గాలిలోకి లేపబోతున్న ఆ మనిషి ఆశ్చర్యంగా తమ తండా అల్లుడికేసి చూశాడు.

“నోటికి వచ్చినట్టు మాట్లాడితే ఒళ్ళు చెడిపోవడమే కాదు. ప్రాణాలు పోతాయ్” హెచ్చరించాడు అల్లుడు.

“అదే కదా నేను అడుగుతోంది. ఏం చేయబోతున్నారు? చంపి అవతల పారేయబోతున్నారా?” అదే స్వరంతో అతన్ని కూడా అడిగాడు గంగారాం.

“అలాంటిదేమీ లేదు. తీసుకుపోయి బోర్డర్స్ దగ్గిర మిమ్మల్ని బేరం పెట్టేస్తారు” కూల్‌గా చెప్పాడా మనిషి.

అర్థం కాలేదు గంగారాంకి. షాడోకి కూడా అవగతం కాలేదు... “లాభం లేదు గురూ... వీళ్ళ పద్ధతులు నాకు అంతుబట్టడం లేదు” అన్నాడు గంగారాం.

అతనా మాట అంటుండగానే– పదిమంది బంజారీ యువకులు తన వెనకాల అడుగులు వేస్తుండగా– వారి దగ్గిరికి వచ్చాడు ఆ తండాకి నాయకుడి మాదిరిగా కనిపిస్తున్న వృద్ధుడు ఒకతను. కిందినించి పైదాకా చూసి, తన వెనక ఉన్న యువకులతో ఏదో చెప్పాడు.

వెంటనే కదిలారు వాళ్ళందరూ పరుగులాంటి నడకతో ఎటోపోయి, నాలుగు పెద్ద పెద్దతోలి సంచులతో నీళ్ళు తీసుకువచ్చి స్నేహితులిద్దరి మీదా కుమ్మరించారు.

ఏం జరుగుతున్నదో అర్థం అయ్యేలోపుగా, వారిద్దరి ఒంటిని పట్టుకుని ఉన్న బురద మూడొంతలు తొలిగిపోయింది. మూకుమ్మడిగా మీదపడి షాడో యూనిఫామ్‌ని తీసి అవతల పారేసి మందపాటి ముతకవస్త్రాన్ని ఒక దాన్ని అతని నడుముకు చుట్టారు ఆ యువకులు.

గంగారాంకి కూడా అదే గతి పట్టటాన్ని గమనించి, చిరాకుగా తల విదిలించాడు షాడో.

“ఇందాక నేను చెప్పిందే నిజం అయింది. మీ ఇద్దరినీ బోర్డర్స్ దగ్గిర బేరం పెట్టబోతున్నారు. రేపు తెల్లారిన దగ్గిర్నించి మీ బతుకులు కుక్క బతుకులే” తన టెంట్ ముందు కూర్చుని ఉన్న నాగరికుడు కామెంట్ చేయటంతో మరింతగా

పెరిగిపోయింది అతని చిరాకు. అతని భావలతో నిమిత్తం లేనట్టు తన సహచరులకు ఇంకేవో ఆర్డర్స్ ఇచ్చాడా నాయకుడు.

అరగంట తర్వాత అర్జంట్‌గా డిస్‌మాంటిల్ చేయబడ్డాయి మైనపు పట్టాలు కప్పిన గుడిసెల వంటి గుడారాలు. బురదనేలల్లో సైతం తేలికగా తిరగగల గార్ధభాలు తీసుకొని రాబడ్డాయి. తట్టాబుట్టా చెంబు తప్పేళావంటి సామాగ్రినంతా వాటిమీదికి ఎక్కించి ప్రయాణం ప్రారంభించారు అందరూ. ముందు మగవాళ్ళు పెంచుకునే శునకాలు, సూకరాలు...

"నేను రావడం లేదు ఇన్స్‌పెక్టర్ సాబ్... బింద్రాకి పోతున్నా. బతికి బాగుండి ఎప్పుడయినా మీరు వెనక్కి రావటం జరిగితే, బింద్రాలోనే ఉంటాను. కలుసుకుందాం" నవ్వుతూ చెప్పి, తనెక్కిన గార్ధభాన్ని వెనక్కి పరుగుతీయించాడు– స్నేహితులకి ఆ గతి పట్టటానికి కారకుడైన నాగరికుడు.

* * * * *

అరగంట వెయిట్ చేశాడు కుందూ. బాత్‌రూమ్‌కి వెళ్ళిన పెద్దమనిషి అప్పటికీ రాకపోయేసరికి, తనంతట తానుగా ఇంకో చాయ్ తెచ్చి పెట్టమని అక్కడున్న వెయిటర్‌కి చెప్పాడు.

"ఇంఖోటి ఏమిటి? ఎన్నయినా తీసుకువస్తాను. ఇప్పటిదాకా తాగిన వాటికి ముందు బిల్లుకట్టు" టేబిల్ దగ్గిర్నించి కదలకుండా రెక్‌లెస్‌గా చెప్పాడు వెయిటర్.

లాగిపెట్టి మొఖంమీద కొట్టాలన్నంత కోపం ముంచుకు వచ్చేసింది కుందూకి. బాత్‌రూమ్‌కి పోయిన పెద్దమనిశి వచ్చేదాకా ఆగదలుచుకోలేదతను.

ఇన్స్పెక్టర్‌సాబ్ ఇచ్చిన నోట్ల పొతిక తన దగ్గిర ఉండగా– మాటలు పడాల్సిన అవసరం తనకేముంది?

"డబ్బులు ఎగ్గొట్టి పారిపోతానా? ఎంతయిందో చెప్పు" నోట్ల పొట్లాన్ని బయటికి తీశాడు. ఎంతయ్యిందో చెప్పి చెయ్యి చాచాడు వెయిటర్. పొట్లాన్ని విప్పిన కుందూకి మొఖం మీద ఎవరో కొట్టిన సెన్సేషన్ కలిగింది.

నోట్లు లేవు అందులో.నోట్ల మాదిరిగా మడతలు పెట్టిన చిత్తుకాగితాలు ఉన్నాయి. "మోసం, దగా... నా డబ్బులు కొట్టేశాడు... నమ్మించి మోసం చేశాడు" ఒక్కసారిగా పాతాళంలోకి కూరుకుపోతున్న భావన కలిగి చుట్టూ చూస్తూ బిగ్గిరిగా అరిచాడు అతను.

సానుభూతి చూపించాల్సిన వెయిటర్, చటుక్కున అతని షర్టు ముందు భాగాన్ని బిగించి పట్టుకుని బర్రున కుర్చీలోనించి బలంగా బయటికి లాగేసేసరికి కుందూ బ్యాలెన్స్ నిలబెట్టుకోలేక దబ్బున కిందపడ్డాడు.

"సువ్వర్‌కీ బచ్చే... నీలాంటి దగుల్బాజీల్ని రోజుకి పాతికమందిని చూస్తూ ఉంటాం. మాకే టోపీ పెడదామని అనుకుంటున్నావా?" లాగి తన్నాడు వెయిటర్.

బరువు భరించలేని అవిటికాలిమీదే తగిలింది ఆ దెబ్బ. భరించరాని బాధతో విలవిలలాడిపోయాడు కుందూ "నిజమే చెపుతున్నా... నమ్మించి మోసం చేశాడు... ఇప్పుడే వస్తానని చెప్పి ఎటో పారిపోయాడు" బావురుమంటూ తన పరిస్థితిని తెలియజేయటానికి ట్రై చేశాడు కుందూ.

వినిపించుకోలేదా వెయిటర్. ఇంకో రెండు తన్నులు తన్ని తన యజమానిని పిలిచాడు. అతను కూడా మరో నాలుగు దెబ్బలు వేశాడు. "రోడ్డు మీదికి నెట్టండి. ఇంకోసారి ఇక్కడ కనిపిస్తే చంపేస్తామని చెప్పండి"

పెదవులు చీరుకుపోయి ఎర్రటిరక్తం కుందూ గుండెల మీదికి జారుతోంది. దెబ్బల్ని తట్టుకోలేని అవిటి కాలు, అతనికి సహాయపడటాన్ని మానేసింది.

ఇసుక మూటని విసిరినట్టు రోడ్డుమీదికి విసిరేసిన తర్వాత లేచి నిలబడటానికి పదినిముషాలకి పైనే పట్టింది అతనికి. కన్నీటితోను, రక్తంతోను మలినమైన మొఖాన్ని అరచేతులతో అద్దుకుంటూ– అతి ప్రయత్నం మీద అడుగులు వేశాడు అతను. సాయం సమయం అవబోతున్న సమయంలో స్టేషన్‌కి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న దుర్గామాయి దేవాలయం దగ్గిరికి పోయాడు.

భక్తితో ప్రార్థించిన వాళ్ళ బాధల్ని నివారించే దయగల ఆ దేవత గుడిగోపురాన్ని చూసేసరికి ఇంకోసారి పొంగుకు వచ్చేసింది అతనికి లోపల దాగిన దుఃఖం.

"కొత్తచోటు, కొత్త జనం. చాలా జాగ్రత్తగా ఉండాలని తుల్జీబాయి చెప్పింది. బిల్లూకాకా చెప్పాడు. అయినాసరే అన్యాయం అయిపోయాను. డబ్బులతోపాటు ఇన్‌స్పెక్టర్ సాబ్ ఇచ్చిన ఉత్తరం కూడా పోయింది... నన్నేం చేయమంటావ్ తల్లీ" రోడ్డుమీదే నిలబడి గుడిలోపల కొలువై వుండే దుర్గామాయిని తలుచుకుని గట్టిగా ఏడ్చేశాడతను.

*　　*　　*　　*　　*

స్టేషన్ వెనుక భాగంలో ఉండే పెద్ద మర్రిచెట్టు కింద కూర్చుని, కుందూ దగ్గిర కొట్టేసుకు వచ్చిన పొట్లాన్ని విప్పతీశాడు అతన్ని మోసం చేసిన వ్యక్తి. మందంగా ఉన్న నోట్ల పొతికను చూసేసరికి మెరిసిపోయాయి అతని కనులు. "ఇట్టాంటి గిరాకి వారానికి ఒకటి దొరికితే చాలు... లక్షాధికారిని అయిపోవచ్చు అతితొందర్లో" అనుకుంటూ ఆ నోట్లని తీసి జేబులో పెట్టుకున్నాడు...

వాటితోపాటుగా మడతపెట్టి వున్న కాయితాన్ని చూడాలన్న కోరిక అతనికి కలగలేదు. ఉండగా చుట్టి అవతలికి పారేశాడు... విజిల్ వేసుకుంటూ చెట్టుకిందినించి లేచి అతను అవతలికిపోయిన అరగంట తర్వాత డబడబమని మోతలు చేసుకుంటూ వచ్చి మర్రిచెట్టుకు పాతిక అడుగుల దూరంలో ఆగిందొక ఆటో.

"త్వరగా... త్వరగా పోనీ... అవతల ట్రైన్‌కి టైమ్ అయిపోతోంది" హెచ్చరించారు ప్రయాణీకులు.

"ఒక్కక్షణం. ఒకే ఒక్కక్షణం. టాంక్‌లోనించి ఆయిల్ లీక్ అవుతున్నట్టుంది" అంటూ కిందికి దిగి ఇంజన్ దగ్గిర ఉన్న ఆయిల్ టాంక్‌ని పరీక్షగా చూశాడు డ్రైవర్.

"నిన్ననే టింకరింగ్ చేయించాను... అయినాసరే ఇంకో చిల్లుపడనే పడింది..." అంటూ తిరిగి ముందుకు వచ్చి, ముందు భాగంలో ఉన్న అరలోంచి ఒక డర్టీక్లాత్‌ని చేతుల్లోకి తీసుకుంటూ ఉండగా.... గాలికి దొర్లుకుంటూ అతని కాలి దగ్గిర ఆగింది ఒక కాయితపు ఉండ.

“ఇదేదో ఫ్రెష్‌గా ఉంది. స్టేషన్ దగ్గరికి పోయేవరకూ పని జరిగిపోతుంది” అని అనుకుంటూ దాన్ని చేతిలోకి తిసుకొని, ఇంజన్ దగ్గరికి పోయాడతను. వైల్డ్‌గా పడిన మడతల్ని సరిచేసి ఒక క్రమపద్ధతిలో మడత పెడుతూ ఉండగా... అతనికి తెలియకుండానే గమనించాయి అతని కళ్ళు దానిమీద ఉన్న ఒక ఫోన్ నెంబర్ని.

‘అయ్యబాబోయ్.... ఇది రామ్‌దయాళ్ సాబ్ నెంబరు... ఈ కాయితం మీదకి ఎలా వచ్చింది?’ ఆశ్చర్యంగా అనుకుంటూ నెంబర్‌కి వనుక పక్కన ఉన్న మేటర్ని కూడా చదివాడు. “ఎంతసేపు భాయీ? ట్రైన్ టైము అయిపోతుందంటుంటే అర్థం కావడం లేదా?” కోపంగా అడుగుతూ ఆటోలోనించి దిగారు ఇద్దరు ప్రయాణీకులు.

“క్షమించాలి సాబ్... మీరందరూ నడిచే వెళ్ళాలి. నా ఆటో ఇక్కడినించి కదలదు” అంటూ వాళ్ల సమాధానం కోసం ఎదురుచూసుకోకుండా, వందగజాల దూరంలో ఉన్న ఒక షాపు దగ్గిరికి పరిగెత్తాడు ఆటోడ్రైవర్.

ఆయాసపడుతూ చేరుకుని అక్కడ ఉన్న ఫోన్‌నుంచి కాయితంపై ఉన్న నెంబర్‌కి డయల్ చేశాడు.

* * * * *

వెలుగు క్రమంగా తగ్గుతూ చీకటి పడబోతోన్న సమయంలో ఉన్నట్లుండి చేయి ఎత్తి పెద్ద కంఠంతో ఏదో అరుపు అరిచాడు బంజారీ తండా నాయకుడు.

ఎక్కడా ఆగకుండా ప్రయాణం చేస్తూ వస్తున్న గార్ధభాలు వెంటనే ఆగిపోయాయి. వాటిమీది సామాగ్రినంతా కిందికి దించి, వాటిని పొదల్లోకి

పంపారు ఆడవాళ్ళు. ఎండు చితుకల్ని పోగుచేసి మంటలు వేశారు. సత్తుపాత్రల్ని మంటలమీద పెట్టి వంటలు స్టార్ట్ చేశారు.

"ఆకలి దంచేస్తోంది గురూ... మనకి తిండి పెడతారంటావా?" ఒక ముళ్ళ పొద దగ్గర కూర్చోబెట్టిన గంగారాం అడిగాడు షాడోని చూస్తూ.

వాళ్ళ చేతులు వెనక్కి విరిచి కట్టేశారు. తమతోపాటు నడవటానికి వీలుగా పాదాల్ని ఫ్రీగానే ఉంచారు.

"ఇంకో పది నిముషాల్లో చీకట్లు దట్టం అవుతాయ్... పిక్కబలం చూపించటానికి అభ్యంతరాలు ఏమైనా ఉన్నాయా?" మౌనంగా ఉన్న షాడోని అడిగాడతను.

"తొందర వద్దు... వెయిట్ చేద్దాం" అన్నాడు షాడో.

"ఎందుకు? ఇప్పటివరకూ తిన్న దెబ్బలు సరిపోలేదా!" ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు గంగారాం.

"బోర్డర్స్ దగ్గిర బేరం అంటే ఏమిటో తెలిసుకోవాలి... ఇంతవరకూ ఆ మాటని మనం వినలేదు..." చుట్టుపక్కల చూస్తూ కామ్‌గా చెప్పాడు షాడో.

"వినకపోతే ఇప్పుడు వచ్చిన నష్టం ఏమీ లేదు... ఈ చచ్చు మొఖాల్ని చూడలేక చచ్చిపోతున్నా.. మనం వెళ్ళిపోదాం" మొండిగా అన్నాడు గంగారాం.

తలతిప్పి అతనివంక చూడను కూడా చూడలేదు షాడో. తలవంచుకుని అలాగే కూర్చుండిపోయాడు.

వంటలు అయిపోయినయ్.

చితకుల మంటల దగ్గిర చేరి లొట్టలు వేసుకూంటూ పదార్థాల్ని ఆరగించారు బంజారీలు అందరూ. తాము పట్టుకు వచ్చిన బందీలకు కనీసం ఒక రొట్టెముక్కయినా పెట్టాలనే ఆలోచన వారిలో ఏ ఒక్కరికీ రాలేదు.

“ఓరి మీ మొఖాలు మండిపోనూ... మాకు పెట్టకుండా పొట్టలు పగల కొట్టుకుంటున్నారా? మీరసలు మనుషులేనా?” కచ్చగా అరిచాడు గంగారాం.

చివ్వున లేచి స్పీడ్‌గా వచ్చాడు ఒక యువకుడు. అతన్ని వెనక్కి నెట్టి దెబ్బ మీద దెబ్బగా నాలుగు దెబ్బలు వేసి, ఎంత స్పీడ్‌గా వచ్చాడో అంతే స్పీడ్‌గా వెళ్ళాడు.

“ఓరి వీడిదుంప తెగిపోను... గట్టి దెబ్బలే కొట్టాడు. మొఖం మంటెక్కిపోతోంది” అని వాపోయాడు.

అతను చెప్పినట్టు అవతలికి జారుకోవటమే మంచిదేమోనన్న ఆలోచన అతినెమ్మదిగా ఆ క్షణంలో అడుగుపెట్టింది షాడో మనసులోకి.

జాలి, దయ అనే పదాలు అమకు తెలియనట్టు చాలా కర్కశంగా ప్రవర్తిస్తున్నారు ఆ బంజారీలు. వాళ్ల వ్యవహారాలు కూడా అదే మాదిరి చాలా కఠినంగా, కరుకుగా ఉంటే– తమకు ఇబ్బంది ఎదురుపడటం డెఫినెట్....

“గెట్ రెడీ గంగూ... అవకాశం దొరకగానే జంప్ అయిపోదాం” అని అతను హెచ్చరించబోతుండగా– చీకట్లో నించి చాలా నెమ్మదిగా వారిద్దరి దగ్గరికీ వచ్చింది ఆరుసంవత్సరాలు కూడా నిండని ఒక బాలిక.

ఎవరికీ అర్థంకాని తమ కీసర బాసర భాషలో కీసుమంటూ ఏదో చెప్పి, తన బొడ్లో దోపుకున్న రొట్టెలు రెండింటిని తీసి అతనికి గంగారాంకి అందించింది.

“అమ్మా... కలకత్తా కాళీ... నీ భక్తుడు ఆకలితో అలమటించిపోతున్నాడని తెలిసి ఈ నికృష్టపు వేషంలో స్వయంగా వచ్చేశావా?” అన్నాడు గంగారాం.

“వెధవ డైలాగులు వదిలేయ్... ముందు ఆ రొట్టెల్ని తీసేసుకో” చిన్న కంఠంతో హెచ్చరించాడు షాడో.

క్షణం కూడా ఆలోచించకుండా నోటిని పెద్దగా తెరిచి, తలను ముందుకు జాచాడతను.

కిసుక్కున నవ్వి, ఒక రొట్టెను అతని నోటికి అందించిందా బాలిక. రెండో రొట్టెని షాడో నోటిలో పెట్టింది.

“ఎవరా బందీల దగ్గర?” అని అర్థం వచ్చే కీసర బాసర అరుపు సడన్‌గా వినవచ్చింది.

నోటికి దొరికిన ప్రాణిని పాము ఎంత త్వరగా లోపలికి లాగేసుకుంటుందో, అంతకు పదింతలు వేగంతో రొట్టెను మింగేశాడు గంగారాం.

“దుష్టదుర్మార్గుల మధ్యలో దయగల తల్లివి. బురదలో పుట్టినా కళ్లకు పసందు కలిగించే తామరపువ్వువి. వెళ్ళిపోరా అమ్మడు... ముందు ఇక్కడినించి దూరంగా వెళ్ళిపో” అంటూ ఆ బాలికని హెచ్చరించాడు.

మాటలు అర్థం కాకపోయినా భావం అర్థమైనట్టుంది. ఇంకోసారి కిసుక్కున నవ్వి గబగబా అవతలికి నడిచిందా బాలిక. ఆ పిల్ల అటుపోవడం, మకురు దున్నపోతులా ఉన్న ఒక బంజారీ అక్కడికి రావటం ఒకేసారి జరిగింది.

"ఎవరు? ఇక్కడికి వచ్చింది ఎవరు?" బందీలవంకా, ఆ చుట్టుపట్ల ఉన్న పొదల వంకా చూస్తూ అడిగాడు తమ భాషలో.

"వీళ్లలో చాలామంది మనభాష వచ్చని నా అనుమానం. రానట్టు నటించడం అంటే సరదా అనిపిస్తోంది" షాడోతో అన్నాడు గంగారాం.

"ఎలా తెలుసు నీకు?" ఆలస్యం చేస్తే ఆ బంజారి నోట్లో ఉన్న రొట్టెని బలవంతంగా లాగేసుకుంటాడన్న అనుమానంతో గబగబా మింగేసి అడిగాడు షాడో.

"ఎంత సంచార జాతి అయినా ఎప్పుడో ఒకప్పుడు నాగరికుల దగ్గరికి పోవడమో, ఏదో ఒక కనెక్షన్ పెట్టుకోవడమో చేసి తీరాలి... ఏదీ లేకుండా తమంతట తాము బతకడం కష్టం" అన్నాడు గంగారాం.

తనకు అర్థం కాని సమస్య ఏదయినా వచ్చినప్పుడు అలా అవాకులు, చవాకులు మాట్లాడటం గంగారాంకి అలవాటు. ఎదుట ఉన్న సమస్యకి సంబంధించిన మాటలు అయి ఉండవు అవి. అయినా ఒక్కొక్కసారి సూటిగా పోయి ఆ సమస్యకే కనెక్ట్ అవుతూ వుంటాయి.

"మన భాష వాళ్లకి తెలిసి ఉండవచ్చని ఎలా చెప్పగలవు?" ఉబికి వస్తున్న నవ్వును అతిబలవంతంగా అదిమి పెట్టుకుంటూ అడిగాడు అతను.

"చూడు... నీకే తెలుస్తుంది" అంటూ తమ ఎదుట నిలబడిన బగుతూ బంజారీ వంక చూశాడు గంగారాం. కంచుగంట వంటి కంఠంతో మాట్లాడటం మొదలుపెట్టాడు. ముందుగా అతను దున్నపోతులాగా ఉన్నట్టు చెప్పాడు. అటువంటి దున్నపోతును కనటానికి అతని తల్లి ఎంత బాధపడి ఉంటుందో అంచనా వేశాడు.

సడన్‌గా ఒక అనుమానాన్ని బయటపెట్టాడు. "అసలు నిన్ను కన్నది ఎవరు బే? మనుషులా, జంతువులా?"

ఎదుట నిలబడి ఉన్న బంజారామనిషి మొఖంలో రకరకాల రంగులు ప్రత్యక్షమవుతూ ఉండటం కనిపించింది షాడోకి. "యువ్వార్ కరెక్ట్ గంగూ... ప్రొసీడ్" అంటూ మెచ్చుకున్నాడు గంగారాం వైపు చూసి.

మామూలు కంటె మూడు అంగుళాలు అధికంగా విస్తరించింది గంగారాం చాతీ. బంజారా మనిషి తల్లిదండ్రుల దగ్గర్నించి అతని తాత ముత్తాతల దగ్గిరికి వెంటనే జంప్ చేశాడు. "మీ తాతకి రెండు కొమ్ములుండేవా? తోక సంగతేమిటి?" అని అడిగాడు.

ఎర్రటి ఎండకి మాడిపోయిన బండరాయికి మల్లే ఒకే ఒక రంగు స్థిరంగా నిలబడిపోయింది ఆ బంజారా మనిషి మొఖం మీద. పళ్ళు పటపటమని కొరుకుతూ ఎగిరి దూకాడు గంగారాం మీదికి. పిడికిళ్ళు బిగించి ఫెడీ ఫెడీమని కొట్టడం స్టార్ట్ చేశాడు.

దెబ్బ దెబ్బకీ ఒక తిట్టు తిట్టాడు గంగారాం. అతన్ని అతని ఫ్యామిలీని వదిలి తండా మొత్తాన్ని తన తిట్లలోకి లాగాడు. "రండిరోయ్... రండి... రండి" విపరీతమైన ఆవేశంతో బిగ్గరిగా అరిచాడు ఆ మనిషి.

అరుపు అతని నోటినుంచి వెలువడిన మరుక్షణం అతని వెనుక ప్రత్యక్షమయ్యారు తండా మెంబర్స్ అందరూ. "వీడు బతికి ఉండటానికి వీలులేదు... చంపి పారేస్తాను. అనుమతి ఇవ్వండి" మితిమీరిన కోపంలో తను ఏ భాషలో మాట్లాడుతున్నదీ మర్చిపోయాడు కాబోలు– ఆర్డినరీ లాంగ్వేజ్ వచ్చింది అతని నోటినుండి.

అతని వంకా, బందీల వంకా మార్చి మార్చి చూశాడు నాయకుడు. "మా భాష మీకు తెలుసు... తెలియనట్టు నటిస్తే మేము కనిపెట్టలేమని అనుకోవడం మీ పిచ్చితనం" కామ్‌గా చెప్పాడు షాడో.

రెండు క్షణాలు ఆలోచించి తమ భాషలో ఏదో చెప్పాడతను అందరికీ. ఎంత సడన్‌గా వచ్చారో అంతే సడన్‌గా వెనక్కి వెళ్ళిపోయారు అందరూ... ఆ మందిలో ఒక్క దున్నపోతు బంజారా తప్ప.

"నీకు బొట్టుపెట్టి బ్యాండ్ మేళంతో వచ్చి చెప్పాలా? వెళ్ళిపో బే... వెళ్ళి కడుపు పగిలిపోయేటట్టు రొట్టెలు తిని బకాసురుడిలా నిద్రపో" వెక్కిరించాడు గంగారాం.

రయ్‌మంటూ కదిలి బలంగా మరో దెబ్బ వేయబోయి, నాయకుడు సీరియస్‌గా చూడటంతో తలవంచుకుని అవతలికి వెళ్ళిపోయాడా హీరో.

“ఇప్పటివరకూ ఎంతోమందిని పట్టుకున్నాం మేం... పట్టుబడిన క్షణం నుంచీ తోకలు కోసిన సూకరాల మాదిరి ఒకటే ఏడుపు తప్ప– వేరే మాటలు ఏవీ ఎవరూ మాట్లాడలేదు. మీ పద్ధతి విచిత్రంగా ఉంది. మీకు భయంగా లేదా?” షాడోని అడిగాడు నాయకుడు.

“ఎందుకు భయం? ఏం చేస్తారు మమ్మల్ని? చంపేస్తారా?” వెంటనే అడిగాడు షాడో.

“చంపటానికి ఇంత దూరం రావాల్సిన అవసరం లేదు... బేరం పెట్టేస్తాం...” అన్నాడు నాయకుడు.

“అంటే ఏమిటి?” అడిగాడు షాడో.

“ఇంకాస్సేపట్లో నీకే తెలుస్తుంది...” అంటూ సడన్‌గా లేచి వెనక్కి వెళ్ళిపోయాడు నాయకుడు.

“నిదానంగా నీ ముందు కూర్చుంటే కుశలప్రశ్నలు వేసి, కడుపునిండా తిండి పెట్టేస్తాడని ఆశపడ్డాను... వాడు కూడా దున్నపోతే... వాడి తాత ముత్తాతలు...” అంటూ అంతకు ముందు బంజారా మనిషిని తిట్టిన తిట్లన్నిటినీ మళ్ళీ మొదలుపెట్టబోయాడు గంగారాం.

“షట్ యువర్ మౌత్ గంగూ... కీప్ క్వయిట్” ఉన్నట్లుండి అతన్ని హెచ్చరించాడు షాడో. ఠక్కున నోటిని అదుముకుని మహాకోపంగా చూశాడు గంగారాం.

అతని వంక చూడడం లేదు షాడో... తాము కూర్చున్న ప్రదేశానికి కుడివైపు ఒక పెద్ద బండరాయి వంక చూస్తున్నాడు. "ఏముంది గురూ అక్కడ?" అడుగుతూ తను కూడా అటుకేసి చూశాడు గంగారాం.

బరువైన మూటలు కొన్నింటిని భుజాలమీద వేసుకుని బండరాయి చాటునుంచి పొదల దగ్గరికి వస్తున్నారు కొందరు ఆగంతకులు... కళ్ళు చిట్లించి ఇంకాస్త పరీక్షగా చూసిన గంగారాంకి... వెంటనే తగిలిందొక షాక్.

"అయ్యబాబోయ్... బోర్డర్స్‌ని దాటి వచ్చిన సోల్జర్స్... మనవాళ్ళకి కనిపించకుండా ఇక్కడకు ఎలా రాగలిగారు?" ఆశ్చర్యంగా కామెంట్ చేశాడు అతను.

మొత్తం పాతికమంది ఉన్నారు ఆ వచ్చిన వాళ్ళల్లో.

"జొన్నపిండి మూటలు నాలుగు, బటానీలు మూడు... మొత్తం ఏడు... లెక్క చూసుకోండి" మోసుకు వచ్చిన మూటల్ని నాయకుడి ముందు నిర్లక్ష్యంగా పడేస్తూ అతనికి చెప్పాడు వారిలో లీడర్ వంటి సోల్జర్.

"పది మూటలు తెస్తామని చెప్పారు, కిందటిసారి వచ్చినప్పుడు" ముక్తసరిగా అన్నాడు నాయకుడు.

"నువ్వు సరైన వాళ్ళని అప్పచెపితే మేము ఇచ్చిన మాట మీద నిలబడతాం. ఎప్పుడు చూసినా ఇవాళో రేపో గుటుక్కుమనే వెన్నెముకలేని వాళ్లని తీసుకువస్తున్నావ్. జైల్లో పెట్టిన రెండో వారంలోనే గుటుక్కుమంటున్నారు. మాకు ఏం ఉపయోగం లేకుండా ఉంది" అన్నాడు లీడర్.

"ఈసారి మీకు ఉక్కుముక్కల్ని అప్పచెపుతాను... మీరు మీదపడి పిచ్చికొట్టుడు కొట్టినా కొంచెం కూడా లెక్క చెయ్యరు" అంటూ వెనక్కి చూసి ఎవరికో సూచన చేస్తున్నట్టు సైగ చేశాడు నాయకుడు.

ఆశ్చర్యంగా చూస్తున్న షాడో, గంగారాంల చేతులు పట్టుకుని బలవంతంగా పైకి లేపారు ఇద్దరు బంజారా యువకులు. బరబరమని నెట్టుకుంటూ తీసుకుపోయి బోర్డర్స్ దాటివచ్చిన ఆ సోల్జర్స్ ముందుకు నెట్టారు...

"అర్థమైంది. విషయమేంటో నాకు ఇప్పుడు పూర్తిగా తెలిసిపోయింది" షాడోతో అన్నాడు గంగారాం.

చిత్తడినేలల్లో పిట్టల్ని, జంతువుల్ని పట్టుకుని పొట్ట పోసుకోవడం ఒకటే కాదు ఆ బంజారీలు చేసే పని... తమ చేతికి దొరికిన నాగరీకుల్ని కామ్‌గా బోర్డర్స్ దగ్గిరికి తీసుకు వస్తారు... చీకటి మాటున బోర్డర్స్‌ని క్రాస్ చేసి వచ్చి ఆ బందీలను బేరమాడుతారు ఆ సోల్జర్స్... బంజారీలకు కావాల్సిన జొన్నపిండి, బటానీగింజల్ని ఇచ్చి బందీలను వెంటబెట్టుకొని తమతో తీసుకుపోతారు...

"ఆ తర్వాత ఏం చేస్తారో మాత్రం నాకు తెలియటం లేదు" తనకు తెలిసిన విషయం షాడోకి కూడా అవగతమైందని గ్రహించి మరోమాట చెప్పాడు గంగారాం.

"అదేమంత కష్టమైన పనికాదు గంగూ, దొంగచాటుగా బోర్డర్స్‌ని దాటి తమ భూభాగంలోకి ఎంటర్ అవబోతుండగా పట్టుకొన్నట్టు ప్రకటిస్తారు..." అన్నాడు షాడో.

“అందువల్ల వీళ్లకి ఉపయోగం?” అడిగాడు.

“మన ప్రభుత్వం తనకింద ఉన్న డిపార్ట్‌మెంట్స్ అన్నింటికీ కోటాలు విధించి ఎలా రాబడి పెంచుకోవాలని అనుకుంటుందో, వీళ్ళు కూడా అలాగే కోటాలని మీట్ అవ్వాలి. బోర్డర్స్‌ని కాపలా కాసేవాళ్ళు బోర్డర్స్‌ని దొంగచాటుగా దాటేవాళ్ళని పట్టుకు తీరాలి. పట్టుకోలేకపోతే సరిగ్గా పని చేయటం లేదనే మాట వస్తుంది” చెప్పాడు షాడో.

“ఇంతకు ముందు వరకూ నీకు ఏమీ తెలియదు. ఇప్పుడు అన్నీ తెలిసినట్టు చెప్తున్నావ్” అన్నాడు గంగారాం. ఆ మాటకు సమాధానం ఇచ్చే అవకాశం షాడోకి అసలు లభించలేదు. అతన్ని, గంగారాంని చూసి మెచ్చుకోలుగా తల ఊపాడు సోల్జర్స్ లీడర్.

“ఈసారి వచ్చినప్పుడు తప్పకుండా ఇంకో రెండు మూటలు ఇస్తాం” అంటూ తన సోల్జర్స్‌కి సైగ చేశాడు.

“తప్పు వీళ్ళది కాదు గురూ... మనదేశంలో ఉండి... మనవాళ్ళనే బేరం పెట్టే ఈ దొంగనాయళ్ళది... ముందు వీళ్ళ కాళ్ళు చేతులు తీసేయాలి” కచ్చగా అంటున్న గంగారాం జబ్బ పట్టుకుని లాగాడు ఒక సోల్జర్.

బాలెన్స్ నిలుపుకోవటం చేతకాక బోర్లాపడిపోయాడతను. ఫక్కున నవ్వి అతని నడుము మీద బూటుకాలితో బలంగా అదిమి షాడోకేసి తిరిగాడు ఆ సోల్జర్.

ఎదురుతిరిగి అటో ఇటో తేల్చుకోవాల్సిన సమయం వచ్చేసిందని షాడోకి అవగతమైంది. వీళ్ళతో కలిసి బోర్డర్స్ దాటటం అంటూ జరిగితే తిరిగి ఇవతలికిరావటం ఒక పట్టాన సాధ్యపడదు... వెనక్కి విరిచి కట్టేసివున్న చేతులతో వీళ్ళని ఎదిరించటం ఏవిధంగా సాధ్యం?

షాడో మనసులో మెదిలిన ఆ ప్రశ్నకు సమాధానం లభించకముందే– చోటు చేసుకున్నది అక్కడ ఇంకో విచిత్రమైన పరిణామం. తన తండాలో ఉన్న మగవాళ్లనే పక్కన పెట్టుకుని సోల్జర్స్‌తో మాట్లాడుతున్నాడు తండా నాయకుడు. ఆడవాళ్ళు, పిల్లలు అందరూ దూరంగా పొదల చాటుకు వెళ్లిపోయారు....

బండరాయి దగ్గిర జరుగుతున్న బేరసారాల్ని చూడాలని అనిపించింది కాబోలు– తనకు తెలియకుండానే పొదల్ని దాటి కొంచెం ముందుకు వచ్చింది ఒక బంజారా యువతి. వెంటనే పడింది లీడర్ చూపు ఆమెమీద.

"బాగుంది. చాలా బాగుంది... మాతో పంపించు నాలుగైదు రోజులు అట్టే పెట్టుకుని వెనక్కి పంపిస్తాం" క్షణం కూడా ఆలోచించకుండా అన్నాడు నాయకుడితో.

అదిరిపడినట్టు రెండు అడుగులు వెనక్కి వేశాడు నాయకుడు. "నా మనవరాలు... ఇంకా జోడు కుదరలేదు... మీరు అడగటం న్యాయం కాదు" కంగారును కప్పి పెట్టుకోవడానికి ప్రయత్నం చేస్తూ చెప్పాడు.

"మరేం పరవాలేదు... పాతిక మూటలు పంపిస్తాం. కావాలంటే రేపు ఇదే వేళకి ఇక్కడికే తెచ్చిస్తాం... మాతో పంపించు" అంటూ అతని సమాధానం కోసం ఎదురుచూడకుండా తన సోల్జర్స్‌కి సైగ చేశాడు లీడర్.

ఆలస్యం చేసే అలవాటులేనట్టు ముందుకు దూకారు వాళ్ళు. "వద్దు... తీసుకుపోవద్దు. నేను ఒప్పుకోను" అంటూ వారిని అడ్డుకోవటానికి రెడీ అయ్యాడు తండా నాయకుడు. అతను ఒక్కడే కాదు... తండాలోని యువకులు అందరూ తమ ఆయుధాల్ని ముందుకు జాచారు.

తన వెనుక ఉన్న సోల్జర్స్ వంక చూశాడు లీడర్. ఛట్ ఛట్‌మన్ పైకి లేచినయ్ వారివద్ద ఉన్న రైఫిల్స్.

అధునాతన ఆయుధాలు అవి... ట్రిగర్స్‌ని ప్రెస్ చేస్తే క్షణాలమీద నామరూపాలు లేకుండా నాశనమై పోతారు తండాలోని యువకులు అందరూ...

"అన్యాయం... అక్రమం... దారుణం... దుర్మార్గం" పరిస్థితి ఏవిధంగా మారిపోబోతున్నదో తెలిసి, గద్గద స్వరంతో వాపోయాడు తండా నాయకుడు.

"నీకు నాకు దారుణం ఏమిటి? దుర్మార్గం ఏమిటి?? నోరు మూసుకోకపోతే తండాలో ఉన్న ఆడవాళ్ళందర్నీ తీసుకుపోతాను..." అంటూ తల ఊపాడు లీడర్.

గబగబా పోయి పొదల చాటునుంచి ఇవతలికి వచ్చిన యువతిని పట్టుకున్నారు వాళ్ళు. గింజుకుంది ఆమె.

చెంపలు పగిలిపోయాయేలా కొట్టి వెనక్కి పరిగెత్తటానికి ప్రయత్నం చేసింది. రాక్షసుల మాదిరి నవ్వుతూ ఆమెను మరింత ఒడుపుగా పట్టుకుని తమ లీడర్ దగ్గిరికి లాక్కు వచ్చారు ఆ సోల్జర్స్ అందరూ కలిసి.

"మనకి అనవసరం గురూ... పారిపోవటానికి ఇదే మంచి అవకాశమేమో ఒకసారి చూడు..." కిందినించి లేవకుండానే షాడోని అడిగాడు గంగారాం.

సోల్జర్స్ అందరి చూపులు నాయకుడి మనవరాలిమీదే ఉన్నాయి. గుండెలనిండా ఊపిరి పీల్చుకున్నాడు షాడో. గంగారాంవైపు చూసి తల ఊపబోతుండగా...

"వదలండి... మా అక్కను వదిలేయండి... వదలండి" అంటూ పొదల వెనుకనుంచి పరిగెత్తుకు వచ్చింది ఒక ఆరేళ్ళ బాలిక. ఆ కీసర బాసర భాష అవగతం కాకపోయినా ఆ పిల్ల ఇంటెన్షన్ ఏమిటో తెలిసి, ఎక్కడివాడక్కడ ఆగిపోయాడు షాడో. కింద ఉన్న గంగారాం మోకాళ్ళమీదికి లేచినా ఏ మాత్రం పట్టించుకోలేదు.

"వదలండి... వదిలిపెట్టండి..." అంటూ స్పీడ్‌గా వచ్చి తన అక్కను పట్టుకున్న సోల్జర్స్‌ని కొట్టటం మొదలుపెట్టింది బాలిక. చిన్ని చేతులు.. కర్కశత్వం మూర్తీభవించిన ఆ కరుకు పర్సనాలిటీలకు ఏం తగులుతుంది దెబ్బ? "అరే.... దీని స్పీడ్ చాలా బాగుంది. దీన్ని తీసుకుపోదాం. పట్టుకోండి" ఉన్నట్లుండి అన్నాడు లీడర్.

రెండు జతల చేతులు గబుక్కున ఒడిసిపట్టుకున్నాయి ఆ చిన్నారిని. ఆ దృశ్యాన్ని చూసి గావురుమంటూ అరిచి ముందుకు దూకాడు తండా నాయకుడు. అతనితో పాటే కదిలారు తండా యువకులు.

నిర్ధాక్షిణ్యంగా గర్జించాయి రెండు రైఫిల్స్. తెరిచిన నోరు తెరిచినట్టుండగానే తూలి వెనక్కి పడిపోయాడు నాయకుడు. అతనికి నాలుగు అడుగుల దూరంలో నేలను కరుచుకున్నాడో యువకుడు. మంటలమీద నీళ్ళు కుమ్మరించినట్టు చటుక్కున మాయమైపోయింది మిగిలినవారి ఆగ్రహం... భయంతో వెనక్కి జరిగారు.

‘‘ఖబడ్దార్ ఆగే బడేతో... మేము విసిరిపడేసే పిండితో బతికే పందులు మీరు. మాకు అడ్డం వస్తే మొత్తం తండానే చంపి అవతల పారేస్తాం... భాగో యహాఁసే’’ ఖంగుమంటున్న కంఠంతో హెచ్చరించాడు సోల్జర్ లీడర్.

అదే అతని జీవితంలో ఆఖరి మాట... ఎప్పుడయితే తన అక్కకోసం అలమటించిపోతూ చిన్నపిల్ల సోల్జర్స్ మీదికి వచ్చిందో– అప్పుడే అక్కడినించి జంప్ చేసే ఆలోచనని వదిలేశాడు షాడో. ‘‘అయ్యబాబోయ్... మనకి రొట్టెలు పెట్టిన కలకత్తా కాళి... ఇదేంటి ఇలా వచ్చేసింది’’ అంటూ కిందినించి లేచాడు గంగారాం.

నిలుచున్న చోటినించే అమాంతం గాలిలోకి ఎగిరాడు షాడో. అతని నాభి కమలం దగ్గిర్నించి ఉదర కండరాలను బిగదీస్తూ కంఠనాళాలలో నుంచి బయటికి వచ్చింది దారుణమైన కరాటే షౌట్. కంటికి కనిపించని వేగంతో సోల్జర్స్‌కి లీడర్‌లాగా కనిపిస్తున్న పెద్దమనిషి దవడకి కనెక్ట్ అయింది అతని ఎడమపాదం.

అరవటానికి కూడా సరైన వ్యవధి ఆ వ్యక్తికి లభించలేదు. నిలుచున్నవాడు నిలుచున్నట్టుగానే పడిపోయాడు. పాదాలు నేలకు తాకిన మరుక్షణం ఇంకోసారి గాలిలోకి ఎగిరాడు షాడో. నాయకుడి వెనకాల నిలబడి ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు వెనక్కి పడిపోయారు.

ఈసారి పాదాలు నేలను తాకిన తర్వాత గాలిలోకి జంప్ చేయలేదు షాడో. భుజాలతో ఇంకో ఇద్దరు సోల్జర్స్‌ని పొడిచి బండరాయి అవతలికి పరుగు తీశాడు.

కన్నుమూసి కన్ను తెరిచేటంతలో జరిగిపోయాయా సంఘటనలు. అదిరిపాటు నుంచి తేరుకున్న సోల్జర్స్‌కి– పారిపోవటానికే అతను అలా పరిగెత్తుతున్నాడని అనిపించింది. వెనుకా ముందు చూసుకోకుండా “పకడో… పకడో…” అని అరుస్తూ అతని వెనకాలపడ్డారు. తమ దగ్గిర ఉన్న ఆయుధాల్ని ఉపయోగించాలన్న ఆలోచన వారికెవరికీ రాలేదు. పారిపోతున్నవాడిని పట్టుకోవటమొక్కటే అత్యవసరమనిపించింది.

కిందపడిపోయినవారు తప్ప మిగిలిన వారందరూ షాడో వెనుక పరుగులు తీయటం మొదలుపెట్టిన వెంటనే తను కూడా యాక్షన్‌లోకి దిగిపోయాడు గంగారాం.

పైకి లేవబోతున్న ఇద్దర్ని పాదాలతో బలంగా తన్ని మళ్ళీ పడుకోబెడుతూ– “పారిపోండిరా సన్నాసి వెధవల్లారా. ఆడవాళ్ళను తీసుకుని అంతర్ధనమైపొండి” అని అరిచాడు. మగవాళ్ళ బుర్రలు పనిచేయలేదుగాని, ఆడవాళ్ళకు అవగతమైంది అతను ఎందుకలా చెపుతున్నాడో.

గుంపుగా పొదలచాటు నుంచి గుంపుగా వచ్చేశారు వాళ్ళు. గాయపడిన నాయకుడిని, రెండో యువకుడిని చేతుల్లోకి తీసుకున్నారు కొందరు. బిత్తరచూపులు చూస్తున్న నాయకుడి మనవరాలు, ఆమె చెల్లెల్ని పట్టుకుని మళ్ళీ పొదల వెనక్కి పరారయిపోయారు.

గంగారాం అరిచిన మూడో క్షణంలో ఒక్క పురుగు కూడా ఆ ప్రదేశంలో లేకుండా పోయింది. అందరూ అంతర్ధానం అయిపోయారని నికరంగా తెలిసిన వెంటనే కింద ఉన్నవారిని ఇంకో రెండు పీకులు బలంగా పీకి తను కూడా చీకట్లో కలిసి అదృశ్యం అయిపోయాడు.

* * * * *

తనకు జరిగిన అన్యాయాన్ని అదే పనిగా తలుచుకుని తలుచుకుని అమితంగా ఏడ్వటం వల్ల ముంచుకు వచ్చేసింది కుందూకి విపరీతమైన జ్వరం.

రాత్రి పదిగంటల సమయానికి నూటరెండు డిగ్రీలు దాటిపోయింది. కళ్ళు మంటలు, ఒళ్ళు నెప్పులతో పాటు విపరీతమైన చలి... పదిగంటల ఇరవై నిముషాలకి గుడి తలుపులు మూయటానికి వచ్చిన వాచ్‌మెన్ చూశాడు అతన్ని. “చీకటిపడిన తర్వాత ఎవరూ ఇక్కడ ఉండకూడదు. వెళ్ళిపో” అంటూ కసురుకున్నాడు.

తెల్లవారే వరకూ గుడి ఆవరణలోనే కాలక్షేపం చేయాలని అనుకుంటున్నాడు అతను. ఆలస్యం చేస్తే అతను మెడ పట్టుకుని బయటికి నెట్టేస్తాడన్న భయంతో, అతి ప్రయత్నం మీద లేచాడు. అవిటికాలు బాగా నొప్పి చేయటం వల్ల పావుగంటకి పైగా పట్టింది అతనికి రోడ్డును చేరుకోవటానికి. ఆగి

ఆగి వీస్తున్న గాలిలో చల్లదనం ఏమంత పెద్దగా లేకపోయినా ఒంట్లోకి చేరిన జ్వరం కారణంగా గజగజ వణికిపోతున్నాడు అతను. ఆ వణుకును చూసి తమ దుకాణాల దగ్గిరికి కూడా అతన్ని రానీయలేదు ఆ చుట్టుపట్ల ఉండే వ్యాపారస్తులు.

"పోరా.. ఇంకెక్కడికైనా పో..." అంటూ కసురుకుని తమ దుకాణాలకు తాళాలు వేసుకుని వెళ్ళిపోయారు. తిండి పెట్టే దిక్కులేదు. జ్వరం వస్తే పలకరించే నాధుడు లేడు... అసలు తన గోడును వినిపించుకునే దిక్కు ఆ పట్టణంలో లేదు. తనవంటి దురదృష్టవంతుడు ఎవరైనా ఉంటాడా ఈలోకంలో?? పుట్టి బుద్దెరిగిన తర్వాత ఎన్ని అవమానాలు ఎదురైనా ఏనాడు అతిగా బాధపడని ఆ అమాయకుడి మనస్సులోకి పరిధుల్ని దాటి ప్రవేశించాయి రకరకాల ఆలోచనలు. వాళ్ళతో వీళ్ళతో ఛీ కొట్టించుకుంటూ ఈ బతుకు బతకకపోతే ఏం? బతికి తను సాధించగలిగేది ఏముంది? పదకొండు గంటల సమయంలో సడన్‌గా అంతం అయిపోయాయి అతని ఆలోచనలు. దుర్గామాయి గుడి దగ్గరకి వస్తున్న సమయంలో కనిపించింది అతనికి ఒక కాలువ. సిటీలో ఉన్న మురుగు నీరంతా ఉరకలు వేస్తూ నురుగులు వెదజల్లుతూ ప్రవహిస్తోంది అందులో. కన్నీటితో మలినమైన ముఖాన్ని చొక్కా అంచుతో తుడుచుకుంటూ అటుకేసి నడవటం మొదలుపెట్టాడు అతను.

*　　*　　*　　*　　*

ఫుల్‌గా మందు కొట్టాడు జానీసింగ్‌గా కుందూకి పరిచయం అయిన హీరో. తను తాగటమే కాదు– తన దోస్తులు ఇంకో నలుగురికి పూర్తిగా పోయించాడు.

“తాగండి బే... తాగండి” అంటూ ప్రోత్సహించాడు.

“ఇవాళ ఎంత దొరికిందేమిటి?” అడిగాడో దోస్తు.

“అబ్బో.. చాలా ఎక్కువ... మొత్తం మీద పాతికవేలకు పైనే ఉంటుంది” అంటూ తాగటాన్ని ముగించి లేచి నిలబడ్డాడు హీరో. అతన్ని పాలో అయ్యారు దోస్తులు. సారా దుకాణం వెలుపలే వెయిట్ చేస్తున్నాడు ఆటోడ్రైవర్. అటువంటి కేసుల్ని తీసుకుపోవటం అలవాటే అతనికి.

“జామీబజార్‌కి పోదాం వస్తావా?” అడిగాడు హీరో.

ఆటోని స్టార్ట్ చేసి తల ఊపాడు ఆటోడ్రైవర్.

ఒకరిమీద ఒకరు పడుతూ లోపలికి చేరుకున్నారు అతని కస్టమర్స్. “పోనీ త్వరగా పోనీ...” తొందర పెట్టారు. స్పీడ్‌గానే కదిలి, పది నిముషాల తర్వాత దుర్గామాయి గుడికి దగ్గర ఉండే మురుగు కాలువ దగ్గిరికి చేరుకుంది. విజిల్ వేస్తూ చూస్తున్న హీరోకి కుంటుకుంటూ కాలువ దగ్గిరికి వస్తున్న కుందూ కనిపించాడు.

“ఆపు... ఆపేయ్...” వెంటనే ఆర్డర్ ఇచ్చాడతను.

ఆగిపోయింది ఆటో. “అడుగో... ఆ కుంటినాయాల్నే నేను పల్టీ కొట్టించింది... ఏడుపు మొఖం పెట్టుకుని ఎలా వస్తున్నాడో చూడండి” నవ్వుతూ తన దోస్తులకి కుందూని చూపించి చెప్పాడు హీరో.

“మొత్తం నొక్కేశావా? ఇంకా ఏమైనా మిగిలి ఉందా?” అడిగాడు ఒక దోస్తు.

"సంచీలో ఉన్నదే పట్టేశాను. చొక్కాజేబులో ఇంకా కొంత ఉందేమో తెలియదు" అన్నాడు హీరో.

"అయితే నేను వెళ్ళి ఆ జేబుల్ని కూడా ఖాళీ చేస్తాను" అంటూ ఆటో దిగాడు ఒకతను.

"మొఖం చూస్తుంటే మహాకష్టంలో ఉన్నట్టుంది... వదిలేయండి భాయీ..." అన్నాడు ఆటోడ్రైవర్– కుందూ వాలకాన్ని ఓసారి గమనించి.

"ఏడుపు మొఖంపెట్టి మా జేబుల్లో పైసలు లేవంటే వదిలేస్తావా నువ్వు?" అడిగాడు ఆటో దిగిన వ్యక్తి. నోరు మూసుకోవటం కంటె మంచిపని మరొకటి లేదని అర్థమై కామ్‌గా ఉండిపోయాడు ఆటోడ్రైవర్.

అర్జంటు పని ఏదో అప్పుడే గుర్తుకు వచ్చినట్టు– "ఒకే ఒక్క నిమిషంలో వచ్చేస్తాను. ఒక్కటంటే ఒక్క నిమిషం" అంటూ ఆటో దిగి రోడ్డుకు రెండో పక్కన ఉన్న షాపు దగ్గరికి త్వరత్వరగా వెళ్ళిపోయాడు.

క్లోజ్ అయిపోయి ఉంది ఆ షాపు... పగలంతా గుడి దగ్గర యాచన చేస్తూ గడిపిన బిచ్చగాడు ఎవరో షాపు మెట్లమీద పడుకుని ఉన్నాడు. అతన్ని రఫ్‌గా అవతలికి నెట్టి మెట్లమీద కూర్చున్నాడు ఆటోడ్రైవర్.

అలా అవతలికి వెళ్లిపోవాలని ఎందుకు అనిపించదని ఎవరైనా అడిగితే సరైన సమాధానం లేదు అతని దగ్గిర.

'మోసాలు చేయడం, రుబాబు చూపించి డబ్బులు సంపాదించడం పెద్ద తప్పేమీ కాదుగాని– పోయి పోయి మరీ ఒక అవిటివాడిని అదేపనిగా టార్గెట్

చేయటం ఎందుకనో నాకు నచ్చలేదు. అందుకే ఆ దృశ్యాన్ని చూడలేక ఇవతలికి వచ్చేశాను' తనకు తనే సమాధానం చెప్పుకుంటూ వెయిట్ చేశాడు.

ఆ సమయంలో అతనికి తెలియలేదు. అవతలికి పోకుండా ఆటోలోనే ఉండి ఉన్నట్టయితే– ఆరోజు లేచీ లేవగానే ఎవరి మొఖం చూశాడో గుర్తుకుతెచ్చుకోవాల్సిన అవసరం అర్జంటుగా ఏర్పడి ఉండేది. విషయం ఏమిటంటే మురుగు కాలువమీదనే దృష్టిని నిలిపి, సాధ్యమైనంత వేగంగా అడుగులు వేస్తున్న కుందూ దారికి అడ్డం నిలబడ్డాడు ఆటోలోనించి దిగిన వ్యక్తి.

"ఒక్కక్షణం ఆగు భాయీ... ఎక్కడికి పోతున్నావ్ నువ్వు?" అని అడుగుతూ భుజం మీద చెయ్యివేశాడు.

పరిచయం లేనివాళ్ళు ఆప్యాయంగా పలకరిస్తే ఆ తర్వాత ఏం జరుగుతుందో అనుభవపూర్వకంగా తెలుసుకున్న కుందూ... తనకు తెలియకుండానే విదిలించేశాడు ఆ చేతిని. "అరే సైతాన్... అభిమానంతో పలకరిస్తే హరాం చేస్తావేమిటి బే? ఎలా వుంది ఒళ్ళు?" దారుణమైన కోపాన్ని తెచ్చుకుంటూ కరుకుగా అడిగాడా వ్యక్తి.

సమాధానం ఇవ్వలేదు కుందూ.

అతను పలకరిస్తోంది తనను కాదని అన్నట్లు ఇంకా కొంచెం వేగంగా వెళ్ళిపోవటానికి ట్రై చేశాడు.

ఫెడీమని కొట్టాడు ఆటోదిగిన వ్యక్తి. తట్టుకోవడం అసాధ్యమైంది కుందూకి. అడుగు తడబడింది. అమాంతంగా ఒక పక్కకి పడిపోయాడు.

‘‘జేబుల్లో వున్న సొత్తంతా బైటికి తీయ్...’’ వికృతంగా కమాండ్ చేశాడు ఆ వ్యక్తి. తనే ముందుకు వంగి కుందూ జేబులో చెయ్యి పెట్టబోయాడు.

అదిగో... అప్పుడు మొదలైంది అసలైన యాక్షన్.

మురుగు కాలువ మీద ఉన్న వంతెనకు కొంచెం ఇవతలగా... రోడ్డు పక్కనే ఉన్న ఒక పెద్ద చెట్టుకింద పార్క్ చేయబడి ఉన్నది ఒక వైట్ అంబాసిడర్.

ఇంటికిపోయే ఓపికలేకో, ఇంకేదయినా కారణంవల్లనో అలా రోడ్డుపక్కనే సెటిల్ అవడం ఆ సిటీలోని టాక్సీ డ్రైవర్స్‌కి మహా బాగా అలవాటు.

వైట్ అంబాసిడర్‌ని కూడా టాక్సీయే అనుకున్నాడు ఆటోదిగిన వ్యక్తి. తమకు అవసరంలేని విషయాల్లో వేళ్ళు పెట్టడం టాక్సీ డ్రైవర్స్‌కి అసలు అలవాటు లేదు.

సో... తను చేయదలుచుకున్నది ఏదైనా సరే నిరభ్యంతరంగా చేసుకోవచ్చని భావించాడు.

అయితే కుందూ కిందపడిన మరుక్షణం ఠక్కున తెరుచుకుంది అంబాసిడర్ డోరు. పొడుగాటి సిగార్‌ని మునిపళ్ళతో నొక్కిపెట్టి, రైలింజన్ మాదిరి గుప్పు గుప్పున పొగ వదులుతున్న ఒక పర్సనాలిటీ బయటికొచ్చింది.

‘‘తప్పు భాయీ... నువ్వు చేస్తున్నది చాలా పెద్ద తప్పు’’

ముందుకు వస్తూ చిన్న కంఠంతో హెచ్చరించింది. కుందూ జేబును తడమటానికి చాచిన చేతిని వెంటనే వెనక్కి లాక్కుని మహాగీరగా అటు చూశాడు ఆటో దిగిన వ్యక్తి. ‘‘మర్యాదగా అవతలికి పోకపోతే ముక్కూ మొఖం

ఏకమైపోతయ్... ఛలేజావ్ యహాఁసే" ఖంగుమంటున్న కంఠంతో వార్నింగ్ ఇచ్చాడు.

మరో మూడు అంగల్లో అతన్ని సమీపించింది ఆ పర్సనాలిటీ... నోటిలోని సిగార్ నోటిలోనే ఉంది. గుప్పు గుప్పున పొగ బయటికి వస్తూనే ఉంది. కోటు మడతల మీద ఉన్న చేతులు కదిలిన దాఖలాలు కూడా కనిపించలేదు.

నిలుచున్నవారు నిలుచున్నట్టే వెనక్కి పల్టీ కొట్టాడు ఆటో దిగిన వ్యక్తి. పాదాలకు పట్టు దొరకకపోవటంతో బోర్లాపడిపోయాడు. ఆశ్చర్యంగా చూస్తున్న ఆటోలోని హీరోలందరికీ వచ్చేసింది విపరీతమైన కోపం.

"వేసేయండిరా ఆ ముసలోడిని... నడములు విరగకొట్టి మురుగుకాలువలోకి నెట్టేయండి." అని అరుస్తూ అతివేగంగా ఆ పర్సనాలిటీ దగ్గరికి వచ్చేశారు.

అప్పుడు కూడా నోట్లో వున్న సిగార్‌ని తీయలేదు ఆ పర్సనాలిటీ.... కోటు చేతుల్ని మాత్రం కొంచెం పైకి లాక్కుంటూ వాళ్లని ఫేస్ చేసింది.

పిడికిటి పోట్లతో అతన్ని తల్లకిందులు చేసేయటం చాలా తేలిక అనుకుంటూ వచ్చిన హీరోలకి ఊపిరి తీసుకునే వ్యవధి కూడా లభించలేదు.

ఫట్‌ఫట్‌మంటూ పడ్డాయి వారి మొఖాలమీద పిడుగుల్లాంటి దెబ్బలు. నరాలు చెదిరి ఎర్రటిరక్తం నాశికా రంధ్రాలలో నుంచి వెల్లువలా వెలుపలికి వస్తుండగా రోడ్డును కౌగిలించుకున్నారు ఇద్దరు. విపరీతమైన భయంతో

వణికిపోతూ దూరంగా పారిపోయారు మిగిలినవారు... పడిన చోటినించి లేవకుండా విప్పారిత నేత్రాలతో ఆ ఫైటింగ్‌ని అలానే చూశాడు కుందూ.

"కాళ్ళు విరిగిపోయిన కోడిపిల్లలా పడినచోటే ఉండిపోతావా? పైకి లేవవా?" సడన్‌గా అతనికేసి చూస్తూ అడిగిందా పర్సనాలిటీ. కోపం లేదు ఆ కంఠంలో.

బెదిరింపు కూడా లేదు... జస్ట్... తనకు బాగా తెలిసిన సాటి మనిషితో ఇంకో మనిషి మాట్లాడినట్టే ఉంది.

తనకు తెలియకుండానే గబగబా లేచాడు కుందూ... నొప్పి చేసిన కాలిని తడుముకుంటూ అతనికేసి చూశాడు. "వీళ్ళు నిన్ను ఎందుకు టార్గెట్ చేస్తున్నారు?" అంబాసిడర్లోనించి దిగిన తర్వాత మొదటిసారిగా సిగార్‌ని తీసి మసిని అవతలికి విదిలిస్తూ అడిగిందా పర్సనాలిటీ.

ఎందుకో తెలియదు గాని ముంచుకు వచ్చేసింది దుఃఖం కుందూకి. బుగ్గలమీదికి జారడం మొదలుపెట్టిన కన్నీటిని షర్టుతో అద్దుకుంటూ తానెవరో చెప్పాడు.

ట్రైన్ దిగిన తర్వాత జరిగింది ఏమిటో వివరించాడు. "నీది వట్టి మట్టిబుర్ర... దగ్గర్లో ఉన్న పోలీస్టేషన్‌కి పోయి మీ ఇన్స్‌పెక్టర్ సాబ్‌ని గురించి ఒక్కమాట అక్కడ చెప్పి ఉంటే ఈ గొడవ ఇంత దూరం వచ్చి ఉండేది కాదు" అంతా విని తాపీగా తన అభిప్రాయం వెల్లడించింది ఆ పర్సనాలిటీ.

"పోలీసులందరూ నన్ను పిచ్చోడికిందే జమకట్టి మాట్లాడారు" తను ఆ ఆలోచన చెయ్యకపోవటానికి కారణం కూడా చెప్పాడు కుందూ.

"వీళ్ళలో ఆ ఆటోడ్రైవర్ ఎవరు?" సడన్‌గా తను పడగొట్టిన వాళ్ళకేసి తిరుగుతూ అడిగిందా పర్సనాలిటీ.

"ఇక్కడ ఉన్నాను సాబ్... ఈ గొడవని చూడలేక అవతలికి పోయాను" తనంతట తనే పరుగులాంటి నడకతో రోడ్డుమీదికి వస్తూ చెప్పాడు ఆటోడ్రైవర్.

"అచ్చా... నీకు ఒక పని అప్పగిస్తాను, చేస్తావా?" కోటు జేబులోనించి వాలెట్‌ని తీసి పట్టుకుంటూ అడిగింది ఆ పర్సనాలిటీ... "చేసి తీరతాను. చెప్పండి సాబ్..." అతనికి గబగబా చెప్పాడు ఆటోడ్రైవర్.

"ఈ కుర్రాడికి మస్కా కొట్టిన వెధవ ఇక్కడ ఉన్నాడా?" అతనిని అడిగిందా పర్సనాలిటీ.

ఆటోలో జరిగిన సంభాషణను గుర్తుకు తెచ్చుకుంటూ రోడ్డును కౌగిలించుకుని ఉన్న వ్యక్తుల్లో ఒకతన్ని చూపించాడు ఆటోడ్రైవర్. "జేబులు వెతుకు" ఇంకో ఆర్డర్ ఇచ్చిందా పర్సనాలిటీ... క్షణం కూడా ఆలస్యం చేయకుండా జేబులు వెతికి, తాగి తందనాలాడగా మిగిలిన నోట్లను వెంటనే బయటికి తీశాడు ఆటోడ్రైవర్.

ఆ డబ్బును కుందూకి ఇప్పించింది ఆ పర్సనాలిటీ... "ఇతన్ని తీసుకుపోయి రీజెంట్ హోటల్లో దించు... నేను వచ్చే లోపల ఇతనికి తిండి పెట్టి,

మంచి గదిని ఎలాట్ చేయమను'' అంటూ తన వాలెట్‌లోనించి నాలుగునోట్లని తీసి అతనికి అందించింది ఆ పర్సనాలిటీ.

''వాళ్ళు చాలా ప్రశ్నలు వేస్తారు సాబ్...'' తటపటాయిస్తున్నట్లుగా అన్నాడు ఆటోడ్రైవర్.

''వేయనీ... నేను పంపించానని చెప్పు. అప్పుడు కూడా వినిపించుకోకపోతే రామ్‌దయాళ్ పేరును బయటపెట్టు''

ఆ పర్సనాలిటీ పేరేమిటో అడగబోతూ, రామ్‌దయాళ్ పేరు బయటికి వచ్చేసరికి అదిరిపడ్డాడు ఆ మనిషి. ''అంటే రామ్‌దయాళ్ సాబ్ అంటే రాజస్థాన్...'' అంటూ ఏదో చెప్పబోయి మాటని ఆపేశాడు.

చిరునవ్వుతో తల ఊపింది ఆ పర్సనాలిటీ. ''అయ్యబాబోయ్... అసలు ఆ హోటల్ రామ్‌దయాళ్ సాబ్‌దే అంటారు అందరూ. ఇతను ఆ సాబ్‌కి కావాల్సిన వాడయితే మాత్రం ఆ బద్మాష్‌గాళ్ళ బతుకులు తెల్లారిపోయినట్లే'' గుండెలమీద చెయ్యేసుకుంటూ అన్నాడు డ్రైవర్.

ఆటోలో కూర్చోకుండా వెంటనే అవతలికి వెళ్ళిపోవాలన్న ఆలోచన తనకు వచ్చినందుకు అతను ఎంత సంతోషించాడో చెప్పటానికి వీలులేకుండా పోయింది.

''సాబ్... అడుగుతున్నప్పుడు మన్నించాలి... మీ పేరు?'' ధైర్యం చేసి ఒక్క ప్రశ్నవేశాడు.

''చెప్పింది చేయకుండా ఏమిటి బే నీ సణుగుడు? ముందు అవతలికి పోతావా, పోవా?'' సడన్‌గా సీరియస్ అయిపోతూ అడిగింది ఆ పర్సనాలిటీ.

‘‘ఈ బద్మాష్‌గాళ్ళది చాలా పెద్ద ముఠా... పారిపోయినవాళ్ళు మిగిలిన వాళ్ళని వెంటబెట్టుకు రావచ్చు... మీరు కూడా మాతో వచ్చేయండి’’ రెండు అడుగులు వెనక్కి వేసి చిన్నగా అన్నాడు డ్రైవర్.

‘‘అందుకే కద బే... నేను ఇక్కడే ఉండిపోవాలని అనుకుంటోంది. నువ్వు వెళ్ళిపో... గెట్‌లాస్ట్’’ ఖంగుమంటున్న కంఠంతో చెప్పిందా పర్సనాలిటీ.

ఆపైన అక్కడే ఉంటే తన షేపులు కూడా మారిపోతాయన్న అనుమానం కలిగింది కాబోలు–

కుందూ చెయ్యి పట్టుకుని ఆటో దగ్గరికి తీసుకుపోయాడు డ్రైవర్. త్వరత్వరగా స్టార్ట్ చేసి స్పీడ్‌గా ఆ వీధి చివరికి తీసుకుపోయాడు.

చిన్నమలుపు తిరిగి ఇంకో పెద్ద వీధిని మీట్ అవుతుందది. రీజెంట్ హోటల్ ఆ రెండో వీధి మధ్యలోనే ఉంటుంది. ‘‘నువ్వు వేరేగా అనుకోకపోతే రెండు నిముషాలు ఇక్కడ ఆగుదాం భాయీ... ఇలాంటి విశేషాల్ని ఇంతకు ముందు ఎప్పుడూ నేను చూడలేదు’’ కుందూకి చెప్పి ఆటోని ఆ మలుపులో ఆపేశాడు అతను. సీటులోనించి కిందికి దిగి వెనక్కి చూశాడు.

*    *    *    *    *

ఎగసుకు వస్తున్న ఆయాసాన్ని లెక్క చేయ్యకుండా రెండు కిలోమీటర్ల దూరం పరిగెత్తాడు షాడో... పట్టిన పట్టు వదలకుండా అతన్ని వెంబడించారు సోల్జర్స్. అతను తమకు దొరకడని అర్థమైంది వారికి–

‘‘ఇంతవరకూ రెండో కంటివాడికి తెలియకుండా జరిగిపోతున్న మన వ్యవహారం చిటికెలో బట్టబయలు అయిపోతోంది. అతను ప్రాణాలతో

ఉండకూడదు'' ఉన్నట్లుండి ఒక నిర్ణయానికి వస్తూ పెద్దగా అందరినీ హెచ్చరించాడు వారిలో ఒకతను.

పరుగును ఆపి చటుక్కున తమ ఆయుధాల్ని పైకి ఎత్తారు మిగిలినవారు.. వెనక్కి చూడటం లేదు షాడో... ఐనా సరే అర్థమైపోయింది ఆ డెవలప్‌మెంట్ అతనికి. అమాంతంగా ముందుకి డైవ్ చేసి ఒక పొదచాటున బోర్లాపడిపోయాడు.

ధన్‌ధన్ ధనాధన్‌మంటూ నిప్పుల్ని వర్షించటం మొదలుపెట్టాయి సోల్జర్స్ చేతుల్లో వున్న ఆయుధాలు. తను చాటు చేసుకున్న ముళ్ళపొద కత్తులతో చెరిగినట్టు చిన్నాభిన్నం అయిపోతూ ఉండగా... పైకి లేవకుండా పాము మాదిరి మోచేతులమీద అవతలికి పాకాడు షాడో. పాతిక అడుగుల దూరం పోగానే పైకి లేచి మళ్ళీ పరుగు మొదలుపెట్టాడు.

ఈసారి ఎంతో దూరం పోలేకపోయాడతను. అరకిలోమీటర్‌లో మూడొంతుల దూరం పోయేసరికి. అతనికి ఎదురయింది భుజ్ పట్టణాన్ని బేస్‌గా చేసుకుని ఆ ఏరియానంతా పెట్రోల్ చేసే బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌కి చెందిన ఒక సెర్చిపార్టీ.

అనుకోని విధంగా వినవచ్చిన కాల్పుల శబ్దాలను ఇన్వెస్టిగేట్ చేసేందుకు పరుగు పరుగున వస్తున్నారు వాళ్ళు. ''బోర్డర్స్‌ని దాటి మన లోపలికి వచ్చేశారు. నా అంతు చూడటానికి పట్టుదలగా ప్రయత్నం చేస్తున్నారు'' పరిస్థితిని వారికి ఎక్స్‌ప్లెయిన్ చేశాడు షాడో.

అతని చేతుల్ని బంధించి వుంచిన చర్మపు తాళ్ళని ఒక హంటింగ్‌నైఫ్‌తో తెంపి అవతల పడేశారు వాళ్ళు.

"నువ్వు ఇక్కడే ఉండు..." అంటూ అతనికి కాపలాగా ఒక వ్యక్తిని నిలబెట్టి తాము ముందుకుపోయి అక్కడ తమ తమ పొజిషన్స్ తీసుకున్నారు.

పదే పది క్షణాల్లో ఆ ప్రదేశంలోకి వచ్చేశారు షాడోని తరుముతున్న సోల్జర్స్. తమకోసం ఎవరు ఎదురుచూస్తున్నారో అవగతమై అదిరిపడ్డారు..

"భాగో... భాగో..." అని ఒకరినొకరు హెచ్చరించుకుంటూ వచ్చిన దారినే వెనక్కి పారిపోవటానికి ట్రై చేస్తే కేవలం నలుగురికే సాధ్యపడింది. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ జరిపిన కాల్పుల్లో ప్రాణాలు పోగొట్టుకున్నారు మిగిలినవాళ్ళు.

*　　　*　　　*　　　*　　　*

ఆటోడ్రైవర్ చెప్పినట్లే పదినిముషాల్లో ఇంకో పదిమందిని పోగేశారు పారిపోయిన బద్మాష్‌లు.

సైకిల్ చైన్లు, ఐరన్ రాడ్లు పట్టుకుని పెద్ద పోటుగాళ్ళ మాదిరి వచ్చేశారు మురుగుకాలువ దగ్గిరికి. రోడ్డుమీద పడిపోయి ఉన్న హీరోల దగ్గరే నిలబడి ఉంది ఆ పర్సనాలిటీ. ఒక్క అడుగు కూడా అవతలికి జరగలేదు.

"వేసేయండి... తల పగల కొట్టేయండి" ఒకరినొకరు హెచ్చరించకుంటూ బ్రిడ్జిని దాటి దగ్గిరికిపోయారు అందరూ. నోటిలో ఉన్న సిగార్‌ని అవతలికి విసిరి, ఇంకోసారి కోటు చేతుల్ని పైకి లాక్కున్నది ఆ పర్సనాలిటీ.

"వేసేయండి బే... పుచ్చకాయలాగా పగిలిపోవాలి తలకాయ" ఖంగుమంటున్న కంఠంతో అందరినీ ఒక్కసారిగా హెచ్చరించాడు ఒక వ్యక్తి.

"ఎవరి తలకాయ బే? ఎవరు పగలకొట్టేది?" ఉన్నట్లుండి వినవచ్చింది ఒక కంఠం– చీకటితో నిండివున్న ఒక షాపు ముందు భాగంలోనుంచి.

అదిరిపడి అటుకేసి చూసిన ఆ హీరోలకి బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ కొంచెం ఇవతలికి వస్తున్న ఒక భారీమనిషి అక్కడ కనిపించాడు.

"అయ్యబాబోయ్... రామ్‌దయాళ్‌సాబ్ పెద్ద తమ్ముడు రంగరాజు... ఇదేంటి? ఈయన ఇక్కడికి రావటమేంటి?" రోడ్డుమీద ఉన్న పర్సనాలిటీ గురించి మర్చిపోయి, తనలో తను అనుకుంటున్నట్టు పైకే అన్నాడు ఒక హీరో.

"మీ అదృష్టం బాగుంది కాబట్టి ఒకటి రెండు దెబ్బలతోనే సరిపెట్టేశాడు. ఆయనకి నిజంగా కోపం వచ్చి వుంటే ఈపాటికి మీరందరూ చచ్చి స్వర్గానికో, నరకానికో వెళ్లిపోయి ఉండేవాళ్లు. ఎవరని అనుకున్నారు బే?

"పెద్ద పెద్ద పోలీసులందరూ సలాం చేసే మనిషి .." అంటూ వారి ఎదుటికి వచ్చాడు రంగరాజు.

అంతే... వెంట తెచ్చిన ఆయుధాల్ని కిందికి వదిలేశారు వారందరూ... కన్నుమూసి కన్ను తెరిచేటంతలో మటుమాయం అయిపోయారు.

"మాకు ఒక్కమాట చెపితే వీధికి ఒక మనిషిని కాపలా పెట్టి ఆ కుందూగాడిని వెతికి పట్టుకునేవాళ్ళం. ఇంత చిన్నపనికి మీరే స్వయంగా

రావాటం ఏమిటి సాబ్?" ఉక్కుస్తంభంలాగా నిలుచుని ఉన్న పర్సనాలిటీ దగ్గిరికి పోయి వినయంగా అడిగాడు రంగరాజు.

"కుందూ గురించి వివరాలు మొదట నాకు తెలియదు. ఇటుగా వస్తుంటే అతని వాలకం నాకు అనుమానం కలిగింది. విషయం ఏమిటో తెలుసుకుందామని కారు ఆపాను... ఈలోపలే ఈ రాస్కెల్స్ అతన్ని ఎటాక్ చేశారు..." నవ్వుతూ చెప్పారు కులకర్ణి.

"అతన్ని షాడోసాబ్ మా దగ్గిరికి పంపించాడు. మా హోటల్‌కి చెందిన ఫోన్ నెంబర్ వేసిన కాయితం అతనికి ఇచ్చాడు. అది ఒక ఆటోవాలాకి దొరికిందట...

మేము వచ్చిన కారణం అది... సాయంత్రంనించీ వీధులన్నీ వెతుకుతున్నాం" తను అక్కడికి వచ్చిన కారణాన్ని వెల్లడించాడు రంగరాజు.

"ఓ.కే... మీరు అతన్ని హేండోవర్ చేసుకోండి. నాకు వేరే పనులున్నాయ్" అంటూ వెనక్కి తిరిగి తమ అంబాసిడర్ దగ్గిరికి పోయారు కులకర్ణి.

అదే సమయంలో మోతలు చేస్తూ వచ్చింది ఒక పోలీస్‌వేన్. ముందు సీట్లలోనించి కిందికి దూకి స్మార్ట్‌గా శాల్యూట్ చేశాడు ఒక ఇన్స్‌పెక్టర్.

"మీకోసమే సిటీ అంతా వెతుకుతున్నాం సార్... బింద్రా ఏరియాలో బోర్డర్స్ దగ్గిర చిన్నసైజు గొడవ ఒకటి జరిగిందిట. అన్నెం–పున్నెం తెలియని అమాయకుల్ని బోర్డర్స్ దాటించే రాకెట్ ఒకదాన్ని బింద్రా ఇన్స్‌పెక్టర్ స్మాష్ చేశాట్ట..." అంటూ రిపోర్టు చేశాడు.

రంగరాజుకేసి చూసి చిన్న నవ్వు నవ్వి, అంబాసిడర్ దగ్గిరికి వెళ్లిపోయారు కులకర్ణి.

"ఈ మేటర్‌ని నేను హేండిల్ చేస్తానని మీ ఆఫీసర్స్‌కి నా మాటగా చెప్పండి. ఎవర్నీ ఇన్‌వాల్వ్ కావద్దని కూడా చెప్పండి" అంటూ ఆ ఇన్స్‌పెక్టర్‌కి చెప్పి, అంబాసిడర్‌ని ముందుకు కదిలించారు. చీమచిటుక్కు మన్నా పెద్దగా వినిపించేటంత నిశ్శబ్దం ఆ ప్రదేశాన్ని ఆవరించుకుని ఉండటం వల్ల వీధి మలుపులో నిలబడివున్న ఆటోడ్రైవర్‌కి పూర్తిగా వినిపించాయి ఆ మాటలన్నీ.

"బోర్డర్స్‌లో జరిగే అన్యాయాల్ని ఎదుర్కొనే దమ్ముగల ఇన్స్‌పెక్టర్ దగ్గిర్నించి వచ్చావన్న మాట నువ్వు. నిన్ను గురించి చాలా తక్కువగా అంచనా వేశారు మావాళ్ళు. ఇవాళ వాళ్ళు లేచిన వేళ చాలా మంచిది" అంటూ ఆటోని కదిలించి, హోటల్‌వైపు పరుగుతీయించాడు.

*　　*　　*　　*　　*

ఊపిరి బిగపట్టి అదేపనిగా పరుగుతీస్తున్న గంగారాం– చటుక్కున ఆగిపోయాడు కాల్పుల శబ్దాలు వినిపించేసరికి. షాడో వెళ్ళినవైపు నుంచే వస్తున్నాయవి.

బోర్డర్స్ దాటివచ్చిన సోల్జర్స్‌ని తేలికగా బురిడీ కొట్టించగలిగామన్న ఆనందం ఒక్కసారిగా మాయం అయిపోతుండగా– అటుకేసి తిరిగాడతను. గుండెలనిండా ఊపిరి పీల్చుకుని మరోసారి పరుగు మొదలుపెట్టబోతుండగా– నిశ్శబ్దంగా అతని దారికి అడ్డంగా ప్రత్యక్షం అయ్యారు పదిమంది బంజారి యువకులు.

"మీకు ఇంకా బుద్ధిరాలేదన్నమాట. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌వాళ్ళు వచ్చి మీ తాటలు వలిస్తే తప్ప మాట వినరు... అంతేకదూ?" నడుము మీద చేతులు వేసుకుంటూ సీరియస్‌గా అడిగాడు అతను.

"కోపం వద్దు భాయీ! మా నాయకుడు నీతో ఏదో చెప్పలని అనుకుంటున్నాడు. అందుకే వచ్చాం... వేరేగా అనుకోవద్దు" నాగరికుల భాషలో పట్టిపట్టి మాట్లాడుతూ అతనికి చెప్పాడు ఒక యువకుడు.

"ఇందాక తగిలిన దెబ్బకి ఎప్పుడో బాల్చీ తన్నేశాడని అనుకుంటున్నాను. ఇంకా బతికి ఉన్నాడన్న మాట" అంటూ వారితో కలిసి అడుగులు వేశాడు గంగారాం. చిత్తడి పొదల మధ్య కనిపించిన చిన్నపాటి ఖాళీస్థలంలో గుమికూడి ఉన్నారు తండా మెంబర్స్ అందరూ.

ఎత్తుగా ఉన్న చిన్న మట్టిదిబ్బ మీద ప్రశాంతంగా పడుకో బెట్టబడి ఉన్నాడు నాయకుడు.

"మామూలు మనుషులని అనుకున్నాము మిమ్మల్ని చూసి... బోర్డర్స్‌ని అల్లకల్లోలం చేసే దమ్ము కలవాళ్ళని అనుకోలేదు... మమ్మల్ని క్షమించాలి" గంగారాంని చూడగానే చేతులు పైకెత్తి నమస్కారం చేస్తూ అన్నాడతను.

అతనితోపాటు పైకి లేచాయి మిగిలినవారి చేతులు. ఆఖరికి రొట్టెలు తెచ్చి పెట్టిన బాలిక కూడా వినయంగా నమస్కారం చేసింది గంగారాంకి.

అర్థం పర్థంలేని మాటలు గనుక ఆ నాయకుడు మాట్లాడితే విపరీతమైన కోపం తెచ్చుకోవటానికి ప్రిపేర్ అయి వున్న గంగారాంకి వెంటనే ముంచుకు వచ్చేసింది ఒక్కసారిగా విపరీతమైన సిగ్గు.

“నా గొప్పతనం ఏమీలేదు... అంతా మా గురువుగారి దెబ్బే... తలుచుకుంటే ఏదైనా చేసేయగలడు” వారికి అర్థమయ్యేలా షాడో గురించి వివరించాడు.

“పోలీస్ మనిషని ముందుగా మాకు తెలియలేదు. మోసపోయాం... ఈసారి వాడు తండాలోకి వస్తే తగిన శిక్ష విధిస్తాం...” తమకు అల్లుడైన నాగరికుడిని తలుచుకుంటూ కోపంగా అన్నాడు నాయకుడు.

అక్కడితో ఆగలేదతను... “మేము చేసిన తప్పును సరిచేసుకోవాలంటే మీకు ఏదో ఒక మేలు జరిగేటట్టు చూడాలి. మావల్ల కాదగిన సహాయం ఏమైనా ఉంటే వెంటనే చెప్పు” అని కూడా అన్నాడు.

“ఈ చుట్టుపట్ల జరిగే రైలు దొంగతనాలను గురించి మాకు తెలియాలి” అన్నాడు గంగారాం.

“బింద్రాలో ఉండేవాళ్ళు కొంతమంది రైలుకట్టమీద తిరుగుతూ ఉండటాన్ని మేము చాలాసార్లు చూశాం” అంటూ అతన్ని ఇంకా కొంచెం దగ్గిరికి రమ్మని రహస్యంగా చేతులతో సైగ చేశాడు నాయకుడు.

తను చెప్పే విషయాలు వినటానికి తన తండా మెంబర్స్ తప్ప పరాయివాళ్ళు ఎవరూ అక్కడ లేకపోయినా గొంతును బాగా తగ్గించాడు అతను.

“బింద్రాకి ఉత్తరదిశలో చిత్తడినేల మధ్య చిన్నపాటి కోటవంటి కట్టడం ఒకటి ఉంది. ఎప్పుడు చూసినా పదిమంది ఆ కట్టడం దగ్గిర కాపలా ఉంటూ కనిపిస్తారు. కారణం ఏమిటో మాకు తెలియదు” అని చెప్పాడు.

విపరీతంగా సంతోషించాడు గంగారాం. తను ఎంత సంతోషిస్తున్నాడో అతనికి అర్థమయ్యేటట్లు చెప్పాడు.

“ఈ మాటల్ని విని మా గురువుగారు కూడా హ్యాపీగా ఫీలవుతాడు... ఇంకెప్పుడూ మీరు బోర్డర్స్ దగ్గిర బేరాలు చేయకండి. ఇంకోసారి ఏదైనా జరిగితే మేము కల్పించుకోవాల్సి వస్తుంది” అని సలహా కూడా ఇచ్చాడు.

అతనితో మాట్లాడటం వల్ల తన గుండెలమీది బరువంతా దిగిపోయినట్టు నిట్టూర్చాడు నాయకుడు.

“వీళ్ళకి రొట్టెలు పెట్టకుండా మాడ్చి మనం చాలా తప్పు చేశాం. ఆ తప్పును ఇప్పుడు సరిచేసుకోవాలి... తీసుకుపోయి తిండి పెట్టండి” అని ఆర్డర్ ఇచ్చాడు.

ముళ్ళపొదల మధ్య మంటవేసి, అప్పటికప్పుడు పట్టెడు రొట్టెల్ని కాల్చారు తండాలోని ఆడవాళ్ళు.

ఒక ముళ్ళపొద మీద కునికిపాట్లు పడుతున్న గూడ కొంగని కొట్టి, కూర వండారు. పెద్ద ప్లేటువంటి జనపనార పళ్ళెంలో పెట్టి అతనికి అందించారు.

నాలుగు రొట్టెల్ని ఆరగించాడు గంగారాం. ఇంకో రొట్టెని చేతిలోకి తీసుకుంటూ ఉండగా అతనివంక చూసి నోటిలోని దంతాలన్నీ బయటికి కనిపించేటట్టు నవ్వింది ఒక తండా మెంబర్.

చిత్తడి పొదల్లో ఉండే చీమలు, జెర్రులు అన్నీ తన ఇంటిమీద పాకిన అనుభూతి కలిగింది గంగారాంకి. చటుక్కున తలవంచుకుని రొట్టెలమీద కాన్సన్ట్రేట్ చేశాడు. "అవసరం అయినప్పుడు ఫరవాలేదుగాని, కాలక్షేపం కోసం చీకటి సమయంలో ఈ పొదల్లో చక్కర్లు కొట్టడం మంచిది కాదు... తెల్లవారగానే బయలుదేరి వెళ్లువుగాని" అంటూ అతనికి ఒక పడక ఏర్పాటు చేయించాడు నాయకుడు.

ఆ చీకట్లో తన జతగాడిని వెతికి పట్టుకోవడం కష్టం కాబట్టి గంగారాం అందుకు అంగీకరించాడు. వారు వడ్డించిన రొట్టెలు అదే పనిగా ఆరగించిన మూలకంగా బరువెక్కిన పొట్టను తడుముకుంటూ నెమ్మదిగా పడకమీదికి చేరాడు.

సరిగ్గా ఒక గంట తరువాత వచ్చేసింది అతనికి మెలకువ... బరువుగా ఉన్న ప్రాణి ఏదో తన ఒంటిమీదికి వస్తున్న ఫీలింగ్. అదిరిపడి చూసేసరికి నిశ్శబ్దంగా నవ్వుతూ అతని మీదికి వాలిపోబోతున్నది అంతకుముందు అతన్ని చూసి నవ్విన తండా మెంబర్.

"అరే గురూ... ఎప్పుడు వచ్చావ్?" పక్కకు చూస్తూ ప్రశ్న వేశాడు గంగారాం. ఉలిక్కిపడి తను కూడా అటుకేసి తల తిప్పింది ఆ మెంబర్. ఉన్నట్టుండి మెడమీద చెయివేసి బలంగా అవతలికి నెట్టాడు గంగారాం.

అతను అలా చేస్తాడని ఎదురుచూడకపోవటం వల్ల పడకమీదినించి పడిపోయింది ఆమె.

“క్షమించాలి తల్లీ... జరిగిన గొడవనంతా చూసి నన్ను పెద్ద హీరోగా ఊహించుకుంటున్నావు. మనకి అంత సీన్ లేదు... మా గురువుగారు పక్కన లేకపోతే మనం జీరోలమే... నిన్ను కాదని అంటున్నందుకు క్షమించు” అంటూ వేగంగా పడకమీదినించి లేచాడు. కన్నుమూసి కన్ను తెరిచేటంతలో పొదల్లోకి పోయి మాయం అయిపోయాడు.

* * * * *

తను మెలకువగా ఉన్నాడో, గాడమైన నిద్రలో విచిత్రమైన కలలు కంటున్నాడో తెలియకుండా పోయింది కుందూకి. రిజెంట్ హోటల్ రిసెప్షనిస్టుతో మాట్లాడి ఆటోడ్రైవర్ అతన్ని అక్కడ వదిలిపెట్టినప్పటినించీ జరుగుతున్న మర్యాదలతో మతిపోతున్నట్లవుతోంది అతనికి.

విశాలంగా పెద్ద రాజభవనంలాగా కనిపిస్తున్న గదిలోకి అతన్ని తీసుకుపోయారు నలుగురు వెయిటర్స్. మట్టి కొట్టుకుపోయిన అతని దుస్తుల్ని విప్పించి, వేడినీళ్ళు నింపిన బాత్‌టబ్ దగ్గిరికి తీసుకుపోయారు.

“జ్వరం... నాకు జ్వరం వచ్చింది. నీళ్ళు తగిలితే ఎక్కువై పోతుంది” కంగారుగా చెప్పాడు కుందూ.

ఒకరి ముఖం ఒకరు చూసుకొని చిన్నగా నవ్వారు ఆ వెయిటర్స్. స్పీడ్‌గా బయటికి పరిగెత్తి ఒక ధర్మామీటర్ తీసుకువచ్చాడు వారిలో ఒకతను. కుందూ నోట్లో పెట్టి రీడింగ్‌ని అతనికి చూపించాడు.

నార్మల్... దుర్గామాయి గుడి దగ్గిర వుండగా మంటలు మండించిన జ్వరం ఏమైందో అర్థంకాలేదు కుందూకి.

"టెన్షన్ మూలంగా వచ్చి వుంటుంది భాయీ... టెన్షన్ తగ్గిపోయేసరికి అది కూడా మాయమైపోయింది" అంటూ అతన్ని బాత్‌టబ్‌లోకి దించి, స్నానం చేయించారు. తెల్లటి టర్కీటవల్‌తో ఒళ్ళు తుడిచి, అతని సంచీలో ఉన్న స్పేర్‌డ్రెస్‌ని ధరింపచేశారు.

ఒంటికి ఉన్న మురికి తొలిగిపోవటమే కాదు. విపరీతమైన ఆకలి కూడా స్టార్ట్ అయింది కుందూకి.

అతను ఆ మాటని బయటికి చెప్పటానికి మొహమాట పడాల్సిన అవసరం లేకపోయింది. బాత్‌రూమ్‌లోనించి అతన్ని నేరుగా ఒక డైనింగ్ టేబిల్ దగ్గిరికి తీసుకుపోయారు వాళ్ళు. తళతళ మెరిసే సిల్వర్ పాత్రల్లో రెడీగా ఉన్న భోజనాన్ని వడ్డించారు.

పుట్టి బుద్ధెరిగిన తర్వాత అటువంటి పదార్థాల్ని తిని ఎరగడు కుందూ. అసలు అలాంటివి ఉంటాయని కూడా తెలియదతనికి. చూసేవాళ్ళు ఏమైనా అనుకుంటరేమో అన్న సంకోచం లేకుండా ఆబగా ఆరగించాడు. భుక్తాయాసంతో పడకమీద మేను వాల్చాడు. వెంటనే వచ్చేసింది నిద్ర. కళ్ళు తెరిచేసరికి తెల్లవారింది. బెడ్ పక్కనే కుర్చీలో కూర్చుని ఉన్న కొత్తమనిషి కనిపించాడు.

"నా పేరు డాక్టర్ రాంప్రసాద్... నీ కాలుకు సంబంధించిన ప్రిలిమినరీ రిపోర్టులు తయారుచేయాలి... అందుకోసం బ్లడ్ టెస్టులు ఇంకా నాలుగైదు

పరీక్షలు చేయాలి... మొదలు పెడదామా?" కళ్ళు తెరిచి తన వంక చూసిన కుందూతో మృదువుగా చెప్పాడతను.

దుర్వాసనలు వెదజల్లే పెద్ద కాలువలో పడి ప్రాణాలు పోగొట్టుకోవాల్సిన తను, ఇంకా ప్రాణాలతోనే ఉండటం ఎలా సంభవించిందో, రాజభవనం వంటి ఆ ప్రదేశంలోకి ఎలా రాగలిగాడో గుర్తు చేసుకుంటున్నాడు కుందూ.

"ఇది... ఇదంతా ఎవరు చేస్తున్నారు? నామీద ఇంత జాలి ఎవరికుంది?" ధైర్యం చేసి అడిగాడు.

"అదేమిటో నాకు తెలియదు... బహూశా ఇదంతా బింద్రా ఏరియాలో ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న ఒక మనిషి చేయిస్తూ ఉండి ఉండవచ్చు" చిరునవ్వుతో చెప్పాడు ఆ వ్యక్తి.

"ఇన్స్‌పెక్టర్ సాబేనా? మా ఇన్స్‌పెక్టర్ సాబేనా?" అడిగాడు కుందూ. అవునన్నట్టు తల ఊపాడు ఆ వ్యక్తి.

నీటితో నిండిపోయాయి కుందూ కళ్ళు. తుల్జీబాయి రొట్టెలు పెట్టనని ముఖంమీదే ఖరాఖండిగా చెపితే చాయ్ బంక్‌లో ఉండే ఎండిపోయిన రొట్టెల్ని తిని ఆకలి తీర్చుకున్నాడు ఇన్స్‌పెక్టర్ సాబ్. చిత్తు కాయితాలు అంటించి వేడిచేసిన చాయ్‌ని తాగి తృప్తిపడ్డాడు.

అటువంటి మనిషి పంపగా వచ్చిన తనకు మాత్రం రాజభోగాలు జరుగుతున్నయ్. ఏమిటీ విచిత్రం?

“నీకు తెలియని విషయాల గురించి అనవసరమైన ఆలోచనలు చేయకు. నీ కాలు బాగుపడటం కోసమే మీ ఇన్స్‌పెక్టర్ సాబ్ నిన్ను ఇక్కడికి పంపించారు. కాలు బాగు చేసుకుని వెళితే చూసి సంతోషిస్తాడు. ఇక మన పని మొదలు పెడదామా?” అసహనంగా అన్నాడా వ్యక్తి.

కాలకృత్యాలు తీర్చుకుని రెడీ అవ్వాలని అనుకున్నాడు కుందూ. కాని అతనికి ఆ అవకాశం లభించలేదు. “పరగడుపునే చేయవలసిన పరీక్షలు చాలా ఉన్నాయ్” అంటూ అతన్ని గదిలోనించి బయటికి తీసుకుపోయి, హోటల్ ఎదుట వెయిట్ చేస్తున్న అంబులెన్స్ ఎక్కించాడా వ్యక్తి.

*　　*　　*　　*　　*

“ఈ బంజారా తండావాళ్ళ గురించి మాకు బాగా తెలుసు. పట్టుకున్న వాళ్లని చేతులు వెనక్కి విరిచి కట్టేస్తారు... బోర్డర్స్ దగ్గిర బేరాలు పెట్టడం మాత్రం కొత్త ఎలిమెంట్... మాకు తెలియని అంశం ఇది. వినటం కూడా ఇదే మొదటిసారి” చిత్తడినేలల్లో వున్న ఒక బేస్ క్యాంప్ దగ్గిరికి షాడోని తీసుకుపోతూ అన్నాడు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌కి కమాండర్ వంటి వ్యక్తి.

బండరాయి దగ్గిర్నించి పరుగు మొదలుపెట్టిన సమయంలో, వెనక్కి విరిచి కట్టేసి ఉన్న చేతుల్ని ముందుకు ఎలా తెచ్చుకున్నాడో వారికి చెప్పలేదు షాడో.

“ప్రస్తుతానికి ఈ బేరం ప్రాబ్లమ్ సాల్వ్ అయిపోయినట్టే... కానీ ఇంకా అసలు విషయం మాత్రం అలాగే ఉంది...” క్యాంప్‌కి చేరుకోగానే ఒక గార్డు తీసుకువచ్చిన టీని సిప్ చేస్తూ అన్నాడు.

అసలు విషయం అంటే రైల్వే ఆస్తుల మీద ఎటాక్ చేయటమని ప్రత్యేకంగా చెప్పల్సిన అవసరం లేకుండా తనంతట తనే అవగతం చేసుకున్నాడు ఆ కమాండర్.

“అది మాకూ అంతుబట్టని వ్యవహారమైంది. ఎనీవే... ఏదైనా హెల్ప్ కావాలంటే వెంటనే ఏర్పాటు చేయగలను” అంటూ టీ తీసుకువచ్చిన గార్డుకి సైగ చేశాడు.

షాడో ఒడ్డు పొడుగు కొలతలన్నిటినీ క్లోజ్‌గా అబ్జర్వ్ చేసి, పదినిముషాల తర్వాత తమ దగ్గిర ఉన్న స్పేర్ యూనిఫామ్ ఒకదాన్ని తీసుకువచ్చి ఇచ్చాడతను.

బంజారా వాళ్ళు మొలకు చుట్టిన ముతకవస్త్రంతో అక్కడినించి అవతలికి ఎలా పోవాలోనని తీవ్రంగా మధనపడుతున్న షాడోకి ప్రాణం లేచొచ్చినట్టయింది. అంతే లేచి చకచకా డ్రెసప్ అయ్యాడు.

కమాండర్ దగ్గిర ఒక సిగరెట్‌ని అడిగి తీసుకుని, ఆ క్యాంప్‌లోనించి బయటికి వచ్చాడు. తను చేసిన ఎడ్వెంచర్‌నంతా వైర్‌లెస్ సహాయంతో ఆ కమాండర్ అహమ్మదాబాద్‌లోని అధికారులకు తెలియజేయటానికి రెడీ అవుతున్నాడన్న విషయం.... తెలియదు అతనికి.

*　　　*　　　*　　　*　　　*

కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని కటిక చీకట్లోకి... పరిగెత్తుకుంటూ రావటం అయితే వచ్చాడుగాని, ఎటుపోవాలో తెలియలేదు గంగారాంకి.

తండా అంతా కునికిపోయినట్లు పడుతున్న సమయంలో తన దగ్గిరికివచ్చిన బంజారా మెంబర్‌ని తలుచుకునేసరికి, మరోసారి జలదరించింది అతని శరీరం.

"నీకేం... నువ్వు హాయిగా ఎక్కడో చక్కర్లు కొడుతూ ఉంటావ్... చచ్చిన చావైపోతోంది నాకిక్కడ... శుభ్రంగా రొట్టెలు తిన్న తర్వాత సుష్టుగా నిద్రపోయే అదృష్టం లేకుండాపోయింది..." ఎక్కడ ఉన్నాడో తెలియని షాడోని తలుచుకుని చాలా రోషంగా అన్కున్నాడు అతను.

"నీకోసం నేను వెతకడం చాలా కష్టం. నువ్వే నన్ను వెతికి పట్టుకోవాలి..." అంటూ కొంచెం ఎత్తుగా పెద్ద మట్టిదిబ్బలా ఉన్న మెరక ప్రదేశాన్ని సెలక్ట్ చేసుకుని దానిమీద సెటిల్ అయిపోయాడు గంగారాం.

ఆగి ఆగి వీస్తోంది గాలి... ఒకదానితో ఒరుసుకుని వికృతమైన శబ్దాల్ని వెలువరుస్తున్నాయి చుట్టూ ఉన్న పొదలు. టోటల్‌గా చాలా డిప్రెసింగ్‌గా ఉంది అక్కడి వాతావరణం. అందువల్ల అక్కడ నిద్రపోలేకపోయాడు గంగారాం. పాములు, తేళ్ళవంటి విషపు జీవులేమయినా మెరక ప్రదేశం మీదికి వస్తే తన బాధలు రెట్టింపు అవుతాయన్న భయంతో, రెప్పవాల్చకుండా చుట్టూ చూస్తూ టైమ్‌ని పాస్ చేయడం మొదలుపెట్టాడు.

అదిగో... అప్పుడు... అతను అలా నిశాచరుడి మాదిరి నిట్టనిలువుగా కూర్చుని వున్న సమయంలో కనిపించింది ఒక వెలుగు. మీడియమ్ సైజులో ఉండే ఒక బ్యాటరీ ఆపరేటెడ్ మెర్క్యురీ లాంప్‌ని ఎవరో వెలిగించినట్టుంది... చిటికెలో ఎలర్ట్ అయిపోయాడతను. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా మెరక

ప్రదేశం మీదినించి లేచి, ఆ వెలుగు కనిపించిన వైపు అడుగులు వేశాడు. కటిక చీకటిలో ఏ వెలుగైనా చాలా ప్రసరిస్తుంది. దగ్గిర్లోనే ఉన్నదనుకుంటూ బయలుదేరిన అతనికి అరగంటకు పైగానే పట్టింది అక్కడికి చేరుకోవడానికి.

పెద్ద పొద... చుట్టూ పొడిగా ఉన్న నేల... మందపాటి కంబళీ ఒకదాన్ని కిందపరిచి, దానిమీద కూర్చుని వున్న ఇద్దరు దృఢకాయులు... చేతులు కట్టుకుని చుట్టూ నిలబడి వున్న పదిమంది వ్యక్తులు...

"ఎవరు? ఎవరా పొద దగ్గిర?" ఒక వికృత కంఠం వినిపించేసరికి, అదిరిపడి ఆగిపోయాడు గంగారాం.

"చూడండి. అదేమిటో త్వరగా వెళ్ళి చూడండి" కంబళీ మీద కూర్చుని వున్న వ్యక్తి సడన్‌గా లేచి నిలబడుతూ తన అనుచరులకు ఆర్డర్ ఇచ్చాడు.

వేగంగా వెనక్కి పరిగెత్తాలి గంగారాం– లెక్కప్రకారం. కాని అనుమానం అంటూ వచ్చిన తర్వాత అందరి చూపులు చాలా షార్ప్‌గా తయారవుతాయి. వేగవంతమైన కదలికలు వెంటనే గుర్తింపబడతాయి.

దారికి అడ్డంగా ప్రత్యక్షం అయిన ముంగీసను చూసి, గిరుక్కున వెనక్కి పోవు పాములు... అతి నెమ్మదిగా పడగల్ని దించి పక్కదారులు వెతుక్కుంటాయి.

ఇప్పుడు గంగారాం కూడా అదే పనిచేశాడు. నిటారుగా ఉన్నవాడు కాస్తా నెమ్మదిగా కిందికి వాలిపోయాడు.

"చూడండి... మరికొంచెం ముందుకు పోయి చూడండి" మళ్ళీ వినవచ్చింది ఇంకో ఆర్డర్.

బరువైన మనుషులు ఇద్దరు పొడినేల దగ్గర్నించి బురదలోకి వస్తున్న సవ్వడి గంగారాం చెవులకి చేరింది.

ఆలస్యం చేస్తే తన ఉనికి బట్టబయలు అయిపోవడం గ్యారెంటీ అని అతనికి తెలిసిపోయింది.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా చేతుల్ని పైకెత్తి చటచటమని నాలుగు చప్పట్లు కొట్టాడు. గొంతును సవరించుకుని, పొదాలమీద కునికిపాట్లు పడే గూడకొంగ మాదిరి అస్పష్టమైన శబ్దాలు చేశాడు.

ధ్వనుల్ని అనుకరించటంలో అమోఘమైన తెలివిగల అతని మిమిక్రీకి తల్లకిందులు అయిపోయారు బురదలోకి బయలుదేరిన వ్యక్తులు. "అరే... అది కొంగ చేసిన చప్పుడు. అది కొమ్మల మీదినించి జారి బురదలో పడిపోయి ఉంటుంది.... సందేహం లేదు" ఎక్కడివాడక్కడ ఆగిపోతూ కామెంట్ చేశాడో మనిషి.

సంతోషమై పోయింది గంగారాంకి. ఇంకోసారి చప్పట్లు కొట్టి, ఇంకా కొంచెం ఆర్తిగా శబ్దాలు చేశాడు.

"ఒకటి కాదు బే... అక్కడ ఇంకోటి కూడా ఉంది. పొదమీద చోటు కోసం ఆ కొంగలు కొట్లాడుకుంటున్నాయ్" వెంటనే అన్నాడు రెండో మనిషి.

వాళ్ళ అటెంక్షన్ డైవర్ట్ అయిందని తెలిసిన తర్వాత ఆ ప్రదేశంలో ఆగలేదు గంగారాం.

మోచేతుల మీద పాకుతూ ఇంకో పొద దగ్గరికి పోయి, బురదలోనే మోకరించి కూర్చున్నాడు.

"కొంగలు చేస్తున్న గోలే. వేరే ఏమీ లేదు" వెనక్కిపోయి కంబళి మీది వ్యక్తికి రిపోర్టు చేశారు ఆ మనుష్యులిద్దరూ.

"ఇందాక బోర్డర్స్ దగ్గిర్నించి కాల్పుల మోత వినిపించింది. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ఈ చుట్టుపట్లే తిరుగుతూ ఉండి ఉంటుంది. ఎందుకైనా మంచిది లైటును తీసేద్దాం" ఉన్నట్లుండి ఒక సలహా ఇచ్చాడు కంబళీ దగ్గిర చుట్టూ నిలబడి ఉన్న వారిలో ఒకతను.

"లైటు మనకి రక్షణ కల్పిస్తుంది. ఎవరైనా అదాటుగా వచ్చిపడితే కొంగల్ని వేటాడటం కోసం వచ్చిన వేటగాళ్ళమని చెప్పవచ్చు. అదే మనం చీకట్లో కనిపిస్తే లేనిపోని ప్రశ్నలు వేస్తారు" వెంటనే సమాధానం ఇచ్చాడు కంబళీ మీద కూర్చుని ఉన్న రెండో వ్యక్తి.

"నిన్న అటు మొన్న రెండు దొంగతనాలు జరిగినయ్... దొరికిన మాల్‌నంతా గుల్గీ హవేలీలో దాచిపెట్టడం జరిగింది. ఎందుకో మళ్ళీ ఆ సరుకుని అంతా అక్కడినించి ఇంకెక్కడికో తరలిస్తున్నారు. కారణం తెలియదు" రెండు క్షణాల తరువాత మాటలు మొదలుపెట్టాడు నిలుచుని ఉన్నవారిలో మరో మనిషి.

"కారణమంటూ ప్రత్యేకంగా వెతుక్కోవలసిన అవసరం లేదు. ఇదంతా కొత్తగా వచ్చిన ఇన్‌స్పెక్టర్ దెబ్బ... ఆ తోతాపురిని నిద్రపోనీయటం లేదు అతను. యముడిలా పీడించుకు తింటున్నాడు" అన్నాడు ఇంకో వ్యక్తి.

"అతని సంగతి మనం తర్వాత చూద్దాం... ముందు మనం ప్లాన్ చేసుకున్న వర్క్‌ని పూర్తి చేయాలి... బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ అంతా రైల్వే దొంగతనాల మీద దృష్టిని పెడుతుందని అనుకున్నాం. కాని అది జరగలేదు..." సాలోచనగా అన్నాడు కంబళీపై కూర్చున్న వారిలో మొదటి వ్యక్తి.

"దృష్టిని పెట్టకపోవడం ఏమిటి సాబ్? ఎప్పుడు చూసినా రైల్వేట్రాక్ దగ్గిరే తచ్చట్లాడుతున్నారు... బోర్డర్స్ దగ్గిరికి పోవటం తగ్గిపోయింది" అన్నాడు మూడో మనిషి.

ఆ మాటలు తనకి చాలా సంతోషాన్ని కలిగించినట్టు తల ఊపాడు కంబళీ మీద ఉన్న వ్యక్తి.

"మనకి అవసరమైన మెటీరియల్ అంతా ఆలీబందర్ పట్టణంలో సిద్ధంగా ఉంది... మీరందరూ ఇక్కడ బోర్డర్ సెక్యూరిటీ వాళ్ళని ఇంకా ఇంకా ఇరకాటంలో పెట్టి ఊపిరి తీసుకోనియకుండా చేయాలి. ఆ సందడిలో మేము మెటీరియల్‌ని సరిహద్దులు దాటించి తీసుకువస్తాం... ఆ తర్వాత అనుకున్నపని అనుకున్నట్టే జరిగిపోతుంది. ఏమంటారు?" సూటిగా అడిగాడు.

"మీరేమీ ఫికర్ చేయకండి. మామీద నమ్మకం ఉంచండి" చెప్పాడు నిలబడిన వారిలో మొదటి మనిషి.

తమ దుస్తుల్లో చేతులు పెట్టి ఫెళఫెళలాడుతున్న కరెన్సీ కట్టల్ని బయటికి తీశారు కంబళీ మీది వ్యక్తులు "ఇది ఖర్చులకి ఉంచుకోండి. పని పూర్తి అవగానే ఇందుకు మూడింతలు ఇస్తాం" అంటూ కంబళీ మీద నుంచి లేచారు.

చెవులు రిక్కించి వింటున్న గంగారాంకి వాళ్ళ సంభాషణలో ఒక్కముక్క కూడా అర్థం కాలేదు.

దేశానికి అత్యవసరమైన రైల్వే వ్యవస్థ ఈ వరస దొంగతనాలతో నాశనం అయిపోతోందని భావించి ఇన్స్‌పెక్టర్ సంతోష్‌ని అక్కడికి పంపించింది పోలీస్ డిపార్ట్‌మెంట్. అతను అన్యాయంగా హతమారిపోవటాన్ని చూసి సహించలేక తాము రంగంలోకి దిగటం జరిగింది.

తోతాపురి ఆధ్వర్యంలో రైలు దొంగతనాలు జరుగుతున్నాయనే ఒక నిర్ణయానికి వచ్చారు తాము ఇద్దరూ. దానికి తగినట్లే అతను తమకు అడ్డు తొలగించుకోవటానికి పడరాని పాట్లు పెడుతున్నాడు. అంతవరకూ ఓ.కే.

మరి ఈ మెర్క్యురీ లైటు పెద్ద మనుషులు ఎక్కడినించి వచ్చారు? ఎవరో చేస్తున్న రైలు దొంగతనాల్ని అడ్డం పెట్టుకుని వాళ్ళు చేయాలనుకుంటోంది ఏమిటి?

గంగారాం ఆలోచనలకు సరైన సమాధానాలు లభించకముందే తలా ఒక పక్కకి వెళ్ళిపోయారు కంబళీ వ్యక్తుల ముందు వినయంగా నిలబడిన జనం.

చిత్తడి నేలల్లో తిరగటానికి అలవాటు పడిన రెండు గార్ధభాల్ని పొదల చాటునుంచి బైటికి తీసుకువచ్చి, వాటిమీద ఇంకో పక్క బైలుదేరారు కంబళీ వ్యక్తులు.

శరీరం మీద సరయిన దుస్తులు లేకపోవటం వల్ల వీరకుట్టుడు కుట్టేస్తున్న దోమల్ని నిశ్శబ్దంగా తోలుకుంటూ తనూ ముందుకు అడుగువేశాడు గంగారాం.

తూర్పు దిక్కు తెల్లబడటానికి ఇంకా ఒక అరగంట వ్యవధి ఉన్నదనగా– బంజారీ నాయకుడు చెప్పిన కోటవంటి కట్టడం దగ్గిరికి చేరుకున్నాడు.

అప్పుడే ఆ కట్టడంలోనించి బయటికి వస్తున్నాయి సుమారు ఓ అరడజను గార్ధబాలు. జనపనార పట్టాలలో పాక్ చేయబడి ఉన్న ఏదో సామాగ్రి వాటి నడుముల మీద భద్రంగా బిగించబడి ఉంది.

“నడిపించండి... త్వరగా... త్వరగా తెల్లవారిందంటే ఎవరో ఒకరు మనల్ని గమనిస్తారు... ఆ పని జరగకముందే సరుకు అవతలికి వెళ్ళిపోవాలి” అని అరుస్తూ కట్టడంలోనించి బయటికి వచ్చిన బద్రీనాథ్ కూడా కనిపించాడు.

ఈసారి తన కళ్ళ ఎదుట కనిపిస్తున్నది ఏమిటో పని కట్టుకుని పరాయివాళ్ళు ఎక్స్‌ప్లెయిన్ చేయాల్సినవసరం లేకపోయింది గంగారాంకి. తమను బంజారీ రాక్షసుల దగ్గిరికి పంపించడంతో తృప్తిపడలేదు తోతాపురి. అప్పటివరకూ దోచుకున్న సామాగ్రినంతా చోటు మార్పిస్తున్నాడు.

తన స్థానంలో చనిపోయిన ఇన్స్‌పెక్టర్ సంతోష్ గనుక ఉండి వుంటే ఏం చేసి ఉండేవాడో ఊహించటానికి ప్రయత్నం చేశాడతను. పదిమందికి పైగా ఉన్నారు తోతాపురి చంచాలు...

ఒంటరిగా వాళ్ళనందర్నీ అరెస్ట్ చేయటం ఇంపాజిబుల్... ఒకవేళ అరెస్టు చెసినా– తోతాపురిని ఇన్‌వాల్వ్ చేసేందుకు అవసరమైన సాక్ష్యాలు లభించడం ఇంకా కష్టం.

సో... నోరు తెరుచుకుని, కళ్ళు అప్పగించి చూస్తూ ఉండటం కంటే అతను చేయగలిగింది ఏమీ లేదు... అతనే కాదు... తనకు కూడా వేరే దారి లేదు.

ఆ మాట అనుకునేసరికి ఛట్‌మని తాచుపాములా తలెత్తింది అతనిలో ఉన్న అహం! ఇంత బతుకు బతికి ఏమీ చేతకానట్లు చూస్తూ ఊరుకోవటమా?

తన పక్కన తన గురువుగారు లేడనే విషయాన్ని మరిచిపోయాడతను నిర్మోహమాటంగా చేతుల్ని నోటికి అడ్డం పెట్టుకుని తన మిమిక్రీ విద్యను ఇంకోసారి ప్రదర్శించటం మొదలుపెట్టాడు.

చెవులు చిల్లులు పడిపోయేటట్టు ఆ ప్రదేశంలో మార్మోగిపోయింది పెద్ద విజిల్ శబ్దం... "కమాన్ ఎవ్రీ బడీ... కాచ్ దోజ్ రాస్కేల్స్... ఒక్కడంటే ఒక్కడు కూడా తప్పించుకోకూడాదు... కామన్... కాచ్" అణువు అణువునా పోలీస్ దర్పం ప్రతిఫలిస్తున్న కంఠం పెద్దగా వినవచ్చింది.

హాయిగా విశ్రాంతి తీసుకోవాల్సిన ఆ ఎర్లీ అవర్స్‌లో– తమచేత బలవంతంగా పనిచేయిస్తున్నందుకు చాలా కోపంగా ఉన్నాయి సరుకుల్ని మోస్తున్న గార్ధభాలు. అనుకోని విధంగా వినవచ్చిన అరుపుల్ని విని చెవులు రిక్కిస్తూ ఎక్కడివక్కడ నిలబడిపోయాయి ఆ గార్ధభాలు.

బద్రీనాథ్ ఆర్డర్స్ కోసం ఎదురుచూడలేదు వాటిని తోలుకుపోతున్న తోతాపురి చంచాలు. ఒక్కసారిగా పక్కలకు పరిగెత్తి పొదలచాటుకు వెళ్ళిపోయారు...

“పట్టుకోండి. వాళ్ళందర్నీ పట్టుకోండి. కమాన్... మాన్.. అవసరం అయితే కాల్చి పారేయండి...” ఉరుము ఉరిమినట్లు వినవచ్చింది ఆ కంఠం ఇంకోసారి.

ధనాధన్‌మని వినవచ్చింది ఒక రివాల్వర్ మోగిన శబ్దం... అంతే... కట్టడం దగ్గిర నిలబడి వున్న బద్రీనాథ్ కూడా పక్కకు దూకి పరుగు మొదలుపెట్టాడు. పదే పది క్షణాల్లో బిత్తర చూపులు చూస్తున్న గార్ధభాలు తప్ప నరమానవుడు అంటూ కనిపించకుండా పోయాడు ఆ ప్రదేశంలో.

* * * * *

ఉదయం ఏడుగంటల సమయంలో తన టాంగాని పోలీస్‌స్టేషన్ దగ్గిర ఆపించాడు తోతాపురి. “అరేయ్ కుందూ... ఒరేయ్ కుందూ... ఏమయిపోయావురా కుంటినాయాల...” పెద్ద కంఠంతో తనే స్వయంగా పిలిచాడు.

“కుందూ లేడు...” వెంటనే సమాధానం ఇచ్చాడు స్టేషన్ లోపలి భాగాన్ని చీపురుతో శుభ్రం చేయటానికి వచ్చిన బిల్లూకాకా.

“నువ్వు ఇక్కడేం చేస్తున్నావ్? ఏం పని నీకు ఇక్కడ?” అడిగాడు తోతాపురి.

“మా కుందూని ఇన్స్‌పెక్టర్ సాబ్ అహ్మదాబాద్‌కి పంపించాడు. దెబ్బతిన్న కాలుకు ఆపరేషన్ చేస్తే తిరిగి మామూలుగా వచ్చేసుందిట... అతనికి బదులుగా నేను పని చేస్తున్నాను...” చెప్పాడు బిల్లూకాకా.

“బాగుందిరా... ముక్కూ ముఖం తెలియని ఒక పోలీసోడికి వెట్టిచాకిరి చేయటం బాగుంది...” వెక్కిరించాడు తోతాపురి.

“మా సంగతి వదిలేసి నీ సంగతి చెప్పు. కుందూతో నీకేంటి పని” ఆ మాటలు తనకు వినిపించనట్టు అడిగాడు.

“నిన్న ఉదయమనగా ఇప్పుడే వస్తానని చెప్పి ఎటో పోయాడు ఇన్స్‌పెక్టరు. ఇంతవరకూ వచ్చి కనిపించలేదు. ఏమైపోయాడు?” అడిగాడు తోతాపురి.

“ఆయనకి, నీకు మధ్య ఎలాంటి ఒప్పందాలు ఉన్నాయో” అంటూ గిరుక్కున వెనక్కి తిరిగి లోపలికి వెళ్ళిపోయాడు భిల్లూకాకా.

టాంగా దిగి అతని చెంపలు వాయించేయాలన్నంత కోపం తోతాపురిని ఆవరించుకుంది. భిల్లూకాకాతో వ్యవహారం చాలా ప్రమాదమని తెలుసతనికి.

ఇనుప సమ్మెటను పట్టుకుని పట్టుకుని అతని చేతులు కూడా సమ్మెటల్లాగానే తయారైపోయాయి. పిడికిళ్ళు బిగించి దెబ్బ వేశాడంటే–

ఆపైన ఆలోచించటానికి కూడా మనస్కరించక టాంగాతోలే వ్యక్తికి సైగ చేశాడు తోతాపురి. “తర్వాత వద్దాం– పోనీ” అని ఆర్డర్ ఇచ్చాడు.

కదిలింది టాంగా. పాతిక అడుగుల దూరం పోకముందే బరువైన జనపనార సంచుల్లో పాక్ చేయబడిన సామాగ్రిని మోస్తూ ఎదురువచ్చాయి కొన్ని గార్ధభాలు. బంజారీ మనిషి మాదిరి బురద నిండిన శరీరంతో వాటివెనుక ప్రత్యక్షం అయ్యాడు గంగారాం.

నిలువుగుడ్లు పడిపోయినయ్ తోతాపురికి. తను చూస్తున్నది కలో, నిజమో తెలియని అయోమయం ఆవరించుకున్నది అతన్ని. "హల్లొల్లొలో తోతాపురి సాబ్... ఎలా ఉన్నారు?" స్టేషన్ ముందు బొమ్మలా నిలబడిపోయిన బింద్రా పౌరుల్ని ఓరకంట గమనించుకుంటూ, టాంగాలో వున్న తోతాపురిని అడిగాడు గంగారాం.

అప్పుడు గుర్తుపట్టాడు తోతాపురి అతన్ని. అమాంతం టాంగాలోనించి దూకి "ఏడి? మీ ఇన్స్పెక్టర్ ఎక్కడ?" అడిగాడు.

"రైలు దొంగతనాలు చేస్తున్న దొంగనాయాళ్ళ ఆచూకి దొరికింది. వెంటపడ్డాడు" గార్ధభాల్ని స్టేషన్ ముందు ఆపుతూ చెప్పాడు గంగారాం.

"నోళ్ళు తెరుచుకుని అలా వింత చూడకపోతే, వచ్చి కాస్తంత సహాయం చేయకూడదా?" అని పౌరుల్ని ప్రశ్నించాడు. తమ ఆశ్చర్యాన్నించి వెంటనే బయటపడి– వాళ్ళిద్దరూ గబగబా ముందుకు వచ్చి తలా ఒక చెయ్యి వేశారు. క్షణాలమీద స్టేషన్లోకి చేరవేయబడ్డాయి గార్ధభాల మీద ఉన్న బరువైన మూటలన్నీ.

"ఆ చేతులతోనే వీటి సంగతి కూడా చూసి పెట్టండి. పనులు చేయించుకోవడమే తప్ప వాటి మొఖాలమీద రెండు గడ్డిపరకలు కూడా వేసినట్టులేదు... వట్టి బద్మాస్గాళ్ళు ఆ రైలు దొంగలు" ఓరకంట తోతాపురినే గమనించుకుంటూ వాళ్ళకి చెప్పాడు గంగారాం.

"వీటిని గుట్ట అవతలికి తోలుకుపోవడం బెస్టు సార్. అక్కడ ఉన్న పొదల్లో వదిలితే అవే హాయిగా వెతుక్కుంటాయి ఆహారాన్ని" సలహా ఇచ్చాడు ఒక పౌరుడు.

"శబ్బాష్... సరైన సమయంలో గుర్తుచేశావ్... కుందూ గాడెక్కడ?" అంటూ నాలుక కరుచుకున్నాడు గంగారాం. "కుందూని అహ్మదాబాద్ పంపించిన సంగతి మర్చిపోయాను. గుట్ట అవతల ఉండే కత్తీని ఒకసారి స్టేషన్ దగ్గిరికి రమ్మని కబురు అందించాలి. ఎవరు చేసి పెడతారు ఈ సాయాన్ని?" అందరి వంకా చూస్తూ అడిగాడు.

అమితంగా అలసిపోకుండా చిన్నా చితకా సహాయాలు చేయటానికి ప్రిపేర్ అయిన ఆ పౌరులు– ఏకంగా గుట్ట అవతలికి పోయి రావాలనేసరికి వెనుకంజ వేశారు.

ఒక్కమాట మాట్లాడకుండా నిలబడి ఉన్న తోతాపురి పెదవులమీద ప్రత్యక్షం అయిందొక విషపునవ్వు.

"బురదగుంటల్లో పొర్లాడి ఏవో నాలుగు మూటల్ని మోసుకు వచ్చినంత మాత్రాన వీరాధి వీరుడిలా ఉపన్యాసాలిస్తే వినటానికి ఎవరూ సిద్ధంగా లేరు. నువ్వు తోలుకు వచ్చిన జీవాల మంచీచెడ్డా నువ్వే చూసుకోవాలి" అంటూ టాంగాకేసి తిరుగుతూ ఎందుకో ఆగిపోయాడు.

"ఏంటీ సంగతి? ఇంకేదయినా గుర్తుకు వచ్చిందా?" వెక్కిరింపుగా అడిగాడు గంగారాం.

“వాళ్ళు... ఆ దొంగలు ఎవరైనా దొరికారా?” గంగారాంను అడిగాడు తోతాపురి.

“అడిగినమాటే అడిగి ప్రాణాలు తీయకు. దొరికితే కాళ్ళుచేతులు విరిచి ఇక్కడికే తీసుకువచ్చేవాడిని. మా గురువుగారు ఆ పనిమీదే ఉన్నాడని ఇందాక చెప్పాను... మర్చిపోయారా?”

“చిత్తడినేలలో చికుబుకు పొదలమధ్య ఎవర్నయినా పట్టుకోవాలంటే మామూలు తెలివితేటలు సరిపోవు... ఆవలిస్తే పేగులు లెక్కబెట్టగల వాళ్ళకే అది సాధ్యమవుతుంది” అనాడు తోతాపురి.

ఆవలించకుండానే పేగులతోపాటు ఒంట్లో ఉన్న నరాలన్నీ లెక్కపెట్టే దమ్ము తన గురువుకి ఉందని అప్పుడు బయటికి చెప్పలేదు గంగారాం.

గార్ధభాల్ని వాటిమీది మూటల్ని చూడగానే షేక్ అయిపోయాడు తోతాపురి. ఇంటికి వెళ్ళగానే ఏదో ఒక డ్రాస్టిక్ స్టెప్ వేస్తాడు. జాగ్రత్తగా అబ్జర్వ్ చేయగలిగితే అతని ఛాప్టర్‌ని వెంటనే క్లోజ్ చేసేయచ్చు.

కాని ఆ పని చేయటానికి గురువుగారు ఆ చుట్టుపట్ల లేడు. అసలు ఎక్కడ ఉన్నాడో కూడా తెలియదు...

తోతాపురిని మరింతగా వెక్కిరించి, ఇంకా ఇంకా టెన్షన్‌కి గురిచేసే ఆలోచనని వెంటనే విరమించుకున్నాడు గంగారాం. చిన్న నవ్వు నవ్వి వెనక్కి తిరిగాడు స్టేషన్‌లోకి పోవటానికి. కనుచివరలనించి అతనికి కనిపించింది

తోతాపురి మహాకోపంగా ఎవరివంకో చూడటం. ఉన్నట్టుండి అతనికి అంత కోపం ఎందుకు వచ్చిందో తెలుసుకోవటం కోసం తను కూడా పక్కకి చూశాడు.

స్టేషన్ వెనుక ఉన్న గుమ్మంలోనించి తన షెడ్ దగ్గరికిపోయాడు కాబోలు– తన పాత సైకిల్ మీద స్పీడ్‌గా వచ్చేస్తున్న బిల్లూకాకా కనిపించేసరికి అందమైన చిరునవ్వు ఒకటి వెంటనే ప్రత్యక్షమైంది అతని పెదవుల మీద.

''ఇక్కడి పనులన్నీ కుందూ నాకు అప్పగించాడు... ఏం చేయాలి ఇప్పుడు? చాయ్ తెచ్చి పెట్టాలా?'' గంగారాం దగ్గిర సైకిల్ దిగుతూ అడిగాడు అతను.

చాయ్ మాట చెవుల పడేసరికి అదేపనిగా పీకటం మీకటం మొదలుపెట్టింది గంగారాం నాలుక.

అయితే కుందూకి చెప్పినట్టూ ఆ పెద్దమనిషికి ఆర్డర్ ఇవ్వలేకపోయాడు. ''చాయ్ వద్దు. ముందు వాటిని–'' అంటూ గార్ధభాల వంక చూపించాడు.

ఏం చేయాలో చెప్పాల్సిన అవసరం లేకపోయింది. ''గుట్ట అవతల కత్లీకి అప్పగిద్దాం. తనైతే వీటి ఆలనా పాలనా చక్కగా చూసుకుంటుంది'' అన్నాడు బిల్లూకాకా.

''ఇవి చాలా ఇంపార్టెంటు... రేపు కోర్టులో ఎవిడెన్సుగా చూపించాల్సి రావచ్చు. మనదగ్గర ఉండగా మాయమైపోతే మాట పడాల్సి వస్తుంది'' జాగ్రత్త చెప్పాడు గంగారాం. అతని ఊహ యథార్థమయింది వెంటనే. ఆ మాటలు చెవుల పడిన వెంటనే టాంగా ఎక్కేశాడు తోతాపురి. స్పీడ్‌గా వెళ్ళిపోయాడు అక్కిడినించి. సైకిల్‌ని స్టేషన్‌గోడకి ఆనించి, కాలినడకనే గార్ధభాల్ని తోలుతూ గుట్ట దగ్గిరికి

బయలుదేరాడు బిల్లూకాకా. బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ స్టేషన్‌లోకి పోయాడు గంగారాం.

*　　　*　　　*　　　*　　　*

పుట్టినప్పటినించీ కాయకష్టం చేసుకుని బతుకుతూ ఉండటం వల్ల పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడు కుందూ... రిజెంట్ హోటల్ దగ్గిర్నించి అంబులెన్సులో అతన్ని ఒక పెద్ద బిల్డింగ్‌లోకి తీసుకుపోయాడు డాక్టర్ రాంప్రసాద్.

తెల్లటి దుస్తులు ధరించిన మగవాళ్ళు, ఆడవాళ్ళు చాలామంది ఉన్నారు ఆ బిల్డింగులో. అంబులెన్సు బిల్డింగ్ ముందు ఆగీ ఆగగానే బయటికి వచ్చి, ఒక వీల్ ఛైర్లో కుందూని లోపలికి తీసుకుపోయారు.

ఒక గది తర్వాత ఇంకో గదిలోకి తీసుకుపోయి ఎన్నెన్నో పరీక్షలు చేసి, ఆఖర్లో విశాలమైన ఒక ఎయిర్ కండిషన్డ్ గదిలోకి అతన్ని ప్రవేశపెట్టారు. నోరు తెరిచి ఒక్కమాట కూడా మాట్లాడకుండా మర మనుషుల మాదిరి చకచకా పనులు చేసుకుపోతున్న ఆ జనాన్ని ఒక్కసారిగా చూసి కొంచెం బెదిరిన మాట వాస్తవం.

“నీకు వచ్చిన భయం ఏమీలేదు. ఎవ్రీథింగ్ ఈజ్ క్వయిట్ నార్మల్. వెంటనే ఆపరేషన్ చేసేస్తాం. ఒక పని అయిపోతుంది” అంటూ అతన్ని ఒక టేబిల్‌మీద పడుకోబెట్టాడు ఆ హాస్పిటల్ డాక్టర్ రాంప్రసాద్.

ఆకలి దంచేస్తోంది కుందూకి. ఏదైనా తిని ఒకటో రెండో చాయ్‌లు తాగిన తర్వాత తాపీగా ఆ టేబిల్‌మీద పడుకుంటే బాగుంటుందని అనిపించింది అతనికి.

అతని భావాలు తనకు తెలియనట్టు సీరియస్‌గా తన పని తను చేసుకుంటూ పోయాడు డాక్టర్ రాంప్రసాద్... మత్తుమందు ఇచ్చాడు. మొఖం మీద పరిశుభ్రమైన వాసనలు వెదజల్లే ఒక టవల్‌లాంటి క్లాత్‌ని కప్పాడు.

"నీకు నొప్పి తప్ప అన్నీ తెలుస్తూనే ఉంటయ్... కాబట్టి కంగారు పడాల్సిన అవసరం లేదు" అంటూ ఎవరికో సైగచేశాడు. అతను సైగ చేసినప్పుడు ఆపరేషన్ టేబిల్ దగ్గిరికి వచ్చాడు ఎముకల వైద్యంలో పేరున్న అహ్మదాబాద్‌కు చెందిన డాక్టర్ ఒకతను.

"ఇది చాలా సింపుల్ ఆపరేషన్. చిన్నతనంలోనే చేయించి ఉంటే కాలు ఎదుగుదల క్వయిట్ నార్మల్‌గా ఉండి ఉండేది" దగ్గిరికి వస్తూనే అన్నాడతను.

"ఇప్పుడు ఎదుగుదల లేదంటారా?" అడిగాడు.

"నో... నో... అది కాదు నా ఉద్దేశ్యం. అవిటివాడిగా బతకాల్సిన అవసరం ఉండి ఉండేది కాదు. ఇప్పటికయినా మించిపోయింది ఏమీలేదు... అవిటితనం ఆల్‌మోస్ట్ కనిపించదు. పట్టి పట్టి చూస్తే తప్ప ఎవరూ కనిపెట్టలేరు" అంటూ తన పని తను మొదలుపెట్టాడా డాక్టర్.

మాటలన్నీ కుందూకి వినపడుతూనే ఉన్నయ్...

తన కాలును ఏం చేయాబోతున్నారోనని టెన్షన్ ఫీల్ అవుతున్నాడతను. ఆ మాటల్ని వినేసరికి మటుమాయం అయిపోయింది టెన్షన్ అంతా.

అలా జరగటం కోసమే వాళ్ళు కావాలని అలా మాట్లాడినట్టు అతనికి తెలియదు. తనకు తెలియకుండానే హాయిగా నిద్రలోకి జారిపోయాడతను. తిరిగి

కనులు తెరిచేసరికి ఆపరేషన్ అయిపోయింది. ఆపరేషన్ టేబిల్ మీదినించి అతన్ని ఒక గదిలో బెడ్‌మీదికి మార్చారు. 'నేను ఎక్కడ ఉన్నాను?' అని అడగబోతూండగా ఆపేసింది పక్కనే ఒక స్టూల్ మీద కూర్చుని పుస్తకం చదువుకుంటున్న నర్సు.

"ఆపరేషన్ సక్సెస్... నాలుగైదు రోజుల్లో లేచి తిరగచ్చు..." కట్లు కట్టి వున్న కాలివంక చూపిస్తూ చెప్పింది. నీటితో నిండిపోయినయ్ కుందూ కళ్ళు.

"ఎందుకు? నొప్పిగా ఉందా?" అడిగింది నర్సు.

"నొప్పి గురించి కాదు... మా ఇన్స్‌పెక్టర్ సాబ్ గుర్తుకు వచ్చాడు. ఆయన గనక పూనుకోకపోయినట్టయితే జీవితాంతం అవిటివాడిగానే ఉండేవాడిని" బుగ్గలమీదికి జారబోతున్న నీటిని తుడుచుకుంటూ చెప్పాడు.

"మీ ఇన్స్‌పెక్తర్ గురించి మా డాక్టర్‌గారు మాట్లాడటం నేను కూడా విన్నాను. ఇంత ఖరీదైన ఆపరేషన్ చేయిస్తూ, తను నీ దగ్గిరికి రాలేదు. ఎందుకని?" అడిగింది నర్సు.

"రావటానికి ఆయనకి తీరిక ఎక్కడ? ఆ బురద నేలలో పడి ఎక్కడ తిరుగుతున్నారో ఏమిటో" అన్నాడు కుందూ. అంటూ ఉండగానే మళ్ళీ ముంచుకు వచ్చేసింది నిద్ర. తలను పక్కకు తిప్పుకుని హాయిగా నిద్రపోయాడు.

*            *            *            *            *

దాహం వేస్తోంది. చెమటల్తో ఒంటిమీద వున్న అరువు యూనిఫాం తడిసి ముద్దైంది. సిగరెట్లు లేవు. అయినా సరే కదలలేదు షాడో తను కూర్చుని ఉన్న చోటినించి. కారణం– అతను కూర్చుని వున్న ప్రదేశానికి వంద గజాల దూరంలో

చిత్తుఒత్తుగా పెరిగిన ఒక పొద దగ్గిర మాకాం వేసివున్న పదిమంది దృఢకాయులు.

మొట్టమొదటి చూపులో వాళ్ళు తనకు చాలా బాగా పరిచయం అయిన వాళ్ళ మాదిరి కనిపించారతనికి. గట్టిగా ఆలోచించేసరికి గుర్తుకు వచ్చింది వాళ్ళు తోతాపురికి సంబంధించిన వాళ్ళని.

ఎక్కడో ఉన్న బింద్రాని వదిలి వీళ్ళు ఆ పొదల్లోకి ఎందుకు వచ్చారో తెలుసుకోవడం చాలా ముఖ్యం అనిపించింది అతనికి. చప్పుడు చేయకుండా తను కూడా ఒక పొదచాటున సెటిల్ అయిపోయాడు. పదకొండు గంటల సమయంలో కదలిక వచ్చింది ఆ దృఢకాయుల్లో.

‘‘కూర్చున్న కొద్దీ కూర్చోవాలని అనిపిస్తుంది... చేయాల్సిన పని అలాగే ఉండిపోతుంది. లేవండి. లేచి నడుములు వంచండి’’ అన్నాడు ఒక మనిషి. ‘‘ఇదంతా ఆ ఇన్స్‌పెక్టర్‌గాడి వల్ల వచ్చింది. నణ్ణడిగితే వాడిని చంపి బురదలో పాతి పెట్టేయాలి’’ కచ్చగా అన్నాడు ఇంకో మనిషి.

ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు అందరూ లేచి నిలబడ్డారు.

అప్పుడు తెలిసింది షాడోకి– బింద్రాలో ఉండాల్సిన ఆ జనం అక్కడికి వచ్చిన కారణం.

చిత్తుఒత్తుగా పెరిగిన పొదవెనుక చిన్నసైజు పర్వతంలా గుట్టగా పడేయబడి ఉన్నాయి రకరకాల జనపనార పార్శిల్స్... అవి ఏమిటోనని పెద్దగా

ఆలోచించాల్సిన అవసరం లేకుండానే తెలిసిపోయింది షాడోకి. ఎవరికీ తెలియకుండా రైళ్ళను ఆపి నేర్పుగా తస్కరించిన సరుకది.

తమను అబ్జర్వ్ చేసేవాళ్ళు ఎవరూ లేరన్న ధైర్యంతో పెద్ద పెద్దగా మాట్లాడుకుంటూ పలుగులు, పారలు పట్టుకుని పనిచేయటం మొదలు పెట్టారు ఆ దృఢకాయులు. బురదనేలలో పెద్ద గొయ్యిని తవ్వి గుట్టలా పేర్చిన సరుకునంతా అందులోకి దొర్లించి బురదతోనే కప్పేట్టేశారు.

“ఇక తోతాపురిసాబ్ జోలికి వచ్చేవాళ్ళు ఎవరూ ఉండరు. ఈ సరుకు ఇక్కడ ఉన్నట్టు ఎవరికీ తెలీదు. తెలిసినా తోతాపురి సాబ్ దగ్గరికి రాలేరు” అన్నాడో మనిషి.

“అది సరే... బురద మూలకంగా సరుకంతా పాడయిపోతుంది. ఎవరికీ పనికిరాదు” అన్నాడు ఇంకో మనిషి.

“అదంతా మనకనవసరం... అప్ప చెప్పిన పనిని చేసేశాం. ఇంక వెళ్ళిపోదాం” అంటూ బయలుదేరాడు మొదటి మనిషి. తాము ఉపయోగించిన పలుగుల్ని, పారల్ని, ఆ పొద దగ్గిరే పాతిపెట్టి అతన్ని అనుసరించారు.

కనురెప్ప కూడా కదిలించకుండా వారిని అబ్జర్వ్ చేయటమైతే చేశాడుగాని, ఆ తర్వాత కుదురుగా కూర్చోలేకపోయాడు షాడో. దొంగతనాలు చేయిస్తోంది తోతాపురి అని రూఢీ అయింది. ఓకే.... అతన్ని ఉచ్చులో బిగించే ఆధారాలు సఫిషియంట్‌గా లేవు.

కాని లోపల ఈ చంచాలు అనుకుంటున్నట్టు పాతిపెట్టబడిన సరుకు సర్వనాశనం అయిపోతుంది. ఆ సరుకు లాస్ అవటం వల్ల బోలెడంత డబ్బును కాంపన్‌సేషన్ కింద ఖర్చుపెట్టింది రైల్వేశాఖ...

నష్టపరిహారాలు ఇవ్వటం కంటె అసలు అటువంటి సరుకును ట్రాన్స్‌పోర్ట్ చేయకుండా ఉండటమే మంచిదనే ఆలోచన కూడా వుంటుంది.

ఇప్పుడు ఏం చేస్తే ఆ మెటీరియల్‌ని తాను సేవ్ చేయగలడు...? ఒంటరిగా తవ్వి బయటికి తీయవచ్చు.

కాని అందుకు చాలా సమయం పడుతుంది. తవ్వి బయటికి తీసిన తర్వాత రైల్వేవారికో, బోర్డర్ సెక్యూరిటీ వాళ్ళకో కబురు అందించి దాన్ని అవతలికి పంపించేయాలి. ఆలస్యం చేస్తే మళ్ళీ ఏ బంజారీ తండావంటి అనాగరికులు దాన్ని మాయం చేసేసే ప్రమాదం ఉంది.

వాట్ టూ డూ నౌ?? సమాధానం లభించని ఆ ప్రశ్న మనసులో తిరగటం మొదలుపెట్టేసరికి విపరీతమైన చికాకు కలిగిందతనికి. రెండు నిముషాల తర్వాత కుదుటపరుచుకున్నాడు అతని మనస్సును. కూర్చున్న చోటినించి లేచి ఆ చికుబుకు పొద దగ్గిరికి బయలుదేరాడు.

పాతిక అడుగులు వేయకముందే వెర్రిగా అరుస్తూ వింటినించి వెలువడిన బాణంలా వేగంగా అతనికేసి దూసుకువచ్చాయి రెండు పక్షులు.

నల్లగా కాకులు మాదిరిగానే ఉన్నాయి అవి. కాకులు మాత్రం కావు... కళ్ళ చుట్టూ ఎర్రటి చారలున్నాయి. ఇనుప సూదులవంటి ముక్కులు... పదునైన కాలివేళ్ళు. అవి అల్లంత దూరంలో ఉండగానే గమనించాడు షాడో.

చేతుల్ని తలకు అడ్డం పెట్టుకుని వేగంగా వెనక్కి పరిగెత్తాడు. వదిలిపెట్టలేదు ఆ పక్షులు. రాకెట్లలా వచ్చేశాయి. లాగిపెట్టి తలమీద తన్నింది వాటిలో ఒకటి.

అడ్డం పెట్టుకున్న షాడో చేతులమీద బ్లేడుతో కోసినట్లు సన్నపాటి చార ప్రత్యక్షం అయింది.

ఆలస్యం చేస్తే అటువంటి చారలు ఇంకా చాలా ఏర్పడతాయని తెలిసిపోయింది అతనికి. ఊపిరి బిగపట్టి ఇంకా వేగంగా పరిగెత్తాడు. అమాంతంగా డైవ్ చేసి అంతకు ముందు కూర్చున్న పొదమధ్యలో పడిపోయాడు.

తేరగా దొరికిన మనిషి అలా పొదలోకి పోయి దాక్కోవటాన్ని చూసి రెచ్చిపోయాయి ఆ పక్షులు... పొదచుట్టూ తిరుగుతూ వికృతంగా అరవటం మొదలుపెట్టాయి.

సరిగ్గా రెండు నిముషాల తర్వాత ఇంకో జత పిట్టలు వచ్చాయి అక్కడికి. మరో నిముషం తర్వాత ఇంకో నాలుగు... ఆ తర్వాత పది... ఇంకో పదినిముషాలు గడిచేసరికి యాభై పక్షులకు పైగా పోగుపడ్డాయి....

పొదలోనించి అతను తల బయటపెడితే– వెంటనే ఎటాక్ చేయటానికి సర్వసన్నద్ధంగా వాటిలో కొన్ని నేల మీద వాలాయి. పూర్తిగా ఎండుకుపోయింది

షాడో గొంతు. కచ్ ప్రాంతపు చిత్తడి నేలల్లో రకరకాల జంతువులు, పక్షులు తిరుగుతూ ఉంటాయని అతనికి తెలుసు.

కాని ఎగబట్టిన పాములవంటి ఈ పిట్టలు ఉంటాయని మాత్రం తెలియదు. మనిషిని చూడగానే దూరంగా పారిపోయే పరమ పిరికి పిట్టలు అవి. పెద్దపులుల్లా పగబట్టడానికి కారణం ఏమై ఉంటుంది?

బురదలో పాతిపెట్టబడిన సరుకును వెంటనే బయటికి తీయకపోతే సర్వనాశనం అయిపోతుందేమోనన్న ఆలోచనకు ఇప్పుడు ఆ పిట్టల భాగోతం కూడా తోడయ్యేసరికి ఇంకా ఇంకా చికాకు గురి అయింది షాడో అంతరంగం. ఏదోటి చేసి ఆ ప్రమాదం నించి బయటపడాలి.

గంగారాం గనుక వెంటవుంటే ఏదో ఒక సలహా తప్పకుండా ఇచ్చి వుండేవాడు. అవసరం వచ్చినప్పుడు అందుబాటులో లేకుండా పోయాడు. ఏం చేయాలి?

ఏదోలా వాటిలో రెండింటినో, మూడింటినో చంపితే మిగిలినవి భయపడి పారిపోవచ్చు... వాటెబౌట్ ఇట్? సన్నగా వెదురుచువ్వలా పొడుగ్గా కనిపించిన ఒక కొమ్మను విరిచి చేతిలో పట్టుకుంటూ ఉండగా– ఆ పని చేయటానికి విముఖత చూపించింది అతని అంతరంగం.

వాటిని ఏదో ప్రమాదం ఆ స్టేజికి తీసుకువచ్చింది. ఆత్మరక్షణ కోసమో, తమ సంతానాన్ని కాపాడుకోవటం కోసమో అని అలా వైల్డ్‌గా బిహేవ్ చేస్తున్నాయి.

అటువంటి అమాయక ప్రాణుల్ని తను గాయపరచడం బాగుంటుందా? సాల్వ్ అయిపోతుందనుకున్న సమస్య తిరిగి మొదటికి వచ్చేయటంతో మరింత గిజాటుగా గురి అయ్యాడు షాడో... అమాయక పక్షులు... ఆత్మ రక్షణకో, తమ సంతానాన్ని రక్షించుకోవటానికో–

రీవైండ్ చేసిన టేప్ రికార్డర్ మాదిరి అంతకుముందు అనుకున్న ఆ మాట మరోసారి మనసులో మెదిలేసరికి అప్రయత్నంగా జలదరించింది అతని శరీరం.

వాటికి ఎదురైన ప్రమాదం ఏదో అక్కడికి దగ్గర్లోనే ఉండి ఉంటుంది. అది తనవంటి మనిషి మూలకంగానే ఏర్పడి ఉంటుంది. అంటే– పిట్టల్ని భయపెట్టే మనిషో, మనుషులో ఎవరో దగ్గిర్లోనే ఉన్నారు...

ఆ మాట మనుసులో మెదిలిన మరిక్షణం.. ఆగలేదు షాడో.... అంతకుముందు ఆ పిట్టలమీద ప్రయోగించటానికి విరిచి పట్టుకున్న పొద కొమ్మని గట్టిగా బిగించి పట్టుకుంటూ పొదలోనించి బయటికి జంప్ చేశాడు.

అతను అంత సడన్‌గా బయటికి వస్తాడని ఊహించలేదు కాబోలు– రియాక్ట్ అవటంలో క్షణకాలం లేట్ చేశాయి ఆ పిట్టలు. ఆ కాస్త వ్యవధిలోను యాక్షన్‌లోకి దిగిపోయాడు షాడో. చేతిలో ఉన్న కొమ్మని తలమీద గిర్రుగిర్రున తిప్పుతూ పరుగు మొదలుపెట్టాడు.

గోలగోలగా అరుస్తూ అతన్ని అనుసరించటం మొదలుపెట్టాయి పిట్టలు.

అంతకుముందు మాదిరి అతని తలను ఎటాక్ చేయటానికి మాత్రం వీలుపడలేదు. విష్ణుచక్రం తిరుగుతున్నట్టు వేగంగా తిరుగుతోంది షాడో తలమీద అతను ఊపుతున్న కొమ్మ.

ఎటాక్ చేయటం చేతకాకపోవటంతో మరింత వికృతంగా ధ్వనులు చేయటం మొదలుపెట్టాయి అవి.

ఆ గోలను గురించి పట్టించుకోకుండా రాకెట్ మాదిరి పరిగెత్తాడు షాడో... అరకిలోమీటర్ దూరం పోయిన తర్వాత కనిపించింది అతనికి నీటితో నిండివున్న పెద్ద పల్లపు ప్రదేశం... తనవంటి మనుషులు ఎవరూ అక్కడ కనిపించలేదతనికి. నీటిగుంట ఒడ్డున వత్తుగా ఏర్పాటు చేయబడి ఉన్న బర్డ్ ట్రాప్స్ కనిపించాయి.

కంటికి కనిపించనంత సన్నగా ఉండే వైర్‌తో తయారు చేయబడిన వలలు అవి. నీటికోసమో, నీటిలో తిరిగే పురుగుల కోసమో అక్కడ వాలే పక్షుల్ని పట్టుకోవటం కోసం ఏర్పాటు చేయబడ్డాయి. తనను తరుముతున్న పిట్టల వంటివే వాటిలో ఆల్‌రెడీ చిక్కుబడి ఉండటం కూడా షాడోకి కనిపించింది. తప్పించుకునే దారి కనిపించక తలల్ని పైకెత్తి చాలా దీనంగా అరుస్తున్నాయి అవి. రెక్కల్ని తపతప కొడుతూ గోలగోల చేస్తున్నాయి.

పరిస్థితి ఏమిటో పూర్తిగా అర్థం అయిపోయింది షాడోకి. నడుము మీద చేతులు వేసుకుని దీర్ఘంగా ఆలోచించటాన్ని స్టార్ట్ చేయలేదతను. ఎదుట కనిపించిన దృశ్యాన్ని చూడగానే అసలు తనను తాను మరిచిపోయాడు. తల మీద తిప్పుతున్న కొమ్మని వదిలేశాడు.

అదే అదునుగా ఫట్‌ఫట్‌మని తలమీద పొడవటం స్టార్ట్ చేసిన పిట్టల్ని గురించి పట్టించుకోవటం మానేశాడు.

మరమనిషిలాగా పనిచేసి, నీటిగుంట ఒడ్డున ఉన్న ఐరన్ వైర్లను డిస్‌మాంటిల్ చేయటం మొదలుపెట్టాడు.

పదినిముషాలు పట్టింది అతనికి చిక్కుపడిన పిట్టలన్నిటినీ వదిలించటానికి. ఆ కాస్త వ్యవధిలో నాలుగు చోట్ల చిల్లులు పడింది అతని తల. సన్నటి రక్తపు ధారలు మెడమీది నించి కిందికి జారి అరువు యూనిఫామ్‌ని మలినపరచడం మొదలైంది. అయినా సరే కేర్ చేయలేదతను. భయంతో వణికిపోతున్న ఆఖరి పిట్టను అతి జాగ్రత్తగా బయటికి తీసి గాలిలోకి ఎగరేశాడు.

అప్పుడు తెలిసి వచ్చింది అతనికి తనమీద జరుగుతున్న ఎటాక్స్ గురించి అవతలికి విసిరేసిన కొమ్మ దగ్గిరికి జంప్ చేయబోతుండగా– తెలిసివచ్చింది ఇంకో విషయం.

ఎప్పుడో ఆగిపోయాయి ఎటాక్స్. అతను ఏం చేయబోతున్నాడో తమకు అవగతం అయిన మరుక్షణం ఆగిపోయాయి పిట్టలు. దూరంగా నేలమీద వాలి తదేక దృష్టితో అతనివంకే చూస్తున్నాయి. ‘‘అయిపోయింది కదా! నెత్తిమీద చిల్లులు పెట్టారు కదా... వై డోన్ట్ యూ గో ఎవే? ఇంకా ఇక్కడే వెయిట్ చేయటం దేనికి?’’ వాటి భాష తనకు తెలిసినట్టు అడిగాడు అతను.

ఆ మాటలు తమకు కూడా అర్థం అయినట్టు ఒకేసారి గుంపుగా గాల్లోకి లేచి అతని చుట్టూ నాలుగు రౌండ్స్ కొట్టాయి అవి... ‘‘బై డియర్స్... గుడ్‌బై..

హ్యాపీ జర్నీ...'' అని చెప్తూ అదిరిపడ్డాడు షాడో. కిందికి వదిలేసిన కొమ్మని మళ్ళీ చేతుల్లోకి తీసుకున్నాడు.

పరుగు పరుగున నీటిగుంట దగ్గిరికి వచ్చేస్తున్నారు దగ్గిర దగ్గిరిగా పాతికమంది ఆజానుబాహులు. "మనం పెట్టిన వలల్లో పడిన పిట్టలన్నింటినీ వాడు కొట్టేస్తున్నాడు. వాడి బుర్ర పగలగొట్టేయ్యాలి. వదిలి పెట్టొద్దు'' అంటూ అందరినీ హుషారు చేస్తున్నాడు ముందు వరసలో లీడర్‌లా ఉన్న భారీ పర్సనాలిటీ.

నరరూప రాక్షసుల్లాగా కనిపిస్తున్న ఆ హీరోల నందర్నీ చూసేసరికి పెద్దబండరాయి పడినట్టు అయింది షాడో గుండెల్లో. ఇప్పుడు తనున్న పరిస్థితిలో వారిని ఎదిరించటం తనకి చేతనవుతుందా?

అతని ఆలోచన పూర్తి కాకముందే దగ్గిరికి వచ్చేశారు వాళ్ళందరూ. "కొట్టండి. తల పగల కొట్టేయండి'' అని అరుస్తూ మీదికి ఎగబడబోయారు.

"ఆగండిరోయ్... ఆగిపొండి'' సడన్‌గా అరిచాడు వారిలో ఒకతను.

"ఓరి నీ మట్టిమొఖాల్లారా... బాగా చూడండిరా. కళ్ళు తెరుచుకుని మరీ చూడండి. మన ఇన్స్‌పెక్టర్ సాబ్‌రా... బింద్రాలో మన దుమ్ము దులిపినవాడు'' చిరుకోపంతో గట్టిగా అరుస్తూ చెప్పాడు ఆ వ్యక్తి.

విపరీతమైన ఆశ్చర్యంతో పట్టి పట్టి చూశారు వాళ్ళందరూ షాడోని. "అరే ఇదేమిటి సాబ్? ఈ అవతారం ఏమిటి? ఒంటరిగా ఏం చేస్తున్నారిక్కడ?'' అని అడుగుతూ దగ్గిరికొచ్చాడు వాళ్ళందర్నీ నడిపించే లీడర్ వంటి వ్యక్తి.

దగ్గిరికి వచ్చినట్టే వచ్చి మనసు మార్చుకుని ఎటాక్ మొదలు పెడతాడేమోనన్న అనుమానం షాడోకి కలిగిన మాట వాస్తవం. అయితే ఆ విషయం బయటికి కనిపించకుండా జాగ్రత్త పడ్డాడు... "మీలాంటి వాళ్ళకోసమే వెతుకుతూ ఇటు వచ్చాను. నోరు వాయి లేని పిట్టలు ట్రాప్‌లో చిక్కుపడటం నాకు బాధ కలిగించింది" నిజాయితీగా చెప్పాడు తను చేసిన పని గురించి.

"అలా అంటారేంటి సాబ్... అవి మా జీవనాధారం.. వాటిని పట్టుకుని బతకమని దేవుడు మా మొఖాలమీద రాశాడు" నవ్వుతూ అన్నాడా వ్యక్తి.

రెట్టించదలుచుకోలేదు షాడో. ఆర్గ్యుమెంటు స్టార్ట్ చేయాలనీ అనుకోలేదు... "ఆల్‌రైట్... ఇవాళ నా మూలకంగా మీరు నష్టపోయారు. ఐయామ్ సారీ" అన్నాడు.

మరింత పెద్దదైపోయింది ఆ మనిషి ముఖం మీది నవ్వు. "మాకు ఇట్టాంటివన్నీ మామూలే సాబ్... మీరు కాబట్టి తాపీగా నిలబడి మర్యాదగా మాట్లాడుతున్నారు. ఇదే బోర్డర్ సెక్యూరిటీ వాళ్ళు అయి ఉంటే మా చెమడాలు ఎక్కదీసేవాళ్ళు" అని చెప్పాడు.

అప్పటికప్పుడు సీరియస్‌గా ఆలోచించి ఒక నిర్ణయం తీసేసుకున్నాడు షాడో. "మీరు నాకు ఎదురుపడటం నిజంగా నా అదృష్టం. అర్జంటుగా చేయాల్సిన పని ఒకటి ఉంది. సాయం చేస్తారా?" అని అడిగాడు. తటపటాయించలేదు వారెవరూ. "చెప్పండి సాబ్... చేసేస్తాం. చెప్పండి" ఒకేసారి చెప్పారు.

దూరదూరంగా ఎగురుతున్న నల్లపిట్టలను ఒక కంట గమనించుకుంటూ వారందర్నీ వెనక్కి తీసుకువచ్చి, తోతాపురి జనం తవ్వి పూడ్చిన ప్రదేశాన్ని చూపించాడు షాడో.

"వట్టి చేతులతో తవ్వటం చాలా కష్టం సాబ్" విషయాన్ని వెంటనే అర్థం చేసుకుంటూ అన్నాడు వాళ్ళ లీడర్. నోరు తెరిచి ఒక్కమాట కూడా మాట్లాడకుండా, పలుగులు, పారలు పాతి పెట్టబడిన ప్లేస్‌ని చూపించాడు షాడో. రాక్షసుల్లాగా పనిచేశారు ఆ హంటర్స్... అరగంట తర్వాత బురదలో పాతిపెట్టబడిన సరుకంతా తిరిగి బయటికి వచ్చేసింది. వారిలో ఒక సన్నపాటి మనిషిని సెలక్ట్ చేశాడు షాడో. "భుజ్ పట్టణానికి పోయి బోర్డర్ సెక్యూరిటీవాళ్ళకి ఈ సరుకును గురించి చెప్పాలి. వెంటనే వచ్చి హేండోవర్ చేసుకోమని సలహా ఇవ్వాలి" అని చెప్పాడు. అతను అంగీకార సూచకంగా తల ఊపి అప్పటికప్పుడు ప్రయాణానికి సిద్ధం అవగానే, మిగిలిన వాళ్ళందర్నీ ఆ సరుకుకు కాపలాగా అక్కడే ఉండమని చెప్పి, తను బింద్రావైపు అడుగులు వేశాడు.

*          *          *          *          *

సాయం సమయం అయింది షాడో బింద్రా పట్టణంలోకి అడుగు పెట్టేసరికి, పొలిమేరకు కొంచెం దగ్గర్లో ఉండగానే గమనించారు జనం అతన్ని.

"వచ్చేశాడు... ఇన్స్‌పెక్టర్ సాబ్ వెనక్కి వచ్చేశాడు... ఒళ్ళంతా బురద... నెత్తురు..." అర్జంటుగా తోతాపురి దగ్గిరికి పోయి రిపోర్టు చేశాడు అతని అనుచరుడు ఒకతను.

‘‘వెంటనే వెళ్ళు, నేను రమ్మంటున్నానని చెప్పి వెంట తీసుకురా’’ తడుముకోను కూడా తడుముకోకుండా ఆర్డర్ ఇచ్చాడు తోతాపురి.

‘‘ఇప్పుడు వాడు మన దగ్గిరికి దేనికి సార్?’’ అడిగాడు బద్రీనాథ్.

‘‘మాట్లాడకుండా కూర్చుంటే వాడి అనుమానాలు చాలా ఎక్కువైపోతాయ్... ఎదుటికి రప్పించుకుని రెండు తిట్లు తిడితే కామ్ అయిపోతాడు’’ అన్నాడు తోతాపురి.

‘‘మన సరుకు కొంత స్టేషన్లోనే ఉంది’’ గుర్తు చేశాడు బద్రీనాథ్.

‘‘అది మనది కాదు. అసలు ఆ పని చేసింది మనం కాదు... అర్థమైందా?’’ కోరగా చూస్తూ అన్నాడు తోతాపురి.

బద్రీనాథ్ ముఖంలో పెద్ద నవ్వు ప్రత్యక్షం అయింది, తమ మనుషులు ఎవరూ ఆ గంగూభాయ్ చేతికి చిక్కలేదు. గార్ధభాలు మాత్రమే దొరికాయి. వాటికి నోళ్ళు లేవు గనక మాట్లాడలేవు... తమ యజమాని ఎవరో ఎవరికీ చెప్పలేవు. బురద కొట్టుకున్న ఒంటితో వచ్చిన ఇన్స్పెక్టర్ చేయగలిగింది ఏమీలేదు... హుషారుగా విజిల్ వేసుకుంటూ తన దారిన తను వెళ్ళిపోయాడతను అక్కడినించి.

*　　*　　*　　*　　*

‘‘నిముషానికి ఒకసారి ఆ పాడు బురదలోకి పోయి ఒళ్ళంతా కంపు చేసుకోవటం మీకు బాగా అలవాటు అయిపోయింది. సాధించింది ఏమైనా వుందా అంటే ఏమీ లేదు... తోతాపురి ఆనందంగా, హాయిగా ఊళ్ళో తిరుగుతూనే ఉన్నాడు’’ స్టేషన్ దగ్గిరే కూర్చుని బిల్లూకాకా అన్నాడు షాడోని చూడగానే.

అతను కుందూ ప్లేస్‌లో పనిచేయటానికి డిసైడ్ అయినట్టు షాడోకి తెలియదు. చురుకుగా ఒక చూపు చూసి లోపలికి పోయి, తన కుర్చీలో కూలబడ్డాడు.

ఒక అలమారాలో పెట్టిన సిగరెట్ ప్యాకెట్‌ని, అగ్గిపెట్టెని అతనికి అందించాడు గంగారాం వెంటనే.

"మనం తోతాపూరిని అరెస్ట్ చేయాలి..." సిగరెట్ వెలిగించుకుంటూ అన్నాడు షాడో.

"అధారాలు లేవు... వాడి చంచాల్లో ఒక్కడు కూడా నాకు దొరకలేదు" కామ్‌గా చెప్పాడు గంగారాం.

"మరేం పరవాలేదు. తీసుకొచ్చి రెండు తీతలు తీద్దాం. ఆధారాలు అవే బైటికి వస్తయ్" అన్నాడు షాడో.

"అంత తొందర వద్దు" అంటూ చిత్తడి నేలలో తను చూసిన నూతన వ్యక్తుల్ని గురించి అతనికి చెప్పాడు గంగారాం.

వెలిగించుకున్న సిగరెట్ పొగ చాలా చేదుగా ఉన్న ఫీలింగ్ వెంటనే కలిగింది షాడోకి.

ఆ చుట్టుపట్ల జరుగుతున్న రైలు దొంగతనాలకు మూలకారుడు తోతాపురి అనీ, అతన్ని ఊచల వెనక్కి నెట్టేస్తే తను వచ్చిన పని పూర్తి అవుతుందని అనుకుంటున్నాడు తను. రైలు దొంగతనాల్ని మించిన రాకెట్ ఏదో అక్కడ

నడుస్తోంది. అదేమిటో తనకి తెలియదు... దాన్ని కనిపెట్టకపోతే, అంతవరకూ తాము పడిన కష్టం అంతా ఎందుకూ పనికి రాకుండా పోతుంది.

"ఆ ఇన్స్‌పెక్టర్ సంతోష్ గనుక బతికి ఉంటే తను ఏం చేసి ఉండేవాడు?" సగం కూడా కాలని సిగరెట్‌ని అవతలికి విసిరేస్తూ అడిగాడు.

"తప్పకుండా తన యాంగిల్‌ని మార్చుకుని ఉండేవాడు..." చెప్పాడు గంగారాం.

"ఓ.కే. మనం అతన్ని ఇంపర్సనేషన్ చేస్తున్నాం కాబట్టి మనం కూడా మన యాంగిల్‌ని మార్చుకోవాలి. తోతాపురిని కాస్సేపు మర్చిపోదాం" అంటూ కుర్చీలోనించి లేవబోయాడు. సరిగ్గా అప్పుడే లోపలికి తొంగి చూశాడు బిల్లూకాకా. "మీ యజమాని దగ్గిర్నించి మనిషి వస్తున్నాడు. ఇప్పుడు అక్కడికి వెళ్ళి నమస్కారం చేసుకోవాలి కాబోలు" వ్యంగంగా కామెంట్ చేశాడు.

షాడో అతనివంక కోపంగా చూడకముందే గుమ్మంలో ప్రత్యక్షం అయ్యాడు తోతాపురి అనుచరుడు.

"నేనే వద్దమని అనుకుంటున్నాను... కాస్తంత స్నానం చేసి వస్తాను. నువ్వు వెళ్ళు" వెంటనే చెప్పాడు షాడో.

"త్వరగా రండి. తోతాపురి సాబ్‌కి కోపం చాలా ఎక్కువ. ఆలస్యం అయితే అస్సలు ఊరుకోడు" తన యజమాని గొప్పతనాన్ని చాలా గొప్పగా చెప్పి అక్కడి నుంచి వెనక్కి వెళ్ళిపోయాడతను.

“ఇప్పుడున్న పరిస్థితుల్లో వాడి దగ్గిరికి పోవడం అవసరమా?” అడిగాడు గంగారాం.

సమాధానం చెప్పలేదు షాడో. ఉన్నట్లుండి స్టేషన్లో నించి బయటికి పరిగెత్తాడు. అతను అంత సడన్‌గా మూవ్ కావటానికి కారణంఏమిటో గంగారాంకి తెలియలేదు.

“నేను కూడా వస్తున్నా... ఆగు గురూ... కొంచెం ఆగు” అంటూ తనూ అతనివెనకే పరుగు మొదలుపెట్టాడు. పొలిమేరల దగ్గిరికో... పొలిమేరల అవతల ఉన్న గుట్ట దగ్గిరికో పోలేదు షాడో... వింటినించి వెలువడిన బాణంలా సూటిగా స్టేషన్‌కి కొంచెం అవతలగా ఉన్న ఒక చిన్న వీధిలోకి ఎంటర్ అయినాడు.

“ఎందుకు? ఎందుకు గురూ మనం ఇక్కడికి రావటం?” అని అడగబోతూ ఆ మాటల్ని నోటిలోనే అదిమేసుకున్నాడు వెనుకగా వస్తున్న గంగారాం.

వీధిలోకి ఎంటర్ అవగానే ఒక ఇంటిదగ్గిర ఉన్న మట్టి గోడమీదినించి అవతలికి జంప్ చేశాడు షాడో.

శత్రువును చూసి కలుగులోకి పారిపోబోతున్న కుందేలును పట్టుకున్నట్టు ఒక పర్సనాలిటీ మెడని పట్టుకుని విసురుగా గోడ ఇవతలికి విసిరేశాడు.

“చచ్చిపోయాను బాబోయ్... నా పని అయిపోయింది నాయనోయ్” అని కీచుగా అరిచాడు ఆ వ్యక్తి. అరవటంతో ఆగలేదు. పడిన చోటినించి ఛెంగున లేచి స్పీడ్‌గా ఆ వీధి చివరికి పారిపోయే ప్రయత్నం చేశాడు.

"అయ్యబాబోయ్... బంజారా తండాకి మనల్ని పట్టించిన బద్మాష్ వీడు... నీకు ఎలా కనిపించాడు?" ఆశ్చర్యంగా అడుగుతూ తోడేలు మాదిరి అతనిపై కలబడ్డాడు గంగారాం. పైకి లేచి పది అడుగులు కూడా వేయకముందే అతని మెడని పట్టుకుని మళ్ళీ కిందకి నెట్టాడు.

"మనం క్షేమంగా వెనక్కి రావటం వీడికి అర్థం కాలేదు. ఎలా తిరిగి వచ్చామో, ఏం మాట్లాడుకుంటున్నామో తెలుసుకోవటానికి అదేపనిగా తొంగి తొంగి చూస్తున్నాడు" మట్టిగోడ వెనక నించి ఇవతలికి వస్తూ చెప్పాడు.

"ఐతే అన్ని విషయాలు వాడికి వివరంగా చెప్పాల్సిందే. వీధిలో మాట్లాడుకోవటం బాగోదు... స్టేషన్లోనే బాగుంటుంది" అంటూ ఆ మనిషిని ఇసుక మూటలా భుజం మీద వేసుకుని వెనక్కి తీసుకువచ్చాడు గంగారాం.

"కుందూకి మీరు చేస్తున్న సాయాన్ని చూసి మీరు మారిపోయారని మేము అనుకుంటున్నాం. కానీ మీరు అసలు ఏమాత్రం మారలేదు" స్టేషన్ ముందే ఉన్న బిల్లూకాకా వెంటనే కామెంట్ చేశాడు.

"మేము మారం బిల్లూకాకా... మాది ఎప్పుడైనా సరే ఒకే మాట ఒకటే పద్ధతి" అంటూ భుజం మీద ఉన్న మనిషిని కింద పడేశాడు గంగారాం. దెబ్బ ఏమంత గట్టిగా తగలకపోయినా బిల్లూకాకా మాటల్లో తన పట్ల కొంచెం సానుభూతి వ్యక్తం అవటాన్ని గమనించి, జాలి గొలిపే కంఠంతో కీచుగా అరిచాడు ఆ వ్యక్తి.

‘‘అన్నెం పున్నెం ఎరగని అమాయకుడిని... కాపాడండి... నన్ను రక్షించండి’’ అంటూ గగ్గోలుగా అరిచాడు.

ఏ ఎఫెక్ట్‌ని అతను కోరుకున్నాడో అది వెంటనే వచ్చేసింది. ‘‘ఎందుకు పట్టుకున్నారు అతన్ని? ఏం నేరం చేశాడని పట్టుకున్నారు?’’ గుమ్మానికి అడ్డంగా నిలబడి కోపంగా అడిగాడు బిల్లూకాకా.

చూస్తూ చూస్తూ ఉండగానే పాతికమంది పైగా అతని వెనుక ప్రత్యక్షం అయ్యారు.

‘‘చెప్పండి సాబ్... వాడిని ఎందుకు పట్టుకున్నారు?’’ అని వాళ్ళు కూడా అడగటం స్టార్ట్ చేశారు.

‘‘వాడు తోతాపురి సాబ్ దగ్గిర అప్పు తీసుకుని ఎగగొట్టి గట్టిగా అడిగేసరికి పొదల్లోకి పారిపోయాడు’’ ఓపికగా వివరించి చెప్పాడు గంగారాం.

‘‘అయితే దానికి మీకు ఏమిటి సంబంధం?’’ దురుసుగా అడిగాడు ఒక పౌరుడు. ‘‘తోతాపురి సాబ్ కంప్లయింట్ ఇచ్చాడు’’ చెప్పాడు గంగారాం.

‘‘అప్పు ఇచ్చినవాడే వసూలు చేసుకోవాలి... లేదా కోర్టుకి పోవాలి. పోలీసులకి ఈ ఇచ్చి పుచ్చుకోవటాలకి ఏమిటి కనెక్షను?’’ అడిగాడు బిల్లూకాకా.

వాడి మూలకంగా తాము పడిన బాధల్ని బయటపెట్టలేదు గంగారాం. బిల్లూకాకాని గాని, అతని వెనకాల వచ్చి నిలబడిన జనాన్నిగాని కన్విన్స్ చేయాలనే కోరిక కూడా ఆ సందర్భంలో అతనికి లేదు.

“మా ఇష్టం వచ్చినట్టు మేము చేస్తాం అడిగే అధికారం మీకు లేదు. మా పద్ధతులు మీకు నచ్చకపోతే అహ్మదాబాద్‌కి పోయి మా పై అధికారుల దగ్గిర కంప్లయింట్ చేసుకోండి. అంతే ఇక్కడ గొడవ వద్దు. వెళ్ళిపోండి” అంతవరకూ చాలా మర్యాదగా మాట్లాడిన వాడు కాస్తా సడన్‌గా రఫ్ అయిపోయాడు.

ఏదో అనటానికి నోటిని తెరిచి వెంటనే ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు బిల్లూకాకా.

అతనివంకా, షాడో వంకా అసహ్యంగా చూసి వెనక్కి వెళ్ళిపోయాడు. అతనితోపాటే వెళ్ళిపోతున్న పౌరుల వంక చూస్తూ గాఢంగా నిట్టూర్చాడు షాడో.

“కథ మళ్ళీ మొదటికి వచ్చింది గంగూ... మనమీద సానుభూతి ఏర్పడిందని అనుకున్నాను. కాని వీళ్ళు అసలు ఏమాత్రం మారలేదు” అన్నాడు.

“మారితే మనకేంటి మారకపోతే మనకేంటి? వీడిని ఏం చేద్దాం? తీసుకుపోయి తోతాపురికి అప్పగిద్దామా?” ఖంగుమంటున్న కంఠంతో అడిగాడు గంగారాం.

“ఆ పని మీవల్లకాదు... ఇప్పుడు వెళ్ళిపోయిన జనం ఇంకా చాలామందిని వెంటబెట్టుకు వస్తారు... తలుపులు పగలగొట్టి నన్ను విడిపించకపోతే అప్పుడు అడగండి” జరుగుతున్న పరిణామాలన్నిటినీ జాగ్రత్తగా అబ్జర్వ్ చేస్తున్న ఆ మనిషి వెంటనే అన్నాడు.

లాగిపెట్టి అతని భుజం మీద తన్నాడు షాడో.

గుడ్డబొమ్మలా గాలిలోకి ఒక్కసారిగా లేచి సరిగ్గా లాకప్ తలుపుల దగ్గిరపడ్డాడు ఆ మనిషి.

“లోపలికి నెట్టేయ్... తలంటి స్నానం చేయించిన తర్వాత తీసుకుపోయి అప్పగిద్దాం” కరకరమంటున్న కంఠంతో గంగారాంకి ఆర్డర్ ఇచ్చాడు.

“అయిపోయావురా బిడ్డా... మా గురువుగారికి కోపం తెప్పించావ్. ఇక నీ బతుకు కుక్క బతుకే” అంటూ ఆ మనిషిని లాకప్‌లోకి నెట్టి తలుపులు మూశాడు గంగారాం.

*  *  *  *  *

“జనంలో అసంతృప్తి చాలా ఎక్కువ అయింది. ఇంతకు ముందు మెచ్చుకున్న వాళ్ళే ఇన్‌స్పెక్టర్‌ని తిట్టిపోస్తున్నారు” చీకటి పడిన అరగంట తర్వాత తోతాపురి దగ్గిరికి వచ్చి రిపోర్ట్ చేశాడు ఒక అనుచరుడు.

“నేను భుజ్‌దాకా వెళ్ళాలి. జీప్‌ని రెడీ చేయమని చెప్పు” అప్పటికప్పుడు ఒక నిర్ణయానికి వచ్చినట్టు ఖచ్చితమైన కంఠంతో చెప్పాడు తోతాపురి.

“ఎటూ కాని వేళ ప్రయాణమా? ఎందుకు సాబ్?” అడిగాడు పక్కనే నిలబడి ఉన్న బద్రీనాథ్.

“ఇన్‌స్పెక్టర్ పని పట్టాల్సిన టైము దగ్గిరికి వచ్చేసింది. వాడి అధికారులకు చెప్పి ఈ నాటకాన్ని బట్టబయలు చేయించేస్తాను...” అన్నాడు తోతాపురి.

“మరి మనదగ్గిర లాక్కున్న సరుకు సంగతి గురించి ఏం చేస్తారు?” అడిగాడు బద్రీనాథ్.

“వీడు వట్టి మోసగాడని తేలితే నేరం వీడి మీదికే పోతుంది. రైలు దొంగతనాలు చేయిస్తోంది వీడేనని చెపుదాం. తిక్క కుదిరిపోతుంది...” చెప్పాడు తోతాపురి.

అవకాశం కోసం ఎదురుచూసి, అప్పటికప్పుడు ప్లేటు ఫిరాయించటంలో అతనికి ఉన్న నేర్పును చూసి మెచ్చుకోలుగా తల ఊపాడు బద్రీనాథ్. తానే స్వయంగా వెళ్ళి జీప్‌ని రెడీచేసి తీసుకువచ్చాడు.

*　　　*　　　*　　　*　　　*

తూర్పుదిక్కు తెల్లబడుతూ ఉండగా బింద్రా అంతా గప్పుమని వ్యాపించింది ఆ వార్త.

ఎప్పుడు చూసినా బురద నేలల్లోకి పోయి చాలా కష్టపడుతున్నట్టు కనిపించే తమ ఇన్స్‌పెక్టర్– నిజమైన ఇన్స్‌పెక్టర్ కాదుట... సంతోష్ అనే ఇన్స్‌పెక్టర్‌ని చంపి అతని స్థానంలో వచ్చిన పెద్ద మోసకారిట.

“ఎలా తెలిసింది నీకు? ఎవరు చెప్పారు?” ఆ వార్తని మోసుకు వచ్చి తనకు వినిపించిన పౌరుడిని అడిగింది తుల్జీబాయి. “ఒకళ్ళు చెప్పేదేముంది? రాత్రికి రాత్రి బయలుదేరి వచ్చేశారు బోర్డర్ సెక్యూరిటీ పోలీసులు. స్టేషన్ చుట్టూ నిలబడి ఇన్స్‌పెక్టర్‌ని విచారిస్తున్నారు” వివరించి చెప్పాడు ఆ పౌరుడు.

అప్పటికీ నమ్మకం కలగలేదు తుల్జీబాయికి. “మనిషి మహామకురు... తను పట్టిన కుందేలుకి మూడు కాళ్ళేనని మొండిగా వాదిస్తాడు... మోసకారి అంటే మాత్రం నమ్మకం కలగటం లేదు” అనుకుంటూ తనే స్వయంగా స్టేషన్ దగ్గిరికి బయలుదేరింది.

*        *        *        *        *

“సో... నువ్వు సంతోష్‌వి కాదు... నీకు, పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి ఎటువంటి సంబంధమూ లేదు... అంతేనా?” షాడో కూర్చునే కుర్చీలో కూర్చుని, ఠీవీగా అడిగాడు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ కమాండర్.

“అంతేనా గింతేనా అంటూ అనవసరమైన మాటలు మాట్లాడతారేమిటి సాబ్; అహ్మదాబాద్‌కి ఫోన్ చేసి వివరంగా చెప్పండి. వాడు ఎవరో వాళ్ళే తేలుస్తారు” అన్నాడు చెక్కబల్లమీద కూర్చుని ఉన్న తోతాపురి.

స్వయంగా వచ్చి ఆ స్టేషన్లో జరుగుతున్న మోసాన్ని నేర్పుగా కనిపెట్టి తమకు రిపోర్ట్ చేసినందుకు అతన్ని అభినందించి, ఆ విచారణ జరిగే సమయంలో అక్కడే ఉండనిచ్చారు భుజ్‌నించి అతనితో వచ్చిన అధికారులు.

“యస్... తోతాపురి సాబ్ చెప్పినట్టే చేద్దాం... అహ్మదాబాద్‌కి కబురు పంపిద్దాం...” అంటూ లేచాడు కమాండర్... అవతలగా ఉన్న వైర్లెస్ సెట్ దగ్గిరికి పోవాలని అతని ఉద్దేశ్యం.

“పనిలో పనిగా దొంగతనాల గురించి కూడా అడగండి... మొత్తం విషయాలన్నీ బయటికి వచ్చేస్తయ్” అన్నాడు వెంటనే తోతాపురి.

“నిన్న మీరు మా దగ్గిరికి వచ్చేముందు ఇతను పంపించాడని ఒక హంటర్ వచ్చాడు. చిత్తడి నేలలో దాచిపెట్టిన సరుకు గురించి రిపోర్టు చేశాడు. అదేమిటో తెలుసుకోవటానికి మా యూనిట్ ఒకటి అక్కడికి వెళ్ళింది. తిరిగి వచ్చిన తర్వాత విచారిస్తాం” అన్నాడు కమాండర్.

తన తెలివితేటలతో షాడోని నీట్‌గా పల్టీ కొట్టించగలిగినందుకు విపరీతంగా సంతోషిస్తున్న తోతాపురికి ఒక్కసారిగా కరెంట్ షాక్ తగిలినట్టు అయింది.

"చిత్తడి నేలల్లో సరుకు ఉన్నదా? నేను ఇక్కడ స్టేషన్లోనే ఉన్న సరుకు గురించి మాట్లాడుతున్నాను" అస్పష్టంగా అన్నాడు.

"అదే... దీన్ని గురించి కూడా తర్వాత మాట్లాడుకుందాం. ముందు అహ్మదాబాద్‌కి రిపోర్టు చేస్తాను" అంటూ వైర్‌లెస్ సెట్‌ని యాక్టివేట్ చేసే పనిలో బిజీ అయ్యాడు కమాండర్.

టేబిల్ దగ్గర చేతులు కట్టుకొని నిలబడి వున్న గంగారాం ఓరకంట చూశాడు షాడోకేసి.

"ఇక్కడ ఉండటం అనవసరం గురూ... జంప్ అయిపోదాం" అతనికి మాత్రమే వినిపించేటట్టు అన్నాడు.

చేతులు వెనక్కి పెట్టుకుని నిర్వికారంగా నిలబడి వున్న షాడోలో అతను కోరుకున్న మార్పు కనిపించలేదు.

"మాట్లాడవేంటి గురూ... మాయమైపోదాం"

"తొందరవద్దు... ఎంత దూరం పోతుందో చూద్దాం" స్టేషన్ వెలుపల ఎలర్ట్‌గా నిలబడి వున్న సెక్యూరిటీ గార్డుల వంక చూస్తూ అతనికి చెప్పాడు షాడో.

అదిగో అప్పుడు స్టేషన్ దగ్గరికొచ్చింది తుల్జీబాయి... "ఎంత నేరస్తుడు అయినా పరగడుపుతో నిలబెట్టి ప్రశ్నలు వేయటం పద్ధతి కాదు... నేను చాయ్

పంపిస్తాను.... తాగటానికి అనుమతి ఇవ్వండి'' అంటూ వైర్‌లెస్ సెట్ దగ్గర ఉన్న కమాండర్‌ని అడిగింది.

''వీళ్ళని లాకప్‌లో నెట్టిన తర్వాత పంపించు. ఇప్పుడు కాదు. వెళ్ళిపో'' అసహనంగా అంటూ తన పనిలో తను మునిగిపోయాడు కమాండర్.

అతను చెప్పినట్టు అవతలికి పోకుండా అలాగే నిలబడింది తుల్జీబాయి. ''మేము మోసగాళ్ళం అని వాళ్ళు చెపుతున్నారు కదా. ఇంకా మా గురించి ఆలోచించటం దేనికి?'' ఆమెని అడిగాడు గంగారాం.

''మీరు ఎటువంటి వాళ్ళయినా మా కుందూ మీద అభిమానం చూపించారు. నాకు అది చాలు... మీరు ఖాళీ కడుపులతో నిలబడడం నాకు నచ్చలేదు'' అంటూ బయటికి వెళ్ళిపోయింది ఆమె. అప్పుడే వైర్‌లెస్ సెట్లోనించి బయటికి వచ్చాయి మాటలు.

''ఇన్స్‌పెక్టర్ సంతోష్... లేరాయ్య?'' అంటూ...

గొంతు సవరించుకుని తను ఎవరో చెప్పాడు కమాండర్. తోతాపురి తన దగ్గరికి వచ్చి చేసిన రిపోర్టును గురించి చెప్పాడు ''ఇప్పుడు మేం బింద్రా స్టేషన్లోనే వున్నాం. నెక్ట్స ఏం చేయమంటారో చెప్పండి. ఇతన్ని అరెస్ట్ చేసి మాతోపాటు భుజ్‌కి తీసుకుపొమ్మంటారా?'' అని అడిగాడు.

''మీరు కాస్సేపు వెయిట్ చేయండి. ఈ మేటర్ని డిజిపిగారికి రిపోర్ట్ చేస్తాం. అతను తప్పించుకు పోకుండా జాగ్రత్తపడండి'' అంటూ కట్ అయింది అవతలి కంఠం.

"లాకప్‌లోకి నెట్టండి... తాళం సరిగ్గా వేయండి" అంటూ ఆర్డర్ ఇచ్చాడు కమాండర్.

వెంటనే కదిలారు నలుగురు గార్డులు. షాడో, గంగారాంలను నెట్టుకుంటూ లాకప్‌లోకి పంపించి, తలుపులకు తాళం వేశారు. "జంప్ అయిపోదామని అన్నాను. ఏనాడూ వినిపించుకోలేదు. ఇప్పుడు చూడు..." చిరుకోపంతో అన్నాడు షాడోతో గంగారాం.

"మీరే పెద్ద దొంగలు... మీరు నన్ను లాకప్‌లోకి నెడితే ఆ దేవుడు చూస్తూ ఊరుకోడు..." సన్నగా ఎత్తి పొడిచాడు ఆ లాకప్‌లోనే ఉన్న మనిషి.

అంతవరకూ అతన్ని గురించి మర్చిపోయారు వాళ్ళిద్దరూ. ఉలిక్కిపడి అతనివంక చూశాడు గంగారాం.

"గుడ్డు ఉరమద్దు. సాయంత్రమయ్యేసరికి మీరిద్దరూ భుజ్ పట్టణంలో ఉన్న జైల్లోకి పోతారు... అక్కడి వార్డెన్ పరమ కిరాతకుడు. మీ ఎముకల్ని విరగగొట్టి సున్నంలో కలిపేయిస్తాడు" నవ్వుతూ అన్నాడు ఆ మనిషి.

పిడికిలి బిగించి ఫెడీమని కొట్టాడు గంగారాం.

"చచ్చిపోయాను బాబోయ్" బిగ్గిరిగా అరిచాడతను.

మూడే మూడు అంగల్లో లాకప్ తలుపుల దగ్గిరికి వచ్చేశాడు కమాండర్.

"ఏమయింది? ఏం జరుగుతోంది ఇక్కడ?" తలుపులకున్న ఊచల్ని పట్టుకుని లోపలికి తొంగి చూస్తూ అడిగాడు స్పీడ్‌గా వచ్చిన కమాండర్.

“పిప్పి పన్ను ఒకటి అదేపనిగా నొప్పి పుడుతోందట సాబ్... ఏదో ఒకటి చేసి ఆ బాధని తగ్గించమని ఒకటే గొడవ, నాకు తెలిసిన వైద్యం చేస్తున్నాను” మహా వినయంగా చెప్పాడు గంగారాం.

కనులు చిట్లించి చూశాడు కమాండర్. పిప్పి పన్నుకు వైద్యం జరిగిందో జరగలేదో అతనికి తెలీలేదు గాని, అదే పనిగా ఆ మనిషి చూసుకుంటున్న ఒక దంతం మాత్రం కనిపించింది. ఫ్రెష్‌గా ఊడిపోయినట్లు రక్తంతో మలినమై ఉంది అది. ఆ మనిషి నోరు కూడా అదే రక్తం...

“అబద్ధం అబద్ధం చెపుతున్నాడు సారూ... కావాలని నా పళ్ళమీద కొట్టాడు. దంతం ఊడి చేతిలో పడింది” భరింపరాని బాధతో మెలికలు తిరుగుతున్నట్టు అయిపోతూ రిపోర్ట్ చేశాడు ఆ వ్యక్తి.

“ఎవరు నువ్వు?” కనులు చిట్లిస్తూ అడిగాడు కమాండర్.

“అమాయకుడిని సారూ... ఈ ఇన్స్‌పెక్టరే కావాలనే తీసుకువచ్చి ఇక్కడ పడేశాడు” అన్నాడు ఆ వ్యక్తి.

అనుమానంగా షాడోకేసి చూశాడు కమాండర్.

“ఇతని మాటలకేంగాని, అక్కడ కూర్చున్న పెద్దమనిషిని అడగండి. ఆయన ఇచ్చిన రిపోర్టు ప్రకారమే ఇతన్ని తీసుకురావటం జరిగింది” షాడోకి బదులుగా తను సమాధానం చెప్పాడు గంగారాం.

“అబద్ధం... అంతా అబద్ధం... అసలు ఆ లాకప్‌లో ఉన్నది ఎవరో నాకు తెలియనే తెలియదు...” సంగతి అర్థమై కీచుకంఠంతో బిగ్గిరిగా అరిచాడు తోతాపురి.

“అంటే తను మీ దగ్గిర అప్పు తీసుకుని, తీర్చమని అడిగితే పొదల్లోకి పారిపోలేదా?” అడిగాడు గంగారాం.

“పారిపోవటమా పాడా... అసలు వీడెవడో నాకు తెలియదని మొదట్నుంచీ చెపుతున్నాను కదా” గుడ్లు ఉరుముతూ స్పీడ్‌గా అన్నాడు తోతాపురి.

అప్పటికీ తొందరపడలేదు గంగారాం “నిజంగానే వాడు మీ దగ్గిర అప్పు తీసుకున్న మనిషి కాదా?” అతనివైపు చూస్తూ రెట్టించి అడిగాడు.

“కాదు. కానేకాదు. అసలు వాడికి, నాకెలాంటి లావాదేవీలు లేవు. ఇది కూడా మీరు చేస్తున్న ఇంకో మోసం...” పెద్దగా అరిచాడు తోతాపురి. ఎవరికీ తెలీని ఇంకో పెద్ద రహస్యాన్ని కూడా తనే బయట పెట్టినట్టు విజయగర్వంతో వెలిగిపోవటం మొదలెట్టింది అతని వదనం.

“విన్నావా? నువ్వు తోతాపురి సారు దగ్గిర అప్పు తీసుకులేదుట... నీకు ఆయనకి మధ్య ఎటువంటి లావాదేవీలు లేవుట” నేలమీద చతికిలపడి ఉన్న మనిషితో వివరంగా చెప్పాడు గంగారాం.

చెప్పిన వెంటనే అర్థము కాలేదా మనిషికి, అతనలా ఎందుకు అంటున్నాడో. “నా దవడ పోటెత్తిపోతోంది. నా కళ్ళు గిర్రున తిరిగి పోతున్నయ్...

నేను ఎంతోసేపు బతకను. నా పని అయిపోయింది" అని రాగాలు తీయబోతూ చటుక్కున కళ్ళు పెద్దవి చేశాడు.

"అవును బే... ఇంక నువ్వు పొదల్లోకి పారిపోవాల్సిన అవసరం లేదు. ఇంతమంది ముందు నువ్వు అప్పు తీసుకోలేదని ఒప్పుకున్న తరువాత తోతాపురి సారు ఇంక నిన్నేమీ చేయలేడు. ఆనందంగా వెళ్ళిపో..." అంటూ లాకప్ వెలుపలే నిలబడి వున్న కమాండర్‌కేసి చూశాడు గంగారాం. "వదిలేయండి సాబ్ వీడిని" అని సలహా ఇచ్చాడు.

విప్పారిత నేత్రాలతో చూస్తున్న కమాండర్, వెంటనే తలుపులు తెరిపించి ఆ మనిషిని బయటికి రానిచ్చాడు.

తనకు తగిలిన దెబ్బను తలుచుకుని ఏడ్వాలో, తనకు విముక్తి లభించినందుకు ఆనందించాలో– ఏం చేయాలో తెలియక అయోమయంగా చూస్తూ తోతాపురి ఎదుటినించే స్టేషన్ బయటికి పోయాడా మనిషి.

పరిచయం ఉన్న జనం అతన్ని చూసి ఆనందంతో కేకలు పెట్టారు. పరిచయం లేనివాళ్ళు కూడా అరిచి ఆ సంతోషాన్ని పంచుకున్నారు.

దొంగ ఇన్స్‌పెక్టర్‌ని అధఃపాతాళానికి తొక్కేస్తున్నాననుకుంటున్న తోతాపురికి గొంతులో ఏదో గులకరాయి అడ్డంపడిన సెన్సేషన్ కలిగింది.

అయినా చేయగలిగింది ఏముంది గనక?

"ఓ.కే. తోతాపురి సాబ్... మీరు ఇంటికి పోయి విశ్రాంతి తీసుకోండి. అహ్మదాబాద్‌నించి వివరాలు రాగానే మేము వీళ్ళని ఇక్కడినించి భుజ్‌కు

తీసుకుపోతాం. ఇక్కడి సరుకును కూడా తీసుకుపోయి రైల్వే పోలీసులకి అప్పచెపుతాం'' తోతాపురి ముఖంలో కనిపిస్తున్న ఆవేదనను– అలసటగా భావించి సానుభూతి సూచించే మాటలు చెప్పాడు కమాండర్.

మరింతగా వడిలిపోయింది తోతాపురి ముఖం. ఆ వ్యవహారం ఏమిటో పూర్తిగా తేలేవరకూ అక్కడే ఉండాలని అనుకుంటున్నాడు అతను.

''అవసరం లేదు సార్... అహ్మదాబాద్ నుంచి వచ్చే వివరాలకు, మీకు సంబంధంలేదు. మేము చూసుకుంటాం. మీరు వెళ్ళిరండి'' అంటూ అతన్ని కూర్చున్న చోటునుంచి లేపి, స్టేషన్ బైటికి పంపించాడు కమాండర్.

''ఇదేంటిరా? ఇట్టా అయిందేంటి? ఆ ఇన్స్‌పెక్టర్‌గాడి అంతు చూడాలని ఏదో మాట్లాడితే మళ్ళీ మనకే దెబ్బ తగిలిందేమిటి?'' ఊరి ప్రజల మధ్య ఆనందంగా నిలబడి ఉన్న మనిషిని చూస్తూ కసితో రగిలిపోతూ బద్రీనాథ్‌తో అన్నాడు తోతాపురి.

''ప్రాణాలకు తెగించి దోచుకొచ్చిన సరుకంతా పోలీసుల పరమైంది. ఆ సరుకును మోసే గాడిదలు కూడా మనకి కాకుండా పోయినయ్. ఇప్పుడు అప్పు తీసుకున్న వాడు కూడా తప్పించుకున్నాడు... చాలా కష్టం వచ్చేసింది సాబ్...'' సానుభూతిగా అన్నాడు బద్రీనాథ్.

తన మనిషి రెడీగా నిలబెట్టిన టాంగాలో దర్జాగా కూర్చుని పోనియ్ అన్నట్టు తలూపాడు తోతాపురి. అరనిముషంలో అక్కడినించి వెళ్ళిపోయాడు.

*  *  *  *  *

పెద్ద కంచులోటా నిండా సెగలు వెలువరిచే చాయ్‌ని పోసింది తుల్జీబాయి. నాలుగు మట్టిముంతల్ని పట్టుకుంది. చక్కగా కాల్చిన రొట్టెల్ని, రుచికరమైన కూరని వేరే పాత్రలో పెట్టి స్టేషన్ దగ్గిరికి వచ్చింది.

“లాకప్‌లో ఉన్నవాళ్ళు బయటినించి వచ్చిన పదార్థాల్ని తీసుకోకూడదు” వెంటనే అబ్జక్ట్ చేశాడు ఒక సెక్యూరిటీ గార్డు. అతని వంక చురుకుగా చూసి, కంచులోటాలో నుంచి చాయ్‌ని ఒక ముంతలోకి వంపి కమాండర్‌కి అందించింది తుల్జీబాయి “తాగి చూడండి. విషం ఏదైనా కలిపానో లేదో చెప్పండి” అన్నది తుల్జీబాయి.

రెండు గుటకలు వేసేసరికి ఆవరించుకుని ఉన్న అలసటంతా చేత్తో తీసేసినట్టు మాయమయ్యేసరికి, అధికంగా అబ్జెక్ట్ చేయకుండా తల ఊపాడు కమాండర్. లాకప్ తలుపుల్ని ఇంకోసారి తెరిపించాడు.

“మమ్మల్ని మోసగాళ్ళని కమాండర్ గట్టిగా చెపుతున్నప్పుడు నువ్వు మాకోసం రావటం మంచిది కాదు గదా” అన్నాడు షాడో ఆమె లోపలికి రాగానే.

“అదేంటో నాకు తెలియదు. మొగుడు పోయిన కత్లీని దబ్బిలిచ్చి ఆదుకున్నావ్. మా అవిటి కుందూకి ఆపరేషన్ చేయించటానికి సిద్ధం అయినావ్. మనిషి అన్న తర్వాత మంచి గుణాలు, చెడు గుణాలు రెండూ ఉంటయ్. నాకు నీ మంచి గుణాలు మాత్రమే కనిపిస్తున్నయ్” అంటూ తను తీసుకువచ్చిన రొట్టెలను తినమన్నట్టు వారిముందు పెట్టింది తుల్జీబాయి.

కంచులోటాలో ఉన్న చాయ్‌ని ముందుగా తాగేశారు స్నేహితులు. తర్వాత వారి ముందు పెట్టిన రొట్టెల్ని మెల్లగా తినటం మొదలుపెట్టారు.

"మా కుందూగాడు ఇక్కడినించి వెళ్ళిన తర్వాత ఏమయిందీ ఇంకా తెలియలేదు. వాడికి ఆపరేషన్ జరిగి ఉంటుందా?" అడిగింది తుల్జీబాయి.

"నువ్వు ఒక పని చెయ్యి. ఇప్పుడో ఇంకాస్సేపట్లోనో అహ్మదాబాద్‌నించి కమాండర్‌కి మెస్సేజి వస్తుంది. ఆయన మాట్లాడేప్పుడు పక్కనే నిలబడి, గట్టిగా అడుగు" నవ్వుతూ చెప్పాడు గంగారాం.

అతను ఆ మాటలు అంటూ ఉండగానే- గరగరమనే శబ్దంతోపాటు "హాల్లో... హాల్లో..." అంటూ మాటలు కూడా వినవచ్చాయి వైర్‌లెస్ సెట్లోనించి.

తినడం ఆపకుండా షాడోకేసి చూశాడు గంగారాం.

"ఎటువంటి పరిస్థితి ఎదురయినా తట్టుకోగలడు. మనకి దెబ్బ తగలకుండా రక్షించగలడు. ఆ మనిషికి ఆ నేర్పు ఉంది. అలా చేసే అధికారం కూడా ఉంది. కంగారుపడకు" చిన్నగా నవ్వాడు షాడో.

"హల్లో... కమాండర్‌ని మాట్లాడుతున్నాను" అంటూ వైర్‌లెస్ సెట్ దగ్గిరికి పోయిన కమాండర్ దగ్గిరికిపోయి అతన్ని చూస్తూ నిలబడింది తుల్జీబాయి.

"హలో కమాండర్... నీతోపాటు ఎవరెవరున్నారు అక్కడ?" అడిగింది అవతలి కంఠం.

అర్థం అయింది కమాండర్‌కి.

తలతిప్పి తన వారివంక చూశాడు అతను. వాళ్ళకి కూడా అవగతమైపోయింది గబగబా స్టేషన్ వెలుపలికి పోయి, ముఖద్వారాన్ని మూశారు.

“నువ్వు లాకప్‌లోకి వెళ్ళు తల్లీ” తుల్జీబాయికి చెప్పాడు కమాండర్. ఇష్టం లేకపోయినా వెనక్కి వెళ్ళి లాకప్ తలుపుల్ని ఆనుకుని నిలబడింది ఆమె.

“రైలు దొంగతనాలు మొదలైన తర్వాత ఎప్పుడయినా దోచుకోబడుతున్న సొత్తును రికవర్ చేయటం జరిగిందా?” కమాండర్‌ని అడిగింది అవతలి కంఠం.

తడుముకోలేదు అతను.

“లేదు సార్. ఇప్పుడే మొదటిసారిగా బోలెడంత సరుకు స్వాధీనం అయింది” అన్నాడు.

“ఓకే... ఇంపర్సనేషన్ వేసి అందర్ని మోసం చేయాలని అనుకుంటున్న ఆ మోసగాడు రైల్వే దొంగతనాలకి వత్తాసు పలకాల్సిందిపోయి, ఆ సొత్తునంతా మీకు అప్పగించటం చాలా చిత్రంగానూ, వింతగానూ అనిపించటం లేదా?” అడిగింది అవతలి కంఠం.

“అవును. నాకూ అదే వింత అనిపించిన మాట వాస్తవం” నిజాయితీగా ఒప్పుకున్నాడు కమాండర్.

“నువ్వు తెలివైనవాడివి. ఆ తెలివినే ఉపయోగించి ఆలోచించు” నవ్వుతూ చెప్పింది అవతలి కంఠం.

“అంటే... అంటే అర్థం ఏమిటి సార్? ఇదంతా కావాలనే మీ డిపార్ట్‌మెంట్ ప్లాన్ చేసిందా? ఇన్స్‌పెక్టర్ సంతోష్ హత్య చేయబడ్డాడని తెలిసి మీరే ఇప్పుడున్న మనిషిని పంపిచారా?” ఆశ్చర్యంగా అడిగాడు కమాండర్.

“సరిహద్దుల దగ్గిర జరిగే అక్రమాన్ని ఒకదాన్ని ఆపింది ఎవరు?” సీరియస్‌గా అడిగింది అవతలి కంఠం.

“ఇతనే... ఇతనికి మా స్పేర్ యూనిఫాం ఒకటి ఇచ్చాము...” చెప్పాడు అతను.

“మరి ఇంకా గింజుకోవడం దేనికి?”

“మరి ఈ తోతాపురి?”

“నోరు పెట్టుకుని గట్టిగా అరిచే వాళ్ళందరూ నిజాయితీపరులనేనా నీ ఉద్దేశ్యం?”

“అర్థం అయింది సార్... ఇప్పుడు నేనేం చేయ్యాలి?”

“అతన్నే అడుగు... అతను చెప్పినట్టు చెయ్...”

“అలాగే సార్... థాంక్యూ వెరీమచ్” అంటూ కనెక్షన్‌ని కట్ చేయబోతుండగా తలుపుల దగ్గిర ఉన్న తుల్జీబాయిని ముందుకు నెట్టాడు గంగారాం.

“మా కుందూ? మా కుందూగాడు ఇప్పుడు ఏమైనాడు? వాడి పరిస్థితేమిటి? వాడికి ఎలా వుంది?” గట్టిగా అడిగింది ఆమె– అతని దగ్గిరికి పోతూ.

అక్కడే నిలబడిచూస్తున్న కమాండర్ రిపీట్ చేయాల్సిన అవసరం లేకపోయింది ఆ మాటల్ని.

“కుందూకి ఆపరేషన్ జరిగింది. కాలు బాగయినట్టే. ఒకటి రెండు రోజుల్లో బింద్రా వచ్చేస్తాడు” నవ్వుతూ విషయం చెప్పింది అవతలి కంఠం.

ఆనందాన్ని అణుచుకోవటం తుల్జీబాయికి అసాధ్యం అయిపోయింది ఆ సందర్భంలో–

అదేపనిగా వెలువడుతున్న కన్నీటిని పమిటెచెంగుతో అద్దుకుంటూ స్టేషన్ బయటికి పరిగెత్తిందామె.

లోపల వున్న గార్డులందరూ బయటికి రావటం, తలుపుల్ని మూయటం ఆశ్చర్యాన్ని, అనుమానాన్ని కలిగించాయి కాబోలు– అవతలికి పోకుండా ఇంకా అక్కడే గుమిగూడి ఉన్నారు బింద్రా జనం.

“ఇదిగో... ఇప్పుడే చెపుతున్నాను. అందరూ వినండి... మన ఇన్స్‌పెక్టర్ సాబ్ మనసు బంగారం... అతను చేసే పనులు మనకి నచ్చకపోవచ్చు... పనిచేసే పద్ధతి వింతగా ఉండచ్చు. కాని అన్ని పనులు మనకి సక్రమంగానే ఉంటయ్... అర్థం అయిందా?” అందర్నీ అడిగింది తుల్జీబాయి.

“స్టేషన్లో నీకు ఎంత ముట్టచెప్పాడు?” కోరగా ఆమెనే చూస్తూ అడిగాడు ఒక పౌరుడు.

పిడికిలి బిగించి ఫెడీమని కొట్టాలన్నంత కోపం తుల్జీబాయిని ఆవరించుకుంది ఒక్కసారిగా. మళ్ళీ అంతలోనే అంతం అయిపోయిందా కోపం.

కారణం అతని మీద చెయ్యి ఎత్తితే మిగిలిన వారందరూ తనమీద దాడి చేస్తారన్న భయంకాదు.

చెమట ముఖాలతో, బురద కొట్టుకున్న దుస్తులతో అలసటగా అడుగులు వేస్తూ వచ్చిన హంటర్స్ అనేకమంది ఆమెను చూసి అక్కడ ఆగిపోవటం.

వాళ్ళు చూస్తూ వుండగా తను ఎవరిమీదైనా చెయ్యి ఎత్తితే– ఎత్తిన మరుక్షణం రంగంలోకి దిగిపోతారు వాళ్ళు. అవతలి వాళ్ళని తుక్కుకింద కొట్టి పారేస్తారు.

"మీకు దేవుడు వచ్చి చెప్పినా ఏమీ అర్థంకాదు. మీరు మారరు. మారాలని కూడా కోరుకోరు" అసహ్యంగా అంటూ తన హోటల్ దగ్గిరికి వెళ్ళిపోయిందామె.

"తుల్జీబాయి కోపంగా వెళ్ళిపోతోంది. మీలో ఎవరయినా ఆమెను ఏదయినా అన్నారా?" విషయం అర్థంకాని హంటర్స్ నాయకుడు ఆ పౌరుల్ని అడిగాడు.

సమాధానం చెప్పటానికి భయపడి, ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు జనం అక్కడినించి.

*　　*　　*　　*　　*

ఆపరేషన్ అయిన తర్వాత ఒకసారి మెలకువ వచ్చిన తర్వాత మాట్లాడి మళ్ళీ నిద్రలోకి జారిపోయిన కుందూ– ఏకగ్రీవంగా పదిగంటలు నిద్రలోనే గడిపి, చివరికి మెల్లిగా కళ్ళు తెరిచాడు.

"యువ్వార్ క్వయిట్ ఆల్‌రైట్... ఇందాక డాక్టరుగారు వచ్చి వెళ్ళారు. నీ కాలు చాలా ఫాస్ట్‌గా బాగుపడుతోందిట... డాక్టర్‌గారికే ఆశ్చర్యం వేసింది" నవ్వుతూ చెప్పింది పక్కనే కూర్చుని ఉన్న నర్సు.

అంతకుముందు మాట్లాడిన నర్సు కాదు...

"మీరు... మీరు..." అంటూ తడబడుతున్న అతన్ని చూసి చాలా అందంగా నవ్విందామె.

"ఇది చాలా పేరు ప్రతిష్టలున్న హాస్పిటల్. ప్రతి ఆరుగంటలకీ డ్యూటీలు మారతాయి... ఇంకో రెండు గంటల్లో నేను కూడా డ్యూటీ దిగిపోతాను" అంటూ చెప్పింది.

"నేను మా ఇన్స్‌పెక్టర్‌సాబ్‌తో ఇప్పుడు మాట్లాడటానికి వీలుంటుందా?" అడగలేక చివరికి అడుగుతున్నట్టు అడిగేశాడు కుందూ.

"ఎందుకు వీలుండదు? ఫోన్ చేయచ్చు. నెంబర్ చెప్పు" ఆ గదిలోనే ఉన్న టెలిఫోన్ దగ్గిరికిపోయి, దాన్ని బెడ్ దగ్గిరికి తీసుకువస్తూ అన్నది ఆమె.

"ఫోన్ నెంబరు నాకు తెలియదు. అసలు మా ఊళ్ళో పోస్టాఫీసులో తప్ప ఇంకెక్కడా ఫోన్లు లేవు... మళ్ళీ తోతాపురి సాబ్ దగ్గిర ఇంకోటి ఉంది" అన్నాడు కుందూ.

"అయితే ఒక్క నిముషం ఆగు" అంటూ ఏదో నెంబర్‌ని తిప్పి ఎవరితోనో మాట్లాడింది ఆమె.

అవతలివారు చెప్పిన నెంబర్‌ని చిన్న కాయితం మీద రాసుకుని, తర్వాత ఆ నెంబరుకి ఫోన్ చేసింది.

రెండు నిముషాల తర్వాత కనెక్షన్ దొరికింది. "హల్లో ఎవరూ? నేను పోస్టుమాస్టర్‌ని మాట్లాడుతున్నాను" అంటూ వినిపించింది ఒక కంఠం.

"మీ పోస్ట్‌మాస్టరు మాట్లాడుతున్నాడు...." అంటూ రిసీవర్‌ని కుందూ చేతికి అందించామె.

అంతకుముందు ఎన్నడూ ఫోన్లో మాట్లాడింది లేకపోవటంతో విపరీతంగా భయపడ్డాడు కుందూ.

"మరేం పరవాలేదు... మాట్లాడు" అంటూ కుందూను మాట్లాడేందుకు ప్రోత్సహించింది ఆమె.

"హల్లో హల్లో" అంటూ అదేపనిగా అరుస్తున్న పోస్ట్‌మాస్టర్‌కి తనెవరో చెప్పాడు కుందూ.

"ఒరేయ్ కుందూ... ఎలా ఉన్నావురా? ఇక్కడ అందరూ నీ గురించే మాట్లాడుకుంటున్నారు... ఆపరేషన్ అయిపోయిందిటగా... తుల్జీబాయి అందరికీ చెపుతోంది" ఆనందంగా అన్నాడు పోస్ట్‌మాస్టర్.

"నేను ఇన్స్‌పెక్టర్ సాబ్‌తో మాట్లాడాలి" అన్నాడు కుందూ. సడన్‌గా వినకూడని మాట ఏదో చెవుల పడినట్టు కామ్ అయిపోయింది పోస్ట్‌మాస్టర్ కంఠం.

"అరేయ్ కుందూ... ఆ ఇన్స్‌పెక్టర్ నిజమైన ఇన్స్‌పెక్టర్ కాదుటరా... దొంగ ఇన్స్‌పెక్టరట.... భుజ్‌నించి సెక్యూరిటీ వాళ్ళు వచ్చి, అరెస్టు చేసి తీసుకుపోయారు" నిదానంగా విషయాన్ని వివరించాడు.

"ఎప్పుడు? ఎప్పుడు??" ఆత్రుతగా అడిగాడు.

"ఇందాకే రెండు గంటలైంది. అంతా గందరగోళం" అంటూ తోతాపురి భుజ్ వెళ్ళి బోర్డర్ సెక్యూరిటీ వాళ్ళని వెంటబెట్టుకు రావటం దగ్గిర్నించి తుల్జీబాయి వెళ్ళి చాయ్ తాగించటం వరకూ వివరంగా చెప్పాడు పోస్ట్‌మాస్టర్.

"బిల్లూకాకా ఇప్పుడు ఏమంటున్నాడు" పోస్ట్‌మాస్టర్‌ను గద్గద స్వరంతో అడిగాడు కుందూ.

"మోసగాడనే అంటున్నాడురా..." చెప్పాడు పోస్ట్ మాస్టర్. ఎంత బిగపట్టుకున్నా ఆగకుండా కుందూ బుగ్గలమీదికి వచ్చేశాయి కన్నీళ్ళు. రిసీవర్‌ని ఫోన్‌మీద పెట్టేసి మొఖాన్ని చేతుల్లో దాచుకున్నాడు అతను.

"ఏమయింది కుందూ? చెడు వార్త ఏదయినా తెలిసిందా?" సానుభూతిగా అడిగింది నర్సు.

"నాలాంటివాడికి సహాయం చేసే మనిషి మోసగాడు అంటే నువ్వు నమ్ముతావా?" కన్నీటితో మలినమైన ముఖాన్ని ఎత్తి అడిగాడు కుందూ.

"నమ్మనుగాక నమ్మను" చెప్పిందామె.

''మా ఊళ్ళో వాళ్ళందరికీ పిచ్చెక్కింది. మా ఇన్స్పెక్టర్ సాబ్ మోసగాడుట. ఎవరినో చంపి, ఆ మనిషి స్థానంలో మోసం చేయటానికి వచ్చాట్ట'' అంటూ పోస్ట్‌మాస్టర్ తనకు చెప్పిన మాటలన్నిటినీ ఆమెకు చెప్పాడు.

''ఇవేవీ నిజం అయివుండవు. ఎక్కడో ఏదో పొరపాటు జరిగివుంటుంది. ఇవాళో రేపో నిజం ఏమిటో తప్పకుండా బయటపడి తీరుతుంది. నువ్వు బాధపడకు. రేపు ఇంకోసారి ఫోన్ చేద్దాం'' అంటూ ధైర్యం చెప్పిందామె.

తల ఊపి ముఖం తుడుచుకున్నాడు కుందూ.

*   *   *   *   *

''నాకు అంతా అయోమయంగా ఉంది. ఇన్స్పెక్టర్ సంతోష్‌ని చంపి, అతని స్థానంలో వచ్చానని తోతాపురి ఇచ్చిన కంప్లయింట్‌ని నువ్వు కాదని అనటం లేదు...

అలాగని ఇంతవరకూ నువ్వు చేసిన పనులేవీ ఒక మోసగాడు చేసేవి కావు... ఎందుకని ఇలా?'' బింద్రాని దాటి పొదల్లోకి పోయిన వెంటనే షాడోని పరిశీలనగా చూస్తూ అడిగాడు కమాండర్.

''అహ్మదాబాద్‌నించి మీకు వచ్చిన వివరాలు ఏమంటున్నాయి?'' నవ్వుతూ అడిగాడు షాడో.

''నువ్వు పోలీస్ మనిషివే అంటున్నాయి, కావాలని చేస్తున్న పనులే అంటున్నాయి'' అన్నాడు కమాండర్.

"మరి ఇంకా సందేహాలు దేనికి?" అంటూ వేన్ వెనుక భాగంలోకి వాలి కళ్ళుమూసుకున్నాడు షాడో.

మరో రెండు కిలోమీటర్ల దూరం పోగానే సడన్‌గా డ్రైవర్‌కి సైగ చేశాడు కమాండర్. బ్రేకుమీద కాలువేసి ఒక్కసారిగా అదిమాడు డ్రైవర్.

బురదనేలలో పన్నెండు అడుగుల దూరం జారుతూ పోయి ఆగింది వేన్. "ఆల్‌రైట్... నువ్వు మోసగాడివి కాదని క్లీన్ సర్టిఫికేట్ ఇవ్వమని నాకు ఎవరూ చెప్పలేదు. నిన్ను అరెస్టు చేసి భుజ్ జైలుకు పంపమని కూడా చెప్పలేదు... అన్ని విషయాలు నా విజ్ఞతకే వదిలివెయ్యబడ్డాయి" అంటూ వేన్‌లో నించి దిగాడు కమాండర్.

"మీ విజ్ఞత ఎటువంటి డెసిషన్ తీసుకోమంటుంది?" పరిశీలనగా చూస్తూ అడిగాడు గంగారాం.

"మీ దారిన మిమ్మల్ని పోనిచ్చి చేతులు దులుపుకోమంటోంది. ఎవరైనా అడిగితే మమ్మల్ని ఏమార్చి పారిపోయినట్టు చెప్పమంటోంది" అన్నాడు.

"ఎవరూ అడగకపోతే" రెట్టించాడు గంగారాం.

'ఏదీ జరగనట్టు కామ్‌గా మా పనులు మమ్మల్ని చేసుకోమంటోంది" నవ్వుతూ అన్నాడు కమాండర్.

చెంగున వేన్‌లోనించి కిందికి దూకి బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాడు గంగారాం. అతని వెనుకే నెమ్మదిగా కిందకు దిగాడు షాడో. రెండు క్షణాలాగి,

అతని వంక ఏదోలా చూశాడు కమాండర్. "మీరు వేరేగా అనుకోకపోతే ఒక మాట అడుగుతాను, సమాధానం చెప్తారా?" అని అడిగాడు.

"అడగండి" అన్నాడు గంగారాం.

"తోతాపురి ఇచ్చిన కంప్లయింట్ సామాన్యమైంది కాదు. ఒక పోలీస్ ఆఫీసర్‌ని చంపి ఇంపర్సనేషన్ చేయటం అంటే జీవితకాలం జైల్లో ఉండాల్సినంత నేరం. ఆ మాట చెపితే అహ్మదాబాద్‌లో అధికారులు కొంచెంగా కూడా కంగారు పడలేదు. మీమీద పూర్తి నమ్మకం ఉన్నట్టు చకచకా మాట్లాడేశారు" అంటూ ఆగాడు కమాండర్.

"ఇంతకీ మీరు అడగదలుచుకున్నది ఏమిటి?" అతనిని వెంటనే అడిగాడు గంగారాం.

"ఎవరు మీరు? పోలీస్ డిపార్ట్‌మెంటేనా? వేరే ఏదైనా ఆర్గనైజేషనా?" అడిగాడు కమాండర్.

ఒకరివంక ఒకరు ఆశ్చర్యంగా చూసుకుని తమలో తాము నవ్వుకున్నారు స్నేహితులు.

"ఆ విషయం బయటపెట్టే అధికారం మాకు లేదు... క్షమించాలి" సీరియస్‌గా అన్నాడు గంగారాం.

"ఓ.కే. ఓకే... ఏదో కుతూహలంకొద్దీ అడిగాను. ఇట్సాల్‌రైట్. ఇంక మేము మూవ్ అవుతాము..." అంటూ వేన్‌లో కూర్చున్నాడు కమాండర్.

బురద జల్లుల్ని రేపుతూ దూసుకుపోయింది వేన్. క్లోజ్‌గా దాన్ని అనుసరించింది– మిగిలిన గార్డులు కూర్చున్న రెండో వేన్. దానివెనుకే కదిలింది గంగారాం తీసుకువచ్చి స్టేషన్‌లో పెట్టిన దొంగసరుకు.

“తోతాపురిని మనం ఏమీ చేయలేకపోయాం... సరైన ఆధారాలు మనకి దొరక్కముందే వాడు దెబ్బకొట్టాడు” తోతాపురిని తల్చుకుంటూ కచ్చగా అన్నాడు గంగారాం.

“వాడిని కాస్సేపు వదిలెయ్... బింద్రాని వదిలి ఎక్కడికీ పోలేడు... ముందు మనం అర్జంటుగా ఇంకో యాంగిల్‌లో పనిచేయాలి...” సిగరెట్‌ను లైటర్‌తో వెలిగించుకుంటూ అన్నాడు షాడో.

“ఇంకో యాంగిలా? అదేమిటి?” ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు గంగారాం.

“చిన్న చితకా రైలు దొంగతనాల గురించి అదేపనిగా కంగారుపడే మనిషికాదు మనల్ని గురించి ఆ కమాండర్‌కి మంచిగా చెప్పిన పెద్ద మనిషి” సిగరెట్ పొగని గుండెలనిండా పోల్చుకుంటూ అన్నాడు షాడో.

“అట్టా మాట్టాడతావేంటి గురూ.... పని కట్టుకుని బింద్రా వచ్చి రైల్వే వ్యవస్థ ఎటువంటిదో మనకి చెప్పాడు. ఏదో ఒకటి చేసి ఈ గొడవకి బ్రేక్ వెయ్యమన్నాడు. మర్చిపోయావా?” ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు గంగారాం.

“ఆ మాట నిజమే అయినా ఆయన ఉద్దేశ్యం వేరేగా ఉంది. రైలు దొంగతనాల్ని అడ్డం పెట్టుకుని ఇంకేదైనా గొడవ జరుగుతుందేమో

తెలుసుకోవటానికి ఆయన అలా మాట్లాడాడు. దొంగతనాల తీగెని లాగితే వేరే ఇంకేదో డొంక కదులుతుందని ఆయన విశ్వాసం'' అన్నాడు.

''అది నీకు అర్థం అయిందేమో– నాకు మాత్రం బుర్రకి ఎక్కలేదు'' నిదానంగా అన్నాడు గంగారాం.

''మరేం పరవాలేదు. ఇప్పుడు మనం పనిచేయాల్సిన యాంగిల్ అదే'' కామ్‌గా అన్నాడు షాడో.

అలవాటు ప్రకారం యాంత్రికంగా తల ఊపబోయి– అదిరిపడినట్టు నిఠారుగా నిలబడ్డాడు గంగారాం. నడినెత్తి మీద టపీటపీమని చరుచుకున్నాడు.

''ఇప్పటిదాకా బాగానే ఉన్నావుగా. ఇంతలోనే నీకు ఏమయింది?'' విసుగ్గా అడిగాడు షాడో.

అటు ఇటూ చూసి అతనికి దగ్గిరిగా జరిగాడు గంగారాం. ''నీకు చెప్దామనుకుంటూనే మర్చిపోయాను. ఆ బంజారా నాయాళ్ళ దగ్గిర్నించి తప్పించుకు వస్తున్నప్పుడు నాకు చీకట్లో ఒక మెర్క్యురీ లైటు కనిపించింది'' అంటూ మొదలుపెట్టి బురదనేలలో కంబళీ పరుచుకుని కూర్చున్న వ్యక్తుల గురించి, వారు మాట్లాడిన మాటల గురించి వివరంగా చెప్పాడు.

''అనవసరమైన మెటీరియల్ అంతా ఆలీబందర్ పట్టణంలో రెడీగా ఉందిట. బోర్డర్ సెక్యూరిటి వాళ్ళని ఇరకాటంలో పెట్టి బిజీగా ఉంచిన తర్వాత ఆ మెటీరియల్‌ని సరిహద్దులు దాటిస్తారట'' అన్నాడు.

ముడిపడ్డాయి షాడో నొసలు విపరీతమైన ఆలోచనలతో... ఆలీబందర్ పట్టణం అంటే సరిహద్దులకి అవతలి పక్కన ఉండే ప్రముఖ పట్టణం. అక్కడ ఉన్న మెటీరియల్‌ని ఇవతలి పక్కకి తీసుకురావాలంటే చాలా కష్టపడాలి. ఆ పని చేయగలిగింది ఎవరు? ఎందుకు?

సిగరెట్ పూర్తిగా కాలి– చేతివేళ్ళని చురుక్కుమనిపించటంతో, ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చేశాడు.

"ఏం చేద్దాం గురూ?" అతని మొఖంలోకి చూస్తున్న గంగారాం వెంటనే అడిగాడు షాడోని.

గడ్డివామిలో పడిన సూదిని వెతకటం అంటే ఎలాగ ఉంటుందో– ఆ బురదనేలలో జరగబోతున్న అఘాయిత్యాన్ని కనిపెట్టడం కూడా అచ్చం అలాగే ఉంటుందని మాత్రం అతనికి చెప్పలేదు షాడో.

"బింద్రాలోకి వెళ్ళే యోగ్యత మనకి లేదు. ఎక్కడో ఒకచోట కొద్దిసేపు రెస్ట్ తీసుకుంటే తప్ప మన ఆలోచనలు ముందుకి సాగవు" ఇంకో సిగరెట్‌ని వెలిగించుకుంటూ అన్నాడు షాడో. విశ్రాంతి తీసుకోవటానికి అనువుగా ఉండే ప్లేస్‌ని వెతకటం కోసం పది అడుగులు అవతలికి వేశాడు గంగారాం. సరిగ్గా అప్పుడే అతని చెవికి చేరింది కర్ణకఠోరమైన గార్ధభ స్వరమొకటి.

అదిరిపడి గబగబా ఒక పొద దగ్గిరికి పోయి అవతలి పక్కకి చూశాడతను. పొడినేలమీద పెరిగే పచ్చిగడ్డిని ఆనందంగా ఆరగిస్తూ, ఆ సంతోషంలో మెడని

ముందుకు జాచి మహదానందంగా ఓండ్ర పెడుతున్న ఒక గార్ధభం వెంటనే కనిపించింది అతనికి.

అంతకు ముందు తమను పట్టుకుని అతలాకుతలం చేసేసిన బంజారా తండా వంటి జనం ఎవరో ఆ చుట్టుపట్ల సంచారిస్తున్నారేమోనన్న అనుమానం కలిగిందతనికి.

'ఇక్కడ ఉండటం మనకి ఏమంత క్షేమం కాదు. ఇంకో చోటికి వెళ్ళిపోదాం' వెనక్కి చూసి షాడోకి వినబడేటట్లు బిగ్గిరిగా అరవబోయాడు.

అరుపు అతని పెదవుల్ని దాటకముందే, ఓండ్ర పెడుతున్న గార్ధభం వెనుకగా ప్రత్యక్షమైందొక ఆడమనిషి.

"నిముషానికి ఒకసారి కట్టుతాడు తెంపుకుని పారిపోవటానికి చూస్తున్నావ్. ఇంకోసారి ఇలా చేశావంటే ముట్టెమీద గరిటె కాల్చి వాతలు పెడతాను.

ముంగాళ్ళకి బంధాలు వేసి కదలనీయకుండా కట్టిపడేస్తాను" అంటూ చేతిలో ఉన్న వెదురుచువ్వతో రెండే రెండు దెబ్బలు దాని నడ్డి మీద వేసింది ఆమె.

చురుకుగా తగిలింది కాబోలు దెబ్బ– ఎగిరి గంతులు వేస్తూ కర్ణకఠోరంగా అరిచిందా గార్ధభం. వెనుక కాళ్ళను గాలిలోకి ఎగరేసి ఆ ఆడమనిషిని తన్నటానికి ట్రై చేసింది. నేర్పుగా తప్పించుకుని, ఇంకో రెండు దెబ్బలు వెసిందామె. వెదురుచువ్వని ఎడమచేతిలోకి మార్చుకుని కుడిచేత్తో దాని చెవులు రెండింటినీ పట్టుకుంది.

అదిగో... అప్పుడు కనిపించాడు ఆమెకి పొద దగ్గిర ఉన్న గంగారాం. వెంటనే గార్ధభాన్ని వదిలేసి పరుగులాంటి నడకతో అతని దగ్గిరికి వచ్చిందామె. వెదురుచువ్వని వదిలేసి చాలా వినయంగా నమస్కారం చేసింది.

"నువ్వు నువ్వు కత్లీవి. గుట్ట అవతల" ఆమెని గుర్తుపట్టి ఆశ్చర్యంగా మాటని మధ్యలోనే ఆపాడు గంగారాం.

"మీరు నా దగ్గిరికి పంపించిన జీవాల్లో మహా మకురుజీవం ఇది. తడవ తడవకీ పొదల్లోకి పారిపోతోంది. మధ్యాన్నం నించీ దీనికోసం పొదల్లో వెతుకుతున్నాను. ఇప్పటికి కనిపించింది" మృదువుగా చెప్పింది ఆమె.

అప్పచెప్పిన పనిని తూచా తప్పకుండా చేస్తున్న ఆమె సిన్సియారిటీని చూసేసరికి ముచ్చట వేసింది గంగారాంకి. "నీ దగ్గిరికి పంపించినప్పుడు ఇది మాదే. ఇప్పుడు పరిస్థితులు మారిపోయినయ్... నువ్వే తీసేసుకో. ఇక నించీ అది నీదే" కత్లీతో అన్నాడు గంగారాం.

"ఎందుకని? మిమ్మల్ని సెక్యూరిటీ వాళ్లు పట్టుకున్నందుకా?" సూటిగా అడిగింది ఆమె.

తమ విషయం బింద్రాని దాటి గుట్ట అవతలికి కూడా తెలిసిపోయిందని గ్రహించి, కొంచెంగా కూడా సిగ్గుపడకుండా తల ఊపాడు గంగారాం.

"మిమ్మల్ని ఇక బింద్రాలోకి రానియ్యరు. ఒకవేళ మొండిగా వచ్చినా, మళ్ళీ బోర్డర్ సెక్యూరిటీవాళ్ళకి కబురు చేసి ఇంకోసారి పట్టించేస్తారు. నెత్తిమీద

నీడలేని ఈ పొదల్లో కాలినడకన తిరగటం అంత మంచిది కాదు'' సాలోచనగా విషయం చెప్పింది ఆమె.

తమను అరెస్టు చేసిన బోర్డర్ సెక్యూరిటీ అధికారుల కళ్ళు కప్పి తాము తప్పించుకున్నట్టుగా ఆమె అనుకుంటోందని వెంటనే అర్థమైపోయింది గంగారాంకి.

నిజం ఆమెకు చెప్పలేదతను. అమాయకంగా తల ఊపాడు. ''మీరు మా గూడేనికి వచ్చేయండి. హాయిగా మా ఇంట్లో ఉండండి. మా దగ్గిర ఉండగా మీకు వచ్చే ఇబ్బంది ఏమీ ఉండదు'' అసలు విషయాన్ని అప్పుడు వారి ముందు బయట పెట్టింది ఆమె.

వెనక్కి తిరిగి షాడో వంక చూశాడు గంగారాం. సిగరెట్ పొగల్ని చిద్విలాసంగా గాలిలోకి వదులుతూ నిలబడి ఉన్న షాడో- రెండో ఆలోచన లేకుండా తలూపాడు.

సంతోషమైపోయింది కత్లీకి. కిందపడిన వెదురుచువ్వని తీసుకుని గార్ధభాన్ని అదిలిస్తూ ముందుండి దారి చూపించింది. నడిచి నడిచి కాళ్ళు పని చేయకుండా పోతాయేమోనని అనిపించే సమయానికి వాళ్ళ ముందు ప్రత్యక్షం అయింది గుట్ట అవతలి గూడెం.

*     *     *     *     *

ఉదయం పదిగంటల వేళలో ఇంకోసారి బింద్రా పోస్ట్‌మాస్టర్‌కి ఫోన్ చేశాడు కుందూ... ''అంతా గందరగోళంగా ఉందిరా కుందూ. తనని అరెస్ట్ చేసి తీసుకుపోతున్న కమాండర్ కళ్ళు కప్పి పొదల్లోకి పారిపోయాట్ట మీ దొంగ

ఇన్స్పెక్టర్. అందరూ అతని కోసం వెతుకుతున్నారు'' ఫోన్ ఎత్తీ ఎత్తగానే చెప్పాడు పోస్ట్మాస్టర్.

ఇంకోసారి కుందూ బుగ్గలమీదికి వచ్చేశాయి కన్నీళ్ళు. రిసీవర్ని ఫోన్మీద పెట్టేసి మొఖాణ్ని చేతుల్లో దాచుకున్నాడు అతను. సరిగ్గా అప్పుడే ఆ గదిలోకి అడుగుపెట్టాడు ఒక భారీ మనిషి. కుందూని ఎలా సముదాయించాలో తెలియక అయోమయంగా చూస్తోంది నర్సు. కంగారుగా కుర్చీలోంచి లేచి నమస్కారం చేసింది.

“మీరు ఎవరు?'' చేతుల్లోనించి మొఖాన్ని బాధగా పైకి ఎత్తుతూ అడిగాడు కుందూ.

“అరే... వీరు ఎవరో తెలియదా? నీకు ఆపరేషన్ చేయించింది వీరే. రామ్దయాళ్ సాబ్ పెద్ద తమ్ముడు రంగరాజుగారు'' గబగబా చెప్పింది నర్సు.

“నాకు ఆపరేషన్ చేయించింది మా ఇన్స్పెక్టర్ సాబ్. వీరు కాదు'' అయోమయంగా చూస్తూ అన్నాడు కుందూ.

అసహనంగా చూస్తూ అతన్ని కరెక్ట్ చేయటానికి ట్రై చేసిన నర్సును వెంటనే ఆపాడు ఆ భారీ మనిషి.

“కుందూ చెప్పిందే కరక్టు. వీళ్ళ ఇన్స్పెక్టర్ సాబ్ చెప్పబట్టే మేం పూనుకుని ఈ పని చేయించాం'' అంటూ బెడ్ అంచుమీద కూర్చుని కుందూ భుజంపై చెయ్యేశాడు.

"నీకు తగ్గిపోయింది నాలుగైదురోజుల్లో కట్లు విప్పేయొచ్చనీ నీకు ఇక్కడ ఉండడం కష్టమనిపిస్తే ఇంటికెళ్ళిపోవచ్చని కూడా చెప్పాడు" అని అన్నాడు.

ఒక్కసారిగా ప్రకాశవంతమయింది కుందూ మొఖం. "బింద్రా వెళ్ళిపోతాను. మా ఇన్స్‌పెక్టర్ సాబ్‌కి నా అవసరం చాలా ఉంది" వారితో అన్నాడు కుందూ.

"ఓ.కే. నీ కాలు బాగోగులు చూసుకోవటానికి ఒక నర్సుని నీ వెంట పంపిస్తాను. కట్లు విప్పిన తర్వాత వెనక్కి వచ్చేస్తుంది. ప్రయాణానికి సిద్ధంగా ఉండు" అంటూ బెడ్ మీదినించి లేచి గదిబయటికి వెళ్ళిపోయాడు రామ్‌దయాళ్ పెద్ద తముడు రంగరాజు.

వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో వెయిట్ చేశాడు కుందూ. రంగరాజు చెప్పినట్లే సరిగ్గా ఒక గంట తర్వాత డిశ్చార్జి చేసేశారు హాస్పిటల్ వాళ్ళు. అతని వెంట ఒక నర్సును కూడా పంపించారు.

హాస్పిటల్‌కి చెందిన అంబులెన్స్‌లో రైల్వేస్టేషన్‌కి వచ్చి రైలు ఎక్కాడు కుందూ. చీకటిపడిన అరగంట తర్వాత భుజ్ పట్టణంలో రైలు దిగాడు.

ప్లాట్‌ఫామ్ మీద అతనికోసమే వెయిట్ చేస్తూ కనిపించాడు స్టేషన్ మాస్టర్. నమస్కారం చేసిన కుందూ తనకి బాగా తెలిసినట్టు ఆప్యాయంగా పలకరించాడు.

"నీ కాలు బాగయినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. చీకటి పడిపోయింది కాబట్టి ఈ రాత్రికి నువ్వు మా గెస్ట్‌హౌస్‌లోనే రెస్టు తీసుకోవాలి.

తెల్లవారగానే తీసుకుపోయి బస్ ఎక్కిస్తాను" అంటూ ఒక మనిషిని తోడుగా ఇచ్చి తమ గెస్ట్‌హౌస్‌కి పంపించాడు.

"స్టేషన్ మాస్టర్ అంతటివాడు స్వయంగా వచ్చి ఈ ఏర్పాట్లు చేశాడంటే నువ్వు చాలా గొప్పవాడికిందే లెక్క. ఏమీలేని పేదవాడినని ఎందుకు చెప్పావ్?" ఆశ్చర్యంగా అడిగింది కుందూతోపాటు వచ్చిన నర్సు.

అదంతా తమ ఇన్స్‌పెక్టర్ సాబ్ గొప్పతనం అని చెప్పబోయి ఎందుకనో విరమించుకున్నాడు కుందూ.

"నేను కాస్సేపు అటూ ఇటూ తిరగవచ్చా?" అని మాత్రమే అడిగాడు తనతో వచ్చిన నర్సును.

"నిరభ్యంతరంగా..." అంటూ పర్మిషన్ ఇచ్చిందామె.

బింద్రా స్టేషన్లో ఇన్స్‌పెక్టర్లకి సేవలు చేస్తూ బతికే తన జీవితం ఎటువంటి మార్పులు చేర్పులకి గురి అవుతున్నదో తలుచుకుంటూ గెస్ట్‌హౌస్ బయట వున్న ఖాళీ ప్రదేశంలో అటూ ఇటూ తిరగటం మొదలుపెట్టాడు కుందూ.

అప్పుడప్పుడు కొంచెం నొప్పిగా అనిపించడం తప్ప ఆల్‌మోస్ట్ నార్మల్ అయిపోయింది అతని కాలు. అందరి మాదిరిగా నిఠారుగా నిలబడగలుగుతున్నాడు. తడబడకుండా అడుగులు వేయగలుగుతున్నాడు.

పదినిముషాలు గడిచిన తర్వాత ఒకేచోట గానుగ ఎద్దులా తిరగటం విసుగనిపించింది అతనికి. తనంతట తనే డెసిషన్ తీసేసుకుని గెస్ట్‌హౌస్ అవతలి పక్కన ఉన్న వీధిలోకి బయలుదేరి వెళ్ళాడు.

వీధి చివర ఉన్నది ఒక చిన్న టీ బంకు. అక్కడ ఉన్న చెక్కబల్లల మీద కూర్చుని టీలు తాగుతూ, కబుర్లతో కాలక్షేపం చేస్తూ కనిపించారు అతనికి అనేకమంది పౌరులు.

తల వంచుకుని తన దారిన తాను వెళ్లిపోబోతూ చటుక్కున ఆగిపోయాడు కుందూ. కారణం అక్కడ కూర్చున్న వాళ్ళల్లో కొంతమందిని తాను అంతకుముందే చూసినట్టుగా అనిపించిన కారణంగా.

“ఇన్స్పెక్టర్ సాబ్ పంపించేవరకూ నేను ఈచోటికి రాలేదు. ఇక్కడి వాళ్ళెవరూ నాకు తెలియదు. మరి ఎందుకు ఇలా అనిపిస్తోంది?” తనలో తను అనుకుంటూ ఒక గోడ దగ్గిర నిలబడ్డాడు అతను.

పదినిముషాల తర్వాత చెక్కబల్లల మీదినించి లేచారు అతను అబ్జర్వ్ చేసిన వ్యక్తులు. తాగిన టీలకి డబ్బులు చెల్లించి, అతను నిలబడి ఉన్నవైపుకే అడుగులేశారు.

“ఎక్కడా చోటు దొరకనట్టు సరాసరి వచ్చి మనమధ్యలోనే తిష్టవేశాడు. అతని తప్పుకాదు. అతన్ని తీసుకువచ్చిన కల్తీది. ముందు దానికి బుద్ధి చెప్పాలి” అసహనంగా అంటున్నాడు వారిలో ఒకతను.

అంతవరకూ వారిని ఎక్కడ చూశాడో గుర్తుకురాక గిజాటు పడుతున్న కుందూకి ఛట్‌మని గుర్తు వచ్చేసింది.

బింద్రా కొండగుట్ట అవతల గూడెంలో నివసిస్తూ ఉంటారు వాళ్ళు. అప్పుడప్పుడూ తుల్జీబాయి హోటల్ దగ్గిరికి వచ్చివెళుతూ ఉంటారు. వేగంగా

కొట్టుకుంటున్న గుండెల్ని చిక్కబట్టుకుంటూ వారి మాటల్ని మరింత శ్రద్ధగా ఆలకించటానికి ప్రయత్నం చేశాడతను."వాడు ఏమైపోతే మనకేంటి... ముందు మనం వచ్చిన పని పూర్తి చేయాలి" అంటున్నాడు ఇంకో మనిషి.

వాళ్ళు ఎవరిగురించి మాట్లాడుకుంటున్నారో కుందూకి అర్థం కాలేదు. అయితే వాళ్ళు భుజ్ పట్టణంలోకి ఎందుకు వచ్చారో తెలుసుకోవాలని మాత్రం అతనికి అనిపించింది. ఒక అడుగు ముందుకేసి వారిని పలకరించబోతుండగా– మోతలు చేస్తూ, దుమ్ము రేపుకుంటూ అటుకేసి దూసుకువచ్చింది ఒక జీప్.

భుజ్ పట్టణంలోగాని, ఆ చుట్టుపట్ల ఉండే గ్రామాల్లో గాని జీప్ కనిపించిందంటే అది బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌కి చెంది ఉంటుందనే నమ్మకం.

అల్లంత దూరంలో ఉండగానే ఆ వెహికిల్‌ని గమనించి గబగబా ఒక చీకటి సందులోకి సర్దుకున్నారు ఆ వ్యక్తులు. జీప్ అవతలికి వెళ్ళిపోయిన తర్వాత రోడ్డుమీదికి వచ్చి తిరిగి నడక మొదలు పెట్టారు. వారిని పలకరించాలన్న కుందూ కోరిక అతని గుండెల్లోనే ఉండిపోయింది.

"మర్యాదకరమైన పనులమీద భుజ్ రాలేదు వాళ్ళు. అలా వచ్చి వుంటే జీప్ కారును చూసి భయపడాల్సిన అవసరం లేదు.... వాళ్ళు ఎందుకు వచ్చారో మనకి ఎలా తెలుస్తుంది?" గెస్ట్‌హౌస్‌ని వదిలి తను అప్పటికే చాలా దూరం వచ్చిన సంగతి మర్చిపోయాడు కుందూ. అతిగా నడిస్తే ఆపరేషన్ చేసిన కాలుకి ఏదైనా ఇబ్బంది కలుగుతుందేమో నన్న ఆలోచనని కూడా చెయ్యలేదు. అడుగులో అడుగు వేసుకుంటూ వాళ్ళని అనుసరించాడు.

అరగంటపాటు నడిచిన తర్వాత అతనికి కనిపించాయి బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ఉండే బారెక్స్. ఆ ప్రదేశానికి కొంచెం ఇవతలగా ఉన్న ఒక చీకటి సందులో మకాం పెట్టారు అతను అనుసరిస్తున్న వ్యక్తులు. వాళ్ళకి వందమీటర్లు ఇవతలగా నిలుచున్నాడు కుందూ. ఊపిరి బిగపట్టి వాళ్ళ చేతల్ని, మాటల్ని అబ్జర్వ్ చేయడం మొదలుపెట్టాడు. ఇంకో అరగంట గడిచిపోయింది.

ఉన్నట్టుండి కదిలారు ఆ వ్యక్తులు. నీడల్లో అడుగులు వేస్తూ సెక్యూరిటీ ఫోర్స్ అధికారులు సమావేశం అయ్యేందుకు ఉద్దేశించబడిన ఒక పెద్ద బిల్డింగ్ దగ్గరికి పోయారు. అక్కడ కాపలాగా నిలబడి వున్న గార్డుకి కనిపించకుండా ఒక గోడ చాటుకి పోయి రెండు నిముషాల్లో వెనక్కి వచ్చేశారు. ఎందుకు వెళ్ళారో, వెంటనే ఎందుకు వచ్చేశారో కుందూకి అవగతం కాలేదు. ఎందుకో ఒకందుకు వెళ్ళారు... ఏదో పాడుపనే చేసి ఉంటారు.

అతని ఆలోచనలు కరెక్ట్ అని వెంటనే తేలిపోయింది. ఇవతలికి వచ్చిన వెంటనే ఒకరినొకరు నిశ్శబ్దంగా హెచ్చరించుకుంటూ, వేగంగా ఆ ప్రదేశాన్ని వదిలి అవతలికి వెళ్ళిపోయారు వాళ్ళందరూ. అంతవేగంగా నడవడం తనకు అసాధ్యమని అర్థమై, వారిని మళ్ళీ అనుసరించే ప్రయత్నాన్ని విరమించుకున్నాడు కుందూ. సెక్యూరిటీ ఫోర్స్‌కి చెందిన భవనం చాటుకు వెళ్ళి చుట్టూ చూశాడు.

దేనికోసం చూస్తున్నాడో తెలియదు అతనికి. అక్కడ ఏం జరిగి వుంటుందో అంతకన్నా తెలియదు. అయినా సరే చూడటం మాత్రం మానలేదతను. సడన్‌గా అతని కళ్ళపడింది గుమ్మటంలా ఉన్న ఒక గుడ్డమూట. దానికి దగ్గరిగా పోతున్న

సమయంలోనే వినవచ్చింది అతనికి ఏదో గడియారం చేస్తున్నట్టుగా టిక్‌టిక్‌మనే మోత.

ఊహ తెలిసిన దగ్గర్నించీ పోలీస్టేషన్ పరిసరాల్లోనే పెరిగి పెద్దవాడవటం వల్ల ఆ శబ్దం ఏమిటో ఎవరూ చెప్పాల్సిన అవసరం లేకపోయింది అతనికి.

"బాంబు... గోడదగ్గిర బాంబు... పారిపోండి... పారిపోండి" తనకి తెలియకుండానే బిగ్గిరిగా అరుస్తూ రోడ్డు మీదికి పరుగెత్తుకు వచ్చాడతను.

అటువంటి అరుపులు విన్న తర్వాత ఆలస్యం చేయటం అలవాటు లేదు కాబోలు– జేబులో ఉన్న విజిల్‌ని తీసి చాలా గట్టిగా ఊదాడు ఆ బిల్డింగ్ ముందు కాపలా నిలబడిన గార్డు. విజిల్ శబ్దం చెవులపడిన రెండో క్షణంలో బిల్డింగ్‌లోనించి బయటికి పరిగెత్తుకు వచ్చారు పదిమంది సెక్యూరిటీ ఫోర్స్ అధికారులు.

వారు రోడ్డుమీదికి రావటం రావటం, చెవులు చిల్లులుపడే శబ్దంతో కుందూ చూసిన గుడ్డమూట పేలిపోవటం ఒకేసారి జరిగింది. ఎర్రటి మంట... నల్లటి పొగలు... గోడబద్దలై ఆ ప్రదేశమంతా గందరగోళమైపోయింది.

సగానికి సగం నాశనమైపోయింది భవనం... మూడు అడుగుల లోతున ఏర్పడింది గోడ ఉండాల్సిన చోటులో పెద్ద గొయ్యి. "ఇంకో క్షణం ఆలస్యం చేసివుంటే అందరం హతమారిపోయి ఉండేవాళ్ళం... మనల్ని ఎలర్ట్ చేసింది ఎవరో తెలుసుకోండి" జరిగిన దారుణాన్ని చూసి ఆర్డర్ ఇచ్చాడు భవనంలోనించి వచ్చిన ఒక అధికారి.

కుందూ గనక ఇంకో రెండు నిముషాల పాటు రోడ్డు మీదే నిలబడి వుంటే ఆ పని చేసింది ఎవరో వారికి తెలిసిపోయి ఉండేది. బాంబు పేలిన మరుక్షణం గబగబా వెనక్కి జరిగి చీకటిసందు దగ్గిరికి వెళ్ళిపోయాడతను. పేలుడు శబ్దం విని కేకలు పెడుతూ వచ్చిపడిన చాలామంది పౌరుల్ని చూసి ఇంకా వెనక్కి వెళ్ళిపోయాడు.

కొండగట్టు అవతల నివసిస్తూ, పిట్టల్ని, నక్కల్ని పట్టుకుంటూ బతికే జనాలకి బాంబులు పెట్టే తెలివి ఎక్కడినించి వచ్చిందో తెలియలేదతనికి.

"ఇదేమిటో వాళ్లకి వీళ్ళకి చెపితే ఎవరికీ తెలియదు. చెపితే గిపితే మా ఇన్స్‌పెక్టర్ సాబ్‌కే చెప్పాలి... అంతవరకూ నోరు మూసుకోవాల్సిందే" తనలో తను అనుకుంటూ గెస్ట్‌హౌస్ దగ్గిరికి చేరుకున్నాడు. చెమటలు పట్టిన మొఖంతో అతనికోసం కంగారు పడుతుంది నర్సు. కుందూని చూడగానే అతనిమీద విరుచుకుపడింది–

"కాస్సేపు తిరిగితే పరవాలేదని అన్నానుగాని, అదే పనిగా చక్కర్లు కొట్టమనలేదు. కాలుకి ఏదైనా అయితే నాకు మాట వస్తుంది. నీకసలు బుద్ధి లేదు" అంటూ.

తన ఆలోచనల్లో తనున్న కుందూ ఆ అరుపుల్ని పట్టించుకోలేదు. స్టేషన్ మాస్టర్ పంపించిన క్యారేజీలోని రొట్టెల్ని ఆరగించి, మెత్తటి ఫోమ్‌బెడ్‌మీద మేను వాల్చాడు. రెండే రెండు నిముషాల్లో నిద్రలోకి జారిపోయాడు.

*　　*　　*　　*　　*

తెల్లవారేసరికి భుజ్ పట్టణంలో జరిగిన సంఘటన గురించి బింద్రాలో తెలిసిపోయింది. అక్కడినించి గుట్ట గూడెంలోకి కూడా వ్యాపించింది.

"ఆలీబందర్‌లో ఉన్న మెటీరియల్‌ని బోర్డర్స్ దాటించాలంటే బోర్డర్ సెక్యూరిటీ వాళ్ళు బిజీబిజీగా ఉండాలి. సరిహద్దుల దగ్గిరికి పోకూడదు. ఈ పని అందుకోసమే చేయబడిందా?" నులకమంచంమీద ప్రశాంతంగా పడుకుని ఉన్న షాడోని అడిగాడు గంగారాం.

"ఆ పని చేసింది ఎవరో మనకి ఎలా తెలుస్తుంది?" అడిగాడు షాడో.

అప్పుడే వీధుల్లోకి వెళ్లిన కత్తీ రుసరుస లాడుతూ తిరిగి రావటాన్ని గమనించి కామ్ అయిపోయారు వారిద్దరూ. ఇంటిముందు కట్టివేసి ఉన్న ఒక గార్ధభం తనని చూసి బిగ్గిరిగా ఓండ్ర పెట్టేసరికి టాప్ పిచ్‌కి వెళ్ళిపోయింది కత్తీ కోపం.

"నీకు కూడా నేను అలుసు అయిపోయానా?" అంటూ కింద ఉన్న వెదురు చువ్వనొకదాన్ని అందుకుని దబదబా రెండు దెబ్బలు వేసింది దాని వెన్నుమీద.

"ఏమయింది తల్లీ? ఎందుకు అంత కోపం?" ఆశ్చర్యంగా చూస్తూ ఆమెను అడిగాడు గంగారాం.

"మొగుడు లేని వాళ్లని చూస్తే అందరికీ అలుసే. నిన్నా మొన్నటిదాకా మూడు పూటలా తినటానికి లేనివాళ్ళు కూడా ఇవాళ నన్ను చూసి అదోలా మాట్లాడుతున్నారు. కాసిని డబ్బులు జేబులో పడేసరికి ఒళ్ళు తెలియటంలేదు వెదవలకి" కోపంగానే చూస్తూ చెప్పింది ఆమె.

"ఎవరు తల్లీ వాళ్ళు? నిన్నా మొన్నా లేని డబ్బులు ఇవ్వాళ ఎలా వచ్చాయి?" అడిగాడు గంగారాం.

"ఎలా వచ్చాయో ఆ భగవంతుడికే తెలుసు. నిన్నంతా భుజ్ పట్టణంలో షికార్లు కొట్టినట్టున్నారు. ఎవరి దగ్గరో దోపిడీ చేసి వుంటారు" అంటూ తన ఇంటికి నాలుగు ఇళ్ళ అవతలగా నివసించే ఒక యువకుడి పేరు చెప్పింది.

"ఒళ్ళు వంచటం తెలియదు... ఏనాడు ఎర్ర ఏగాని సంపాదించి ఎరగడు. ఇవాళ మాత్రం జేబుల నిండుగా పచ్చనోట్లు" అంటూ లోపలికి వెళ్లిపోయింది.

"మబ్బులు లేకుండా ఎక్కడైనా వర్షం పడుతుందా?" షాడోని అడిగాడు గంగారాం.

"సూటిగా చెప్పు చుట్టుదారి మాటలు వద్దు" అన్నాడు షాడో.

"పచ్చనోట్లు ఉట్టి పుణ్యానికి జేబుల్లోకి రావు" చెప్పాడు గంగారాం.

"నిజమే కాని వీళ్ళు మొదటినించీ వంకర పనులు చేయటానికి అలవాటుపడి వున్నారు. వీళ్ళ పద్ధతులు సరిగ్గా ఉండకపోవడం వల్లనే వెలివేసినట్టు ఊరికి దూరంగా ఈ ప్రదేశంలోకి వచ్చిపడ్డారు" అన్నాడు షాడో.

"అయినా సరే... నా అనుమానం నాది... నువ్వు వాళ్ళని వెనకేసుకు వచ్చినా నా అభిప్రాయం మార్చుకునేది లేదు" అన్నాడు గంగారాం.

"ఆల్‌రైట్... ఇప్పుడు ఏం చేస్తే బాగుంటుందో నువ్వే చెప్పు" అన్నాడు షాడో.

“కత్తీ వెంటపడిన వాడిని జాగ్రత్తగా అబ్జర్వ్ చేసి ఆ తర్వాత చెప్తాను” అంటూ అప్పటికప్పుడు వీధిలోకి వెళ్ళిపోయాడు గంగారాం.

*            *            *            *            *

ఊరు ఊరంతా కదిలివచ్చింది కుందూని చూడటానికి. అవిటి కాలిని ఎగరేసుకుంటూ వంకరటింకరగా నడిచే కుందూ ఇప్పుడు సూటిగా, స్ట్రెయిట్‌గా నడుస్తూ ఉండటాన్ని చూసేసరికి ఆనందం, ఆశ్చర్యం, అసూయ మొదలైన భావాలన్నీ కలిగాయి వారందరికీ.

“ఇంత మంచి పనిచేసిన ఆ ఇన్స్‌పెక్టర్ తన విషయంలో మాత్రం తప్పటడుగులు చాలా వేశాడు. ఎందుకో నాకర్థం కావడం లేదు” తన దగ్గిరికి వచ్చిన కుందూని తుల్జీబాయి హోటల్ దగ్గిరికి తీసుకుపోతూ అన్నాడు బిల్లూకాకా.

“కాకా... నేను ఒకసారి ఆయనతో మాట్లాడాలి... ఎలా వీలవుతుంది?” అడిగాడు కుందూ.

“బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ వాళ్ళ దగ్గిర్నించి పారిపోయిన తరువాత అతను ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో ఎవరికీ తెలియదురా” అన్నాడు బిల్లూకాకా.

తుల్జీబాయి హోటల్‌కి చేరుకున్నారు ఇద్దరూ... కుందూ తల నిమిరిందామె. బుగ్గలు ముద్దు పెట్టుకుంది. “ఎంతో కాలంగా నీకు చెపుదామని అనుకుంటున్నాను. ఇప్పుడు సమయం వచ్చింది. ఈ హోటల్‌ని నువ్వే తీసేసుకో. మంచి పిల్లని చూసి పెళ్ళి చేసుకుని హాయిగా నడుపుకో. నేను కొంతకాలం కాశీ వెళ్ళి అక్కడ ఉండి వస్తాను” అని చెప్పింది. ఆమె ఇచ్చిన చాయ్‌ని తాగుతూ ఒక బల్లమీద కూర్చున్నాడు కుందూ.

వచ్చేపోయే వాళ్ళతో హుషారు హుషారుగా కబుర్లు చెపుతున్న సమయంలో కనిపించింది అతనికి కత్తీ.

"ఇంటికి చుట్టాలు వచ్చారు. మంచి కూర కావాలి" అంటూ తుల్జీబాయికి ఒక సత్తు టిఫిన్ బాక్సుని అందించింది. భర్తని పోగొట్టుకున్న కత్తీ సుఖంగా ఉండటానికి కారణం తమ దొంగ ఇన్స్పెక్టర్ సారేనన్న విషయం ఇంకోసారి గుర్తొచ్చింది కుందూకి.

"ఎవరు కత్తీ, ఆ చుట్టాలు? ఎక్కడినించి వచ్చారు? వాళ్ళతో నీకేంటి సంబంధం?" నవ్వుతూ అడిగాడు.

"వాళ్ళు భుజ్ నించి వచ్చారులే. రెండు రోజులుంటారు" అంటూ హడావుడిగా వెళ్లిపోయిందామె–

తుల్జీబాయి తెచ్చిచ్చిన టిఫిన్ బాక్సని పట్టుకుని, "పిచ్చి పిల్ల.... నీకు మాదిరిగానే ఒంటరిది. చుట్టాలు పక్కాలు ఎవరూ లేరు. అమ్మా నాన్న పోయిన తర్వాత ఇంకా ఒంటరిది అయిపోయింది" ఆమె వెళుతున్న దిశలోకే చూస్తూ చిన్నగా అన్నది తుల్జీబాయి.

అటువంటి ఒంటరిమనిషి ఇంటికి వచ్చిన చుట్టాలు ఎవరై వుంటారు? తుల్జీబాయి మాటల్ని విన్న వెంటనే కుందూ మనసులో మెదిలిన సందేహం అది. ఐతే ఆ మాటని బయటపెట్టలేదతను. మరో అరగంట గడిచాక ఎవరూ చూడకుండా బయటికి వచ్చి గట్టు అవతలికి బయలుదేరాడు.

*　　　*　　　*　　　*　　　*

వెయ్యి రూపాయలకి పైగానే పోగొట్టుకున్నాడు గంగారాం పేకాటలో. "మీకు ఈ మధ్య అదృష్టం చాలా ఎక్కువ మోతాదులో డ్యాన్స్ చేస్తోంది. మిమ్మల్ని గెలవటం నా వల్ల కాదు" నిరాశగా నిట్టూరుస్తూ అన్నాడు.

కత్తీని కామెంట్ చేసిన యువకుడు ఉన్నాడు ఆడినవారిలో. అతని ఫ్రెండ్స్ మరో నలుగురు ఉన్నారు.

"ఆకలి దంచేస్తోంది. నాలుగు రొట్టెలు తినివచ్చిన తర్వాత మళ్ళీ ఆడదాం" అంటూ ఎవరి ఇంటికివారు బయలుదేరారు. నెమ్మదిగా లేచి నిలబడిన గంగారాంకి వెంటనే కనిపించాడు కుందూ. "అరే కుందూ? ఎలా ఉన్నవ్? ఎప్పుడు వచ్చావ్?" ఆప్యాయంగా అడుగుతూ అతన్ని కత్తీ ఇంటికి తీసుకుపోయాడు.

నులకమంచం మీది షాడోని చూసి విపరీతంగా చలించిపోయాడు కుందూ. అహ్మదాబాద్‌లో జరిగినవన్నీ వివరంగా చెప్పాడు. ఆఖర్లో గతరాత్రి భుజ్‌లో తను చూసిన సంఘటనని వర్ణించాడు. "ఇది చెప్పటానికే మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చావా?" అడిగాడు షాడో.

"నువ్వు ఎప్పుడూ చూసివుండని విశేషాలు మొదలు కాబోతున్నాయి. నోరు మూసుకుని వెళ్ళిపో. ఎక్కడా నోరు జారకు. ఎవరికీ ఏదీ చెప్పకు. వెళ్ళు" అంటూ అతిబలవంతంగా అతన్ని వెనక్కి పంపించేసి, గంగారాం వంక చూశాడు షాడో.

"నా అనుమానమే నిజం. ఇక్కడి దొంగనాయాళ్ళే భుజ్‌లో ఆ బాంబుని పెట్టి ఉంటారు. రెండు తగిలిస్తే వివరాలు బయటికి వచ్చేస్తయ్" అన్నాడు గంగారాం.

ఊళ్ళోకి పోయి కత్తీ తీసుకువచ్చిన మాంసపుకూరతో ఇద్దరూ చెరో నాలుగు రొట్టెల్ని ఆరగించారు. ఆ తర్వాత తనొక్కడే తిరిగి పేకాట దగ్గిరికి పోయాడు గంగారాం.

"భుజ్‌నించి ఎవరో పెద్దమనిషి వచ్చాడు. రాత్రి భుజ్ పట్టణంలో గడిపిన కుర్రాళ్ళు ఎక్కడ ఉంటారని అడిగాడు" ఆట మొదలు కాబోతుండగా అన్నాడు.

ఉలిక్కిపడినట్టు ఒకరి మొఖం ఒకరు చూసుకున్నారు వాళ్ళు. "కంగారు పడకండి. గుట్ట దగ్గిర ఉంటారని చెప్పారు. కాస్సేపు చూసి అతని దారిన అతను వెళ్ళిపోతాడు" చాలా కాజువల్‌గా చెప్పాడు గంగారాం.

అతను ఊహించినట్టే ఆ తర్వాత ఎంతోసేపు సాగలేదు ఆట. అత్యవసరమైన పనులు ఉన్నట్టు ఒకరి తర్వాత ఒకరుగా లేచి అవతలికి వెళ్ళిపోయారు వారందరూ.

'వెళ్ళండి. మీకోసం సిద్ధంగానే ఉన్నాడు ఆ పెద్దమనిషి. మీకు తగిలే షాక్‌ని తట్టుకోవడం ఇంపాజిబుల్' తనలో తను అనుకుంటూ తాపీగా తను కూడా గుట్ట దగ్గిరికి బయలుదేరి వెళ్ళాడు గంగారాం.

అతను ఊహించినట్టే ఉతికి ఆరేశాడు షాడో గుట్ట దగ్గిరికి వచ్చిన హీరోలనందర్ని. ఏదో ఒక విధంగా తప్పించుకోవటానికి ట్రై చేశారు వాళ్ళు. కాని

ఉపయోగం లేకపోయింది. "ఎందుకు మమ్మల్ని కొట్టడం? ఏం చేశాము మేం?" దీనంగా అడిగాడు ఒక హీరో.

"బాంబును గురించి చెప్పు. ఎవరు పెట్టమన్నారో, ఎందుకు పెట్టమన్నారో మాకు తెలియాలి" నిదానంగా వెళ్ళి ఒక పక్కన నిలబడిన గంగారాం తమకు కావల్సింది ఏమిటో అతనికి వివరించి చెప్పాడు.

అరగంటపాటు గింజుకున్నాడు అతను. నిముషనిముషానికి పెరిగిపోతున్న అసహనాన్ని అతిప్రయత్నంమీద అంటిపెట్టుకుంటూ వెయిట్ చేశాడు షాడో.

"అతను ఎవరో మాకు తెలియదు. రేపు ఉదయం రాపూర్ గ్రామం దగ్గరికి రమ్మని చెప్పాడు" షాడో పిడికిటి పోట్లని తట్టుకోలేక విషయాన్ని బయట పెట్టేశాడు.

"బాంబు పెట్టటం దేనికి?" అడిగాడు గంగారాం.

"ఇవాళ రేపు సెక్యూరిటీ ఫోర్స్‌వాళ్ళు పెట్రోలింగ్‌కి బయలుదేర కూడదట. కూలీల్ని గురించి ఆలోచిస్తూ వాళ్ళు భుజ్‌లోనే ఉండిపోవటానికికట" చెప్పాడు హీరో.

సిగరెట్ వెలిగించుకుంటూ గంగారాం వంక చూశాడు షాడో. "ఎంత లేదన్నా వాళ్ళు మనకి బాగా కావాల్సినవాళ్ళు. ఎక్కడికీ కదలకుండా ఇక్కడే ఉండిపోయేటట్లయితే వదిలేయవచ్చు. ఇబ్బందేమీ ఉండదు" అన్నాడు గంగారాం.

అతను అలా ఎందుకు అంటున్నాడో అర్థం అయింది ఆ హీరోకి "అమ్మతోడు అసలు గూడెంలోనించి అడుగు బయటపెట్టం... మీమీద ఒట్టు" అని ఒప్పేసుకున్నాడు.

"రాపూర్ గ్రామం అంటే నలభై నాలుగు కిలోమీటర్లు. లెప్ట రైటు కొడితే ఈ బురదలో పదిపన్నెండు గంటలు పడుతుంది. చీకట్లో దారి తప్పితే తిరిగి ఇక్కడికే వచ్చేస్తాం" కత్తీ ఇంటికి తిరిగివస్తూ అన్నాడు గంగారాం.

పొదల్లో కోసుకువచ్చిన గడ్డిని విదిల్చి గార్ధభాల ముందు వేస్తోంది కత్తీ. వాటిని చూసేసరికి షాడో మనసులో మెదిలింది ఒక ఆలోచన.

క్షణం ఆలస్యం చేయకుండా పోతరించి ఉన్న రెండు గార్ధభాల్ని సెలక్ట్ చేశాడు. కాస్సేపు అలా అలా తిరిగి వస్తాం. ఆలస్యమైతే కంగారు పడద్దు" అని కత్తీకి చెప్పి ఒక గార్ధభం మీద కూర్చున్నాడు. పట్టుబడిన క్షణంనించీ చేసేందుకు సరైన పనేమీ లేకపోవటంవల్ల బద్దకం ఎక్కువై మొరాయించింది అది ముందుకు కదలటానికి.

గంగారాం ఎక్కిన వాహనం కూడా అలాగే ప్రవర్తించటాన్ని చూసి, కింద వున్న వెదురుచువ్వతో ఠపీఠపీమని నాలుగు అంటించింది కత్తీ. పందెపు గుర్రల మాదిరి ఒక్కసారిగా పరుగు అందుకున్నాయి అవి. రెండు నిముషాల్లో గూడేన్ని వదిలి పొదల్లోకి ప్రవేశించాయి.

* * * * *

రాపూర్ గ్రామం చివరి భాగంలో సముద్ర తీరం దగ్గిర ఉంటుంది పురాతనకాలపు భజరంగభళి ఆలయం.

నడిచి నడిచి అలసిపోయిన తమ వాహనాల్ని ఆ గుడి దగ్గిర వదిలి ఆలయమండపంలో కూర్చున్నారు షాడో, గంగారాం. తెల్లవారుఝాము సమయం. దూరంనించి సముద్రపు హోరు... ఒళ్ళు గగ్గుర్పొడిచే చలిగాలి...

"బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌వాళ్ళకంటే ఘటికులు మన నావల్ కోస్ట్‌గార్డు వాళ్ళు. ఇటునుంచి మనదేశంలోకి ప్రవేశించటం అంత సులభం కాదు" అరగంట తర్వాత చిన్నగా అన్నాడు గంగారాం.

"సరిహద్దులు దాటటం కాదు ఈ ప్రాబ్లమ్‌కి అర్థం" అన్నాడు షాడో క్షణం ఆలోచించి.

"మరి ఇంకేమిటి?" అడిగాడు గంగారాం.

"ఇంకేటో ఉన్నది... ఈ మారుమూల గ్రామాన్ని సెలక్ట్ చేసుకోవటానికి కారణం ఏదో గట్టిదే ఉండి ఉంటుంది. అదేమిటో తెలియాలి" అన్నాడు షాడో.

"ఇది మారుమూల గ్రామం అనే మాట నిజమేననుకో, కాని దానికి ఇంకో విశేషం ఉంది" చెప్పాడు గంగారాం.

"ఏమిటది?" అడిగాడు షాడో.

"పెట్రోలియం..... సముద్రంలో ఉన్న మన పెట్రోల్ బావుల దగ్గిరికి రావటానికి, పోవటానికి ఈ గ్రామం బేస్ కాంప్‌గా ఉపయోగపడుతోంది. అదిగో" అంటూ ఒక వైపుకు చూపించాడు గంగారాం.

అటుకేసి చూసిన షాడోకి అర కిలోమీటర్ దూరంలో దేదీప్యమానంగా వెలుగుతున్న లైట్లు కనిపించాయి.

అవి కనిపించటం అతని మనసులో ఇంకో ఆలోచన మొదలవటం ఒకేసారి జరిగింది.

"బేస్ కాంప్‌ని రిస్ట్రిక్ట్ చేసి సముద్రంలో ఉన్న పెట్రోలియం బావుల మీద ఎటాక్ చేస్తే ఏమౌతుంది?" తనలో తను అనుకుంటున్నట్టు పైకే అన్నాడు.

అతను ఊహించినట్టు కంగారు పడలేదు గంగారాం. "రాపూర్ గ్రామం పేరు వినగానే ఇటువంటిది ఏదో జరగబోతున్నదని నాకు అనుమానం వచ్చింది" అన్నాడు.

ఆ మాటలకి షాడో సమాధానం ఇవ్వకముందే చీకట్లోనించి మండపం దగ్గిరికి వచ్చారు నలుగురు దృఢకాయులు. "బింద్రానించి వచ్చింది మీరేనా? మిగిలినవాళ్ళు ఏరి?" వేగంగా వస్తూనే అడిగాడు.

"వెనకాల వస్తామని చెప్పారు. మేము ముందు వచ్చేశాం" లేచి నిలబడుతూ చెప్పాడు గంగారాం.

"ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది... వెలుగు రాకముందే పని జరిగిపోవాలి" అంటూ తమ వెంట తీసుకొచ్చిన నాలుగు గోనెసంచుల్ని అతని ముందు పెట్టారు వాళ్ళు.

"మీరు బేస్‌కాంప్ మీద ఎటాక్ మొదలుపెట్టండి. అందరూ కన్ఫ్యూజ్ అయిపోతారు. ఈ చుట్టుపట్ల ఉండే కోస్ట్‌గార్డ్ బోట్లు అన్నీ ఇక్కడికే వచ్చేస్తాయి. ఆ సందడిలో మేము పెట్రోల్ బావుల దగ్గిరికి చేరుకుంటాం" అంటూ గిరుక్కున వెనుతిరిగి వెళ్ళిపోబోయారు అవతలికి.

“అయ్యా... గోల స్టార్ట్ అయిన తర్వాత మీరు మాకు కనిపించరు. మా పేమెంట్ సంగతేమిటి?” వెంటనే ఆలస్యం చేయకుండా అడిగాడు గంగారాం.

“అంతా ఆ సంచుల్లోనే ఉంది. జాగ్రత్తగా పనిపూర్తి చేయండి” అంటూ చీకట్లోకి వెళ్లిపోయారు వారందరూ.

గోనె సంచుల మూతుల్ని విప్పిన గంగారాంకి కనిపించాయి శక్తివంతమైన పేలుడు పదార్థాలు. ఆఖరి సంచిలో అగుపించాయి నాలుగు పెద్ద పెద్ద నోట్లకట్టలు.

వాటిని దుస్తుల్లో దాచుకుని షాడో వంక చూశాడు అతను. “విషయం రసకందాయంలో పడింది... ఇప్పుడు ఏం చేద్దాం...” అని అడిగాడు. రెండు క్షణాలు ఆలోచించి, అతన్ని దగ్గిరికి పిలిచి ఏదో చెప్పాడు షాడో.

“ఎక్సలెంటు గురూ! ఇప్పుడే చేసేస్తాను. నువ్వు మాత్రం జాగ్రత్త” అని అంటూ గోనెసంచులతో వడివడిగా చీకట్లోకి బయలుదేరాడు గంగారాం. కాలుస్తున్న సిగరెట్ని మండపానికి దూరంగా విసిరి అతను వెళ్ళిన దిశకు ఆపోజిట్గా కదిలాడు షాడో.

*            *            *            *            *

తూర్పుదిక్కు తెల్లబడటానికి ఇంకో అరగంట వ్యవధి ఉన్నదనగా రాపూర్ గ్రామాన్ని దడదడలాడించాయి దారుణమైన పేలుళ్ళు. భూకంపం వచ్చినట్టుగా భయపడుతూ ఇళ్లలోనించి బయటికి పరిగెత్తుకు వచ్చేశారు జనం. పెట్రోలియం శాఖకి చెందిన బేస్ కాంపులో కూడా చెలరేగింది దారుణమైన అలజడి.

తమ తమ ఆయుధాల్ని రెడీగా పట్టుకుని కాంప్ ఏరియాలోనించి బయటికి పరిగెత్తుకు వచ్చారు సెక్యూరిటీ గార్డులు. ఒక చెట్టున నిలబడి వున్న షాడో వెంటనే కదిలి నిశ్శబ్దంగా ఎంటర్ అయ్యాడు కాంప్‌లోకి.

"వెళ్ళండి. భజరంగభళి ఆలయం దగ్గిరికిపోయి విచారించండి. మోతలన్నీ అటునుంచే వినవచ్చాయి" బిగ్గిరిగా అరుస్తూ అందరికీ ఆర్డర్స్ ఇస్తూ కనిపించాడు అతనికి- ఆ కాంప్‌కి బాస్. అడుగులో అడుగువేస్తూ అతని వెనక్కిపోయి చటుక్కున అతని మెడచుట్టూ చేతులు చుట్టి, గట్టిగా పట్టుకున్నాడు షాడో.

"అరిచి అల్లరి చేసినా, అందర్నీ ఎలర్ట్ చేయటానికి ట్రై చేసినా మెడ విరిగిపోతుంది" అని హెచ్చరించాడు.

"ఎవరు నువ్వు? ఇప్పుడు నీకేం కావాలి" భయం నిండిన కంఠంతో అడిగాడు బాస్.

"కమ్యూనికేషన్ రూమ్‌కి తీసుకుపో..." కరుకుగా హెచ్చరించాడు షాడో. అటూ ఇటూ పరిగెత్తుతున్న వారెవరికీ అనుమానం రాకముందే అక్కడికి గద్దిర్లో ఉన్న ఒక పెద్ద బిల్డింగ్‌లోకి అతన్ని తీసుకుపోయాడు బాస్.

*　　*　　*　　*　　*

"రాపూర్ గ్రామంలో ఏదో గొడవ జరుగుతోంది సార్. దారుణమైన పేలుళ్ళు వినిపిస్తున్నాయట... కోస్ట్‌గార్డ్‌కి చెందిన బోట్లు అన్నీ గ్రామం దగ్గిరికి పోతున్నాయి" నిద్రలేచి సిగార్ వెర్లిగించుకుంటున్న కులకర్ణిగారికి ఫోన్ చేసి చెప్పాడు అహ్మదాబాద్ డిజిపి.

"జాగ్రత్తగా మానిటర్ చేయండి..." అని చెప్పబోతూ అదిరిపడి ఆ మాటల్ని మింగేశాడు కులకర్ణి.

"పేలుళ్ళ శబ్దాలేనా? నష్టం జరిగిందా?" అడిగారు.

"ఇప్పటివరకూ ఎటువంటి రిపోర్టు రాలేదు... జస్ట్ శబ్దాలు మాత్రమే అంటున్నారు" చెప్పాడు డిజిపి.

పూర్తిగా వెలిగించుకోని సిగార్‌ని అవతలికి విసిరికొట్టి నైట్‌డ్రస్‌తోనే హోటల్ బయటికి వచ్చేశారు కులకర్ణి. అంబాసిడర్లో డిజిపి ఆఫీస్‌కి వెళ్ళారు.

ఆయన కమ్యూనికేషన్స్ రూమ్‌లో అడుగుపెట్టటం– "సార్ మెస్సేజి మీకు వచ్చింది" అంటూ డిజిపి ఎదురు రావటం ఒకేసారి జరిగింది.

వైర్‌లెస్ సెట్ దగ్గిరికిపోయిన కులకర్ణిగారికి గంభీరంగా వినవచ్చింది ఒక యువకుడి కంఠం.

"పెట్రోల్ బావులమీద దాడి జరగబోతోంది. గ్రామం దగ్గిరికి వస్తున్న కోస్ట్‌గార్డు బోట్లన్నిటినీ వెనక్కి పంపండి. వెంటనే చేయండి" వైర్‌లెస్ సెట్ దగ్గిర్నించి ఒక ఫోన్ దగ్గిరికి స్పీడ్‌గా పోయారు కులకర్ణి.

రిసీవర్‌ని ఎత్తి ఒక నెంబర్‌ని డయల్ చేశారు.

సరిగ్గా పదినిముషాల తర్వాత కోస్ట్‌గార్డు బోట్లన్నిటికీ రిలే చేయబడింది ఒక హెచ్చరిక.

"పెట్రోల్ బావుల దగ్గిరికి మూవ్ అవ్వండి... వెంటనే. ఇమ్మీడియట్లీ!"

మోడ్రన్ బోట్లు ఉపయోగిస్తే అనుమానం వస్తుందని అనుకున్నారు కాబోలు– చేపలు పట్టటానికి ఉపయోగించే నాటు పడవుల్లో అత్యంత అధునాతనమైన ఆయుధాల్ని భద్రపరుచుకుని, పెట్రోల్ బావులదగ్గిరికి వేగంగా పోతున్నారు– గంగారాంకి పేలుడు పదార్థాల సంచుల్ని అప్పగించిన వ్యక్తులు.

రాపూర్ గ్రామం దగ్గిరికిపోతూ ఉండాల్సిన కోస్ట్‌గార్డు బోట్లన్నీ వెనక్కి ఎందుకు వస్తున్నాయో వారెవరికీ అర్థం కాలేదు. అర్థమయ్యే సమయానికి చాలా ఆలస్యం జరిగిపోయింది. రెండే రెండుసార్లు లొంగిపొమ్మని వార్నింగ్ ఇచ్చి, ఆ వార్నింగ్‌ని వారు లక్ష్యపెట్టకపోయేసరికి నిర్మొహమాటంగా కాల్పులు స్టార్ట్ చేశాయి బోట్లు.

రెండు నిముషాలు మాత్రమే తట్టుకోగలిగారు ఆ వ్యక్తులు. మూడో నిముషంలో తమ నాటు పడవల్లో ఉన్న పేలుడు పదార్థాలు అంటుకోవటంతో సముద్రంలోకి దూకేశారు. రెండు తాడిచెట్లు ఎంత ఎత్తు ఉంటాయో అంత ఎత్తుకు లేచాయి మంటలు. తునాతునకలైపోయాయి నాటు పడవలు. ఆ పేలుడు అదుటికి సముద్రంలో దూకినా కూడా సురక్షితంగా ఉండలేకపోయారు వాళ్ళు. ముక్కలు ముక్కలపోయాయి వారి శరీరాలు.

*　　*　　*　　*　　*

“ఎవరికీ ఎటువంటి అనుమానం రాకుండా రైలు దొంగతనాల్ని అడ్డం పెట్టుకుని మన పెట్రోల్ బావుల్ని ధ్వంసం చేయటానికి రచించబడింది ఈ దారుణపథకం. ముల్లును ముల్లుతోనే తీయటం జరిగింది” ఉదయం పదిగంటల సమయంలో డిజిపికి చెప్పారు కులకర్ణి.

“బింద్రా వ్యవహారం ఏమిటిసార్?” అడిగాడు డిజిపి.

“పెద్ద పక్షుల్ని పట్టుకోవటానికి ప్రయత్నించినప్పుడు ఒక్కొక్కసారి చిన్న చిన్నపిట్టలు మనకి చిక్కకుండా తప్పించుకుంటూంటాయి. బింద్రాలో ఉన్న తోతాపురి అలాంటివాడే... నిఖార్సుగా పనిచేసే ఇన్స్‌పెక్టర్‌ని ఎవరినయినా అక్కడికి పంపించండి. ఎవ్రీథింగ్ విల్ బి ఆల్ రైట్” సాలోచనగా చెప్పారు కులకర్ణి.

“మరి ఆ దొంగ ఇన్స్‌పెక్టర్?” అడిగాడు డిజిపి.

సిగార్ పొగని గుప్పు గుప్పుగా బయటికి వదులుతూ ఒకసారి చిరునవ్వు నవ్వారు కులకర్ణి.

*　　*　　*　　*　　*

ఇన్స్‌పెక్టర్ సంతోష్‌ని భద్రపరిచిన ప్రదేశంలో నిలబడి స్టిఫ్‌గా ఒక శాల్యూట్ చేశాడు షాడో.

“నాకు చేతనయింది నేను చేశాను బ్రదర్.... తోతాపురి కంటె ప్రమాదకరమైన వ్యక్తుల్ని ఖతమ్ చేయించాను. నువ్వు ఏ పనిమీద ఇక్కడికి వచ్చావో, ఆ పని నెరవేరిందనే అనుకుంటున్నాను” కంటి ఎదుటలేని అతనికి చెప్పాడు.

“తోతాపురిని వేసేద్దాం గురూ... వదిలిపెట్టడం అనవసరం” తన అభిప్రాయాన్ని వెల్లడించాడు గంగారాం.

“నీకు చెప్పిన పని ఏమైంది?” అడిగాడు షాడో.

పెట్రోల్ బావుల్ని ధ్వంసం చేయటానికి వచ్చినవాళ్ళ దగ్గిర సంపాదించిన నోట్లకట్టల్ని తీసుకుపోయి గుట్ట అవతల గూడెంలో ఉండేవాళ్ళందర్నీ పంచుకోమని ఇచ్చి వచ్చాడు గంగారాం. తాము అక్కడికి రావటానికి ముందు నుంచీ వెంట పెట్టుకు తిరుగుతున్న పట్టుగుడ్డ మూటని పొదల్లోనే భద్రపరిచాడు. ఇప్పుడు దాన్ని తీసుకుపోయి అందులోని సంపదలో సగాన్ని కత్తీకి, బిల్లూకాకాకి, కుందూకి అప్పగించి వచ్చాడు.

"అంతా అయిపోయింది గురూ... చేతులు ఖాళీ అయిపోయాయి. తోతాపురి సంగతేంటో తేల్చేస్తే మనం వచ్చిన పని అయిపోయినట్టే" అని చెప్పాడు.

సమాధానం చెప్పలేదు షాడో.

భుజ్ సెక్యూరిటీ ఫోర్స్ కమాండర్ దారి చూపిస్తుండగా– స్పీడ్‌గా వస్తోంది ఒక పోలీస్ జీప్.

పదిమంది కానిస్టేబిల్స్ ఉన్నారు. ఒక ఇన్స్‌పెక్టర్ ఉన్నాడు...

"ఆ వచ్చేవాళ్ళు అందరూ ఇన్స్‌పెక్టర్ సంతోష్ లాంటివాళ్ళే అయితే తోతాపురి పని హుష్‌కాకి అయిపోతుంది" అని అన్నాడు గంగారాం.

అంతలోనే అతనికి కనిపించింది కొంచెం వెనకగా వస్తున్న ఒక వైట్ అంబాసిడర్.


“అయ్యబాబోయ్... ఆ పెద్దమనిషి మళ్ళీ వస్తున్నాడు. మనకోసమే అనుకుంటా” ఆందోళన నిండిన కంఠంతో అన్నాడు. పది అడుగుల దూరంలో వదిలిపెట్టిన తమ గార్ధభాలవైపు జంప్ చేశారు వారిద్దరూ.

వైట్ అంబాసిడర్ ఆ ప్రదేశంలోకి వచ్చే సమయానికి పొదల మధ్యలో వందగజాల దూరం వెళ్ళిపోయారు.

## ముగింపు

విశ్రాంతి తీసుకోవడం కోసం అహ్మదాబాద్ ఏరియాకి వచ్చి అనవసరమైన గొడవల్లో ఇరుక్కున్న షాడో, బింద్రా నించి తిరిగి వెనక్కి వెళ్ళిపోయాడు. సరిగ్గా మూడురోజుల తర్వాత నాగపూర్ సమీపంలో ఉన్న ఒక పట్టణంలో స్టార్ట్ అయ్యాయి ఆ అరుపులు. ‘దొంగ... దొంగ... పట్టుకోండి... పట్టుకోండి.’

-: అయిపోయింది :-


DONGA...
DONGA...
DONGA...
Novel By
Madhubaabu